॥ ఓం శ్రీపరమాత్మనే నమః ॥

# అథ తృతీయోఽ ధ్యాయః - కర్మయోగః

## (మూడవ అధ్యాయము - కర్మయోగము)

**అర్జున ఉవాచ**

శ్లో. 1 **జ్యాయసీ చేత్ కర్మణస్తే మతా బుద్ధిర్జనార్దన ।**
**తత్కిం కర్మణి ఘోరే మాం నియోజయసి కేశవ ॥**
జ్యాయసీ, చేత్, కర్మణః, తే, మతా, బుద్ధిః, జనార్దన,
తత్, కిమ్, కర్మణి, ఘోరే, మామ్, నియోజయసి, కేశవ ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| జనార్దన! | = | ఓ జనార్దనా! | కేశవ! | = | ఓ కేశవా! |
| కర్మణః | = | కర్మకన్నా | మామ్ | = | నన్ను |
| బుద్ధిః | = | జ్ఞానము | ఘోరే | = | భయంకరమైన |
| జ్యాయసీ | = | శ్రేష్ఠమైనదని | కర్మణి | = | (ఈ) యుద్ధకార్యమందు |
| తే | = | నీ | కిమ్ | = | ఎందుకు |
| మతా, చేత్ | = | అభిప్రాయమైనచో | నియోజయసి | = | నియోగించుచున్నావు? |
| తత్ | = | అటువంటి స్థితిలో | | | |

**జనార్దన! కర్మణః బుద్ధిః జ్యాయసీ తే మతా చేత్ ।**
**తత్ కేశవ! మాం ఘోరే కర్మణి కిం నియోజయసి ॥**

తా: అర్జునుడు పలికెను – ఓ జనార్దనా! కేశవా! కర్మకన్నా జ్ఞానమే శ్రేష్ఠమైనదని నీ అభిప్రాయమైనచో, భయంకరమైన ఈ యుద్ధకార్యమందు నన్నేల నియోగించుచున్నావు?

**1. ఉపోద్ఘాతం శ్లోకాలు 1–7:** గీతలో మూడవ అధ్యాయం, అర్జునుని ప్రశ్నతో మొదలవుతుంది. రెండవ అధ్యాయంలో కృష్ణపరమాత్మ చేసిన బోధ ఆధారంగా వచ్చిన ప్రశ్న అది. కృష్ణపరమాత్మ స్పష్టంగానే చెప్పినా కూడా, అర్జునునికి సందేహం కలిగింది. దానికి కారణం ఇది – రెండవ అధ్యాయంలో కృష్ణపరమాత్మ జ్ఞానయోగంతో తన బోధను మొదలుపెట్టాడు.

**అశోచ్యానన్వశోచస్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే ।**
**గతాసూనగతాసూంశ్చ నానుశోచంతి పండితాః ॥** – 2.11

ఇందులో ముఖ్యాంశం – **పండితాః న అనుశోచంతి** – తెలివైన వారు జీవితంలో దుఃఖించరు. దీని ద్వారా కృష్ణపరమాత్మ దుఃఖమనే సమస్యకు పరిష్కారం జ్ఞానమొక్కటే అని నొక్కివక్కాణించాడు. అంటే అజ్ఞానమే దుఃఖహేతువు అనే అర్థం గ్రహించవచ్చు. ఇది వేదాంతంయొక్క పునాది.

**అజ్ఞానాత్ దుఃఖం జ్ఞానాత్ సుఖమ్**

**అజ్ఞానం దుఃఖహేతువు, జ్ఞానం సుఖప్రాప్తి**

ఆ విధంగా తన బోధ ప్రారంభంలోనే జ్ఞానం గురించి గట్టిగా చెప్పి, అదే అధ్యాయం చివర్లో కూడా జ్ఞానం గురించే విపులంగా చెప్పాడు కృష్ణపరమాత్మ. అర్జునుడు జ్ఞానం పొందిన స్థితప్రజ్ఞుడి లక్షణాలేమిటి అని అడిగితే చాలా విపులంగా, 18 శ్లోకాల్లో వివరించుకొచ్చాడు కృష్ణపరమాత్మ.

**ఏషా బ్రాహ్మీ స్థితిః పార్థ నైనాం ప్రాప్య విముహ్యతి ।**

**స్థిత్వాస్యామంతకాలేఽపి బ్రహ్మనిర్వాణమృచ్ఛతి ॥** – 2.72

ఆ విధంగా జ్ఞానికి జీవితంలో ఎన్నడూ మోహం ఉండదు. జ్ఞానం దుఃఖానికి పరిష్కారం మాత్రమే కాదు, జీవితంలో కలిగే అనేక సంఘర్షణలకు మందు కూడా. అర్జునుని ప్రాథమిక సమస్యలు రెండు – దుఃఖం, సంఘర్షణ. కృష్ణపరమాత్మ ఈ రెండింటికీ అంటే దుఃఖానికీ, మోహానికీ కూడా జ్ఞానమే మందు అన్నాడు. అందువల్ల అర్జునుడు సహజంగానే జ్ఞానమనే మందు వేసుకోవాలనుకున్నాడు. జ్ఞానమెలా పొందుతాము? గురువునో, గురుకులాన్నో వెతుక్కుంటూ వెళ్ళాలి.

రెండవ అధ్యాయం మొదట్లో, చివర్లో జ్ఞానం గురించి గట్టిగా చెప్పినా, ఆ అధ్యాయం మధ్యలో కర్మ గురించి వివరంగా చెప్పాడు.

**కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన ।**

**మా కర్మఫలహేతుర్భూః మా తే సంగోఽస్త్వకర్మణి ॥** – 2.47

**యోగస్థః కురు కర్మాణి సంగం త్యక్త్వా ధనంజయ ।**

**సిద్ధ్యసిద్ధ్యోః సమో భూత్వా సమత్వం యోగ ఉచ్యతే ॥** – 2.48

ఈ మధ్యభాగంలో, కృష్ణపరమాత్మ గట్టిగా చెప్పాడు – **కర్మాణి కురు** – అర్జునా కర్మలు చేయి. ఇప్పుడు అర్జునుడు ఏది పాటించాలి? కర్మయోగమా, జ్ఞానయోగమా? ఇప్పుడు ఉన్న పరిస్థితిలో చూస్తే సహజంగానే అర్జునునికి కర్మ మానేసి జ్ఞానానికి వెళ్ళాలని ఉంది. పలాయనవాదం చిత్తగించాలని ఉంది. అర్జునుడు క్షత్రియుడు; విలువిద్యలో ఆరితేరిన వాడు; స్వతహాగా యుద్ధం చేయటమంటే ఇష్టమున్నవాడు; అందులోనూ పదమూడేళ్ళుగా మహాభారత యుద్ధంకోసం కళ్ళు కాయలు కాచేలా ఎదురుచూసినవాడు; దానికి తగ్గ యుద్ధసన్నాహాలు చేసి ఉన్నవాడు; కాని ప్రస్తుతం తన ముందు యుద్ధభూమిలో తన గురువైన ద్రోణాచార్యుణ్ణి, తన పితామహుడైన భీష్మాచార్యుణ్ణి చూసేసరికి మోహం ఆవేశించింది. అందువల్ల ఇప్పుడు అతను కర్మ చేయటానికి అంటే తన కర్తవ్యాన్ని వహించటానికి సిద్ధంగా లేదు.

అందువల్ల ఇదే మంచి అవకాశం. విల్లంబులు క్రిందపడేసి, ఏదైనా గురుకులానికి వెళ్ళి గీత, ఉపనిషత్తులు నేర్చుకుంటే బాగుంటుంది. కాని కృష్ణపరమాత్మ చెప్పిన ఇంకొక బోధ అతణ్ణి కట్టి పడేస్తున్నది – **యోగస్థః కురు కర్మాణి.**

అర్జునా, నీ విధిని నువ్వు నిర్వర్తించు. ప్రస్తుత పరిస్థితిలో అర్జునుని విధి ఏమిటి? యుద్ధం చేయాలి. జ్ఞాన బోధ చేసి, అందువల్ల కర్మ చేయి అంటున్నాడు. ఇదెలా సాధ్యం? ఇదెలా ఉందంటే – ఇదిగో ఇది 500 రూపాయల నోటు, ఇది 100 రూపాయల నోటు; 500 విలువ ఎక్కువ, అందువల్ల నువ్వు 100 తీసుకో అన్నట్టు ఉంది. ఇది అర్థం లేకుండా పరస్పర విరుద్ధంగా ఉంది.

కాని మనం కృష్ణపరమాత్మ అర్జునుణ్ణి నిజంగా అయోమయంలో పడేశాడో లేదో చూడాలి. మనం కూడా తొందరపడి అర్జునునితో చేతులు కలపకూడదు. రెండవ అధ్యాయాన్ని మనం సరిగ్గా విశ్లేషిస్తే, కృష్ణపరమాత్మ సరిగ్గానే చెప్పాడు, అర్జునుడే సరిగ్గా అర్థం చేసుకోలేదు అని తెలుస్తుంది. అర్జునుడు అడిగిన ప్రశ్న అందరూ ఎప్పుడూ అడుగుతూనే ఉంటారు – జ్ఞానయోగం గొప్పదా, కర్మయోగం గొప్పదా? దానికి ఇంకా కొన్ని కలుపుతారు కూడా వారు. భక్తియోగం గొప్పదా, రాజయోగం గొప్పదా అంటారు. ఇంకా కొంతమంది కుండలినీ యోగం గురించి చెబుతారు. కర్మయోగ మార్గం, జ్ఞానయోగ మార్గం, భక్తియోగ మార్గం, రాజయోగమార్గం అన్నీ మోక్షానికి దారి తీస్తాయనీ, వాటిలో బాగున్నది ఎన్నుకుందామనీ అనుకుంటారు అందరూ.

అర్జునుడు కూడా అదే పొరపాటు చేశాడు. జ్ఞానయోగం, కర్మయోగాల్లో జ్ఞానయోగం మెరుగైనదనీ, అది పాటిస్తే కర్మయోగం పాటించనవసరం లేదనీ అనుకున్నాడు.

ఇక్కడే మనం చాలా జాగ్రత్తగా వేదాంతబోధను గ్రహించాలి. కర్మయోగాన్ని, జ్ఞానయోగాన్ని ఎన్నడూ ఒకదానితో ఒకటి పోల్చకూడదు. ఇదెలా ఉందంటే – ప్రైమరీ స్కూలుకు వెళతావా? సెకండరీ స్కూలుకు వెళతావా? అని అడిగినట్టుంది. రెండూ అవసరమే; ఒకదాని తరువాత ఒకటి చేయాలి. ఈ రెండింటిలో ఏది వాడవచ్చు అనే అవకాశం ఉన్నచోట పోలిక వస్తుంది. కాని రెండవ అధ్యాయం సరిగ్గా అధ్యయనం చేసి ఉంటే, కర్మయోగం, జ్ఞానయోగాల్లో ఏదో ఒకటి కాదు, రెండూ తప్పనిసరిగా చేయాల్సిన సాధనలని అర్థమవుతుంది. కర్మయోగం ముందు పాటించి, అధికారిత్వం పొంది, అప్పుడు జ్ఞానయోగానికి రావాలి.

**జ్ఞానయోగానికి రానిదే కర్మయోగం అసంపూర్ణం**

**కర్మయోగం లేనిదే జ్ఞానయోగం అసంభవం**

ఈ విషయాన్ని సుస్పష్టంగా చెప్పాడు కృష్ణపరమాత్మ రెండవ అధ్యాయంలో –

**యదా తే మోహకలిలం బుద్ధిర్వ్యతితరిష్యతి ।**

**తదా గంతాసి నిర్వేదం శ్రోతవ్యస్య శ్రుతస్య చ ॥** – 2.52

అర్జునా! ముందు నువ్వు కర్మయోగం పాటించి, నీ మనస్సును సిద్ధం చేసుకోవాలి – **మోహకలిలం వ్యతితరిష్యతి** – మనస్సును శుద్ధి చేసుకోవాలి. అది అన్నం తినేముందు చేయి కడుక్కోవడంలాంటిది. నేను చేయి కడుక్కోవాలా?

అన్నం తినాలా? అని ఎవరైనా అడిగితే, అన్నం తిను అని మీరు చెప్పారనుకోండి; ఆ వ్యక్తి చేయి కడుక్కోకుండా, అన్నం తినేసి వెళ్ళిపోతాడు. అది ప్రమాదకరం. పోనీ చేయి కడుక్కో అని చెపితే చేయి మాత్రం కడుక్కుంటాడు, అన్నం తినడు. అందువల్ల ఈ రెండింటిలో ఏదో ఒకటి చేసే అవకాశం ఎలా లేదో, కర్మయోగం, జ్ఞానయోగాల్లో కూడా లేదు. కర్మయోగం చేయి కడుక్కోవటం వంటిది; జ్ఞానయోగం అన్నం తినటం వంటిది. అందువల్ల రెండూ సమానంగా ముఖ్యమే. అలా అయితే నేను ముందు తిని, తరువాత చేయి కడుక్కుంటాను అనకూడదు. తినేముందు చేయి కడుక్కోవటం ముఖ్యం; తిన్నాక ఎలాగూ కడుక్కుంటారు, అది వేరే విషయం. అందువల్ల రెండూ ముఖ్యమే.

రెండింటిలో ఏది అనే ప్రశ్నే లేదు. అర్జునా! కర్మ చెయ్యి అని కృష్ణపరమాత్మ అంటే అక్కడ కర్మ చేయకపోయినా ఫర్వాలేదు అనే ప్రశ్నేలేదు. అది జ్ఞానయోగానికి ముందు మెట్టు. అందువల్ల కృష్ణపరమాత్మ బోధ ఇది – అర్జునా! కర్మ చేయి, చిత్తశుద్ధి పొందు, జ్ఞానం పొందు, మోక్షం పొందు. ఇదే గీతా సారాంశం –

**కర్మ చెయ్యి, చిత్తశుద్ధి పొందు, జ్ఞానం పొందు, మోక్షం పొందు**

ఈ అంశాన్ని కృష్ణపరమాత్మ స్పష్టంగానే చెప్పాడు. అర్జునుడే సరిగ్గా వినలేదు. వినకుండా కృష్ణపరమాత్మను తప్పు పడుతున్నాడు. దీన్ని **ఫిల్టర్డ్–లిజనింగ్** అంటారు. అర్జునుడే కాదు, ప్రతి విద్యార్థీ చేసే పని అదే. అతను క్లాసుకు వచ్చేముందే కొన్ని సిద్ధాంతాలను ఏర్పరచుకుని వస్తాడు. కొంతమందేమో కలియుగంలో జ్ఞానయోగంకన్నా భక్తియోగమే మంచిదని వింటారు; మరి కొంతమందేమో కర్మయోగంకన్నా భక్తియోగం గొప్పదనుకుంటారు. అలా ఒక ఉద్దేశ్యంతో వినేటప్పుడు, వారికి నచ్చిన అంశాల గురించి స్వామీజీ మాట్లాడితే, ఇవాళ స్వామీజీ బాగా మాట్లాడారు అంటారు. తల్లీ, పిల్లలు స్వామీజీ క్లాసుకు వస్తుంటారు. స్వామీజీ ఒక్కోసారి పిల్లల పరంగా మాట్లాడతారు; ఒక్కోసారి తల్లుల పరంగా మాట్లాడతారు. ఎవరి పరంగా మాట్లాడితే వారు దాన్ని బాగా గుర్తు పెట్టుకుంటారు, వారికది నచ్చుతుంది కాబట్టి. దీన్నే ఫిల్టర్డ్–లిజనింగ్ అంటారు.

అర్జునుని విషయం తీసుకుంటే, అతను కర్మ వద్దనుకుంటున్నాడు. అందువల్ల అతను సరిగ్గా వినలేదు. కృష్ణపరమాత్మ కర్మ అవసరం, జ్ఞానం అవసరం అన్నాడు. కాని సరిగ్గా వినకపోవటంవల్ల అర్జునుడు ఈ ప్రశ్న వేశాడు. కృష్ణపరమాత్మ గొప్పదనం చూడండి. నువ్వు సరిగ్గా వినలేదు అనలేదు. శిష్యుడు నువ్వు సరిగ్గా చెప్పలేదు అంటే గురువు తిరిగి శిష్యుణ్ణి నిందించలేదు. అదే గురువు ప్రత్యేకత! ఆ ప్రశ్నను శ్రద్ధగా విన్నాడు. తెలివైన ప్రశ్నగా భావించాడు. సరిగ్గా వినకపోవటంవల్ల వచ్చిన ప్రశ్నగా తీసుకోలేదు. మళ్ళీ ఓపికగా కర్మయోగమంతా వివరించాడు. ఆ విధంగా మూడవ అధ్యాయం కర్మయోగం గురించి చెపితే; నాలుగు, ఐదు అధ్యాయాలు జ్ఞానయోగం గురించి చెబుతాయి. ఈ నేపథ్యంతో అర్జునుని ప్రశ్నను చూద్దాము.

**అర్జున ఉవాచ** – అర్జునుడు అడిగాడు. ఏమని? హే జనార్దనా!

**బుద్ధిః జ్యాయసీ కర్మణః** – బుద్ధి అంటే ఆత్మజ్ఞానం. సంస్కృతంలో ఒక్కొక్క పదానికి ఒక్కొక్క సందర్భాన్నిబట్టి అర్థం మారుతుంది. బుద్ధి అంటే జ్ఞానాన్నిచ్చే పరికరం అవవచ్చు; జ్ఞానం పొందాల్సిన వస్తువు అవవచ్చు; జ్ఞానమే అవవచ్చు. సందర్భంబట్టి మారుతుంది. అలా ఇక్కడ బుద్ధి అంటే జ్ఞానం, అది కూడా ఆత్మజ్ఞానం.

ఈ ఆత్మజ్ఞానం కర్మకన్నా శ్రేష్ఠంగా ఉన్నట్టుంది. ఎందుకు? కృష్ణపరమాత్మ రెండవ అధ్యాయంలో జ్ఞానం గురించి మొదట్లోనూ, చివర్లోనూ మాట్లాడాడు; పైగా జ్ఞానమే దుఃఖానికీ, మోహానికీ కూడా మందు అన్నాడు. అర్జునుడు ఇది నేను చెప్పలేదు; నువ్వే అన్నావు అని చెబుతున్నాడు.

**తే మతా** – ఇది నీ బోధ. కాని నువ్వు ఏం చేస్తున్నావు? జ్ఞానం గురించి అంత గొప్పగా చెప్పి, స్థితప్రజ్ఞుడి లక్షణాలను అంత బాగా వర్ణించి, ఇప్పుడు నన్నేం చేయమంటున్నావు?

**మాం ఘోరే కర్మణి కిమ్ నియోజయసి** – ఏదైనా ఆశ్రమానికి వెళ్ళమని చెప్పేబదులు, యుద్ధం చేయమంటున్నావు. కాని కర్మ చేస్తే జ్ఞానం రాదని తెలుసు కదా!

కర్మ చేసే వాటిని కర్మేంద్రియాలు అంటారు. వాటివల్ల జ్ఞానం రాదు. మీకేదైనా అనుమానం ఉంటే ప్రతిరోజూ మీ గదిని ఒక గంటసేపు కడిగి చూడండి. దానివల్ల ఏం జ్ఞానం పొందారో ఆలోచించండి! చార్మినార్ ఎక్స్‌ప్రెస్ ఎప్పుడొస్తుందో తెలుసుకోవాలంటే, అరగంట సేపు పరుగెడితే తెలుస్తుందా? కర్మ జ్ఞానాన్ని ఇవ్వదు. అలాంటప్పుడు కర్మ చేయమని చెప్పి ఏమిటి లాభం? పోనీ అదేమైనా సంతోషకరమైన కర్మా అంటే అదీ కాదు. అర్జునునికి అప్పుడు అది ఇష్టమైన కర్మ కాదు.

అందువల్ల నువ్వు స్పష్టంగా చెప్పకుండా, నన్నెందుకు తికమక పెడుతున్నావు అంటున్నాడు.

జనార్దన, కేశవ పేర్లతో కృష్ణపరమాత్మను సంబోధించాడు.

శ్లో. 2 **వ్యామిశ్రేణేవ వాక్యేన బుద్ధిం మోహయసీవ మే ।**
**తదేకం వద నిశ్చిత్య యేన శ్రేయోఽహమాప్నుయామ్ ॥**
వ్యామిశ్రేణ, ఇవ, వాక్యేన, బుద్ధిమ్, మోహయసి, ఇవ, మే,
తత్, ఏకమ్, వద, నిశ్చిత్య, యేన, శ్రేయః, అహమ్, ఆప్నుయామ్ ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| వ్యామిశ్రేణ, ఇవ | = | కలగాపులగముగా ఉన్న | శ్రేయః | = | శ్రేయస్సును |
| వాక్యేన | = | (నీ) మాటలతో | ఆప్నుయామ్ | = | పొందుదునో |
| మే | = | నా | తత్, ఏకమ్ | = | అటువంటి ఒక |
| బుద్ధిమ్ | = | బుద్ధిని | | | మార్గమును (కర్మమునో, |
| మోహయసి, ఇవ | = | భ్రమింపజేయుచున్నట్లు ఉన్నావు | | | జ్ఞానమునో) |
| యేన | = | దేనిచేత | నిశ్చిత్య | = | నిశ్చయముగా |
| అహమ్ | = | నేను | వద | = | చెప్పుము |

**వ్యామిశ్రేణ ఇవ వాక్యేన మే బుద్ధిం మోహయసి ఇవ ।**
**తత్ నిశ్చిత్య ఏకం వద యేన అహం శ్రేయః ఆప్నుయామ్ ॥**

తా: కలగాపులగమువంటి నీ మాటలతో నా బుద్ధి భ్రమకు లోనగునట్లు చేయుచున్నావు. కనుక నాకు శ్రేయస్కరమైన ఒక మార్గమును నిశ్చయముగా తెల్పుము.

అర్జునుని ప్రశ్న కొనసాగుతున్నది.

**వ్యామిశ్రేణేవ వాక్యేన** – చూడటానికి పరస్పర విరుద్ధంగా ఉన్న వాక్యాలవల్ల; ఏమిటా వాక్యాలు? జ్ఞానాన్ని మెచ్చుకుని, కర్మ చేయి అని చెప్పటం.

ఎన్నికల ప్రచారంలో ఒక పార్టీని బాగా మెచ్చుకుని, అందువల్ల రెండవ పార్టీకి ఓటు వేయండి అంటే ఎలా ఉంటుంది? అలా ఉంది అర్జునుని పరిస్థితి. అసలే మోహంలో పడి, అయోమయ పరిస్థితిలో ఉన్నాడు. దానికి తోడు కృష్ణపరమాత్మ మరింత తికమక పెడుతున్నాడు.

**బుద్ధిం మోహయసి** – నీ వాక్యాలవల్ల నా బుద్ధిని తికమక పెడుతున్నావు. ఇక్కడ బుద్ధి అంటే బుద్ధే. అంతకు ముందు శ్లోకంలో బుద్ధి అంటే జ్ఞానం అన్నాము; ఇక్కడ బుద్ధి అంటే బుద్ధే. అందువల్లనే మనం శాస్త్రం నేర్చుకోవటానికి గురువు అవసరం అని చెబుతారు.

**ఇవ** – ఇక్కడ అర్జునుడు వాడిన ఒక ముఖ్యమైన పదాన్ని గమనించాలి మనం. ఇవ పదం వేశాడిక్కడ. ఇవ అంటే ఉన్నట్టుగా. ముందు శ్లోకంలో నువ్వు సరిగ్గా చెప్పలేదు అన్నాడు. కాని ఇక్కడికి వచ్చేసరికి తన తప్పు తెలుసుకున్నాడు. స్నేహితుడు, శ్రేయోభిలాషి, కరుణామూర్తి, గురువు అయిన శ్రీకృష్ణపరమాత్మ తనను ఎలా తికమక పెట్టగలడు? కృష్ణునిమీద అపారమైన భక్తిశ్రద్ధలు ఉన్నాయి అర్జునునికి. అందువల్ల నీ వాక్యాలు నన్ను అయోమయంలో పడేస్తున్నాయి అన్నాడు. గురువును తప్పు పట్టకూడదు. గురువుమీద శ్రద్ధ ఉండాలి. అలాగని గురువేది చెపితే దాన్ని గుడ్డిగా స్వీకరించనవసరం లేదు. అయితే ఏం చేయాలి? గురువుకు చెప్పాలి; మీ బోధ సరిగ్గా ఉన్నా, నాకది తార్కికంగా అనిపించటం లేదు. అందువల్ల నాకు దయచేసి మళ్ళీ చెప్పండి. గురువు మళ్ళీ చెప్పింది, మళ్ళీ శ్రద్ధగా వినాలి. అప్పటికీ అర్థం కాకపోతే మళ్ళీ వినాలి. అలా ఎన్నిసార్లు?

మనం సరిగ్గా అర్థం చేసుకునేటంత వరకూ. సరిగ్గా అర్థం చేసుకున్నామని ఎప్పుడు తెలుస్తుంది? అందులో తార్కికంగా తప్పేమీ లేదని మనకు తెలిసినప్పుడు. మనకు తర్కప్రధానంగా ఒక గ్రంథం ఉంది. అది **బ్రహ్మసూత్రాలు**. దాన్ని న్యాయప్రస్థానం అని కూడా అంటారు. న్యాయం అంటే తర్కం. అందులో మనకు కలిగే సందేహాలన్నిటికి తర్కం ద్వారా జవాబులు దొరుకుతాయి. మన మతం కేవలం శ్రద్ధ మాత్రమే పెట్టుకోమనదు; విషయం అర్థం అయ్యేలా వివరిస్తుంది. అందువల్ల మనం ఒప్పుకునేదాకా, ఎన్ని ప్రశ్నలైనా అడగవచ్చు.

అందువల్ల అర్జునుడు, కృష్ణపరమాత్మను తప్పు పట్టకుండా, నీ వాక్యాలు పరస్పర విరుద్ధంగా ఉన్నట్టుగా ఉన్నాయి, కాని నేను నిన్ను కాదనలేను అంటున్నాడు.

**తదేకం వద నిశ్చిత్య యేన** – అందువల్ల వాటిలో ఏదో ఒకదాని గురించి స్పష్టంగా చెప్పు. అంతేకాని, జ్ఞానాన్ని పొగిడి, అందువల్ల కర్మ చేయి అనకు. ఏదో ఒకటి చెప్పు – ఈ సూత్రాన్ని నిజజీవితంలో చాలామంది పాటిస్తారు. కొంతమంది స్వామీజీ దగ్గరికి వెళ్ళి, 'స్వామీజీ, నాకు క్లాసులు అవసరం లేదు; లేవగానే నేనేం చేయాలో చెప్పండి చాలు,' అంటారు. నేటి జీవితం మరీ యాంత్రికంగా తయారయిపోయింది. ఉద్యోగంలోనూ ఎక్కువగా బుద్ధిని ఉపయోగించాల్సిన పని ఉండదు. ఆఫీసులో యాంత్రికంగా పని చేసీ చేసీ, అలసిపోయి,

మళ్ళీ యాంత్రికంగా ఏదో పుస్తకానికో, టీ.వీ.కో అతుక్కు పోతాము. బుద్ధి ఉపయోగించాల్సిన పరిస్థితి బొత్తిగా తగ్గిపోతోంది.

ఒకవేళ బుద్ధిని ఉపయోగించాల్చిన పరిస్థితి ఎదురైనా, స్వామీజీ దగ్గరకు పరుగెడతారు. స్వామీజీ అన్నానగర్‌లో ఇల్లు కొనమంటారా, అడయార్‌లో ఇల్లు కొనమంటారా అంటారు. ఆఖరికి ఈ డ్రెస్సు వేసుకోవాలా? ఆ డ్రెస్సు వేసుకోవాలా తేల్చుకోలేరు కొందరు. వారు ఆలోచించాల్సిన పని లేకుండా స్వామీజీ 10 లేక 20 నియమాలు ఇస్తే హాయిగా పాటించేయవచ్చని చూస్తారు.

వేదాంతం **వివేకం** ఉపయోగించాలని ప్రత్యేకించి చెబుతుంది. శంకరులవారు **వివేకచూడామణి** అని ఒక గ్రంథాన్ని వ్రాశారు. పశువులకు, మనకు మధ్య ఉన్న భేదం ఈ వివేకమే. మనం బుద్ధిని ఉపయోగించకపోతే, మనం మనుష్యరూపంలో తిరుగుతున్న పశువుల క్రిందికి వస్తాము. అందువల్ల కృష్ణపరమాత్మ సలహా ఇవ్వడు. మన శాస్త్రం గొప్పతనం ఏమిటంటే, అది ముందు సలహా ఇస్తుంది కాని తరువాత సలహాలు ఇవ్వటం మానేస్తుంది.

సలహాలివ్వటం, కేవలబోధ చేయటం ఏ సాంప్రదాయంలోనైనా మంచిది కాదంటారు దయానంద స్వామీజీ. అలా సలహాలిస్తేనో, కేవలబోధ చేస్తేనో, మనం చేయాల్సిన పనులను వరుసగా ఎవరో చెప్పటం అవుతుంది. మన మెదడుకు మేత పెట్టే అవసరం కానీ, అవకాశం కానీ ఉండదు. అందువల్ల మనకు కావాల్సింది **జ్ఞానబోధ** అంటారు పూజ్యస్వామీజీ.

సత్యం వద అని చెపితే అది కేవలం బోధ అవుతుంది. దాని బదులు సత్యం ఎంత విలువైనదో, సత్యం పలకటంవల్ల కలిగే మంచి ఏమిటో, సత్యం పలకక పోవటంవల్ల కలిగే హాని ఏమిటో, దాన్ని మన జీవితంలో ఒక విలువగా ఎలా మలుచుకోవాలో మనకు ఎవరైనా చెపితే, వారు మనకు సత్యం గురించిన సంపూర్ణజ్ఞానాన్ని ఇచ్చిన వారవుతారు. సత్యం పలకాలో, వద్దో మనం తేల్చుకోవాలి. అందువల్ల కేవలబోధ చేస్తే అది ప్రాథమికం, పైపై మాటలు అవుతుంది. అదే జ్ఞానబోధ చేస్తే, అది పదికాలాలు నిలుస్తుంది. కాని అర్జునుడు కర్మో, జ్ఞానమో ఏదో తేల్చి చెప్పు అంటున్నాడు. కృష్ణపరమాత్మ అలా తేల్చి చెప్పేస్తే మనకు 18 అధ్యాయాల గీత వచ్చేది కాదు.

మనం చదువుకునే రోజుల్లో, ఏ టెన్నిసన్ కవితలో నేర్చుకోవాల్సి వచ్చినప్పుడు ఏమనుకుని ఉంటాము? 'ఈ టెన్నిసన్ తీరికగా కూర్చుని ఈ కవితలు ఎందుకు వ్రాశాడు? అతను రాశాడు కాబట్టి, మనం చదవాల్సి వస్తోంది.' అలా కృష్ణపరమాత్మ అర్జునా! యుద్ధం చేయి అని ఉంటే 18 అధ్యాయాలు ఉండేవికావు కదా అనిపించవచ్చు. కాని కృష్ణపరమాత్మ పద్ధతి అదికాదు. ఆయన పద్ధతి సలహా ఇవ్వటం కాదు; నిజబోధ చేయటం కాదు; ఆయన పద్ధతి జ్ఞానబోధ చేయటం. జ్ఞానబోధవల్లనే మార్పు వస్తుంది. మనిషిలో మార్పు వస్తేనే, ఏం చేయాలో తెలుసుకోగలుగుతాడు. లేకపోతే అన్నానగర్‌లో ఇల్లు కొనాలా, అడయార్‌లో ఇల్లు కొనాలా అని గురువును అడగాల్సి వస్తుంది. అప్పుడు గురువు కాస్తా కన్సల్టెంట్ అవుతాడు.

కృష్ణపరమాత్మ అలా కన్సల్టెంట్ అవదలుచుకోలేదు.

**అహం శ్రేయః ఆప్నుయామ్** – నేను నీ సలహాను శ్రద్ధగా పాటిస్తాను. అప్పుడు నాకు శ్రేయస్సు కలుగుతుంది అంటే మోక్షం వస్తుంది.

**శ్రీభగవాన్ ఉవాచ**

శ్లో. 3 **లోకేఽస్మిన్ ద్వివిధా నిష్ఠా పురా ప్రోక్తా మయానఘ ।**
**జ్ఞానయోగేన సాంఖ్యానాం కర్మయోగేన యోగినామ్ ॥**
లోకే, అస్మిన్, ద్వివిధా, నిష్ఠా, పురా, ప్రోక్తా, మయా, అనఘ,
జ్ఞానయోగేన, సాంఖ్యానామ్, కర్మయోగేన, యోగినామ్ ॥

| | | | |
|---|---|---|---|
| అనఘ! | = పాపరహితుడా! | సాంఖ్యానామ్ | = సాంఖ్యయోగులకు |
| అస్మిన్, లోకే | = ఈ లోకమందు | జ్ఞానయోగేన | = జ్ఞానయోగము ద్వారా |
| ద్వివిధా, నిష్ఠా | = రెండు విధములగు నిష్ఠలు | యోగినామ్ | = యోగులకు |
| మయా | = నాచేత | కర్మయోగేన | = కర్మయోగము ద్వారా (నిష్ఠ కలుగును) |
| పురా, ప్రోక్తా | = ఇంతకుముందే చెప్పబడినవి | | |

**అనఘ! అస్మిన్ లోకే సాంఖ్యానాం జ్ఞానయోగేన యోగినాం కర్మయోగేన**
**ద్వివిధా నిష్ఠా పురా మయా ప్రోక్తా ॥**

తా: శ్రీభగవానుడు పలికెను – ఓ అనఘా! అర్జునా! ఈ లోకమున రెండు నిష్ఠలు గలవని ఇంతకుముందే చెప్పి ఉన్నాను. వానిలో సాంఖ్యయోగులకు జ్ఞానయోగము ద్వారా, యోగులకు కర్మయోగము ద్వారా నిష్ఠ కలుగును.

దయానంద స్వామీజీ తరచూ ఒక వాక్యం చెబుతుంటారు – **ఒక విలువయొక్క విలువకు మీరు విలువను ఇచ్చినప్పుడు ఆ విలువ ఒక విలువ అవుతుంది**. చూడటానికి మాటల గారడీలా ఉన్నా, చాలా విలువైన వాక్యం. సత్యం వద అని మనకు ఎవరైనా చెపితే దానికి విలువను ఇవ్వము మనం. అలా నిజబోధ చేయిటంవల్ల విలువ గురించి చెబుతున్నారే తప్ప, ఆ విలువయొక్క విలువ గురించి తెలియదు. అదే జ్ఞానబోధ చేస్తే, విలువయొక్క విలువ తెలుస్తుంది. ఒక విలువ గురించి చెప్పటానికి అరక్షణం చాలు. కాని ఆ విలువయొక్క విలువ గురించి చెప్పాలంటే చాలాసేపు పడుతుంది. అలాగే కర్మయోగం ఇది, జ్ఞానయోగం ఇది అని చెప్పటానికి అరక్షణం చాలు. కాని ఎందుకు రెండు యోగాలూ ముఖ్యం; ఎందుకు వీటిలో ఏదో ఒకటి పాటించకూడదు; ఎందుకు ముందు కర్మయోగం పాటించాక జ్ఞానయోగానికి రావాలి – ఇవన్నీ వివరంగా చెప్పాలంటే చాలా సమయం పడుతుంది. కృష్ణపరమాత్మ ఈ జ్ఞానబోధ చేయాలనుకున్నాడు. అందువల్ల – నేను చెబుతున్నాను, పోయి యుద్ధం చేయి అనలేదు.

ఎందుకు కర్మయోగం ముఖ్యమో చెప్పబోతున్నాడు. అందువల్ల ఈ శ్లోకంతో మొదలు పెడుతున్నాడు. ఇది చాలా ముఖ్యమైన శ్లోకం. ఈ శ్లోకం ఈ అధ్యాయానికి పునాది. శంకరాచార్యులవారు తన భాష్యంలో దీన్ని తరచు ఉటంకిస్తుంటారు. ఈ శ్లోకంయొక్క భావాన్ని మనం సరిగ్గా అర్థం చేసుకోవాలి.

శాస్త్రం చెప్పేదేమిటంటే, కర్మయోగమా, జ్ఞానయోగమా అనే ద్వైధీభావనకు చోటు లేదు. రెండూ తప్పనిసరిగా చేయాలి – చేతులు కడుక్కుని, అన్నం తిన్నట్టుగా; కర్మయోగం చేసి జ్ఞానయోగానికి రావాలి. చేతులు కడుక్కున్నంత మాత్రాన ఆకలి తీరదు. కర్మయోగం చేసినంత మాత్రాన సంసారం పోదు; అది మనను జ్ఞానానికి సిద్ధం చేస్తుంది. కర్మయోగంవల్ల మోక్షం ఎన్నడూ రాదు; కాని అదే సమయంలో కర్మయోగం మాత్రమే జ్ఞానయోగానికి సంసిద్ధులను చేస్తుంది. కర్మయోగంవల్ల జ్ఞానయోగ్యతా ప్రాప్తి వస్తుంది; జ్ఞానయోగంవల్ల మోక్షం వస్తుంది.

మనమందరం అయోగ్యులుగా పుట్టాము. అంటే జ్ఞానయోగానికి అనర్హులం. ఎలా చెప్పగలరు? చాలా తేలిక! శాస్త్రమే జ్ఞానయోగాన్ని వేద అంతభాగంలో పెట్టింది. ఒకవేళ మనం జ్ఞానయోగానికి అర్హులమయితే, శాస్త్రం దాన్ని వేదపూర్వభాగంలో పెట్టి ఉండేది. అప్పుడు కర్మయోగం వేద అంతభాగానికి వెళుతుందా? కర్మయోగమే ఉండదు. ఎందుకంటే జ్ఞానయోగం తరువాత కర్మయోగం అవసరం లేదు. అప్పుడు వేదం మొత్తం జ్ఞానయోగమే అయి ఉండేది. వేద అంతభాగంలో జ్ఞానం ఉందన్న కారణమే, మనం అయోగ్యులమని చెప్పకనే చెబుతున్నది. మనం అయోగ్యులమంటే 99.99% అయోగ్యులం. ఎక్కడో ఒకరిద్దరు మహానుభావులు ఉంటారు. వారు వేదపూర్వభాగానికి వెళ్ళనవసరం లేకుండానే వేద అంతభాగానికి రాగలరు. దానికి గొప్ప ఉదాహరణ – రమణ మహర్షి. ఆయన చిన్నవయస్సులోనే తిరువణ్ణామలై వెళ్ళిపోయారు. కర్మయోగం చేయకుండానే జ్ఞానం పొందారు.

రామానుజం స్కూలుకు వెళ్ళకుండానే మాథమేటిక్స్‌లో జీనియస్ అయ్యారు. అలా మనుషుల్లో చెదురు మదురుగా, అన్ని దశలూ దాటకుండా గొప్పదనాన్ని సాధించిన మహానుభావులు, మేధావులు లేకపోలేదు. కాని వారితో మనం సాటి కాదు. వారు పూర్వజన్మలో హోమ్‌వర్క్ చేసేశారు. వారు అసాధారణ వ్యక్తులు. అందువల్ల సాధారణ వ్యక్తులమైన మనం ఒక్కొక్క దశా దాటుకుంటూ రావాలి. మనం కర్మయోగమనే దశ దాటాలి. ఆ దశ వివరాలు ఈ అధ్యాయంలో చూస్తాము. అలా మన మనస్సును సిద్ధం చేశాక, జ్ఞానయోగానికి వచ్చి తీరాలి. జ్ఞానయోగానికి వచ్చి మోక్షం పొందాలి.

**అందరూ కర్మయోగం, జ్ఞానయోగం రెండూ పాటించి తీరాలి.** ఇది మొదటి పాఠం. శాస్త్రం చెప్పే నియమం ఇంకొకటి ఉంది. రెండురకాల జీవన విధానాలు ఉన్నాయి. ఈ శ్లోకంలో కృష్ణపరమాత్మ నిష్ఠ అనే పదాన్ని వాడాడు. నిష్ఠ అంటే ఇక్కడ అర్థం ఆశ్రమం లేదా జీవనవిధానం. మన సాంప్రదాయంలో నాలుగు ఆశ్రమధర్మాలు ఉన్నాయి. అవి – బ్రహ్మచర్యం, గార్హస్థం, వానప్రస్థం, సన్న్యాసం. ఇక్కడ రెండింటి మధ్య చర్చ. అవి గృహస్థాశ్రమం, సన్న్యాసాశ్రమం.

గృహస్థాశ్రమాన్ని ప్రవృత్తి నిష్ఠ అనీ సన్న్యాసాశ్రమాన్ని నివృత్తి నిష్ఠ అనీ అంటారు. గృహస్థాశ్రమం కర్మయోగానికీ, సన్న్యాసాశ్రమం జ్ఞానయోగానికీ నిర్దేశింపబడ్డాయి. గృహస్థుగా ఉంటే జ్ఞానం అసాధ్యం అనలేము. ఎందుకంటే మనమంతా జ్ఞానం పొందుతున్నాము కదా! అలాగే సన్న్యాసాశ్రమంలో కూడా కొంతమేరకు కర్మ ఉంటుంది. కాని గృహస్థాశ్రమం కర్మప్రధాన ఆశ్రమం; సన్న్యాసాశ్రమం జ్ఞానప్రధాన ఆశ్రమం.

ఇప్పుడు ఈ ఆశ్రమ ధర్మాలు అర్థమయితే, ఒక వ్యక్తి తన జీవితాన్ని మూడు మార్గాల్లో నిర్దేశించుకోవచ్చు.

**ఆ(శమ ధర్మాన్ని ఎన్నుకునే అవకాశం ఉంది –**

1. గృహస్థా(శమాన్ని స్వీకరించి, కర్మయోగాన్ని పాటించి, చిత్తశుద్ధి పొంది, సన్న్యాసా(శమానికి మారి, జ్ఞానయోగాన్ని పాటించి మోక్షాన్ని పొందటం. గృహస్థా(శమం– కర్మయోగం – చిత్తశుద్ధి – సన్న్యాసా(శమం – జ్ఞానయోగం – మోక్షం.

2. గృహస్థా(శమాన్ని స్వీకరించి, కర్మయోగాన్ని పాటించి, చిత్తశుద్ధి పొంది, సన్న్యాసా(శమానికి రాకుండానే, గృహస్థుగా ఉంటూనే, జ్ఞానయోగాన్ని పాటించి మోక్షాన్ని పొందటం. అంటే ఇందులో ఆ(శమం మారరు. రెండు సాధనలూ ఒక ఆ(శమంలోనే చేస్తారు. గృహస్థా(శమం – కర్మయోగం – చిత్తశుద్ధి – జ్ఞానయోగం– మోక్షం.

3. (బ్రహ్మచర్యంనుంచి గృహస్థా(శమాన్ని స్వీకరించకుండా, సరాసరి సన్న్యాసా(శమాన్ని స్వీకరించటం. అందులో కూడా కర్మలు ఉంటాయి కాని అవి వేరు. సన్న్యాసా(శమ కర్మలు చేస్తూ, చిత్తశుద్ధి పొంది, జ్ఞానయోగాన్ని పాటించి, మోక్షం పొందటం. సన్న్యాసా(శమం – కర్మయోగం – చిత్తశుద్ధి – జ్ఞానయోగం – మోక్షం.

ఈ మూడు మార్గాల్లో రెండు గృహస్థా(శమంనుంచి వస్తే, ఒకటి సరాసరి సన్న్యాసా(శమానికి రావటం. ఎలా వచ్చినా కర్మ తప్పనిసరి. కాకపోతే సన్న్యాసి చేసే కర్మలు, గృహస్థు చేసే కర్మలూ భిన్నంగా ఉంటాయి. సన్న్యాసి యజ్ఞాలు చేయలేడు; తనే భిక్ష స్వీకరిస్తాడు కాబట్టి అన్నదానం చేయలేడు. కాని అతను చేసే కర్మలు కొన్ని ఉంటాయి. అందులో జపం ఒకటి.

**యజ్ఞానాం జప యజ్ఞోస్మి** – గురుశు(శూష చేయాలి. చాతుర్మాస్య (వతాలు పాటించాలి.

మీ దగ్గర (స్క్రూడ్రైవరు, కత్తి ఉన్నాయనుకోండి. మామూలుగా (స్క్రూడ్రైవరుతో (స్క్రూని బిగిస్తారు; కత్తితో కూరలు కోస్తారు. అవునా? కాని ఒకవేళ మీ దగ్గర ఒక పండు ఉంది కాని కత్తి లేదు, (స్క్రూడ్రైవర్ మా(తమే ఉంది అనుకోండి. అప్పుడేం చేస్తారు? దాని పని పండుకోయటం కాకపోయినా, ఎలాగోలా దానితో పండును కోస్తారు. అవునా? అలాగే (స్క్రూడ్రైవర్ వాడాల్సిన సమయంలో కత్తే ఉంది. కత్తితోనే ఆ పని ఎలాగోలా సాధిస్తారు. అలాగే గృహస్థా(శమం నిజానికి కర్మ(పధానం కాని దానిలో ఉంటూనే మీరు జ్ఞానం పొందగలరు. కాకపోతే ఎన్నో సమస్యలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. అలాగే సన్న్యాసా(శమం జ్ఞాన(పధానం కాని దాన్ని కర్మవల్ల కలిగే చిత్తశుద్ధికి ఉపయోగించవచ్చు. అందువల్ల ఆ(శమధర్మాలను సరిగా పాటించి, రెండు సాధనలూ చేసి, మోక్షం పొందాలి.

అందువల్ల అర్జునా! నీకు కర్మయోగం అవసరం. దానికోసం నీ ధర్మాన్ని నువ్వు నిర్వర్తించాలి. నీ ధర్మం యుద్ధం చేయటం. అందువల్ల నీ విల్లంబులు తీసుకుని, యుద్ధం చేయి.

కృష్ణపరమాత్మ ఆ విధంగా (పవేశపెట్టిన అంశాలు రెండు. ఒకటి సాధన, ఇంకొకటి ఆ(శమ ధర్మం. సాధనను యోగం అనీ, జీవన విధానాన్ని నిష్ఠ అనీ అన్నాడు. సాధన విషయంలో మనకు ఎన్నుకునే అవకాశం లేదు, ఎందుకంటే మోక్షం పొందటానికి కర్మయోగం, జ్ఞానయోగం రెండూ కావాలి.

జీవన విధానంలో గృహస్థాశ్రమాన్ని ప్రవృత్తి మార్గం అనీ, సన్న్యాసాశ్రమాన్ని నివృత్తి మార్గం అనీ అంటారు. కర్మయోగం పాటించటానికి గృహస్థాశ్రమం అనువైనది. ఎందుకంటే కర్మయోగానికి అన్నీ కావాలి. డబ్బు, ఇల్లు, మనుష్యులు. గృహస్థు డబ్బు సంపాదించవచ్చు, ఆస్తులు సమకూర్చు కోవచ్చు, బంధుకోటి ఉండవచ్చు. వీటిద్వారా అతను కర్మలు తేలిగ్గా చేయగలుగుతాడు. అందువల్ల ఒక వ్యక్తి గృహస్థాశ్రమాన్ని పాటించి, కామక్రోధలోభమోహాలను తొలగించుకుంటూ, చిత్తశుద్ధిని పెంపొందించుకోవచ్చు. ఎలాగైతే ఒక కత్తిని బండరాయిమీద రుద్ది పదునుగా చేస్తామో, అలా జీవితంలో ఒడుదుడుకులు అనే బండరాయిమీద మనస్సనే కత్తి పదునెక్కుతుంది. అందువల్ల గృహస్థాశ్రమాన్ని పాటించండి అంటుంది వేదం.

మళ్ళీ అదే వేదం గృహస్థాశ్రమంనుంచి సన్న్యాసాశ్రమానికి మారమంటుంది. ఎందుకు? అది జ్ఞాన సముపార్జనకు అనువుగా ఉంటుంది. ఎందుకంటే సన్న్యాసికి బాధ్యతలు లేవు, బంధాలు లేవు, యోగక్షేమాలు లేవు. యోగం అంటే ఆస్తులు సమకూర్చుకోవటం. క్షేమం అంటే సముపార్జించిన ఆస్తులను పరిరక్షించుకోవటం. సన్న్యాసి దగ్గర ఏమీ ఉండకూడదు. అపరిగ్రహం అంటారు. సన్న్యాసికి పండక్కి బట్టలు కొనాలనే బాధ లేదు; అందువల్ల ఎక్కడ డిస్కౌంట్ సేల్ ఉందా అనే వెంపర్లాట లేదు. ఏ షాంపూ కొనాలి, ఏ నూనె కొనాలనే బాధ లేదు; జుట్టే లేదు కాబట్టి. అతనికి రెండే మార్గాలు ఉన్నాయి. అయితే పూర్తిగా జుట్టు తీసేయటం, లేకపోతే గడ్డాలు పెంచుకోవటం. రెంటికీ మధ్యలో వేరే మార్గం లేదు.

అలాగే ఆశ్రమ ధర్మాలు కూడా ఇద్దరికీ వేర్వేరుగా ఉంటాయి. గృహస్థు నమకం, చమకం, విష్ణుసహస్రనామం లాంటివి పారాయణం చేయాలి. సన్న్యాసి పారాయణం ఉపనిషత్తు, బ్రహ్మసూత్రాలు, భాష్యాలు మాత్రమే.

జీవన విధానం కూడా ఇద్దరికీ వేర్వేరుగా ఉంటాయి. సన్న్యాసి కేవలం జ్ఞానసముపార్జన చేయాలి అంతే. దానికి ఖర్చేం లేదు. గృహస్థు కర్మలు చేయాలి. అది చాలా ఖర్చుతో కూడిన వ్యవహారం. సన్న్యాసి ఆఖరికి వంట కూడా చేసుకోకూడదు. అందుకే సన్న్యాసిని నిరగ్ని అంటారు. అగ్ని ఉండకూడదు అతని చుట్టుపక్కల. అగ్నికర్మలకు వంటశాల చిహ్నం. వంటశాల వస్తే, బొద్దింకలను ఎలా పారద్రోలాలా అంటూ బొద్దింక ధ్యానమే సరిపోతుంది. మరి ఆకలి వేస్తే ఆహారం ఎలా? వేదం భిక్షాటన చేసి, ఆహారం స్వీకరించమంటోంది. **భవతీ భిక్షాం దేహి** అని అడిగి, వచ్చిన ఆహారాన్ని భుజించి, అక్కడితో ఆ విషయం మర్చిపొమ్మంటుంది. ఆ విధంగా ప్రవృత్తి మార్గాన్ని గృహస్థుకూ, నివృత్తిమార్గాన్ని సన్న్యాసికీ నిర్దేశించింది వేదం. ఇది ఒక రకం మార్గం.

రెండవరకం మార్గం మనమంతా పాటిస్తున్న మార్గం. గృహస్థాశ్రమంలో ఉంటూనే జ్ఞానయోగం పాటించటం.

మూడవ రకం మార్గం గృహస్థాశ్రమానికి రాకుండానే సరాసరి సన్న్యాసాశ్రమాన్ని స్వీకరించటం. సన్న్యాసాశ్రమంలో మనస్సును శుద్ధి చేసుకునే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి. అతని చేతిలో డబ్బులు ఉండవు కాబట్టి కర్మ చేయడు, దానధర్మాలు చేయడు, సంఘసేవ చేయలేడు. అలా అవకాశాలు తక్కువగా ఉన్నా కూడా చిత్తశుద్ధి పొందగలడు.

మొదటి మార్గంలో రెండు ఆశ్రమాలూ పాటిస్తే, రెండవ మార్గంలో గృహస్థాశ్రమంలోనే ఉండి సన్న్యాసాశ్రమం జోలికి పోడు; మూడవ పద్ధతిలో గృహస్థు అవనే అవడు. మూడవది కష్టం కాబట్టి అర్జునా! నువ్వు మొదటి రెండింటిలో ఏదైనా ఒకటి పాటించు అంటున్నాడు కృష్ణపరమాత్మ. మొదటి రెండింటిలో ఏ ఒక్కటి పాటించినా కూడా ప్రస్తుతం గృహస్థుగా ఉండాలి. అందువల్ల యుద్ధభూమినించి పారిపోలేదు; గృహస్థుగా ఉండాలి, చిత్తశుద్ధి పొందాలి, జ్ఞానం పొందాలి. ఇలా వస్తుంది బోధ. ఈ నేపథ్యంతో మూడవ శ్లోకం చూద్దాము.

**ద్వివిధా నిష్ఠా మయా ప్రోక్తా** – నేను రెండు రకాల జీవనవిధానాల గురించి చెప్పాను. (సాధనల గురించి చెప్పటం లేదు) ఎప్పుడు?

**పురా** – పూర్వం. ఎక్కడ?పరమాత్మ చెప్పడు. అది మనం పూరించుకోవాలి. వేదం ద్వారా చెప్పాడు. భగవద్గీతలో కొత్తగా ఏమీ చెప్పడు. వేదాలసారాన్ని చెబుతాడు. వైదిక సాంప్రదాయాన్ని, వైదిక జీవనవిధానాన్ని, వైదిక బోధను పునరుద్ధరించటానికి బోధిస్తున్నాడు. అందువల్ల ఎప్పుడు చెప్పాడు అంటే బ్రహ్మను సృష్టించగానే బ్రహ్మకు వేదాలనందించాడు.

**యో బ్రహ్మాణం విదధాతి పూర్వం యో వై వేదాంశ్చ ప్రహిణోతి తస్మై ।**
**తగ్ం హ దేవమాత్మ బుద్ధి ప్రకాశం, ముముక్షుర్వై శరణమహం ప్రపద్యే ॥** – శాంతి మంత్రం

భగవంతుడు బ్రహ్మను సృష్టించి, వేదాలను ఇచ్చాడు. అందువల్ల బ్రహ్మకు నాలుగు తలలు ఉన్నాయి. వాటిని వేదాలుగా భావిస్తాము. చతుర్ముఖబ్రహ్మ అంటాము. ఆ వేదాల్లో ప్రవృత్తి మార్గం, నివృత్తి మార్గం ఉన్నాయి. ఓ అర్జునా! వాటి గురించే నీకు ఇప్పుడు చెబుతున్నాను.

**అనఘ** – హే అర్జునా! అఘ అంటే పాపం; అనఘ అంటే పాపరహితం. స్వచ్ఛమైన మనస్సు కల అర్జునా! ఈ రెండు జీవనవిధానాలను నేను ప్రవేశపెట్టాను. ఎక్కడ?

**అస్మిన్ లోకే** – మనుష్యజాతిలో. జంతువులకు వర్ణాశ్రమధర్మాలు లేవు. మనుష్యులకే ఉన్నాయి. ఏమిటవి?

**సాంఖ్యానాం** – ఒకటి సన్న్యాసుల జీవనవిధానం. ఇక్కడ సాంఖ్య అంటే సన్న్యాసి. నివృత్తిమార్గం. వారి జీవనవిధానం ఎటువంటిది?

**జ్ఞానయోగేన** – అందులో జ్ఞానం పొందటం ఒకటే లక్ష్యం. వేరే ధర్మమేమీ లేదు. సన్యాసం స్వీకరించగానే యజ్ఞోపవీతాన్ని కూడా తీసివేస్తాడు. ఆ యజ్ఞోపవీతాన్ని పరమ పవిత్రంగా బ్రహ్మచర్య ఆశ్రమంలో స్వీకరించి, గృహస్థాశ్రమంలో పరిరక్షించుకుంటూ, గాయత్రీ మంత్రం జపిస్తూ వస్తాడు. కానీ యజ్ఞోపవీతం తీయగానే, గాయత్రీ మంత్రం కూడా పఠించడు. ఆ గాయత్రీ మంత్రం కూడా ఓంకారంలో లయమయిపోతుంది. గాయత్రీ మంత్రంలోని మూడు పాదాలు, మూడు అక్షరాలుగా కుదించబడతాయి సన్న్యాసికి –

**తత్సవితుర్వరేణ్యం** – **అ**
**భర్గోదేవస్య ధీమహి** – **ఉ**
**ధియో యోనః ప్రచోదయాత్** – **మ**

అ + ఉ + మ = ఓం. ఓంకార జపం చేస్తే చాలు. గాయత్రీ మంత్రం జపించే సమయం కూడా జ్ఞాన సముపార్జనకే వెచ్చించాలి. సైంటిస్టును చూడండి, అతను కేవలం అతని ప్రయోగాలమీదే ఏకాగ్రత చూపాలని ప్రభుత్వం అతనికి అన్ని సదుపాయాలను ఏర్పాటు చేస్తుంది. అతనికి వేరే ఏ వ్యాపకమూ లేకపోతే పరిశోధనమీదే శ్రద్ధ చూపగలడు. అతనికి రాత్రీ, పగలూ కూడా ఉండదు. ఎప్పుడు కావాలంటే అప్పుడు ల్యాబ్‌లోకి వెళ్ళే వీలు ఉంటుంది.

ఒక జ్ఞానికి వీలైనన్ని సదుపాయాలను కలుగజేసే సమాజం, తెలివైన సమాజం. మన వైదిక సమాజం తెలివైన సమాజం; అందువల్ల సన్యాసి సంపాదించనవసరం లేదంది. అతని జీవితలక్ష్యం వేదాధ్యయనం చేయటం, నలుగురికీ నేర్పించటం. ఇటువంటి సమాజం మనకు ఉండటంవల్లనే మనకు ఒక గ్రంథాలయం నిండిపోయేటంత లోతైన ఆధ్యాత్మిక గ్రంథాలు ఉన్నాయి. మనం నేర్చుకుంటున్న ఈ భగవద్గీత పైపై పొర మాత్రమే. నిజంగా మన ఆధ్యాత్మిక గ్రంథాల లోతులు కొలవాలంటే అది మైళ్ళ కొద్దీ తవ్వుకుంటూ వెళ్ళాలి. అన్నిటికన్నా గొప్పదైన **బ్రహ్మసూత్రాలు** కూడా ఐస్‌బర్గ్‌కు ఒక కొన మాత్రమే అని చెప్పవచ్చు.

ఆ రోజుల్లో ప్రెస్సులు, పుస్తకాలు, ముద్రణలు లేకపోయినా మనకింత విస్తారమైన శాస్త్రసంపద ఎలా వచ్చింది? వేదం జ్ఞానానికే ప్రాముఖ్యత నిచ్చింది. సన్యాసికి కావాల్సిన ఏర్పాట్లన్నీ చేసింది. అతనికి వేరే వ్యాపకం ఉండకూడదు. కేవలం పరిశోధన, పరిశోధన, పరిశోధన మాత్రమే. కాకపోతే ఇక్కడ పరిశోధన స్వస్వరూపంమీద.

గీతాభాష్యం అని ఒక పుస్తకం ఉంది – ఇప్పటికీ అది అందుబాటులో ఉంది. గీతమీద 8, 9 భాష్యాలు ఉన్నాయి అందులో. మనకు భాష్యం రాయటం మాట దేవుడెరుగు, ఒక భాష్యం అధ్యయనం చేసే తీరికే లేదు.

స్వామీజీ దగ్గర బ్రహ్మసూత్రాలమీద నాలుగు సంపుటాలు ఉన్న పుస్తకం ఉంది. బ్రహ్మసూత్రాలు 555 సూత్రాలు ఉన్నాయి. సూత్రం అంటే చాలా చిన్న వాక్యం. ఒక్కొక్క పుస్తకం ఒక తలగడ అంత పెద్దది. నాలుగు సంపుటాల్లో 9 భాష్యాలు ఉన్నాయి. స్వామీజీ నాలుగవ సంపుటి చివర్లో తిరగేస్తుంటే, 9వ భాష్యం తక్కిన 8 భాష్యాలకూ సారాంశం అని గ్రహించారు. చివరిపుటకు వస్తే, దానితో **నాలుగవ సూత్రంమీద భాష్యం ముగిసింది** అనే వాక్యం కనబడింది. 555 సూత్రాలు ఉంటే, నాలుగు సూత్రాలకే నాలుగు సంపుటాలు ఎలా రాయగలిగారు? ఎలాగంటే, వారు కేవలం తర్కం, మీమాంస, వ్యాకరణం, వేదాలు వీటిమీదే పూర్తి ఏకాగ్రత చూపేలా చేసింది నాటి సమాజం.

అందువల్ల, కృష్ణపరమాత్మ చెబుతున్నాడు, ఓ అర్జునా! అటువంటి సన్యాసులకు ఒక జీవనవిధానం ఏర్పాటు చేయబడింది. జ్ఞానయోగమే వారి లక్ష్యం. కాని అందరూ అంతలా అంకితమవలేరు. అందువల్ల రెండవ రకం మనుష్యుల గురించి చెబుతున్నాడు.

**యోగినామ్** – కొంతమంది బహిర్ముఖంగానే ఉంటారు. వారికి చుట్టూ మనుష్యులు ఉండాలి; ఏకాంతం అంటే భయం. ఒక్కరోజు సెలవు వచ్చినా ముందే ఎక్కడికి వెళ్ళాలో ప్రణాళికలు వేసేసుకుంటారు – ఏ సినిమాకి

వెళ్ళాలి, ఎవరిని ఇంటికి పిలవాలి, ఏ క్యాసెట్టు తెచ్చుకోవాలి వగైరా. ఇలాంటి వారికోసం శివరాత్రి రోజు ఇంకా ఎక్కువ సినిమాలు వేస్తారు. వీరికి జ్ఞానంమీద ఆసక్తి లేదు; అటువంటి వారికి పనేం లేకపోతే కాలం స్థంభించిపోతుంది. అందువల్ల వారికి ఒకటి నిర్దేశించాను అన్నాడు కృష్ణపరమాత్మ. ఏమిటది?

**కర్మయోగేన** – పంచమహాయజ్ఞాలతో కూడిన కర్మయోగ జీవితాన్ని నిర్దేశించాడు. పంచమహాయజ్ఞాలంటే ఏమిటో తరువాత చూద్దాము.

ఆ విధంగా రెండురకాల జీవనవిధానాలున్నాయి.

శ్లో. 4 **న కర్మణామనారంభాత్ నైష్కర్మ్యం పురుషోఽశ్నుతే।**
**న చ సన్న్యసనాదేవ సిద్ధిం సమధిగచ్ఛతి ॥**
న, కర్మణామ్, అనారంభాత్, నైష్కర్మ్యమ్, పురుషః, అశ్నుతే,
న, చ, సన్న్యసనాత్, ఏవ, సిద్ధిమ్, సమధిగచ్ఛతి ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| పురుషః | = మానవుడు | | చ | = ఇంకా |
| కర్మణామ్ | = కర్మలను | | సన్న్యసనాత్, ఏవ | = కర్మలను త్యజించినంత మాత్రమున |
| అనారంభాత్ | = ఆచరింపకుండుటవల్ల | | | |
| నైష్కర్మ్యమ్ | = నైష్కర్మ్యమును అనగా మోక్షమును | | సిద్ధిమ్ | = మోక్షమును |
| న, అశ్నుతే | = పొందదు | | న సమధిగచ్ఛతి | = పొందజాలదు |

**కర్మణామ్ అనారమ్భాత్ పురుషః నైష్కర్మ్యం న అశ్నుతే।**
**చ సన్న్యసనాత్ ఏవ సిద్ధిం న సమధిగచ్ఛతి ॥**

తా: మనుష్యుడు కర్మలను ఆచరింపకపోవడంవల్ల నైష్కర్మ్యము అనగా మోక్షము అతనికి లభింపదు. అలాగే కేవలము కర్మలను త్యజించినంత మాత్రమున సిద్ధిని అనగా మోక్షమును అతడు పొందజాలడు.

ఎటువంటి జీవన విధానాన్ని ఎన్నుకున్నా కూడా, రెండు సాధనలు చేసి తీరాలని కృష్ణపరమాత్మ చెప్పాడు. ఒక సాధన చిత్తశుద్ధిని కలగజేసే కర్మయోగ సాధన; ఇంకొక సాధన జ్ఞానాన్ని కలగజేసే జ్ఞానయోగ సాధన. కాని రెండవ సాధన నేటి ప్రపంచంలో కనుమరుగై పోతున్నది. అందువల్ల మీరెవరితోనైనా నేను వేదాంత బోధకు వెళుతున్నానని చెబితే, వారు ఏమిటీ వేదాంతమా, బోధా అని మీకేసి ఎగాదిగా చూస్తారు. పైగా ఎన్నో సంవత్సరాలుగా నేర్చుకుంటున్నామని మీరు చెపితే, అంత నేర్చుకునేందుకు ఏముంది అంటారు.

అసలు ఏం నేర్చుకుంటారో కూడా తెలియదు. వేదాంతం అంటే ఒక క్రమపద్ధతిలో, కొన్ని సంవత్సరాల పాటు, ఒక సమర్థవంతమైన ఆచార్యుని దగ్గర నేర్చుకుని, దాన్ని లోతైన అవగాహనతో మననం చేసుకోవాలి. కాని అది అదృశ్యమైపోతున్నది. మనం దాన్ని వెనకకు తీసుకురావటానికి ప్రయత్నిస్తున్నాము. స్వామీజీ బోధలకు క్రమం తప్పకుండా వెళ్ళేవారు, అనంత సాగరమైన శాస్త్రాన్ని చూసి ఆశ్చర్యపోతారు. స్వామీజీ, ఇంత నేర్చుకోవాలని తెలియదు, ఇందులో గూఢార్థం ఉందనీ తెలియదు. మీరు ఒకొక్క శ్లోకాన్ని 20 నిమిషాలు, ఒక్కోసారి

40 నిమిషాలు వివరిస్తున్నారు. అది కూడా ఒక్క భాష్యానిది. ఒకవేళ తొమ్మిది భాష్యాలూ వినాలంటే ఒక్క శ్లోకమే 10-12 క్లాసులు పడుతుందేమో అంటారు.

స్వామీజీ స్వయంగా ఆశ్రమంలో శిక్షణ పొందుతున్న రోజుల్లో కొన్ని శ్లోకాలకు, ఉదాహరణకు -

**సర్వాధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ** - 18.66
**క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి సర్వక్షేత్రేషు భారత** - 13.2
**కర్మణ్యకర్మ యః పశ్యేత్ అకర్మణి చ కర్మ యః** - 4.18

శంకరభాష్యం నేర్చుకోవాలంటేనే ఒక్కొక్క శ్లోకానికి 15 రోజులు పట్టేది. ఇది శంకరభాష్యానికి మాత్రమే. ఆ భాష్యంలో ఒక్క వాక్యానికి 15 వాక్యాలు రాస్తారు మరికొందరు.

ఒక జీవితకాలమంతా శాస్త్రం నేర్చుకున్నా కూడా, అందులో వందోవంతు మాత్రమే నేర్చుకుని ఉంటారు. అది కూడా అనుమానమే! అందువల్ల మన శాస్త్రం అంత గొప్పది. దానిలో కొంతైనా తప్పనిసరిగా నేర్చుకోవాలి. కృష్ణపరమాత్మ ముందు కర్మయొక్క ప్రాముఖ్యత గురించి వివరించాక, తరువాత జ్ఞానం గురించి చెబుతాడు. అందువల్ల, అర్జునా! నువ్వు కర్మనుంచి తప్పించుకోకూడదు అంటాడు. కర్మను ఎందుకు నిర్లక్ష్యం చేయకూడదో చెప్పటానికి మూడు కారణాలు చూపిస్తున్నాడు కృష్ణపరమాత్మ.

ఈ శ్లోకంలో మొదటి కారణం వస్తుంది.

1. **కర్మను మానటంవల్ల మోక్షం రాదు** - కర్మ చేయటంనుంచి తప్పించుకుంటేనో, కర్మ చేయటం మానితేనో మోక్షం రాదు; సంసారంనుంచి తప్పించుకోలేరు. ధర్మాన్ని, కుటుంబాన్ని వదిలి పారిపోతే శాంతి దొరకదు. దూరపు కొండలు నునుపు అంటారు. సమస్యలనుంచి పారిపోతే పరిష్కారం దొరకదు. ఎందుకంటే సమస్య ఎక్కడో బాహ్యంగా లేదు. అది మీలో అంతర్గతంగా ఉంది అంటుంది శాస్త్రం. అజ్ఞాని ఎక్కడ ఉన్నా సంసారాన్ని అనుభవిస్తూనే ఉంటాడు; జ్ఞాని ఎక్కడ ఉన్నా శాంతి పొందుతూనే ఉంటాడు. సమస్య లోపల ఉంది కాని వచ్చిన చిక్కేమిటంటే సమస్య కుటుంబంలో ఉందనుకుని, దాన్నుంచి పారిపోవాలని చూస్తారు.

అందువల్ల కృష్ణపరమాత్మ చెప్పిన మొట్టమొదటి సూత్రం కర్మ చేయటం మానివేస్తే, మోక్షం అంటే శాంతి రాదు.

**కర్మణామనారంభాత్** - కర్మలు, బాధ్యతలు, ధర్మాలు, సేవలు చేయకుండా తప్పించుకోవటంవల్ల;

**పురుష; న అశ్నుతే** - మనిషి పొందలేడు. ఏం పొందలేడు?

**నైష్కర్మ్యం** - ఇదొక సాంకేతిక పదం. అంటే మోక్షం లేదా శాంతి. కర్మలు మానేయటంవల్ల మోక్షం రాదు.

కాని శాస్త్రంలో కొన్ని మంత్రాల్లో సన్న్యాసం ద్వారా మోక్షం పొందవచ్చు అని వస్తుంది. ఉదాహరణకు -

**న కర్మణా న ప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వమానశుః**

కృష్ణపరమాత్మ కర్మ మానితే మోక్షం రాదు అంటున్నాడు. అంటే వేదాన్ని కాదంటున్నాడా అనే సందేహం కలగవచ్చు అర్జునునికి. అందువల్ల కృష్ణపరమాత్మ తన వాక్యాన్ని వివరిస్తున్నాడు. సన్న్యాసంవల్ల మోక్షం వస్తుంది అని చెప్పిన చోటల్లా, **జ్ఞానసహితత్యాగేన అమృతత్వమానశుః** అని కలుపుకోవాలంటున్నాడు కృష్ణపరమాత్మ. కేవలం సన్న్యాసం స్వీకరిస్తే చాలదు; దానికి జ్ఞానం తోడవ్వాలి. ఎలా చెప్పగలము? ఇంకో ఉపనిషత్ వాక్యం దాన్ని నిరూపిస్తుంది.

**వేదాంత విజ్ఞాన సునిశ్చితార్థా, సన్న్యాసయోగాద్ యతయః శుద్ధసత్త్వాః।**
**తే బ్రహ్మలోకేషు పరాంతకాలే, పరామృతాః పరిముచ్యంతి సర్వే॥**

సన్న్యాసం గొప్పదే; కాని కేవలం కాషాయ వస్త్రాలు ధరిస్తేనో, ఆశ్రమవాసం చేస్తేనో, హిమాలయాలకు వెళ్ళిపోతేనో చాలదు. **వేదాంత విజ్ఞాన సునిశ్చితార్థా** – వేదాంత విద్య నేర్చుకుంటేనే సన్న్యాసం ఫలిస్తుంది. వేదాంతం నేర్చుకోకుండా, కేవలం సన్న్యాసి అయితే అది పెద్ద సమస్య అయి కూర్చుంటుంది. ఆ విషయం కూడా కృష్ణపరమాత్మ తర్వాత చెబుతాడు. తన భావాన్ని రెండవ పాదంలో వివరిస్తున్నాడు.

**సన్న్యసనాదేవ** – కేవలం సన్న్యాసం స్వీకరించినంత మాత్రాన;

**సిద్ధిం న సమధిగచ్ఛతి** – మోక్షం ఎన్నటికీ పొందలేడు. సిద్ధి అంటే ఇక్కడ మోక్షం. మొదటి పాదంలోని నైష్కర్మ్యం, రెండవ పాదంలోని సిద్ధి, రెండు పదాల అర్థం ఒక్కటే – మోక్షం.

కృష్ణపరమాత్మ ఇక్కడ చెప్పదలుచుకున్నది, సన్న్యాసం మోక్షాన్నిచ్చి తీరదు. అలాంటి అవకాశమే ఉంటే సామూహికంగా ఉపనయనాలు, వివాహాలు చేసినట్లుగా సామూహికంగా సన్న్యాసి మేళాలు కూడా నడిపి, ఒక 200 కాషాయవస్త్రాలు పంచేయవచ్చు. బయటకి రాగానే మోక్షం వస్తుంది – ఇంక కష్టపడి గీత నేర్చుకోవటం ఎందుకు? అందువల్ల కృష్ణపరమాత్మ **సన్న్యసనాదేవ** అంటున్నాడు. ఏవ ముఖ్యం ఇక్కడ. ఏవ అంటే సన్న్యాసం స్వీకరించినంత మాత్రాన **సిద్ధిం న సమధిగచ్ఛతి** మోక్షం రాదు. మరేం చేస్తే వస్తుంది? జ్ఞానం పొందితేనే వస్తుంది. ఇది మొదటి వాదన. రెండవ వాదన తరువాత వచ్చే శ్లోకంలో వస్తుంది.

శ్లో. 5 **న హి కశ్చిత్ క్షణమపి జాతు తిష్ఠత్యకర్మకృత్ ।**
**కార్యతే హ్యవశః కర్మ సర్వః ప్రకృతిజైర్గుణైః ॥**
న, హి, కశ్చిత్, క్షణమ్, అపి, జాతు, తిష్ఠతి, అకర్మకృత్,
కార్యతే, హి, అవశః, కర్మ, సర్వః, ప్రకృతిజైః, గుణైః ॥

హి = నిస్సందేహముగా
కశ్చిత్ = ఏ మనుష్యుడైనను
జాతు = ఒకానొకప్పుడును
క్షణమ్, అపి = క్షణకాలము గూడ
అకర్మకృత్ = కర్మను చేయనివాడై

న, తిష్ఠతి = ఉండడు
హి = ఎందుకంటే
సర్వః = ప్రతిమనుష్యుడును (మనుష్యులందరునూ)

| | | | |
|---|---|---|---|
| ప్రకృతిజైః, గుణైః | = ప్రకృతి జనితములైన గుణములచేత | కర్మ | = కర్మను (చేయుటకు) |
| అవశః | = అవశుడై (అవశముగనే) | కార్యతే | = బాధ్యుడగుచున్నాడు |

**కశ్చిత్ జాతు క్షణమపి అకర్మకృత్ న హి తిష్ఠతి ।**
**ప్రకృతిజైః గుణైః సర్వః హి అవశః కర్మ కార్యతే ॥**

తా: ఏ మనుష్యుడైనను ఏ కాలమునందైనను క్షణమాత్రము గూడ కర్మను ఆచరింపకుండ ఉండలేడు. ఇందు ఎటువంటి సందేహమునకును తావులేదు. ఎందుకంటే మనుష్యులందరును ప్రకృతి జనితములైన గుణములకు లోబడి కర్మలను చేయుటకు బాధ్యులగుదురు. ప్రతివ్యక్తియు కర్మను ఆచరింపవలసియే యుండును.

ఇందులో రెండవ వాదన వస్తుంది.

2. **కర్మ మానటం అసాధ్యం** – ముందేమన్నాడు? కర్మ మానటంవల్ల మోక్షం రాదు అన్నాడు. ఇప్పుడు అసలు కర్మ మానటం అసాధ్యం అంటున్నాడు. తన స్వభావం ప్రకారం కర్మ చేయకుండా ఏ వ్యక్తీ ఉండలేడు.

**క్షణమపి అకర్మకృత్ న తిష్ఠతి** – ఒక్క క్షణం కూడ, ఏ కర్మా చేయకుండా ఎవరూ ఉండలేరు. కాయిక కర్మ మానుతారేమో కాని మానసిక కర్మ మానలేరు. నిజానికి కాయిక కర్మ చేయటం మాని, ఇలా ధ్యానం చేయటానికి కూర్చుంటారో లేదో, సాధారణంగా నిదానంగా కదిలే ఆలోచనలు దూసుకు వస్తాయి. మనస్సు వేగంగా పరుగెడుతూ ప్రపంచమంతా ఒక్క క్షణంలో చుట్టి వస్తుంది. ఒక కవి జపం గురించి అద్భుతంగా చెప్పాడు, 'నాలుకలో నామాలు తిరుగుతాయి; చేతిలో జపమాల తిరుగుతుంది, మనస్సు ప్రపంచం అంతా తిరుగుతుంది.' మూడూ తిరుగుతాయి.

అందువల్ల జాతు క్షణమపి అకర్మకృత్ న తిష్ఠతి – క్షణం కూడా నిశ్చలంగా ఉండలేడు. ఎందుకు?

**సర్వః ప్రకృతిజైః గుణైః కార్యతే** – ప్రకృతియొక్క మూడు గుణాలవల్ల ఏదో ఒక కర్మ చేసి తీరాలి ఎవరైనా. ప్రకృతి అంటే మాయ. మాయవల్ల సృష్టి జరిగింది. మాయలో మూడు గుణాలు ఉన్నాయి. ఆ మూడు జగత్తుకు వచ్చాయి. బంగారంనుంచి ఆభరణాలు చేస్తే, బంగారంలో ఏం ఉంటే అవి నగలలోకి కూడా వస్తాయి. బంగారంలో రాగి ఉంటే ఆభరణంలో రాగి వస్తుంది; బంగారంలో వెండి ఉంటే ఆభరణంలో వెండి వస్తుంది.

కార్యే కారణగుణాః అనువర్తంతే – కారణంలో ఏ గుణాలు ఉంటే, అవి కార్యంలోకి వస్తాయి – ఇది సూత్రం. తల్లితండ్రుల గుణాలు పిల్లలకు వస్తాయి అంటారు. వీటినే జన్యు లక్షణాలు అంటారు. అలా కొన్ని లక్షణాలు, కొన్ని రోగాలతో సహా పిల్లలకు వస్తాయి. అలాగే మాయకు మూడు గుణాలు ఉంటే సృష్టి అంతటా కూడా మూడు గుణాలు ఉంటాయి. మనుష్యుల్లో ఈ గుణాల్లో ఏది ఎక్కువ ఉంటే దానికి తగ్గట్టుగా వారు ప్రవర్తిస్తారు. సత్వరజతమో గుణాల్లో ఏది ప్రధానంగా ఉంటే అలా ప్రవర్తిస్తారు, అలా ప్రవర్తించక తప్పదు.

**అవశః (కార్యతే)** – నిస్సహాయంగా చేస్తారు. మనను మనం గమనించుకుంటే ఇది మనకే తెలుస్తుంది. ఏదైనా ప్రసంగం వింటున్నా కూడా మనం స్థిరంగా కూర్చోము. కాలో చేయో కదుపుతాము. గోళ్ళు కొరుకుతాము, చేతిలో ఉన్న కలం తిప్పుతాము లేదా వేరే ఏదైనా చేస్తాము. ఒక ప్రసంగం మొదట్లో అందరికీ కాగితాలు పంచి, అది అయ్యాక వెనక్కి తీసుకుంటే, ఆ కాగితాలు రకరకాల ఆకారాల్లో వెనక్కి తిరిగి వస్తాయి. పడవ, పక్షి ఆకారాల్లో రావచ్చు, లేదా ముక్కలుగా చిరిగి రావచ్చు. కొంతమంది బయట లాన్‌లో కూర్చుంటే గడ్డి పీకుతుంటారు. నడుస్తుంటే కొమ్మలు తెంపుతూ ఉంటారు. అదీ మనస్సుయొక్క స్వరూపం. అందువల్ల కర్మ మానటం అసాధ్యం. మనం చేయగలిగింది ఆ కర్మను తగ్గించటమో, వాటి దిశ మార్చటమో మాత్రమే. కర్మయోగంలో మన శక్తిని సరియైన దిశలో తీసుకువెళ్ళటమే కృష్ణపరమాత్మ లక్ష్యం. పిల్లలు కుదురుగా కూర్చోలేరు అంటాము కాని ముందు మనమే కూర్చోలేము. అందువల్ల కర్మ మానటం కాదు, కర్మయొక్క దిశానిర్దేశం చేయటమే మన లక్ష్యం.

ధ్యానంలో మనస్సును శూన్యం చేయటానికి ప్రయత్నిస్తారు కొందరు, కాని అది పెద్ద తప్పు. ఎందుకంటే మనస్సు పని, పని చేయటం ఆపటం కాదు; పని చేస్తూనే ఉండటం. అందువల్ల వేదాంత ధ్యానంలో ఆలోచనను ఆపటం కాదు; మనస్సును నిశ్చలం చేయటం కాదు; మనస్సుయొక్క దిశానిర్దేశం చేయటం. ఒక ధ్యానం నిర్దేశిస్తే, దానికి సంబంధించిన ఆలోచనను చేయమంటుంది.

కృష్ణపరమాత్మ కర్మ మానటం అసాధ్యం అంటున్నాడు. ఎక్కడికి వెళ్ళినా కొత్తరకం కర్మ చేస్తారు. సన్న్యాసం స్వీకరించి, హృషీకేశ్ వెళ్ళినా మీరు రాజసిక వ్యక్తి అయితే అక్కడ సన్న్యాసుల సంఘం స్థాపిస్తారు. అక్కడ మంచే చేస్తారు. రక్తదానం చేస్తారు. అదే వ్యాపారలక్షణం ఉంటే రుద్రాక్షల వ్యాపారం మొదలుపెడతారు, ఇండోనేషియానుంచి తెప్పించి మరీ.

కర్మ మానటం అసాధ్యం అని చెప్పటానికి ఒక కథ కూడా ఉంది.

ఒక ఆలయంలో ఒక సన్న్యాసి ఏమీ చేయకుండా కూర్చునేవాడుట. ఆయనకు దేవునికి పెట్టిన నైవేద్యంలోంచి కొంచెం భిక్షగా వేసేవారుట. అలా కొన్నాళ్ళు గడిచింది. ఇంతలో కొత్త ధర్మకర్త వచ్చాడు. ఆయన పరిస్థితులను మెరుగు పరచాలని, ఆలయ ఖర్చులు తగ్గించాలని కంకణం కట్టుకున్నాడు. ఎంతమందికి ఉచితంగా భోజనం పెడుతున్నారో చూస్తే, అందులో ఖాళీగా కూర్చున్న ఈ సన్న్యాసి కూడా ఉన్నాడు. అతను ఏమీ చేయనప్పుడు అతనికి ఎందుకు దండగగా భోజనం పెట్టటం, ఆ ఖర్చు తగ్గిద్దామనుకున్నాడు ధర్మకర్త. పూజారులకు ఆ స్వామి అంటే గౌరవం. అందువల్ల మీరే ఒకసారి మాట్లాడి చూడండి అన్నారు వారు ఆ ధర్మకర్తతో.

ధర్మకర్త వెళ్ళి సన్న్యాసితోనే మాట్లాడాడు. నువ్వేమీ ఆలయానికి సహాయపడనప్పుడు, నీ కెందుకు అనవసరంగా భోజనం పెట్టాలని ప్రశ్నించాడు. ఆ స్వామి ఏమీ చేయకుండా ఉండటమే పెద్ద పని చేయటం అన్నాడు. అదేం పెద్ద పని అన్నాడు ధర్మకర్త. అలా అయితే ఒక వారం నాతో పాటు నువ్వు కూడా ఖాళీగా కూర్చో అని సవాలు విసిరాడు సన్న్యాసి. అదేమైనా కష్టమా అనుకుని నవ్వుకున్నాడు ధర్మకర్త.

మర్నాడు వెళ్ళి సన్న్యాసి పక్కన కూర్చున్నాడు. ఒక గంట గడిచింది. నెమ్మదిగా ధర్మకర్తకు అసహనం మొదలయింది. అటు ఇటు చూశాడు. ఎవరో అవస్థ పడుతుంటే వారికి సహాయ పడటానికి లేవబోయాడు. సన్న్యాసి అతన్ని ఆపి కూర్చోపెట్టాడు. ఇంకొక రెండు గంటలు గడిచాయి. ధర్మకర్త ఎంత అసహనంగా తయారయ్యాడంటే, అక్కడినుంచి పారిపోయాడు. వెంటనే పూజారుల దగ్గరికి వెళ్ళి, ఆ ఖాళీగా కూర్చున్న సన్న్యాసికి రోజూకన్నా రెట్టింపు ఆహారం పెట్టండి అని ఆజ్ఞ జారీ చేశాడు. ఇప్పుడు నాకు అర్థం అయింది – పని చెయ్యటం కన్నా, చెయ్యకుండా ఖాళీగా కూర్చోవటం ఇంకా కష్టమని అన్నాడు. స్వభావంయొక్క తాకిడి ఉంటుంది.

అందువల్ల కర్మ మానటం అసాధ్యం. ఇది కృష్ణపరమాత్మ చేసిన రెండవ వాదన.

శ్లో. 6 **కర్మేంద్రియాణి సంయమ్య య ఆస్తే మనసా స్మరన్ ।**
**ఇంద్రియార్థాన్ విమూఢాత్మా మిథ్యాచారః స ఉచ్యతే ॥**
కర్మేంద్రియాణి, సంయమ్య, యః, ఆస్తే, మనసా, స్మరన్,
ఇంద్రియార్థాన్, విమూఢాత్మా, మిథ్యాచారః, సః, ఉచ్యతే ॥

| | | | |
|---|---|---|---|
| యః | = ఎవడైతే | ఆస్తే | = ఉండునో |
| కర్మేంద్రియాణి | = సమస్తేంద్రియములను | సః, విమూఢాత్మా | = ఆ మూఢుడు |
| సంయమ్య | = (బాహ్యముగా) అదుపు చేసి | మిథ్యాచారః | = దంభా (కపటా)చారము గలవాడు అని |
| మనసా | = మనస్సు ద్వారా | ఉచ్యతే | = చెప్పబడుచున్నాడు |
| ఇంద్రియార్థాన్ | = శబ్దాదివిషయములను | | |
| స్మరన్ | = చింతించుచు | | |

**యః కర్మేన్ద్రియాణి సంయమ్య మనసా ఇన్ద్రియార్థాన్ స్మరన్**
**ఆస్తే సః విమూఢాత్మా మిథ్యాచారః ఉచ్యతే ॥**

తా: బలవంతముగా, బాహ్యముగా ఇంద్రియవ్యాపారములను నిగ్రహించి, మానసికముగా ఇంద్రియ విషయములను చింతించునట్టి మూఢుణ్ణి మిథ్యాచారి అనగా దంభాచారుడు అని అంటారు.

ఇందులో మూడవ వాదన వస్తుంది.

3. **కర్మ మానటం చాలా ప్రమాదకరం కూడా.** ఆత్మజ్ఞానం, మోక్షం కలగటం మాట దేవుడెరుగు, అది విరుద్ధమైన ఫలితాన్ని ఇవ్వచ్చు కూడా. ఒక వ్యక్తి ఐహిక సుఖాలను, ఐహిక కోరికలను పూర్తిగా త్యజించ గలిగినప్పుడే వేదాంతంమీద పూర్తిగా ఏకాగ్రత చూపగలడు.

ప్రతి ఒక్కరికీ కోరికలు ఉంటాయి. ఆ కోరికలు కూడా ఎదుగుతూ వస్తాయి. ముందు ప్రాథమిక కోరికలు ఉంటాయి. అంటే తిండి, బట్ట కోరుకుంటారు. అవి తీరాక సరదాలు తీరాలనుకుంటారు. అవీ తీరాక ప్రేమించబడాలనుకుంటారు. నేనెవరినైనా ప్రేమించాలి, నన్నూ ఎవరైనా ప్రేమించాలి. ఎలా ఉన్నావు అని

ఆప్యాయంగా అడిగే ఒక తోడు కావాలి. జలుబు చేస్తే, నీ జలుబు తగ్గిందా? అని అభిమానంగా అడిగేవారు కావాలి. అలా అడిగేవారు లేకపోతే నాకెవరూ లేరనే బాధతో కృంగిపోతారు.

మనిషి మనస్సులో అనేక స్థాయిలు ఉంటాయి. స్థూలస్థాయిలో అహం రాజ్యమేలుతుంది. అందరూ నన్ను గుర్తించాలని తహతహలాడుతూ ఉంటుంది. అందువల్ల ఒక ఇల్లు కట్టుకుని, దాని ముందు అతనిపేరు తాటికాయంత అక్షరాలతో రాసి, అది కనబడటానికి దానిపైన ట్యూబ్‌లైట్ పెడతాడు. లైటుని మించి పేరు కనబడాలనే తాపత్రయమన్నమాట. కొంతమంది, పిల్లలు పెద్దవారయి, తమ కాళ్ళమీద తాము నిలబడితే భరించలేరు. పిల్లలు స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకుంటే, అదీ పెళ్ళి విషయంలో తామే ప్రేమించి పెళ్ళి చేసుకుంటామంటే తట్టుకోలేరు. పిల్లలు దూరమయిపోతున్నట్టు, తమని పట్టించుకోనట్టు బాధ పడతారు. వారి అహం దెబ్బ తింటుంది. అహంకారం పడిపోయే ముందు, అహంకారం పరిపక్వం చెందాలి.

అహంకారం ఎదగటం, పరిపక్వత చెందటం – సమాజంలో ఉండి, ఏదైనా సాధిస్తేనే జరుగుతుంది. కనీసం పెళ్ళి చేసుకుని, పిల్లలనుకన్నా కూడా ఏదో సాధించినట్టే. ఈ అవసరాలేమీ తీరకుండానే సన్న్యాసం స్వీకరించేస్తే, తను పొందలేని విషయాలమీదే ఉంటుంది దృష్టి అంతా. అయ్యో నేను పెళ్ళి చేసుకుని ఉండాల్సింది అనుకుంటాడు, ముఖ్యంగా ఎవరైనా జంటను చూసినప్పుడు.

పైగా మన సమాజంలో విశేషం ఏమిటంటే సన్న్యాసమార్గం వన్‌వే ట్రాఫిక్. అంటే గృహస్థు సన్న్యాసం స్వీకరించగలడు, సన్న్యాసి మళ్ళీ గృహస్థుగా మారటానికి వీలులేదు. అందువల్ల దయానంద స్వామీజీ చెబుతూ ఉండేవారు – ఆయన ఉత్తరకాశీకి వెళ్ళి సాధువులతో, సన్న్యాసులతో మాట్లాడేటప్పుడు, వారు ఈయన భవిష్యత్తులో ఏమవుదామనుకుంటున్నావని అడిగేవారు. పూజ్య స్వామీజీ నేను సన్న్యాసం స్వీకరించాలనుకుంటున్నాను అనేవారుట. ఆ నిర్ణయం మాత్రం తీసుకోవద్దు అనేవారుట తక్కిన సన్న్యాసులు.

ఒక స్వామి అయితే నేను నా భార్యతో పోట్లాడి సన్న్యాసం స్వీకరించాను! అది కూడా ఒకరోజు పొద్దునే కాఫీ ఇవ్వటం ఆలశ్యం చేసిందన్న చిన్న కారణానికి. ఇక్కడికి వచ్చాక, మొదటి రోజు హిమాలయాలను చూస్తుంటే అద్భుతంగా ఉంది, ఇక్కడే ఉండిపోవాలనుకున్నాను. కానీ రెండవ రోజు, మూడవ రోజు, నాలుగవ రోజు – అవే హిమాలయాలు, అదే గంగ! పోనీ భిక్ష తీసుకుందామని వెళితే అదే భిక్ష. దాల్ రోటీ పొద్దున, రోటీ దాల్ రాత్రి! వేరే మార్గం లేదు. ఇంట్లో అయితే నాలుగు రకాలు దొరుకుతాయి. అందువల్ల తొందరపడి నిర్ణయాలు తీసుకోకు అన్నాడు.

అందువల్ల అహంకారం తగ్గకపోతేనూ, పరిపక్వత రాకపోతేనూ, జీవితంలో ఎన్నో విషయాలు కోల్పోతారు. సన్న్యాసం స్వీకరించినవారి దగ్గరికి వచ్చినవారంతా తమ సమస్యలు చెప్పుకుంటారే తప్ప, మీకేమైనా సమస్యలున్నాయా అని స్వామిని అడగరు. అందువల్ల, సన్న్యాసం స్వీకరించినా మనస్సు సిద్ధంగా లేకపోతే జీవితం అయోమయంలో పడిపోతుంది. బాహ్యంగా వైరాగ్యం ఉన్నా, మానసికంగా ఐహికసుఖాలనే తలుచుకుంటాడు. అటువంటి జీవితం గడిపేవారిని మిథ్యాచారి అంటారు.

గృహస్థు విషయం తీసుకుంటే, అతనికి అనేక బాధ్యతలు ఉంటాయి. దానికి సంబంధించిన బెంగలు కూడా ఉంటాయి. అందువల్ల మనస్సు ఎప్పుడూ సందడిగానే ఉంటుంది. సన్న్యాసికి బాధ్యతలు లేవు, బెంగలు లేవు, లక్ష్యాలు లేవు, ప్రణాళికలు లేవు, అందువల్ల మనస్సుకు పనేం లేదు. ఆత్మజ్ఞానం ఇంకా పొందలేదు కాబట్టి ఆత్మమీద ధ్యానం చేయలేడు. వేరే మంచి పనులేమీ చేయలేడు. దాంతో అతని మనస్సు ఖాళీ అవుతుంది. అతను అణచుకున్న కోరికలు ఎగసి పడతాయి, ముఖ్యంగా తన చుట్టూ ఉన్నవారు అనేక విధాలుగా ఆనందిస్తుంటే. అతను కాషాయ వస్త్రాలు ధరించాడు కాబట్టి, ఆ సరదాలను అతను తీర్చుకోవటం సమాజం హర్షించదు కాబట్టి, ఊహల్లో తేలి పోతుంటాడు. అలా ఊహలు పరాకాష్ఠ చేరుకునేసరికి అతను సన్న్యాసి ఆశ్రమధర్మానైనా ఉల్లంఘిస్తాడు లేదా అణగదొక్కటంవల్ల డిప్రెషన్‌లోకైనా వెళ్ళిపోతాడు.

**పరీక్ష్య లోకాన్ కర్మచితాన్ బ్రాహ్మణో నిర్వేదమాయాన్నాస్త్యకృతః కృతేన ।**

**తద్విజ్ఞానార్థం స గురుమేవాభిగచ్ఛేత్ సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్ ॥** – ముండకమ్ 1.2.12

వేదాంతం ఐహికసుఖాలను అణగద్రొక్కకోక ముందు; వాటికి అతీతంగా ఎదగమంటుంది. వైరాగ్యం అంటే ఇహలోక కోరికలకు అతీతంగా ఎదగటం. అలా ఎదగకుండా కేవలం అణగద్రొక్కుకున్నవారిని మిథ్యాచారి అన్నాడు కృష్ణపరమాత్మ. బాహ్యంగా మాత్రమే సన్న్యాసి, కాని అర్థకామాలు అతన్ని వీడలేదు. అటువంటి వ్యక్తి మనస్సు రెండుగా చీలుతుంది. ఇప్పుడు శ్లోకం చూద్దాము.

**కర్మేంద్రియాణి సంయమ్య** – శారీరకంగా అర్థకామాలనుంచి విడివడతాడు కాని,

**మనసా ఇంద్రియార్థాన్ స్మరన్** – తనను తాను, ప్రపంచాన్ని మోసం చేస్తున్నాడు. సమాజం అతను ధ్యానం చేస్తున్నాడు అనుకుంటుంది. కాని అతని మనస్సుకు మాత్రమే తెలుసు అతను దేనిమీద ధ్యానం చేస్తున్నాడో.

**మిథ్యాచారః** – ఒక ఆచార్యుడు అలాంటి వ్యక్తిని చేపతో పోలుస్తాడు. చేప మంచినీటిలో తిరుగుతుంది కాని, నీటిలో ఉన్న వ్యర్థపదార్థాన్ని తింటుంది. అలాగే మంచి ఆశ్రమంలో ఉంటాడు కాని మనస్సు చెడు తలంపులనే తింటుంది. అటువంటి వ్యక్తిని మిథ్యాచారి అంటారు.

**విమూఢాత్మా** – మోహంలో ఉన్నాడు; అయోమయంలో ఉన్నాడు; తనకేం కావాలో తనకే తెలియదు.

**ఇంద్రియార్థాన్ మనసా స్మరన్** – అని కలపాలి

**ఇంద్రియార్థాన్ విమూఢాత్మా మిథ్యాచారః స ఉచ్యతే**

అందువల్ల ఓ అర్జునా! కర్మ మానేయటం ఇంకా ప్రమాదకరం. ఇది మూడవ వాదన. ఆ మూడూ టూకీగా మళ్ళీ ఒకసారి చూద్దాము.

**1. కర్మ మానటంవల్ల మోక్షం రాదు**

**2. కర్మ మానటం అసాధ్యం**

**3. కర్మ మానటం చాలా ప్రమాదకరం కూడా**

అందువల్ల కర్మ చేయాలి. ఎటువంటి కర్మ చేయాలి? తరువాత వచ్చే శ్లోకంనుంచి వస్తుంది.

శ్లో. 7 **యస్త్వింద్రియాణి మనసా నియమ్యారభతేஉర్జున ।**
**కర్మేంద్రియైః కర్మయోగమ్ అసక్తః స విశిష్యతే ॥**
యః, తు, ఇంద్రియాణి, మనసా, నియమ్య, ఆరభతే, అర్జున,
కర్మేంద్రియైః, కర్మయోగమ్, అసక్తః, సః, విశిష్యతే ॥

| | | | |
|---|---|---|---|
| తు | = కాని | అసక్తః | = అనాసక్తుడై |
| అర్జున! | = ఓ అర్జునా! | కర్మేంద్రియైః | = సమస్త ఇంద్రియములచేత |
| యః | = ఎవరైతే | కర్మయోగమ్ | = కర్మ యోగమును |
| మనసా | = మనస్సు ద్వారా | ఆరభతే | = ఆచరించునో |
| ఇంద్రియాణి | = ఇంద్రియములను | సః | = అతడు |
| నియమ్య | = వశపరచుకొని | విశిష్యతే | = శ్రేష్ఠుడగును |

**అర్జున! యః తు మనసా ఇంద్రియాణి నియమ్య ।**
**అసక్తః కర్మేంద్రియైః కర్మయోగమ్ ఆరభతే సః విశిష్యతే ॥**

తా: కాని, అర్జునా! మనస్సుతో ఇంద్రియములను వశపరచుకొని, అనాసక్తుడై ఇంద్రియముల ద్వారా కర్మ యోగాచరణమును కావించు పురుషుడు శ్రేష్ఠుడు.

కృష్ణపరమాత్మ గృహస్థాశ్రమాన్ని కీర్తిస్తున్నాడు. గృహస్థాశ్రమంలో, సమాజంలో ఉంటూ, సమాజానికి సేవ చేసే అవకాశం ఉంటుంది. ఒక పక్క తన అర్థకామాలను తీర్చుకుంటూ ఇంకో పక్క సమాజసేవ చేయాలంటుంది శాస్త్రం.

**ఇయం సీతా మమ సుతా సహధర్మచరీ తవ**

భార్యను సహధర్మచారిణి అంటారు. అంటే పెళ్ళి చేసుకునేది కేవలం అర్థకామాలను తీర్చుకోవటంకోసం కాదు, ధర్మబద్ధంగా సమాజానికి సేవ చేయటానికి. ఎటువంటి జీవితం గడపాలి?

**ఇంద్రియాణి మనసా నియమ్య** – గృహస్థుగా ముందు తన ఇంద్రియాలను నియంత్రించుకోవాలి. గృహస్థు అర్థకామాలను తీర్చుకోగలడు కాని సన్న్యాసి తీర్చుకోలేడని చూశాము. అర్థకామాలంటే ఏమిటి? అర్థం అంటే భద్రత, అది అనేక విధాలుగా వస్తుంది – డబ్బు, ఆస్తి, ఇల్లు, హోదా, పేరు, వగైరా. కామం అంటే సరదాలు తీర్చుకోవటం. గృహస్థు అర్థకామాలను తీర్చుకోవాలి, కాని ఒక షరతుమీద. ఏమిటది? ఇంద్రియాలను నియంత్రించటం ద్వారా అంటే ధర్మాన్ని ఉల్లంఘించకుండా చేయాలి.

అందరికీ కోరికలు తీర్చుకునే స్వేచ్ఛ ఉంది. అది శారీరకంగా అయినా, మానసికంగా అయినా సరే! సినిమాకు వెళ్ళాలంటే వెళ్ళొచ్చు, తప్పులేదు. కాని రోజుకు మూడు సినిమాలు చూడకూడదు. ఎప్పుడన్నా ఒకసారి వెళ్ళవచ్చు. సన్న్యాసి అలా కూడా వెళ్ళకూడదు. కాని సినిమాకు వెళ్ళేముందు మిమ్మల్ని మీరు ఒక ప్రశ్న వేసుకోవాలి! అది ధర్మపరంగా ఉందా, అతిగా ఉందా? ధర్మపరమైన కోరిక కూడా అతిగా ఉండకూడదు.

అమృతం కూడా ఎక్కువ తీసుకుంటే విషమవుతుంది. దీనికి ఊరగాయ ఉదాహరణ చూడండి. ఊరగాయ అన్నంలోకి తీసుకునే సైడ్ డిష్. దాన్నే అన్నంలా తినేయకూడదు. అలాగే అర్థకామాలు ప్రధానం కాదు; ధర్మం ప్రధానం. మనం ఇచ్చేది ఎక్కువగానూ, మనం తీసుకునేది తక్కువగానూ ఉండాలి. సమాజంనుంచి మనం తీసుకునే దానికన్నా, సమాజానికి మనం ఇచ్చేది అధికంగా ఉండాలి. అలా ఉన్న వ్యక్తిని ధార్మికపురుషుడు అంటారు.

అతిగా చేసే పనిని తగ్గించేలా ఇంద్రియ నిగ్రహం ఎలా చేస్తారు? మనసా – మనస్సు ద్వారా. అంటే వివేకం చూపాలి. ఏది మంచి, ఏది చెడు; ఏది ఎక్కువగా చేస్తున్నారు అని బుద్ధి చెబుతుంది. బుద్ధి నియంత్రిస్తుంది. నియంత్రించటం వేరు, అణగద్రొక్కటం వేరు. ఉదాహరణకు, పరవళ్ళు తొక్కే నదిని ఆపితే, అది అణగద్రొక్కటం అవుతుంది. దాన్ని బలవంతంగా ఆపితే అది మరింత ఎగిసిపడి, గట్టు తెంచుకుని ఆ ప్రాంతాన్ని ముంచెత్తుతుంది. అలా అని నదిని ఆపకపోతే అది అలా ప్రవహిస్తూపోయి, సముద్రంలో కలిసిపోతుంది. ఆ నీరు ఎవరికీ ఉపయోగకరంగా ఉండదు. అందువల్ల ఆనకట్ట కట్టాలి కాని ఆ నీటిని అవసరమైన వైపు వదలాలి.

అదే విధంగా ఇంద్రియాలను అణగద్రొక్కకూడదు; అలాగని అవి పోయిన చోటికల్లా మనస్సు, మనస్సు వెంట మనము పోకూడదు. వాటిని నియంత్రించాలి, సరియైన చోట వదలాలి. జ్ఞానేంద్రియాలను నియంత్రించాక,

**కర్మేంద్రియైః కర్మయోగమ్ ఆరభతే** – అన్ని ఇంద్రియాల ద్వారా కర్మయోగం పాటించాలి. గృహస్థు కర్మయోగం పాటించాలి. అది కూడా ఎలా?

**అసక్తః** – బంధకత్వం లేకుండా. ఇంద్రియాలకు తాను లోబడకుండా, వాటిని ఒక మార్గంగా చూడాలి తప్ప, వాటినే లక్ష్యంగా చూడకూడదు. గృహస్థాశ్రమం కూడా అంతిమలక్ష్యం కాదు. పెళ్ళి చేసుకోవటం, పిల్లలను కనటం అంతిమ లక్ష్యం కాదు; ఎప్పుడో ఒకరోజు మనను యమధర్మరాజు వారినుంచి విడదీసి తీసుకువెళ్ళిపోతాడు. అంతలోపే మనం బంధవిముక్తులం అవ్వాలి. యమధర్మరాజు వస్తే, నన్ను బలవంతంగా తీసుకువెళ్ళనవసరం లేదు. నేను రావటానికి సిద్ధమే అని చెప్పగలగాలి. ఇదీ బంధకత్వం లేకపోవటమంటే. మనం వాడుతున్న దేనిమీదా బంధం పెంచుకోకపోవటం. దీన్ని అసక్తః అంటారు.

**స విశిష్యతే** – కర్మయోగాన్ని పాటించే వ్యక్తి శ్రేష్ఠంగా ఉంటాడు. ఎవరికన్నా శ్రేష్ఠంగా ఉంటాడు? పరిపక్వత రాని సన్న్యాసి కన్నా శ్రేష్ఠంగా ఉంటాడు. అతను రెంటికీ చెడ్డ రేవడి అవుతాడు. అటు పూర్తిగా అన్నీ త్యజించలేడు, ఇటు వేదాంత శ్రవణ మనన నిదిధ్యాసనలు చేయలేడు. వేదాంతాన్ని ఇష్టపడితే సన్న్యాసాశ్రమం అద్భుతంగా ఉంటుంది. లేకపోతే అవస్థగా ఉంటుంది. అందువల్ల పరిణతి చెందని సన్న్యాసికన్నా గృహస్థే ఉత్తమం.

శ్లో. 8 **నియతం కురు కర్మ త్వం కర్మ జ్యాయో హ్యకర్మణః ।**
**శరీరయాత్రాఽపి చ తే న ప్రసిద్ధ్యేదకర్మణః ॥**
నియతమ్, కురు, కర్మ, త్వమ్, కర్మ, జ్యాయః, హి, అకర్మణః,
శరీరయాత్రా, అపి, చ, తే, న, ప్రసిద్ధ్యేత్, అకర్మణః ॥

| | | | |
|---|---|---|---|
| త్వమ్ | = నీవు | జ్యాయః | = శ్రేష్ఠము |
| నియతమ్ | = విధ్యుక్తమైన | చ | = ఇంకా |
| కర్మ | = కర్తవ్యకర్మను | అకర్మణః | = కర్మలనాచరించక పోవుటచే |
| కురు | = చేయుము | తే, శరీరయాత్రా | = నీ శరీరనిర్వహణ |
| హి | = ఎందుకంటే | అపి | = కూడా |
| అకర్మణః | = కర్మలనాచరింపకుండుటకన్నా | న, ప్రసిద్ధ్యేత్ | = కొనసాగదు |
| కర్మ | = కర్మలను చేయుటయే | | |

**త్వం నియతం కర్మ కురు అకర్మణః హి కర్మ జ్యాయః ।**
**తే శరీరయాత్రా చ అపి అకర్మణః న ప్రసిద్ధ్యేత్ ॥**

తా: నీవు శాస్త్రవిహిత కర్తవ్యకర్మలను ఆచరింపుము. ఎందుకంటే కర్మలను చేయకుండుటకన్నా చేయుటయే ఉత్తమము. కర్మలను ఆచరింపనిచో నీ శరీరనిర్వహణము గూడ సాధ్యము గాదు.

ముందు శ్లోకంలో కర్మయోగం శ్రేష్ఠమైనది అన్నాడు కృష్ణపరమాత్మ. కానీ ప్రతి సూత్రానికీ ఒక ఎక్సెప్షన్ ఉంటుంది. దాన్ని పట్టించుకోకూడదు. కొంతమంది గృహస్థాశ్రమానికి రాకుండానే సన్న్యాసాశ్రమం స్వీకరించి జ్ఞానం పొంది, మోక్షం పొందగలరు. నిజానికి శాస్త్రం అది ఎక్సెప్షన్ కూడా కాదు అంటుంది. వారు పూర్వజన్మలోనే గృహస్థాశ్రమ ధర్మాలను నెరవేర్చేశారు. అందువల్ల వారు గృహస్థాశ్రమాన్ని దాటేసినట్టు కాదు. అది పూర్వజన్మలోంచి తీసుకురాబడింది. అంతే.

ముందు శ్లోకంలో కర్మయోగం గురించి చెప్పాడు కాబట్టి కర్మయోగమంటే ఏమిటో వివరిస్తున్నాడు 8వ శ్లోకంనుంచీ. రెండవ అధ్యాయంలో కర్మయోగాన్ని టూకీగా నిర్వచించాడు కృష్ణపరమాత్మ.

**కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన ।**
**మా కర్మఫలహేతుర్భూః మా తే సంగోఽస్త్వకర్మణి ॥** – 2.47

**యోగస్థః కురు కర్మాణి సంగం త్యక్త్వా ధనంజయ ।**
**సిద్ధ్యసిద్ధ్యోః సమో భూత్వా సమత్వం యోగ ఉచ్యతే ॥** – 2.48

**2. కర్మయోగం శ్లోకాలు 8-20 (మొదటి పాదం):** ఈ భాగం చాలా ముఖ్యమైనది. దీనివల్లనే ఈ అధ్యాయానికి కర్మయోగం అనే పేరు వచ్చింది.

అంతకు ముందు కూడా చూసినట్లుగా గీతాబోధ ఉపనిషత్తుల సారం. వేదాలకన్నా గీత ఆధునిక కాలానికి చెందినదైతే, గీతకన్నా ఇప్పటి కాలం ఆధునిక కాలం. అప్పుడు పుస్తకరూపంలో బోధ లేదు; ఇప్పుడు పుస్తకాలు ఉన్నాయి. అప్పటి బోధకి ఇప్పుడు చెప్పే ఉదాహరణలు ఆధునిక కాలానికి చెందినవి ఉంటాయి. అంతేకాని, కర్మయోగం గురించి ఎప్పుడో ఉపనిషత్తులో వచ్చింది.

**కుర్వన్నేవేహ కర్మాణి జిజీవిషేచ్ఛతగ్ం సమాః ।**
**ఏవం త్వయి నాన్యథేతోఽస్తి న కర్మ లిప్యతే నరే ॥** – ఈశావాస్యోపనిషత్తు 2

**తమేతం వేదానువచనేన బ్రాహ్మణా వివిదిషంతి**
**యజ్ఞేన దానేన తపసా అనాశకేన** – బృహదారణ్యకోపనిషత్తు

ఈ రెండూ మొత్తం కర్మయోగానికి ఆయువుపట్టు మంత్రాలు. కృష్ణపరమాత్మ కూడా వీటిని ఆధారంగా చేసుకునే చెబుతున్నాడు. శ్లోకానికి వెళ్ళేముందు, కర్మయోగం అంటే ఏమిటో చూద్దాము. (ఇది రెండో అధ్యాయంలో కూడా చూశాము)

కర్మయోగంలో రెండు పదాలు ఉన్నాయి. ఒకటి కర్మ. రెండవది యోగం. కర్మ అంటే సరియైన పని చేయటం. యోగం అంటే సరియైన దృక్పథం ఉండటం. దేనిమీద? చేసే పనిమీద, దానివల్ల కలిగే ఫలితంమీద. ఇప్పుడు వీటిని వివరంగా చూద్దాము.

**కర్మ** – కర్మ అంటే సరియైన పని చేయటం అని చూశాము. కర్మలను మూడు రకాలుగా విభజించింది శాస్త్రం. అవి – సాత్త్వికకర్మ, రాజసకర్మ, తామసకర్మ. సాత్త్వికకర్మ ఉత్తమం, రాజసకర్మ మధ్యమం, తామసకర్మ అధమం. అందువల్ల కర్మయోగి సాత్త్వికకర్మలను ఎక్కువగా, రాజసికకర్మలను తక్కువగానూ చేయాలి. తామసికకర్మలను చేయకూడదు.

**సాత్త్వికకర్మ** – సాత్త్వికకర్మ ఉత్తమకర్మ. దీనివల్ల ఎక్కువ మంది లాభం పొందుతారు. నేను కూడా లాభం పొందవచ్చు, తప్పేం లేదు. కాని ఆ లాభం నా ఒక్కడికే కాక, అందరికీ వస్తుంది. ఒక వ్యాపారవేత్త తన వ్యాపారంలో లాభం పొందితే, తన లాభాన్ని తానే అనుభవించాలనుకోకుండా, తన ఐశ్వర్యాన్ని అందరితో పంచుకుంటాడు. అటువంటి వ్యక్తిని అందరూ దీవిస్తారు. చాలా డబ్బు సంపాదించాలని కోరుకోవటం తప్పు కాదు, కాని దాన్ని నలుగురికీ పంచాలి. అప్పుడు అందరూ మనను దీవిస్తారు. అందువల్ల సాత్త్విక కర్మ అంటే దానివల్ల చాలామంది ప్రయోజనం పొందుతారు. దీన్ని **నిష్కామ కర్మ** అంటారు. సాత్త్విక కర్మలో నేను ఇచ్చేది ఎక్కువ, తీసుకునేది తక్కువ ఉంటుంది. శాస్త్రం ప్రకారం ఎక్కువ తీసుకునే వ్యక్తి ఓడిపోయినట్టు, ఎక్కువ ఇచ్చే వ్యక్తి గెలిచినట్టు, కాని ప్రాపంచిక సూత్రం ప్రకారం తక్కువ పని చేసి, ఎక్కువ డబ్బు పొందే వ్యక్తి గెలుపొందినట్లు.

**రాజసకర్మ** – రాజసకర్మ మధ్యమ కర్మ. దీనివల్ల లాభం పొందే వారు చాలా తక్కువ. మేమిద్దరం, మాకిద్దరులాగా నా కుటుంబం మాత్రం లాభం పొందితే చాలు. ఇది స్వార్థపూరితమైన కర్మ. అందువల్ల నేను ఎక్కువ లాభం పొందుతాను. మహా అయితే నా భార్య, పిల్లలు లాభం పొందుతారు, నా తల్లితండ్రులను కూడా పట్టించుకోను. వారిని వృద్ధాశ్రమాల్లో దింపేసి, చేతులు దులిపేసుకుంటాను. వృద్ధాశ్రమాల గురించి ఎన్నో దయనీయగాథలు వింటాము. తల్లో, తండ్రో చనిపోయారని ఆశ్రమం వారు చెప్పినా, చివరిచూపు చూడటానికి కూడా రాకుండా, అంత్యక్రియలు కూడా మీరే జరిపేయండి అని చెప్పే ఘనులు ఉన్నారు. అందువల్ల రాజసకర్మ స్వార్థపూరితమైన కర్మ. బావిలో కప్ప మనస్తత్వం.

**తామసకర్మ** – తామస కర్మ అధమ కర్మ. ఇది ఇతరులను బాధపెట్టే కర్మ. నా లాభంకోసం, ఎదుటివారిని బాధ పెట్టటానికి కూడా వెనుకాడను. నా ఇష్టం వచ్చినట్లు రేడియో గాని, టి.వి. గాని పెద్దగా పెట్టేస్తాను. ఇరుగు పొరుగుకు ఇబ్బందేమో అని కూడా చూడను. మన దేశంలో అలా ఎక్కడ పడితే అక్కడ మైకులు పెట్టి వాటిల్లో ఏవో ఒకటి పెట్టేస్తుంటారు. ఒక్కోసారి విష్ణుసహస్రనామం పారాయణమే కావచ్చు కాని నేను అదే సమయంలో ధ్యానంలో కూర్చుంటే అది నా ఏకాగ్రతకు భంగం కలిగించవచ్చు. అందువల్ల ఇతరులకు ఇబ్బంది కలిగించే ఏ కర్మ అయినా కూడా అది తామసకర్మ. రాజసకర్మలో కూడా స్వార్థం ఉంటుంది! కాని దానికీ తామసకర్మకూ చిన్న భేదం ఉంటుంది. రాజస కర్మలో నా లాభం నేను చూసుకుంటాను కాని ఇతరులకు హాని కలుగజేయను. తామసకర్మలో అలా కాదు. నా స్వార్థంకోసం ఇతరులకు హాని కలుగజేస్తాను.

**నిష్కామ కర్మ సాత్త్విక కర్మ, స్వార్థపూరిత కర్మ రాజస కర్మ, హానికరమైన కర్మ తామస కర్మ.** సాత్త్విక కర్మలో ఆధ్యాత్మిక ఉన్నతిని అతి శీఘ్రంగా పొందితే, రాజసకర్మలో నిదానంగా కలిగితే, తామస కర్మవల్ల ఆధ్యాత్మిక ఉన్నతి రాకపోగా, దానికి దూరంగా పోతాడు. తామస కర్మవల్ల ప్రాపంచిక సుఖాలు, ఐశ్వర్యం పొందుతాడేమో కాని, శాస్త్రం అతను అధోగతి పాలవుతాడు అంటున్నది. ఎందుకంటే అతను అంతకంతకూ శాస్త్రానికి దూరంగా తొలగిపోతాడు. అందువల్ల సాత్త్వికకర్మను పెంచుకుంటూ పోవాలి. రాజసకర్మను తగ్గించాలి, తామసకర్మను అసలు చేయకూడదు.

**సాత్త్విక కర్మ అంటే ఏమిటి?** శాస్త్రమే సాత్త్విక కర్మలను నిర్దేశించింది. సకామకర్మలు ఎన్నయినా చేయవచ్చు కాని, సాత్త్విక నిష్కామకర్మ చేసి తీరాలి. దాన్ని **పంచమహాయజ్ఞాలుగా** పేర్కొంది. వాటిలో ఏదో ఒకటి కాదు, అన్నీ చేసి తీరాలి. ఏవి ఎంత చేయాలి అనేది మనిషినిబట్టి మారుతుంది కానీ, చేయటం మాత్రం అన్నీ చేసి తీరాలి. కొన్ని చేస్తే ఆధ్యాత్మిక ఎదుగుదల రెండురెట్లు, నాలుగు రెట్లు వేగంగా సాగుతుంది. సాత్త్విక కర్మ మనస్సుకు సబ్బు వంటిది. మనస్సులో పట్టిన రాగద్వేషాలు, కామక్రోధాలు అనే మురికిని పారద్రోలుతుంది.

**పంచమహాయజ్ఞాలు**

**1. దేవయజ్ఞం:** మీ జీవితంలో ధర్మపరమైన కర్మ ఉండితీరాలి. మీరు ఎంత బిజీగా ఉన్నా కూడా, రోజులో కొంతభాగం ప్రార్థనకు అంకితం చేయాలి. ఏం ప్రార్థన చేయాలి అనేది మీ ఇష్టం. మీ వర్ణాశ్రమ ధర్మాన్నిబట్టి, మీ వంశాన్నిబట్టి మీ ప్రార్థన చేస్తారు. అగ్నిహోత్రం, సంధ్యావందనం, రామనామజపం ఏదైనా చేయవచ్చు. కొంతమంది గుడికి వెళతారు. స్వామీజీ నేను ప్రయాణం చేస్తూ, ప్రార్థన చేయవచ్చా? అని అడుగుతారు కొంతమంది. అప్పుడు కూడా చేయవచ్చు. కాని అది అదనంగా చేసే ప్రార్థన అవుతుంది. ప్రత్యేకించి కొంత సమయాన్ని భగవంతునికోసం కేటాయించుకోవాలి. అప్పుడే దేవయజ్ఞంమీద మీకు గౌరవం ఉన్నట్టు.

ఎవరైనా అతిథులు మీ ఇంటికి వచ్చారనుకోండి! వారితో ఎలా మాట్లాడతారు? ఇల్లు తుడుచుకుంటూనో, మీ పనులు చేసుకుంటూనో మాట్లాడరు కదా! వారి పక్కన కూర్చుని, ప్రత్యేకంగా వారితో మాట్లాడతారు. లేకపోతే వారిని అవమానపరిచినట్టు అవుతుంది అనుకుంటారు. దైవయజ్ఞం కూడా అంతే. కొంత సమయం

జపానికో, ప్రార్థనకో కేటాయించాలి. తరువాత మీ ఇష్టం – బస్సులో కాని, వేరే ఎక్కడైనా కాని చేయవచ్చు. అది అదనం అవుతుంది. అలా దైవయజ్ఞం అంటే దేవుని పూజ, జపం.

**2. పితృయజ్ఞం:** పితృదేవతలను పూజించటం. విదేశాల్లో ఫాదర్స్‌డే, మదర్స్‌డే ఉంది. మనం మన పితృదేవతలను స్మరించుకోకపోతే వారికి కృతజ్ఞత చూపించని వారమవుతాము. ఈరోజు మనం ఇలా చక్కగా ఉన్నామంటే దానికి పితృదేవతలే కారణం. అందువల్ల వారికి శ్రాద్ధకర్మలు పెట్టడం, తర్పణాలు వదలటం చేయాలి.

**3. ఋషియజ్ఞం:** దీన్నే బ్రహ్మయజ్ఞం అని కూడా అంటారు. మన శాస్త్రాలను కాపాడుకోవటం. మన శాస్త్రంవల్లనే మన సాంప్రదాయం ఇంత పురాతనమైనది, ఇంత గొప్పది అయింది. మనకు అతి పురాతనమైన ఋగ్వేదం, యజుర్వేదాలు ఉన్నాయి కాని వాటిల్లో ఏమున్నాయో తెలియదు. వాటిని ఋషులు మనకు అందజేశారు. అందువల్ల వాటిని పదికాలాల పాటు నిలబెట్టటానికి, నలుగురికీ అందజేయటానికి మనవంతు కృషి మనం చేయాలి. అది ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ చేయవచ్చు. విష్ణుసహస్రనామం, భగవద్గీత, ఉపనిషత్తులు, సూక్తులు, భాగవతం, రామాయణం – వీటిల్లో ఏదైనా పారాయణం చేయవచ్చు. రామాయణం మొత్తం చదవలేకపోయినా, రోజుకు కొంతభాగం చదివితే అది బ్రహ్మయజ్ఞం అవుతుంది.

**ఋతం చ స్వాధ్యాయ ప్రవచనే చ, సత్యం చ స్వాధ్యాయ ప్రవచనే చ**
**తపశ్చ స్వాధ్యాయ ప్రవచనే చ, దమశ్చ స్వాధ్యాయ ప్రవచనే చ**
**శమశ్చ స్వాధ్యాయ ప్రవచనే చ, అగ్నయశ్చ స్వాధ్యాయ ప్రవచనే చ**
**అగ్నిహోత్రం చ స్వాధ్యాయ ప్రవచనే చ, అతిథయశ్చ చ స్వాధ్యాయ ప్రవచనే చ ॥** – తైత్తిరీయమ్

అన్ని సార్లు చెప్పటంలోని ఉద్దేశ్యం – మీరు శాస్త్రం అధ్యయనం చేయటమే కాదు. దాన్ని తరువాత తరానికి అందజేయాలి కూడా. మీరు వెళ్ళి సభల్లో ప్రసంగించనవసరం లేదు. మీ పిల్లలకు అందజేసినా చాలు. మన భారతదేశంలో పురాణాలు మన తల్లిదండ్రుల దగ్గరనుంచి నేర్చుకున్నాము. ఇప్పటి తల్లిదండ్రులు మాకంత తీరికలేదు, అందువల్ల అమరచిత్ర కథలు కొని ఇచ్చాము అంటారు. వేదపారాయణం చేసినా, స్మృతి, ఇతిహాస, పురాణాలు పారాయణం చేసినా బ్రహ్మయజ్ఞం క్రిందకి వస్తుంది.

ఈ బ్రహ్మయజ్ఞాన్ని నిజంగా ఒక యజ్ఞం లాగా కూడా చేస్తారు కొంతమంది. ఈ మంత్రాన్ని పఠిస్తారు –

**ఋగ్వేదం తర్పయామి, యజుర్వేదం తర్పయామి**
**సామవేదం తర్పయామి, అథర్వణ వేదం తర్పయామి**
**ఇతిహాస పురాణం తర్పయామి, కల్పం తర్పయామి, వ్యాకరణం తర్పయామి**
**సర్వాన్ ఋషీన్ తర్పయామి, సర్వాన్ ఋషిపత్నీగ్ం తర్పయామి ॥**

వ్యాకరణానికి, ఋషులకు, ఋషిపత్నులకు కూడా పూజ చేస్తున్నాము. దీన్ని బ్రహ్మయజ్ఞం అంటారు. ఇది చేసి తీరాలి. ఎంతసేపన్నది మీ ఇష్టం.

**4. మనుష్య యజ్ఞం:** సాంఘిక సంక్షేమసేవలన్నీ మనుష్యయజ్ఞంలోకి వస్తాయి. అన్నదానం చేయటం, అనాథాశ్రమానికి దానాలు ఇవ్వటం, పాతబట్టలు పంచిపెట్టడం, వృద్ధాశ్రమంలోని వృద్ధులతో కొంత సమయం గడపటం, పాఠశాలలు కట్టించటం – అన్నీ మనుష్యయజ్ఞంలోకి వస్తాయి. వేదం, అన్నదానానికి పెద్దపీట వేస్తుంది.

శ్రాద్ధకర్మ చేయాల్సిన రోజున, అది చేయకుండా బీదవారికి అన్నదానం చేయవచ్చా అని అడుగుతుంటారు కొందరు. శ్రాద్ధకర్మలు పితృయజ్ఞంలోకీ, అన్నదానం మనుష్యయజ్ఞంలోకీ వస్తాయి. ఒకదాని బదులు ఒకటి చేయలేరు. అలా చేసే అవకాశమే ఉంటే శాస్త్రమే వీటిల్లో ఏదో ఒకటి చేయండి అని ఉండేది. పరీక్ష పేపర్లో ఛాయిస్ ఉంటుంది కాని పంచమహాయజ్ఞాల్లో ఉండదు. అన్నీ చేయాలి. వేదాల్లో వస్తుంది ఈ విషయం.

**పంచమవేదే మహాయజ్ఞా సతతి ప్రజాయంతే సతతి**
**సంతిష్ఠంతే దేవయజ్ఞా పితృయజ్ఞా మనుష్యయజ్ఞో భూత**
**యజ్ఞో బ్రహ్మయజ్ఞా ఇతి ।**

వేదమే ఈ పంచమహాయజ్ఞాలను నిర్వచించింది. మనుష్యయజ్ఞం విషయంలో కూడా కొందరు పొరపాటు పడుతుంటారు. మానవసేవే మాధవసేవ అన్నారు కాబట్టి, దేవుడికి పెట్టే ఖర్చు, అభిషేకాలు మానేసి మనుష్యులకు సేవ చేయవచ్చు కదా అంటారు కొందరు. ఇందాక చెప్పినట్టే దేవునికి చేసే ఖర్చు దేవయజ్ఞం కింద వస్తుంది; మనిషికి పెట్టే ఖర్చు మనుష్యయజ్ఞం కింద వస్తుంది. ఒకదాని బదులు ఇంకొకటి చెయ్యకూడదు. పైపెచ్చు వారు ఆ ఈక్వేషను రెండవ వైపు చూడటం లేదు అంటారు స్వామీజీ. మానవసేవే మాధవసేవ అంటే, మాధవసేవే మానవసేవ కూడా కదా! దేవునికి పెట్టిన ఖర్చు మానవాళి మొత్తానికి అందుతుంది.

**5. భూతయజ్ఞం:** పరిసరాలను పరిరక్షించటం భూతయజ్ఞం క్రిందికి వస్తుంది. జంతువులను ప్రేమించాలని చెప్పటానికే మన దేవుళ్ళ వాహనాలుగా అనేక జంతువులు ఉన్నాయి. వాటిని వాహనంగా చూస్తే, వాటిమీద మనకు గౌరవం పెరుగుతుంది. చెట్లను పూజించాలి. ఒక చెట్టు నరకాల్సి వస్తే అధమపక్షం ఇంకొక చెట్టును నాటాలి.

**అశ్వత్థో వటవృక్ష చందన తరుర్మన్దారకల్పద్రుమౌ ।**
**జమ్బూ నిమ్బకదమ్బచూతసరలా వృక్షాశ్చ య క్షీరిణః ।**
**సర్వే తే ఫల సంయుతాః ప్రతిదినం రాజన్తి యత్రానిశం ।**
**రమ్యం చైత్ర రథం చ నన్దనవనం కుర్వన్తు నో మంగళం ॥**

ఈ చెట్లన్నిటినీ తలుచుకుని, అవి నా జీవితానికి తోడ్పడుతున్నాయని తెలుసుకోవటం భూతయజ్ఞం. దీనికి సూచనగా పూర్వం అందరూ ఆవుకు, తులసిచెట్టుకు పూజ చేసేవారు. ఈ రెండూ జంతువులకు, చెట్లకు సంకేతాలు. శకుంతల కణ్వమహర్షి ఆశ్రమంనుంచి వెళ్ళిపోయేటప్పుడు ఆమె మనుష్యులు, చెట్లు జంతువులు అందరికీ, అన్నిటికీ వీడ్కోలు చెప్పిందని కాళిదాసు చాలా అద్భుతంగా వర్ణిస్తాడు. ఆమెకొక లేడిపిల్ల అంటే

చాలా ముద్దు. శకుంతల వెళ్ళిపోతుంటే ఆ లేడిపిల్ల ఆమె కొంగు పట్టుకుని లాగిందట. శకుంతల ఆప్యాయంగా వెనక్కి తిరిగిందట. కణ్వమహర్షి చెట్లతో ఇలా అంటాడుట –

**పాతుం న ప్రథమం వ్యవస్యతి జలం యుష్మాత్ స్వపేతేషు యా ...**

ఓ వృక్షాల్లారా, శకుంతల వెళ్ళిపోతున్నది. ఇప్పటిదాకా ఆమె మిమ్మల్ని తన పిల్లల్లాగా అపురూపంగా చూసుకుంది. దయజేసి, ఆమెని మీరిప్పుడు దీవించండి. ఈ మాట విని చెట్లు తలలు వంచి దీవించాయి. వైజ్ఞానిక శాస్త్రపరంగా కూడా చెట్లకు భావాలుంటాయని నిరూపిస్తున్నారు. చెట్లని నరికితే బాధ పడతాయనీ, నీరు పోస్తే పులకిస్తాయనీ అంటారు. ఇదంతా భూతయజ్ఞం కిందికి వస్తుంది.

ముందే చెప్పినట్టుగా ఈ పంచమహాయజ్ఞాలు చేసి తీరాలి. వీటిలో ఏదో ఒకటి కాదు, అన్నీ చేయాలి. వీటిని సాత్త్వికకర్మ అంటారు. ఇటువంటి జీవనం గడిపిన వ్యక్తి సమాజానికి మేలు చేస్తాడు. జనాభాని తగ్గించండి, వృక్ష సంపదని పెంచండి అంటారు. ఎందుకు? చెట్లు సత్వగుణం ఉన్నవి, మనుష్యులు తామసగుణం ఉన్నవారు. మనిషి వాతావరణానికి బరువు; చెట్లు రక్షణ. అందువల్ల మనం కర్మయోగి జీవితం గడపాలి.

**కర్మ – పంచమహాయజ్ఞాలు, సాత్త్వికకర్మ**

**యోగం** – యోగం అంటే సరియైన దృక్పథం. మీరు చేసే కర్మను చిన్నచూపు చూస్తే, ఎంత గొప్ప కర్మ చేసినా మీకు ఫలితాన్ని ఇవ్వదు.

**ఈశ్వరార్పణ బుద్ధి** – ఏంచేసినా ఈశ్వరార్పణ బుద్ధితో చేయాలి. ఏంచేసినా, దేవుడికి అంకితం ఇస్తున్నట్లుగా చేయాలి. అది రాజసకర్మ అయినా సరే, సాత్త్వికకర్మ అయినా సరే! ఉదాహరణకు సమాజసేవ చేస్తున్నా, మీరు గొప్పగా మురిసిపోయి, అహంకారం పెంచుకోకూడదు. ఆ సేవను వినయంతో, అటువంటి అవకాశం దేవుడు మీకు ఇచ్చినందుకు కృతజ్ఞతతో చేయాలి. బీదవారికి ఏదైనా ఇస్తున్నప్పుడు కూడా అతన్ని నారాయణునిగా భావించాలి. అందుకే వారిని దరిద్రనారాయణులు అంటారు. మానవసేవే మాధవసేవ అంటారు. కృష్ణపరమాత్మ దీని గురించి 9వ అధ్యాయంలో మళ్ళీ చెబుతాడు.

**యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసి యత్ ।**
**యత్తపస్యసి కౌంతేయ తత్కురుష్వ మదర్పణమ్ ॥** – 9.27

ఆహారం తీసుకున్నప్పుడు కూడా మీలో ఉన్న వైశ్వానరాగ్నికి అర్పించాలి. కాయేన వాచా కూడా యాంత్రికంగా చదువుకుపోతాము. దాన్ని అర్థం చేసుకుని మన భావనలో మార్పు తెచ్చుకోవాలి. బల్ల తుడవటం లాంటి, మామూలు పనిని కూడా ఈశ్వరార్పణబుద్ధితో చేస్తే, దాన్ని శ్రద్ధగా చేస్తాము. దేవునికి నిర్లక్ష్యంగా చేయము కదా? అదే బాస్‌కోసం చేస్తే ఆ అంకితభావన ఉండదు. కర్తగా నా భావన ఈశ్వరార్పణబుద్ధిగా ఉండాలి.

**ఈశ్వరప్రసాద బుద్ధి** – మనం ఏపని చేసినా, దానికి ఏదో ఒక ఫలం వస్తుంది. అది స్వార్థపూరితమైన కర్మ అయినా సరే, నిస్వార్థమైన సేవ అయినా సరే! మనం నిస్వార్థసేవ చేస్తున్నా కూడా విమర్శించేవారు ఉంటారు.

పేపర్లలో పేరు రావటంకోసం చేస్తున్నాడు అంటారు. వారు విమర్శించకపోయినా, ఒక్కోసారి మనకే వృథాగా చేస్తున్నామనిపిస్తుంది. అతనికోసం అంత చేశాను, కాని అది అంతా బూడిదలో పోసిన పన్నీరయిపోయిందని బాధపడతాము. అందువల్ల, ఏం వచ్చినా ప్రసాదబుద్ధితో స్వీకరించమంటున్నాడు కృష్ణపరమాత్మ.

భోక్తగా నా భావన ఈశ్వరప్రసాదబుద్ధిగా ఉండాలి.

**యోగః – కర్మాణి ఈశ్వరార్పణ బుద్ధ్యా ఏవం కర్మఫలే ప్రసాద బుద్ధ్యా కుర్యః**
**యోగం – కర్తగా కర్మలు ఈశ్వరార్పణ బుద్ధితో చేయటం, భోక్తగా ఈశ్వర ప్రసాదబుద్ధితో స్వీకరించటం.**

**సమత్వం** – ఇలా చేస్తే మనం పొందే లాభం సమత్వం. కర్తగా భోక్తగా కూడా. ఎలా?

**కర్తగా సమత్వం** – మన కర్మలన్నీ ఈశ్వరార్పణబుద్ధితో చేస్తే, మనం చేసే పనులను ఇష్టమైనవి, కష్టమైనవిగా విభజించము. జీవితంలో మనం ఎన్నో కర్మలు చేయాలి; అందులో కొన్ని తప్పని సరిగా చేసి తీరాల్సినవి ఉంటాయి. అలాంటప్పుడు అన్నీ ఇష్టమైన కర్మలుగా ఉండవు.

ఒక్కోసారి వృద్ధులను చూసుకోవాల్సి ఉంటుంది. అది ఇష్టంగా ఉండదు. ఎందుకంటే మనకు శారీరక శ్రమతో పాటు బోలెడు ఖర్చుతో కూడిన వ్యవహారమది. ఒక్కోసారి ఓ దేవా! వారిని వారి బాధనుంచి విముక్తి చేయి అని ప్రార్థిస్తాము. పేరుకు వారి గురించి అంటున్నా, మన బాధనుంచి కూడా విముక్తి చేయమని చెప్పకనే చెప్పినట్టవుతుంది. అందువల్ల కష్టమైన పనులు కొన్ని చేస్తాము. అలాగే ఆఫీసుకు వెళ్ళే భర్తకు సెలవురోజు వస్తే మొహం వెలిగిపోతుంది; ఆఫీసుకు వెళ్ళనవసరం లేదు, ఇంట్లో ఉండవచ్చని ఆనందం. అదే అన్ని రోజులూ ఇంట్లోనే ఉండే భార్యకు అది కష్టం. వంటింట్లోనే మగ్గిపోతున్నాను, నాకు విముక్తి లేదా? ఒక్కరోజైనా బయటకు తీసుకు వెళ్ళరా అని వాపోతుంది. అదే ఈశ్వరార్పణబుద్ధితో చేస్తే మన పనులను ఇష్టమైన పని, కష్టమైన పని అంటూ విభజించము. ఏది చేసినా ఇష్టంగానే చేస్తాము. దీన్నే కృష్ణపరమాత్మ **సమత్వం** అంటున్నాడు. సణుగుతూ, గొణుగుతూ, తిట్టుకుంటూ పని చేసేవారు, వారు చిరాకు పడటమే కాక, అందరికీ వారి చిరాకుని ఉచితంగా పంచుతారు. కాని కర్మయోగి అలా కాదు.

**ముక్తసంగోఽ నహంవాదీ ధృత్యుత్సాహసమన్వితః** – 18.26

కర్మయోగి మొహం ఉత్సాహంతో చిందులు వేస్తుంది. స్వామీ చిన్మయానందులవారు ఒక సలహా ఇస్తుండేవారు. **చిరునవ్వులు చిందించండి.** చూడటానికి చాలా తేలికగా ఉన్నట్టు ఉంటుంది కాని చాలా ముఖ్యమైన, చాలా కష్టమైన పని. ఏం చేసినా చిరునవ్వు నవ్వుతూ చేయడం.

**భోక్తగా సమత్వం** – ఈశ్వరప్రసాదబుద్ధితో కర్మఫలాన్ని స్వీకరించగలిగితే, ఏదొచ్చినా మన మంచికే అనుకో గలుగుతాము. ఏదొచ్చినా న్యాయంగానే ఇచ్చాడనుకుంటాము. ఇప్పుడు మనం చాలా మంచివారుగా ఉండి (ఉన్నామనుకుంటున్నాము) కూడా అవస్థ పడుతున్నామంటే కర్మసిద్ధాంతమే దానికి కారణం. శాస్త్రం చెబుతుంది, మనకొచ్చే ఫలం ఈ జన్మలో చేసిన కర్మలదే కాదు, పూర్వజన్మ కర్మల ఫలం కూడా అని. మనం క్రమం

తప్పకుండా అక్రమాలు చేస్తున్నామంటారెవరో. అలా మనం ఎప్పుడో చేసిన అక్రమాల ఫలితమే ఇప్పుడు పడే అవస్థలు. అవి మనకు తెలియదు కాబట్టి, భగవంతుడు ఏది ఇచ్చినా న్యాయంగానే ఇస్తాడు, ఆయన అక్రమం చేయడు అని అర్థం చేసుకుంటాము, ఈశ్వరప్రసాదబుద్ధి ఉంటే.

క్రికెట్‌లో అంపైర్ ఏం చెపితే అది న్యాయం. దానికి తిరుగులేదు. అతను తప్పు చెప్పినా, అతని మాట సుగ్రీవాజ్ఞ. అంపైర్ అవుట్ అంటే బాట్స్‌మన్ మారు మాట్లాడకుండా తను ఆడుతున్న ఆటనుంచి వెళ్ళిపోవాలి. ఈ అంపైర్ మాటకే అంత విలువుంటే సర్వాంతర్యామి అయి, అంతటా కళ్ళుండి చూస్తున్న అంపైర్ గాడ్ అవుట్ అంటే మనం మారు మాట్లాడే అవకాశం ఎక్కడ ఉంది? ఆ అవుట్ ఏదైనా కావచ్చు – అనారోగ్యం, వృద్ధాప్యం, బంధం, విడిపోవడం, మృత్యువు కూడా కావచ్చు. వాటిని ప్రసాదబుద్ధితో స్వీకరించటం. ఒకవేళ స్వీకరించే ధైర్యం లేకపోతే, దానికి కూడా భగవంతునికి ప్రార్థన చేయటమే. ఓ భగవంతుడా! నాకు నువ్వేమిచ్చినా నీ ప్రసాదంగా స్వీకరించే ప్రసాదబుద్ధిని ఇవ్వు అని.

భోక్తగా ఏదొచ్చినా స్వీకరించటంవల్ల కలిగే లాభం సమత్వం. బుద్ధి అంటే ఇక్కడ మామూలుగా వాడే నిశ్చయాత్మక బుద్ధి అర్థం కాదు. బుద్ధి అంటే దృక్పథం. ఈశ్వరార్పణబుద్ధితో కర్మ చేసి, ప్రసాదబుద్ధితో ఫలాన్ని స్వీకరిస్తే సమత్వం వస్తుంది.

**సమత్వం యోగముచ్యతే**

**కర్మయోగ ఫలం** – ప్రాపంచిక ప్రయోజనాలు వస్తే రావచ్చు, రాకపోతే రాకపోవచ్చు; కర్మయోగం ప్రాపంచిక ప్రయోజనాలు వచ్చి తీరుతాయని చెప్పదు. నిజానికి, సాధారణంగా వచ్చి తీరుతాయి పరోక్షఫలంగా. కాని వాటిమీద మనం దృష్టి పెట్టకూడదు. ఎందుకంటే పరోక్షఫలంమీద మనం దృష్టి పెడితే, అది ముఖ్య ఫలమైపోతుంది. అందువల్ల ప్రాపంచిక ప్రయోజనాలమీద దృష్టి పెట్టకూడదు.

అందువల్ల కర్మయోగ ఫలం – ఆధ్యాత్మిక అభివృద్ధి చాలా వేగంగా కలుగుతుంది. ఆధ్యాత్మిక అభివృద్ధి అయినట్టు ఎలా తెలుస్తుంది? ఆత్మజ్ఞానంమీద శ్రద్ధ ఏర్పడుతుంది. శ్రద్ధ కలగటమే కాదు, తేలిగ్గా ఆత్మజ్ఞానం పొందుతాము కూడా.

**కర్మయోగం టూకీగా –**

| | | |
|---|---|---|
| **కర్మ** | **= సరియైన కర్మ** | **= పంచమహాయజ్ఞాలు + సాత్త్వికకర్మ** |
| **యోగం** | **= సరియైన దృక్పథం** | **= ఈశ్వరార్పణ బుద్ధి + ఈశ్వరప్రసాదబుద్ధి** |
| **కర్మయోగం** | **= సరియైన కర్మ** | **+ సరియైన దృక్పథం** |
| **కర్మయోగ ఫలం** | **= ఆధ్యాత్మ ఎదుగుదల** | **= ఆత్మజ్ఞానంమీద శ్రద్ధ.** |

ఈ నేపథ్యంతో ఒక్కొక్క శ్లోకాన్నీ చూద్దాము. ఏ శ్లోకానికదే ఒక ఆణిముత్యం.

**అకర్మణః కర్మ జ్యాయః** – ఏమీ చేయకుండా ఉండటంకన్నా కర్మ చేయటం శ్రేష్ఠం.

ఇంతకు ముందు శ్లోకంలో చూశాము. పనిచేయకుండా ఖాళీగా ఉంటే మనస్సు పరిపరి విధాల పోతుంది. జ్ఞాని ఖాళీగా ఉండగలడు గాని, అజ్ఞాని ఉండలేడు. నిశ్శబ్దంగా ఉన్న ప్రదేశంలో ఇద్దరు మనష్యులు రెండు రకాలుగా స్పందిస్తారు. ఒకవ్యక్తి ఆశ్రమంలాగా ప్రశాంతంగా ఉంది అంటాడు. ఇంకొక వ్యక్తి స్మశానంలాగా నిశ్శబ్దంగా ఉంది అంటాడు. నిశ్శబ్దం ఒకటే, కాని పరిణతి చెందిన వ్యక్తి ఏకాంతం అనుకుని మురిసిపోతే, అజ్ఞాని ఒంటరితనం అని బాధపడతాడు. బాహ్యంగా పరిస్థితి ఒకటే, కాని వారి మానసిక స్థితులు భిన్నంగా ఉన్నాయి. అందువల్ల పని చేయకపోవటంకన్నా చేయటం శ్రేష్ఠం అన్నాడు కృష్ణపరమాత్మ. అంతేకాదు –

**అకర్మణః శరీరయాత్రాఽపి చ తే న ప్రసిద్ధ్యేత్** – పని చేయకపోతే, ప్రపంచంలో జీవించటం కూడా కష్టమయిపోతుంది అన్నాడు. ప్రాథమిక అవసరాలైన తిండి, బట్ట, గూడు కూడా దొరకవు పని చేయకపోతే. వాటికోసం నేను పని చేయనవసరం లేదు, మాకు తాతలు సంపాదించి పెట్టిన ఆస్తి ఉంది, కూర్చుని తిన్నా తరగదు అని ఎవరైనా వాదిస్తే, శాస్త్రం, వీరికి అంతా ఉండి, తినటం, పడుకోవటం తప్ప ఏమీ చేయనవసరం లేదు అనుకున్నా, శారీరక ఆరోగ్యంకోసమైనా పని చేయాలంటుంది. తిని కూర్చుంటే, కొవ్వు పెరిగి పోతుంది. కారు, సౌకర్యాలు అన్నీ ఉన్నా, అన్నీ విడిచిపెట్టి గంటసేపు నడవమంటాడు డాక్టరు. అందువల్ల పనిచేయక తప్పదు.

**త్వం కర్మ కురు** – అర్జునా! పని చెయ్యి. ఎటువంటి పని? **నియతమ్** – శాస్త్రం నిర్దేశించిన కర్మలు చేయి. ఏమిటవి? పంచమహాయజ్ఞాలు. మీరు ఏంచేసినా ప్రపంచానికి సేవ చేయాలి. మీరు తినండి, ఆనందించండి, సంగీతనృత్యాలను ఆస్వాదించండి, అర్థకామాల వెంట పరుగులు తీయండి, కాని ఒకటి మాత్రం తప్పనిసరిగా చేసి తీరండి. దేశానికి సేవ చేయండి. ఏం చేస్తారు అనేది మీకున్న శక్తినిబట్టి, మీ వనరులనుబట్టి, మీ ఆర్థిక స్తోమతనుబట్టి ఉంటుంది. అది విద్యాదానం అవచ్చు, అన్నదానం అవచ్చు, కాలదానం కూడా అవచ్చు.

అమెరికాలో మీరు ఎవరితోనైనా కాసేపు గడిపితే, మీ సమయాన్ని నాకు ఇచ్చినందుకు ధన్యవాదాలు అంటారు. నిజంగా అది మంచి పద్ధతి. ఎవరికైనా మీ సమయాన్ని వెచ్చించి, వారి కష్టసుఖాలను వారు మీతో కలబోసుకునే అవకాశం ఇస్తే, అది కూడా చాలా మంచి దానం. ఎవరినైనా చూసి చిరునవ్వులు చిందిస్తే అదీ మంచిదే. ఆ చిరునవ్వు పొందటంకోసం మనుష్యులు వందల కొద్దీ మైళ్ళు ప్రయాణిస్తారు. అందువల్ల పంచమహాయజ్ఞాలు చేయాలి. వీటిని కృష్ణపరమాత్మ నియతం కర్మ అన్నాడు.

ఇక్కడ ఒక ముఖ్యమైన విషయాన్ని గమనించాలి. ఈ సాత్త్వికకర్మను లేదా పంచమహాయజ్ఞాలను భిన్నకోణాల్లోంచి చూడవచ్చు. ఒక్కొక్క కోణంలో ఒక్కొక్క పేరు వస్తుంది దానికి, అంటే ఆ సందర్భాన్నిబట్టి. ఇక్కడ కృష్ణపరమాత్మ వాటిని **నియతం కర్మ** అంటున్నాడు. నియతం అంటే అది ఈశ్వర ఆజ్ఞ. ఎప్పుడైతే ఈశ్వర ఆజ్ఞ అంటామో, అప్పుడే దానిలో భయం చోటు చేసుకుంటుంది. ఆజ్ఞను ఉల్లంఘిస్తే దానికి శిక్ష ఉంటుంది. ప్రభుత్వం, చట్టం మన మంచికోసమే ఉన్నా, ప్రభుత్వంకోసం కొన్ని చట్టాలను పాటిస్తాము. ఇన్‌కంటాక్స్ కట్టకపోతే ఫైను పడుతుంది కాబట్టి కడతాము. ట్రాఫిక్ నియమాలను పాటించకపోతే పెనాల్టీ పడుతుంది కాబట్టి పాటిస్తాము. అప్పటికీ చుట్టుపక్కల పోలీసు లేకపోతే సిగ్నలును పాటించని వారెందరో!

ఈ నియమాలు మన మంచికోసం పెట్టబడినవే; మనలో పరిపక్వత ఉంటే మనంతట మనమే పాటిస్తాము. అలాగే మనలో పరిపక్వత ఉంటే మనంతట మనమే పంచమహాయజ్ఞాలు చేస్తాము. ఎందుకంటే మనకు సమాజంలో హక్కులే కాదు, బాధ్యతలు కూడా ఉన్నాయని తెలుసుకుంటాము. 'దేశం నాకేమిచ్చింది అని అడక్కు, దేశానికి నువ్వేమిచ్చావో ఆలోచించు,' అన్నారెవరో! పరిపక్వత లేనివ్యక్తి తనంతట తాను చేయడు కాబట్టి, శాస్త్రం ఈ పంచమహాయజ్ఞాలను చేసి తీరాలని బెదిరిస్తున్నది. పైగా ఇవి చేయకపోతే పాపం వస్తుంది అంటున్నది.

**విహితం వా అవిహితం వా సర్వం ఏతత్ క్షమస్వ**
**జయజయ కరుణాబ్దే శ్రీమహాదేవ శంభో**

విహితం అంటే చేసి తీరాల్సిన కర్మలు. అవిహితం అంటే చేయకూడని కర్మలు. చేసి తీరాల్సిన కర్మ చేయకపోయినా, చేయకూడని కర్మలు చేసినా పాపం వస్తుంది. పంచ మహాయజ్ఞాలు చేసి తీరాల్సిన కర్మలు. ఇవి చేయకపోతే వచ్చే పాపాన్ని ప్రత్యవాయపాపం అంటారు. దీనివల్ల కిందకి దిగజారి, మోక్షానికి దూరంగా వెళ్ళిపోతాము.

అందువల్ల కృష్ణపరమాత్మ బెదిరింపు భాష వాడుతున్నాడు. అర్జునా! నా ఆజ్ఞ, కర్మయోగం పాటించమని. అందువల్ల అది పాటించు అని కర్ర పుచ్చుకుని చెబుతున్నట్టుగా చెబుతున్నాడు. పోలీసు ఉంటే కాని కొందరిలో భయం ఉండనట్టుగా. భయం ఉంటేనే కాని కర్మయోగం పాటించము. నియతం అన్నా, విధి అన్నా విహితం అన్నా ఒకటే. నా ఆజ్ఞను పాటించు అన్నాడు.

కర్మయోగాన్ని ఈశ్వర ఆజ్ఞగా పాటించాలి – **ఇది కర్మయోగసూత్రం 1**

శ్లో. 9 **యజ్ఞార్థాత్ కర్మణోఽన్యత్ర లోకోఽయం కర్మబంధనః ।**
**తదర్థం కర్మ కౌంతేయ ముక్తసంగః సమాచర ॥**

యజ్ఞార్థాత్, కర్మణః, అన్యత్ర, లోకః, అయమ్, కర్మబంధనః,
తదర్థమ్, కర్మ, కౌంతేయ, ముక్తసంగః, సమాచర ॥

| | | | |
|---|---|---|---|
| కౌంతేయ | = ఓ కౌంతేయా! (అర్జునా) | కర్మబంధనః | = కర్మబంధములలో చిక్కుకొనును |
| యజ్ఞార్థాత్ | = యజ్ఞార్థము చేయబడు | ముక్తసంగః | = (కనుక) ఆసక్తిరహితుడవై |
| కర్మణః | = కర్మలు గాక | తదర్థమ్ | = యజ్ఞార్థము |
| అన్యత్ర | = ఇతర కర్మలలో నిమగ్నులగుటవల్ల | కర్మ | = కర్తవ్యకర్మను |
| అయమ్, లోకః | = ఈ లోకము (మనుష్య సముదాయము) | సమాచర | = చక్కగా ఆచరింపుము |

**యజ్ఞార్థాత్ కర్మణః అన్యత్ర అయం లోకః కర్మబంధనః ।**
**కౌంతేయ! ముక్తసంగః తదర్థం కర్మ సమాచర ॥**

తా: ఓ అర్జునా! యజ్ఞార్థము చేయబడు కర్మలలో గాక ఇతర కర్మలందు నిమగ్నులగుటవల్ల మనుష్యులు కర్మబంధములలో చిక్కుకొనుదురు. కనుక నీవు ఆసక్తిరహితుడవై యజ్ఞార్థమే కర్తవ్యకర్మలను చక్కగా ఆచరింపుము.

ముందు శ్లోకంలో ఈశ్వర ఆజ్ఞ లేదా ఈశ్వరవిధి, అది పాటించకపోతే ప్రత్యవాయపాపం అంటుకుంటుందని బెదిరించాడు. ఇప్పుడు అదే విషయాన్ని మెరుగ్గా చెబుతున్నాడు కృష్ణపరమాత్మ. అంతకు ముందు ఈశ్వర ఆజ్ఞగా చేయమంటే, ఇప్పుడు ఈశ్వరయజ్ఞంగా చేయమంటున్నాడు. ఆధునికయుగంలో పిల్లలను బెదిరించవద్దు, భయపెట్టవద్దు అంటున్నారు. అలా భయపెడితే పిల్లల మనస్సు ముడుచుకుపోయి, సరిగ్గా ఎదగలేరు, సరిగ్గా నేర్చుకోలేరు అంటున్నారు శాస్త్రవేత్తలు. అందువల్లనే మన పెద్దలు సామదానభేదదండోపాయాలు అని చెప్పారు. దండోపాయం చివరి మార్గం. ఇవేమీ పని చేయకపోతే అప్పుడు వాడాలి.

**యజ్ఞార్థాత్ కర్మణః** – అలాగే కృష్ణపరమాత్మ కూడా కర్మయోగం ఈశ్వరయజ్ఞంలా చేయాలి అంటున్నాడు. జీవితాన్ని ఒక పూజగా మలుచుకోవాలి. మామూలుగా మనం పొద్దున 15 నిముషాల సేపు చేసే పూజే పూజ అనుకుంటాము. అది కూడా మొక్కుబడిగా చేస్తాము. కాని కృష్ణపరమాత్మ ముందు అది చేసినా, మీ జీవితాన్నే పూజగా మలుచుకోండి అంటున్నాడు.

**ఆత్మా త్వం గిరిజా మతిః సహచరాః ప్రాణాః శరీరం గృహం**
**పూజా తే విషయోపభోగరచనా నిద్రా సమాధిస్థితిః ।**
**సంచారః పదయోః ప్రదక్షిణవిధిః స్తోత్రాణి సర్వా గిరో**
**యద్యత్ కర్మ కరోమి తత్తదఖిలం, శంభో! తవారాధనమ్** – శివమానస పూజ 4

ఓ దేవా, నా జీవితమే నీకు అర్పిస్తున్నాను.

ఓ మాతా, నేనెక్కడికి వెళ్ళినా అది నీకు చేసే ప్రదక్షిణగా భావించు తల్లీ. అలాగే ఏం తిన్నా బ్రహ్మార్పణం అనుకోవాలి. భగవంతుడు అంటే ఉండాల్సింది భయం కాదు, భక్తి. ఈశ్వరార్పణ బుద్ధితో చెయ్యటం కర్మయోగం. మనం చేసే పనే ప్రార్థన.

**భూః పాదౌ యస్య నాభిర్వియదసురనిలశ్చంద్రసూర్యౌ చ నేత్రే ।**
**కర్ణావాశా శ్శిరో ద్యౌర్ముఖమపి దహనో యస్య వాస్తేయమబ్ధిః ॥** – విష్ణుసహస్రనామమ్

ఈ జగత్తు భగవంతుడు. అందువల్ల మీ పనిని భగవంతునికి అర్పించాలంటే ఆలయానికి వెళ్ళనవసరం లేదు, మీ ఆఫీసునే ఆలయంగా భావించండి; మీ కర్మను భావనలో భగవంతునికి అర్పించండి. యజ్ఞార్థం కర్మ, కర్మయోగం యజ్ఞం. ఇటువంటి దృక్పథంవల్ల లాభం ఏమిటి?

**అన్యత్ర అయం లోకః కర్మబంధనః** – అన్యత్ర – అలా కాకపోతే ఏమిటి? కేవలకర్మలో ఉన్న లోపం చూపిస్తున్నాడు. మీ కర్మను పూజగా మలుచుకోకపోతే ఏమవుతుంది? కర్మబంధనః – మీరు చేసే ప్రతికర్మ మీకు బంధం అవుతుంది. ప్రార్థనగా చేసే కర్మ మోక్షానికి దారి తీస్తే, ప్రార్థనగా చేయని కర్మ బంధంలో పడవేస్తుంది. ఎందుకు

బంధం? సరిగ్గా అవుతుందో లేదో, పిల్లవాడికి సీటు వస్తుందో రాదో, నేను అమెరికా వెళ్ళగలనో లేదో, ఈ కాంట్రాక్టు వస్తుందో రాదో – ఇలా సవాలక్ష బెంగలు.

ఇప్పుడు ఎక్కడ చూసినా ఒత్తిడి, ఒత్తిడి. స్ట్రెస్ మేనేజ్‌మెంట్ కోర్సులు పెడతారు దాన్ని తప్పించుకోవటానికి. స్ట్రెస్ మేనేజ్‌మెంట్ కోర్సు నడిపే వ్యక్తికే పెద్ద స్ట్రెస్. కోర్సు సవ్యంగా నడప గలనో లేదో, అనుకున్నంత మంది వస్తారో రారో, వగైరా. ఈ రోజుల్లో స్ట్రెస్ ఎంతగా పెరిగి పోయిందంటే దానివల్ల బి.పి., షుగర్, కొలెస్ట్రాల్ అన్నీ పెరిగిపోయి కూర్చుంటున్నాయి. జీతం బాగా పెరిగింది నిజమే కాని ఏం లాభం? కడుపు నిండా తిండి తినలేరు. తీపి తినకూడదు, ఉప్పు తగలకూడదు, నూనె పదార్థాలు అసలే ముట్టుకోకూడదు. ఈ ఒత్తిడి, ఈ అనారోగ్యాలు పోవాలంటే ఒకటే మార్గం, మీ జీవితాన్ని ఒక ప్రార్థనగా మలుచుకోండి. ఈశ్వరార్పణబుద్ధితో పనిచేయండి; ప్రసాదబుద్ధితో వచ్చిన ఫలాన్ని స్వీకరించండి.

ముందు శ్లోకంలో ఆజ్ఞగా చెపితే, ఇక్కడ కృతజ్ఞత చూపమంటున్నాడు. దేవునిమీద భయంతో కాదు, కృతజ్ఞతతో పనులు చేయాలి. అసలు విలువలు పాటించకపోవటంకన్నా, దేవునిమీద భయంతో విలువలు పాటించటం మంచిదే. తరువాత రెండవ దశకి రావాలి. దేవుని సృష్టి ఎంత అద్భుతంగా ఉందో గమనిస్తే, దేవునికి కృతజ్ఞత చూపకుండా ఉండలేరు. రాకెట్‌లో రెండవసారి వెళ్ళిన వ్యక్తి ఈ విషయాన్ని గొప్పగా చెప్పాడు. సృష్టిని మెచ్చుకునే వ్యక్తి, భగవంతుణ్ణి నమ్మకుండా ఉండలేడు. భగవంతునికి ప్రార్థన చేయకుండా ఉండలేడు.

మన కృతజ్ఞత పొద్దున లేస్తూనే మొదలవుతుంది. భూదేవిమీద పాదం మోపుతున్నందుకు క్షమాపణ కోరుకుంటాము.

**సముద్రవసనే దేవి పర్వతస్తనమండలే విష్ణుపత్ని**
**నమస్తుభ్యం పాద స్పర్శం క్షమస్వ మే**

స్నానం చేసేటప్పుడు నీటికి నమస్కారం చేస్తాము.

**గంగే చ యమునే చైవ గోదావరి సరస్వతి**
**నర్మదే సింధుకావేరీ జలేస్మిన్ సన్నిధిం కురు**

సంధ్యావందనంలో కూడా నీటిమీద ధ్యానం వస్తుంది.

**అపో వా ఇదం సర్వం విశ్వా భూతాన్యాపః ప్రాణా వా ఆపః**
**పశవ ఆపోఽన్నమాపోఽమృతమాపః సమ్రాడాపో విరాడాపః**
**స్వరాడాపశ్ఛన్దాగ్ంస్యాపో జ్యోతీగ్ంష్యాపో యజూగ్ంష్యాపః**
**సత్యమాపస్సర్వా దేవతా ఆపో భూర్భువస్సువరాపః ॥**

మన మనుగడకు నీరు ఆధారం. అది కూడా ఎలా చేయాలి?

**ముక్త సంగః సమాచర** – ఏమీ ఆశించకుండా చేయాలి.

అందువల్ల దేవుడిచ్చిన ఈ కానుకకు కృతజ్ఞత చెప్పుకుంటాము. తర్వాత వాయువుకు నమస్కారం. ప్రాణవాయువు లేకపోతే మనం జీవించలేము!

**నమో బ్రహ్మణే నమస్తే వాయో త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మాసి**

అలాగే అగ్నిని కూడా పూజిస్తాము. యజ్ఞం చేసే ముందు అగ్నిదేవతకు ప్రార్థన ఉంటుంది.

**అగ్నిమీళే పురోహితం యజ్ఞస్య దేవమృత్విజమ్**

సంధ్యావందనంలో ఆకాశానికి నమస్కరిస్తాము.

**ప్రాచ్యై దిశే నమః దక్షిణాయై దిశే నమః ప్రతీ చ్యై దిశే నమః**
**ఉదీచ్యై దిశే నమః ఊర్ధ్వాయనమః అధరాయ నమః**
**అంతరిక్షాయ నమః భూమ్యై నమః బ్రహ్మణే నమః**
**విష్ణవే నమః మృత్యవే నమః**

పంచభూతాలన్నీ కూడా భగవంతుని కానుకలు మనకు. అందువల్ల భగవంతునికి అర్పణ చేయాలి. మీరు చేసే కర్మ మీకు మోక్షాన్నివ్వవచ్చు; మిమ్మల్ని సంసారమనే కారాగృహంలో పడవేయవచ్చు. అదే దీని ప్రత్యేకత. అది పాము విషం వంటిది. పాము కాటేస్తే మనిషి ప్రాణానికే ముప్పు; అదే విషాన్ని తీసి మందుగా వాడితే ఒక ప్రాణాన్ని కాపాడుతుంది. ఇప్పుడు చెప్పండి పాము విషం ప్రాణం తీస్తుందా, ప్రాణం పోస్తుందా? దాన్ని ఎలా వాడుతామో, దాన్నిబట్టి ఉంటుంది. అదే సూత్రం కర్మకు కూడా వర్తిస్తుంది.

కర్మ దానంతట అదే మోక్షాన్నివ్వదు, బంధించదు అంటున్నాడు కృష్ణపరమాత్మ. దాన్ని మనం చేసే తీరులో ఉంది. భక్తితో కూడిన కర్మ మోక్షాన్నిస్తే, భక్తిలేని కర్మ బంధంలో పడవేస్తుంది. ఇది కర్మయోగం యొక్క ప్రాథమిక సూత్రం.

**పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి ।** 9-26

పని + భక్తి = యజ్ఞం; పని - భక్తి = కర్మ. యజ్ఞం మోక్షాన్నిస్తే కర్మ బంధిస్తుంది.

**కర్మణా బధ్యతే జన్తుః.**

**తదర్థం కర్మ (కురు)** - కౌంతేయా! అందువల్ల నీ పనులను ప్రార్థనగా చేయి. మీ కుటుంబసభ్యులు గుర్తించకపోయినా, మెచ్చుకోకపోయినా బాధపడకండి. రోజూ కమ్మగా వంట చేసిపెడితే మెచ్చుకోరు కాని, ఒక్కరోజు ఒక కూరలో కొంచెం ఉప్పు తక్కువైతే విమర్శిస్తారు. ఇది మానవ నైజం. అందువల్ల మెప్పుకోసం ఆశించకండి. మెప్పుకోసం ఎదురుచూస్తే, మీకు ఆ పనిమీద ఆసక్తి పోతుంది. అదే ఈశ్వరార్పణబుద్ధితో చేస్తే, ఆనందం కలుగుతుంది. ఇతరుల మెప్పువల్ల కాదు, చేసే పనివల్లే ఆనందం కలుగుతుంది.

**మమోపాత్త సమస్త దురితక్షయ ద్వారా శ్రీ పరమేశ్వర ప్రీత్యర్థమ్** - దీన్ని భగవదార్పణభావనతో చేస్తున్నందుకు నాకు ఆనందంగా ఉంది.

శాస్త్రం చెప్పే విధి, సరిగ్గా అర్థం చేసుకోవాలి. కుటుంబసభ్యులనుంచి మెప్పు పొందాలని ఎదురు చూడకండి అంటుంది శాస్త్రం. అదే సమయంలో, మీరు ఎదుటివారిని మెచ్చుకోవటం మీ కర్తవ్యం అంటుంది. ఇది సరిగ్గా అర్థం చేసుకోని వారు – నేను ఎవరినీ మెచ్చుకోను, గీత మెచ్చుకోనవసరం లేదు అంటుంది అంటారు.

**గీత నువ్వు మెప్పు ఆశించకు, కాని నువ్వు మెచ్చుకో అంటుంది.** భార్య భర్తనుంచి మెప్పు ఆశించకూడదు కాని భార్య భర్తను మెచ్చుకోవాలి. అలాగే భర్త కూడా. ఇది మన సంస్కృతి గొప్పదనం. మనకు హక్కులు లేవు, బాధ్యతలే ఉన్నాయి. అంటే మనం పాటించాల్సిన ధర్మాలే ఉన్నాయి. కాని దాని గొప్పతనం ఏమిటంటే మనం మన ధర్మం పాటిస్తే, ఎదుటివారికి వారి హక్కు తీరుతుంది. అందువల్ల మన సమాజం ధర్మంమీద ఆధారపడివుంది.

దయానంద స్వామీజీ అద్భుతంగా చెబుతారు – ఎక్కడ ధర్మం పాటిస్తామో అక్కడ అణకువ వస్తుంది; ఎక్కడ హక్కుకు ప్రాధాన్యతనిస్తామో, అక్కడ గొడవ వస్తుంది; కోర్టు వస్తుంది; విడాకులు వస్తాయి; అన్నీ వస్తాయి.

శ్లో. 10 **సహయజ్ఞాః ప్రజాః సృష్ట్వా పురోవాచ ప్రజాపతిః ।**
**అనేన ప్రసవిష్యధ్వమ్ ఏష వోఽస్త్విష్టకామధుక్ ॥**
సహయజ్ఞాః, ప్రజాః, సృష్ట్వా, పురా, ఉవాచ, ప్రజాపతిః,
అనేన, ప్రసవిష్యధ్వమ్, ఏషః, వః, అస్తు, ఇష్టకామధుక్ ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| ప్రజాపతిః | = | ప్రజాపతియైన బ్రహ్మ | అనేన | = | ఈ యజ్ఞము ద్వారా |
| పురా | = | కల్పాదియందు | ప్రసవిష్యధ్వమ్ | = | వృద్ధి చెందుడు |
| సహయజ్ఞాః | = | యజ్ఞసహితముగా | ఏషః | = | ఈ యజ్ఞము |
| ప్రజాః | = | ప్రజలను | వః | = | మీకు |
| సృష్ట్వా | = | సృజించి | ఇష్టకామధుక్ | = | ఇష్టభోగములను ఇచ్చునది |
| ఉవాచ | = | పలికెను | అస్తు | = | అగుగాక! |
| (యూయమ్) | = | మీరు | | | |

**పురా ప్రజాపతిః సహయజ్ఞాః ప్రజాః సృష్ట్వా ।**
**అనేన ప్రసవిష్యధ్వమ్ । ఏషః వః అస్తు ఇష్టకామధుక్ (ఇతి ఉవాచ) ॥**

తా: కల్పాదియందు బ్రహ్మదేవుడు యజ్ఞసహితముగా ప్రజలను సృష్టించి, 'మీరు ఈ యజ్ఞముల ద్వారా వృద్ధిచెందుడు. ఈ యజ్ఞములు మీకు కామధేనువు వలె కోరిన కోర్కెలనెల్ల తీర్చును,' అని పల్కెను.

ఇటువంటి జీవితాన్ని వేదమే నిర్దేశించింది. ఇలా జీవితాన్ని యజ్ఞంలా జీవించటం మన మంచికోసమే చెప్పింది. వేదాలు సృష్టితో పాటు వచ్చాయి, మనకు మాన్యువల్‌లాగా ఉపయోగపడటానికి. మనం ఏదైనా వస్తువు కొంటే దానితో ఒక మాన్యువల్ వస్తుంది కదా! కంటిలో వేసుకునే మందు కొన్నా కూడా, దానితో పాటు ఒక చిన్న పత్రం ఇస్తారు. దాన్ని ఎలా వాడాలో 25 భాషల్లో చెబుతారు. ఎందుకు? తయారు చేసిన వ్యక్తికే దాన్ని సరిగ్గా ఎలా వాడాలో తెలుస్తుంది కాబట్టి. ఆ సూచనలు ఎవరికోసం ఇస్తున్నాడు? అతని లాభం కోసమా? కానే కాదు, మన మేలుకోసం.

ఈ ప్రపంచాన్ని సృష్టించింది ఎవరు? మానవమాత్రుడు కాదు. మనిషి అయోమయాన్ని సృష్టించగలడు కాని సృష్టిని కాదు. ఇంత అద్భుతమైన సృష్టి రహస్యాలు తెలుసుకోవటానికే మన మేధస్సు సరిపోవటం లేదంటే, ఇంక సృష్టించే అవకాశం ఎక్కడ? అందువల్ల భగవంతుడు ఈ అద్భుతమైన ప్రపంచాన్ని సృష్టించాడు. ఈ ప్రపంచాన్ని మనం సరిగ్గా ఉపయోగించుకుని పూర్తి లాభం పొందాలని సదుద్దేశంతో మనకు వేదాలనే మాన్యువల్‌ను జత పరిచాడు. పూర్తి లాభం పొందాలంటే ఏమిటి? ధర్మార్థకామాలే కాకుండా, మోక్షం కూడా పొందాలని.

**యో బ్రహ్మాణం విదధాతి పూర్వం యో వై వేదాంశ్చ ప్రహిణోతి తస్మై।**
**తగ్ం హ దేవమాత్మబుద్ధిప్రకాశం, ముముక్షుర్వై శరణమహం ప్రపద్యే ॥** – శాంతి మంత్రమ్

అందువల్ల వేదాలనే మాన్యువల్ పాటించి, యజ్ఞంలా జీవించండి అప్పుడు మీరు వృద్ధిలోకి వస్తారు. లేదంటే మీ నాశనానికి మీరే కారకులవుతారు. అదే అర్థం ఇక్కడ.

**ప్రజాపతిః సహయజ్ఞాః ప్రజాః సృష్ట్వా** – ప్రజాపతి అంటే బ్రహ్మదేవుడు. జీవరాశులన్నిటినీ, మనుష్యజాతి తోపాటు యజ్ఞాలను కూడా సృష్టించాడు. ఎప్పుడు?

**పురా** – చాలాకాలం ముందు; సృష్టి చేసినప్పుడు, మనుష్యులకు మాత్రమే వేదాలను ఇచ్చాడు. జంతువులకు ఇవ్వలేదు. ఎందుకు? వాటికి ఇష్టం వచ్చినట్టు చేసే ఫ్రీవిల్ ఇవ్వలేదు. వాటిని ముందే ప్రోగ్రామ్ చేసి సృష్టించాడు. చెట్లు, జంతువులు వాటి వాటి ధర్మాలను నిర్వర్తిస్తాయి. అడవిలో మనిషి కాలు పెట్టనంత వరకూ, అది ప్రకృతి ధర్మానికి అనుగుణంగా ఉంటుంది. సముద్రంలో కూడా అంతే.

సముద్రంలో లెమింగో అనే జీవరాశులు ఉంటాయి. వాటికి వాటి సంతతి బాగా ఎక్కువయి పోయినప్పుడు, అది వాటి ఇన్‌స్టింక్ట్ ద్వారా తెలుసుకుని, వాటిలో కొన్ని ఆత్మహత్య చేసుకుంటాయి, జనాభా సంఖ్యను అరికట్టటానికి. ప్రకృతిలో హార్మనీ ఉండటంకోసం అవి ఆత్మత్యాగం చేస్తాయి! మనమూ జనాభా సంఖ్యను అరికట్టటంకోసం చూస్తాము. కాని మనం పూర్తిగా స్వార్థపరులం. నాకు పిల్లలు కావాలి, మీకనవసరం అంటాము. అందువల్లనే దేవుడు జంతువులకివ్వకుండా, మనుష్యులకు ఇచ్చాడు వేదాలను.

మనుష్యులకు ఫ్రీవిల్‌ను కూడా ఇచ్చాడు. అది తక్కిన శక్తులలాగా మంచీ చేయగలదు, వినాశనమూ చేయగలదు. చిన్మయానంద స్వామి ఈ విషయం గురించి ఒక అద్భుతమైన ఉదాహరణ చెబుతుండేవారు. రెండు గదుల్లో కొంతమందిని బంధించారు. రెండు గదుల్లోనూ ఆహారం ఉంది కాని వారి మోచేతులను

చెక్కబద్దతో కట్టారు. వారు చేతులను వంచలేరు, నోటితోనూ అందుకోలేరు. అలా ఏర్పాటు చేశారు. ఒకగదిలో అవస్థ పడుతూ కూర్చుంటే ఇంకో గదిలోంచి కేరింతలు కొడుతున్నారు. కారణమేమిటా అని తొంగిచూస్తే, రెండవగదిలో ఒకరినోట్లో ఇంకొకరు ఆహారం పెడుతున్నారు. అందువల్ల మనిషి స్వార్థంతో మరణించనూవచ్చు, ఆనందంగా ఇంకొకరితో పంచుకోనూవచ్చు. తలుచుకుంటే మోక్షం పొందవచ్చు లేదా నరకం సృష్టించవచ్చు.

**అనేన ప్రసవిష్యధ్వమ్** – అనేన అంటే కర్మయోగంతో కూడిన జీవితం. వేదాలలో చెప్పిన జీవితం. అటువంటి జీవితం పాటించటంవల్ల ప్రసవిష్యధ్వం. మీరు విజేతలు అవుదురు గాక! (అన్నాడు బ్రహ్మదేవుడు.)

పోటీపడే జీవితానికీ, సహకారం అందించే జీవితానికీ మధ్య భేదాన్ని చక్కగా వర్ణించారు ఎవరో! పోటీపడే జీవితంలో స్వార్థం రాజ్యమేలుతుంది. ఎవరితోనూ ఏమీ పంచుకోరు. పోటీ మనస్తత్వం ఉంటేనే బాగా పైకి వస్తాడు అంటారు కాని శాస్త్రం ఒప్పుకోదు. పోటీ మనస్తత్వం ఉన్నచోట గెలిచి తీరాలనే పట్టుదల వస్తుంది. ఆ గెలుపుకోసం మోసం చేయటానికి కూడా వెనుకాడరు కొందరు. పోటీ పడటం మాత్సర్యం కింద వస్తుంది. కామక్రోధలోభమోహమదమాత్సర్యాలు మనిషి పతనానికి దారితీసే ఆరు దుష్టగుణాలు. వీటిని అరిషడ్వర్గాలు అంటారు. పోటీ మనస్తత్వాన్ని పంచుకునే మనస్తత్వంగా మలుచుకోమంటుంది వేదం. ఎదుటివారు గెలుపొందుతుంటే చూసి మనం ఈర్ష్య పడకూడదు.

**ఏష ఇష్టకామధుక్ అస్తు** – కామధేనువు క్షీరసాగరమథనంలో వచ్చింది. ఏం కోరుకుంటే అది ఇచ్చేది కామధేనువు. అది మానవ మేధస్సుకు చిహ్నంగా చెప్పబడింది. మానవ మేధస్సు ఏం కోరుకుంటే అది సాధించగలదు. ఎక్కడో జరుగుతున్న క్రికెట్‌మ్యాచ్‌ను మీ ఇంట్లో హాయిగా కూర్చుని చూడగలుగుతున్నారంటే టెలివిజన్‌ను కనిపెట్టిన మానవమేధస్సే దానికి కారణం. ఈ కామధేనువు ఇచ్చే పాలు – అర్థ, కామ, ధర్మాలు. అంతేకాదు, మీరు పరిపక్వత చెంది, అధికారి అయితే మోక్షం కూడా ఇవ్వగలదు. తెలివిగా జీవించటం కామధేనువు. కర్మయోగం కామధేనువు.

**ఏష కర్మయోగః ఏషః యజ్ఞః ఇష్ట కామధుక్ వః** – వః అంటే మీకు. అందువల్లనే వేదం ప్రాపంచిక విజయాలను సాధించవద్దనదు. అందువల్ల టీ.వీ. కంప్యూటర్, రాకెట్ – వీటిలో దేన్నీ ఖండించదు. నిజానికి అవన్నీ కూడా భగవంతుడిచ్చిన కానుకలు. వేదం విజ్ఞానశాస్త్రానికి వ్యతిరేకత చూపదు. నిజానికి దానివల్ల మీరు ఇంట్లో కూర్చునే వేదాంతబోధను వినవచ్చు.

వేదం చెప్పేది ఒకటే. ప్రాపంచిక విజయాలు పొందండి, కాని దానికే అంకితమై పోకండి. దానితో సమానంగా ఆధ్యాత్మిక ఎదుగుదలకు కూడా పాటుపడండి. అది లేకపోతే, ప్రాపంచిక విజయం దారుణంగా మారిపోతుంది. ఎందుకంటే ప్రతివ్యక్తి కూడా ఆత్మ, అనాత్మల మేలుకలయిక. అందువల్ల జీవితంలో ఎదుగుదల కూడా సమానంగా ఉండాలి. అంటే ప్రాపంచికంగానూ, ఆధ్యాత్మికంగానూ కూడా ఎదగాలి.

ఆధ్యాత్మిక ఎదుగుదల అంటే ఏమిటి? **ఆత్మజ్ఞానం పొందటం.** నేను ఆత్మను, నేను జగత్తుకు అధిష్ఠానాన్ని. ఆధ్యాత్మికంగా సర్వాత్మభావన వస్తుంది. అదే అనాత్మ పరంగా కుదరదు. శారీరకంగా, ఒక పరిధిని మించి

అవలేము, అవకూడదు కూడా; మానసికంగా ఒక పరిధిని మించి ఎదగలేము; బుద్ధిపరంగా కూడా ఒక స్థాయిని మించి ఎదగలేము; ఆత్మపరంగా ఉన్నదంతా ఆత్మే అని తెలుసుకుంటాము. అందువల్ల ధర్మార్థ కామాలతో పాటు ఆత్మజ్ఞానం పొందటానికి చేసే సమానమైన ప్రయత్నాన్ని కర్మయోగం అంటారు. అందువల్ల కామధేనువు అవండి.

శ్లో. 11 **దేవాన్ భావయతానేన తే దేవా భావయంతు వః ।**
**పరస్పరం భావయంతః శ్రేయః పరమవాప్స్యథ ॥**
దేవాన్, భావయత, అనేన, తే, దేవాః, భావయంతు, వః,
పరస్పరమ్, భావయంతః, శ్రేయః, పరమ్, అవాప్స్యథ ॥

| | | | |
|---|---|---|---|
| అనేన | = ఈ యజ్ఞము ద్వారా (మీరు) | (ఏవమ్) | = ఈ విధముగా |
| దేవాన్ | = దేవతలను | పరస్పరమ్ | = పరస్పరము |
| భావయత | = తృప్తిపరచండి | భావయంతః | = సంతృప్తి పరచుకొనుచు |
| తే, దేవాః | = ఆ దేవతలు | (యూయమ్) | = మీరు |
| వః | = మిమ్ములను | పరమ్, శ్రేయః | = పరమశ్రేయస్సును |
| భావయంతు | = వృద్ధిపరచుదురు గాక! | అవాప్స్యథ | = పొందగలరు |

**అనేన దేవాన్ భావయత తే దేవాః వః భావయన్తు ।**
**పరస్పరం భావయన్తః పరం శ్రేయః అవాప్స్యథ ॥**

తా: 'ఈ యజ్ఞముల ద్వారా మీరు దేవతలను తృప్తిపరచండి. మరియు ఆ దేవతలు మిమ్ములను అనుగ్రహింతురు. నిస్స్వార్థభావంతో మీరు పరస్పరము సంతృప్తిపరుచుకొనుచు పరమ శ్రేయస్సును పొందగలరు,' అని పల్కెను.

కర్మయోగాన్ని యజ్ఞంలా చేయమన్న భావననే ఇంకా కొనసాగిస్తున్నాడు కృష్ణపరమాత్మ. కర్మయోగం పాటించటం వల్ల దేవతలను తృప్తి పరుస్తున్నారు. దేవతలంటే ప్రకృతి శక్తులకు అధిష్ఠానదేవతలు. వర్షానికి అధిష్ఠానదేవత ఇంద్రుడు; సముద్రాలకు అధిష్ఠానదేవత వరుణుడు. మనం ప్రకృతిలో మమేకం చెందటం ద్వారా అధిష్ఠాన దేవతలు తృప్తి పడతారు. అంటే ప్రకృతి ధర్మాలను మనం ఉల్లంఘించటం లేదు.

అలా ప్రకృతికి అనువుగా జీవించటంవల్ల, ఆ దేవతలు తృప్తి చెంది, బదులుగా మనను దీవిస్తారు. మనకు అన్నీ సమృద్ధిగా ఇస్తారు. మన మతంయొక్క గొప్పతనం అది. మనం ప్రకృతితో సహజీవనం చేస్తాము. ప్రకృతిని పూజిస్తాము. వైజ్ఞానిక శాస్త్రం అలా కాదు, ప్రకృతిని జయించాలి అంటుంది. ఎవరెస్ట్ శిఖరాన్ని జయించాడు అంటుంది. శిఖరం చేరుకుంటే అది జయం. మనం జయం మాట వాడము. నిజానికి జయించాల్సిన అవసరం లేదు కూడా. ప్రకృతి మన శత్రువు అయితే కదా జయించాలి! జగత్తు మనకు సమస్యలు ఇవ్వటానికి రాలేదు. మనమూ, ప్రకృతీ పరస్పరసహకారం అందించుకోవాలి.

**తే దేవా భావయంతు వః** – వారు మిమ్మల్ని తృప్తి పరుస్తారు. ఎలా? వర్షాలు సమృద్ధిగా కురుస్తాయి; ఋతువులు సక్రమంగా వస్తాయి.

వైజ్ఞానిక శాస్త్రం సాంకేతిక పదాలతో చెబుతుంది. చెట్లను నరికితే ప్రకృతివైపరీత్యాలు జరుగుతాయి; వర్షాలు సకాలంలో పడవు అంటారు. అదే శాస్త్రపరంగా చూస్తే ప్రకృతి అంతటా భగవంతుడు ఉన్నాడు అంటుంది. చెట్లు భగవంతుని శరీరంమీద ఉన్న జుట్టు; నదులు భగవంతునికి రక్తనాళాలు. అందువల్ల చెట్లను నరికితే, భగవంతునికి హాని చేస్తున్నట్టు; నదులను కాలుష్యం చేస్తే భగవంతుని రక్తాన్ని కాలుష్యం చేసినట్టు. దీని అర్థం ప్రకృతిని గౌరవించండి; ప్రకృతికి హాని చేయకండి అని.

**అనేన (కర్మయోగేన) దేవాన్ భావయత** – కర్మయోగం ద్వారా మీరు దేవతలను తృప్తి పరచండి.

కాళిదాసు ఒక అద్భుతమైన మంగళాష్టకం రాశారు.

**అశ్వత్థో వటవృక్షచన్దన తరుర్మన్దారకల్పద్రుమౌ।**

పొద్దున్న లేవగానే వృక్షాలన్నిటికీ నా నమస్కారాలు. అవి ఎంత ముఖ్యమైనవో నాకు తెలుసు. అలాగే నదులన్నిటికీ నా నమస్కారాలు.

**పరస్పరం భావయంతః** – దేవతలను మీరు తృప్తిపరుస్తే వారు తిరిగి మిమ్మల్ని తృప్తి పరుస్తారు.

**పరం శ్రేయః అవాప్స్యథ** – అన్నీ పొందుదురు గాక. అన్నీ అంటే నాలుగు పురుషార్థాలను పొందుతారు.

యు.ఎన్.ఓ. చేసిన ఒక పరిశోధనలో ప్రపంచంలో ఉత్పత్తి చెందే ఆహారాన్ని, ప్రపంచంలో ఉన్న జనాభాని బేరీజు వేచి చూస్తే, ఉన్న అవసరాలకు, పండే పంట సమృద్ధిగా సరిపోతుందనీ, ఎవరూ ఆకలితో అలమటించనవసరం లేదనీ తెలిసింది. అందువల్ల సమస్య ఆహారం లేకపోవటం కాదు, ఉన్న ఆహారాన్ని అందరికీ సరిగ్గా పంచకపోవటం. కొన్నిచోట్ల అతిగా తింటే, కొన్నిచోట్ల అసలే లేదు.

శాస్త్రం ఆహారం తీసుకోండి, కాని అతిగా తినకండి అంటుంది. మనషి తన ఆరోగ్యంకోసం అన్నాన్ని తింటాడు. కాని అదే మనిషి అదే అన్నాన్ని ఎక్కువగా తింటే, ఆ అన్నమే మనిషిని తింటుంది. అన్నం రెండు రకాలుగా పనిచేస్తుంది. ఆద్యతి – మనిషిచేత తినబడుతుంది; అదిద్య భూతాని – మనిషిని తింటుంది. మనిషిని తింటుంది అంటే అనారోగ్యం పాలు చేస్తుంది. అందువల్ల మన సమస్య ఆహారం లేకపోవటం కాదు, ఉన్నదాన్ని నలుగురికీ పంచక పోవటం. 'మనిషి అవసరానికి సరిపడా ఆహారం ఉంది కాని మనిషి దురాశకి సరిపడా ఆహారం లేదు,' అన్నారెవరో! అందువల్ల దురాశ పడకండి, ఎక్కువ వస్తే నలుగురితో పంచుకోండి, సమాజసేవ చేయండి. నిస్వార్థంగా నలుగురితో పంచుకోవటమే కర్మయోగం. కర్మయోగం ద్వారా నాలుగు పురుషార్థాలను పొందుతారు.

భగవంతుడు ఈ శరీరాన్ని, ఈ జగత్తును మనకు కానుకగా ఇచ్చాడు. చిన్మయానంద స్వామీ ఈ కానుకను మనం భగవంతునికి తిరిగి ఇచ్చేటప్పుడు సరిగ్గా ఇవ్వాలంటారు. దీన్ని దుర్వినియోగం చేస్తే భగవంతుడు బాధపడతాడు. దీన్ని పరోపకారానికి వాడాలి.

**పరోపకారాయ వహన్తి నద్యః పరోపకారాయ దుహన్తి గావః**
**పరోపకారాయ ఫలన్తి వృక్షాః పరోపకారార్థమ్ ఇదం శరీరమ్**

వృక్షాలు ఇతరులకోసం ఫలాలను ఇస్తాయి. మనం పండుకోసం చెట్టును రాయి వేసి కొట్టినా, అది తిరిగి పండును ఇస్తుంది. అలాగే ఆవు పాలు మనకోసం ఇస్తుంది. నదులు మనకోసం ప్రవహిస్తాయి. ప్రకృతిని చూసి అర్థం చేసుకోవచ్చు, భగవంతుడు ఈ శరీరం ఎందుకు ఇచ్చాడో. పరోపకారం చేయటంకోసమే ఇచ్చాడు.

అందువల్ల మనం ఈ శరీరాన్ని సమాజసేవ చేయటానికి ఉపయోగిస్తే, ఈ మనస్సుతో ఇతరులను ప్రేమిస్తే, ఈ బుద్ధితో జ్ఞానాన్ని నలుగురితో పంచుకుంటే, అది ఈశ్వరపూజ అవుతుంది. ఇలా పూజ చేయటంవల్ల, నాలుగు పురుషార్థాలు పొందుతాము. మనం అడక్కపోయినా వాటిని పొందుతాము.

శ్లో. 12 **ఇష్టాన్ భోగాన్ హి వో దేవా దాస్యంతే యజ్ఞభావితాః ।**
**తైర్దత్తానప్రదాయైభ్యో యో భుంక్తే స్తేన ఏవ సః ॥**

ఇష్టాన్, భోగాన్, హి, వః, దేవాః, దాస్యంతే, యజ్ఞభావితాః,
తైః, దత్తాన్, అప్రదాయ, ఏభ్యః, యః, భుంక్తే, స్తేన, ఏవ, సః ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| యజ్ఞభావితాః | = | యజ్ఞముల ద్వారా సంతృప్తి చెందిన | తైః | = | ఆ దేవతలచే |
| | | | దత్తాన్ | = | ఇయ్యబడిన భోగములను |
| దేవాః | = | దేవతలు | యః | = | ఎవరైతే |
| వః | = | మీకు | ఏభ్యః | = | వీరికి |
| ఇష్టాన్ | = | ఇష్టములైన | అప్రదాయ | = | ఇవ్వకుండా |
| భోగాన్ | = | భోగములను | భుంక్తే | = | అనుభవించునో |
| హి | = | నిశ్చయముగా | సః | = | అతడు |
| దాస్యంతే | = | ప్రసాదించెదరు | స్తేనః, ఏవ | = | దొంగయే |

**యజ్ఞభావితాః దేవాః వః ఇష్టాన్ భోగాన్ దాస్యన్తే ।**
**తైః దత్తాన్ ఏభ్యః అప్రదాయ యః భుంక్తే సః హి స్తేనః ఏవ ॥**

తా: యజ్ఞముల ద్వారా సంతృప్తిని పొందిన దేవతలు మీకు (మానవులకు) అయాచితముగనే ఇష్టములైన భోగములను ప్రసాదించెదరు. ఈ విధంగా దేవతలచే అనుగ్రహింపబడిన ఈ భోగములను ఆ దేవతలకు నివేదన చేయక తానే అనుభవించువాడు నిజంగా దొంగే.

ఈశ్వరయజ్ఞంలా జీవితాన్ని గడిపితే, ఏది కోరుకుంటే, దాన్ని భగవంతుడు ఇస్తాడని కృష్ణపరమాత్మ చెబుతున్నాడు. నాకు ధర్మార్థకామాలు వద్దు అంటే మోక్షాన్ని ఇస్తుంది కర్మయోగం; నాకు ధర్మార్థకామాలే కావాలంటే వాటినే ఇస్తుంది కర్మయోగం. అంటే కర్మయోగం రెండు వైపులా పదునున్న కత్తిలాంటిది లేదా టూ-ఇన్-వన్‌లాంటిది. టూ-ఇన్-వన్ లో రేడియో కావాలంటే రేడియో వస్తుంది; టేప్‌రికార్డర్ కావాలంటే అది వస్తుంది. అలా కర్మయోగం - ఐశ్వర్యం కావాలంటే ఐశ్వర్యం, మోక్షం కావాలంటే మోక్షం ఇస్తుంది.

కొంతమంది మాకిప్పుడే మోక్షం వద్దు అంటుంటారు. మాకు ఇంకా చిన్నపిల్లలు ఉన్నారు; మాకు అనేక బరువు బాధ్యతలున్నాయి అంటారు వారు. అటువంటి వారిని విమర్శించడు కృష్ణపరమాత్మ. కాకపోతే ఒక షరతు విధిస్తున్నాడు. సరే, మీకు మోక్షం వద్దంటే, ఏమీ తప్పులేదు. ధర్మార్థకామాలే కావాలనుకుంటే వాటినే కోరండి, కాని ఒక షరతు. మీ ధర్మార్థకామాలను కర్మయోగ పద్ధతి ద్వారా పాటించండి, కాని అనైతిక మార్గంలో మాత్రం వద్దు అంటున్నాడు. నైతిక విలువలు పాటిస్తూ, ధర్మబద్ధమైన పనుల ద్వారా మీ లక్ష్యాలను సాధించుకోండి. అడ్డదారులు తొక్కకండి.

**దేవాః దాస్యంతే** – దేవతలు మీకు కావాల్సింది ఇస్తారు.

**ధనం ధాన్యమ్ పశుమ్ బహుపుత్ర లాభమ్ శతసంవత్సరం దీర్ఘమాయుః**

దేవతలు మీకు వీటన్నిటినీ కురిపిస్తారు. ఎప్పుడు? **యజ్ఞభావితాః** – ఈ దేవతలను కర్మయోగం ద్వారా పూజిస్తే, కర్మయోగి ప్రకృతికి హాని చేయడు, అందువల్ల ప్రకృతి ఋతువులు సక్రమంగా వస్తాయి. మన జీవితం మొత్తం వర్షంమీదే ఆధారపడివుంది. అతివృష్టి వచ్చినా, అనావృష్టి వచ్చినా కూడా మన పంటలకు ఇబ్బంది; మన ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుంది.

**కాలే వర్షతు పర్జన్యః పృథివీ సస్యశాలినీ**

వర్షాలు సకాలంలో కురిస్తే, పృథివి సస్యశ్యామలంగా ఉంటుంది. ఎవరో అన్నారు 'ప్రకృతిలో ఆకుపచ్చ మాయమయితే, ఎర్రగా వుంటుంది.' చెట్లు నరికేస్తే, గాలి కాలుష్యం చెంది, ఎర్రగా మారుతుంది. అంటే ఆరోగ్యం దెబ్బతింటుంది.

**దేశోఽయం క్షోభరహితో బ్రాహ్మణా సంతు నిర్భయాః**

దేశం సుభిక్షంగా ఉండాలి. బ్రాహ్మణులు నిర్భయంగా ధార్మిక జీవనవిధానాన్ని గడపాలి.

దేశమంతా అవినీతిపరులున్నప్పుడు, ఏ ఒక్కరు నీతిగా ఉందామన్నా తక్కినవారు ఉండనివ్వరు; లేదా ఏడిపిస్తారు. అందరూ ధార్మిక జీవనాన్ని గడిపితేనే దేశం ఆరోగ్యకరంగా ఉంటుంది. అందువల్లనే కృష్ణపరమాత్మ చెప్పాడు– కర్మయోగం పాటించండి, దేవతలు మీకు అన్ని పురుషార్థాలు ఇస్తారు అని.

ఇక్కడ ఒక సందేహం రావచ్చు. ఏమిటది? నేనొక పనిని చేస్తే, దానికి తగ్గ ఫలితం వస్తుంది. నేనొక విత్తనాన్ని నాటితే, భూమి దాన్ని మొలకెత్తేలా చేస్తుంది, విత్తనానికి మొలకెత్తే గుణం ఉంటుంది. అందువల్ల **ప్రకృతిలో ఉన్న సూత్రాలు చాలు** నాకు కర్మఫలాన్ని ఇవ్వటానికి. అలాంటప్పుడు, కర్మఫలదాతగా వేరే **భగవంతుణ్ణి కొలవటం ఎందుకు**? దానికి శాస్త్రం ఇచ్చే జవాబు – **ఈ ప్రకృతి సూత్రాలను ఇచ్చింది భగవంతుడు.** మీరు బాగా పంట పండటానికి కావాల్సిన ఏర్పాట్లన్నీ చేశారు; భూమి చదును చేశారు; విత్తనం నాటారు; ఎరువులు వేశారు; పురుగుల మందు జల్లారు; నీరు పోశారు. ప్రకృతి సూత్రంవల్ల భూమినుంచి పంట వచ్చింది. కాని ఆ సూత్రం ఎక్కడినుంచి వచ్చింది? భగవంతునినుంచి.

స్వామీజీ మైక్రోఫోను పెట్టుకుని ప్రసంగం ఇస్తున్నారంటే, ఒక శాస్త్రజ్ఞుని ప్రతిభవల్ల. ఆ శాస్త్రజ్ఞుడు మైక్రోఫోనును కనుక్కోవటంవల్ల. నిజమే, అది మానవమేధస్సుకు చిహ్నం. కాని అతను మైక్రోఫోనును కనిపెట్టగలిగాడంటే ప్రకృతిలో శబ్దాన్ని పెద్దది చేయగలిగే సూత్రం ఉండటంవల్ల. అలాగే దూరదర్శన్. దూరదర్శన్‌ను మనిషి కనుక్కోగలిగాడంటే, దానికి సంబంధించిన సూత్రం ప్రకృతిలో ఉండటంవల్ల. అందువల్ల ప్రకృతిలో ఉన్న సూత్రాలు కర్మఫలాలను ఇచ్చినట్టు కనబడినా, ఆ సూత్రాలను ప్రసాదించినది భగవంతుడు. అందువల్ల మనం కొత్తగా ఏదైనా సూత్రాన్ని కనుగొంటే, దానికి భగవంతునికి లేదా దేవతలకు కృతజ్ఞత చూపాలి. నా బుద్ధి కనుగొన్నదంటే, ఆ బుద్ధిని ఇచ్చింది భగవంతుడే. నా మహిమ నా బుద్ధిలో లేదు, సూత్రాలను కనుగొనటంలో లేదు, ఉన్న సూత్రాలను పట్టుకోవటంలో ఉంది.

అందువల్ల, కృష్ణపరమాత్మ చెబుతున్నాడు. ఒక సూత్రాన్ని కనుగొన్నప్పుడల్లా, భగవంతుడు ఆ సూత్రాన్ని ఇచ్చాడని గుర్తుంచుకోండి అని. అందువల్లనే మనం భోజనం చేసేముందు బ్రహ్మార్పణం అంటూ పూజ చేస్తాము. నేను పంట పండించాను లేకపోతే పండించిన పంటను కొనుక్కున్నాను, నేనెందుకు భగవంతునికి ప్రార్థించాలి అనకూడదు. పండించే సూత్రం ఉంది కాబట్టి పండించగలిగారు ఎవరైనా! అందువల్ల కృష్ణపరమాత్మ చెబుతున్నాడు, మీరు ఏమీ చేయనవసరం లేదు, ఏదైనా అనుభవిస్తున్నప్పుడు, ఆ అనుభవం జరిగేలా చేసిన భగవంతుణ్ణి ఒక్కసారి తలుచుకోండి చాలు.

మన ఆరోగ్యం కూడా అనేక రసాయన సూత్రాలమీద ఆధారపడి ఉంది. ఇష్టం వచ్చినట్టు నోటికి అడ్డూ ఆపూ లేకుండా తినేస్తాము. లోపల ఏం జరుగుతుందో క్షణం కూడా ఆలోచించము. కాని దానికి ఒక అద్భుతమైన సూత్రం పెట్టాడు ఆ భగవంతుడు. అది తిన్న ఆహారాన్ని అరిగించి, పోషక పదార్థాలను శరీరంలో అన్ని భాగాలకూ అందజేసి, ప్రతిరోజూ వ్యర్థపదార్థాలను శరీరంనుంచి బయటకు వెళ్ళేలా చేస్తుంది. జ్వరం వస్తే తిట్టుకుంటాము కాని అది కూడా భగవంతుని కృపే! శరీరంలో ఉన్న టాక్సిన్లను పోగొట్టటానికి శరీర ఉష్ణోగ్రతను పెంచుతాడు. అలాగే దగ్గు వచ్చినప్పుడు దేవుణ్ణి తిట్టుకోకండి; గొంతుని సరిచేసే తెలివైన పద్ధతి అది. అందువల్ల దేవుణ్ణి స్తుతించండి.

సూత్రాలను మనం సృష్టించలేదు. ఉన్న సూత్రాలను మనం పట్టుకుంటున్నాము అంతే. దానికి కృతజ్ఞతలు చెప్పకపోతే, మనం దొంగలతో సమానం.

**తైః దత్తాన్** – దేవతలు మనకు అనేక వస్తువులను దీవెనలుగా కురిపించారు. ధర్మార్థకామమోక్షాలను ఇచ్చారు. తిండి, బట్ట, నీరులను ఇచ్చారు. ఎలా ఇచ్చారు? పరోక్షంగా, సూత్రాల ద్వారా. మనం వాటిని పట్టుకోగలిగినప్పుడు, ఏం చేయాలి? కృతజ్ఞతలు చెప్పాలి. మన శాస్త్రంలో అన్ని పాపాలకూ ప్రాయశ్చిత్తకర్మలు ఉన్నాయి కాని కృతజ్ఞత చూపకపోతే ప్రాయశ్చిత్తకర్మ లేదు. **కృతఘ్నే నాస్తి నిష్కృతిః**

**ఏభ్యః అప్రదాయ** – ఏభ్యః అంటే దేవేభ్యః, దేవతలకు; అప్రదాయ – తిరిగి చేయటం. కృతజ్ఞతలు చూపకుండా ప్రాపంచిక విషయాలను అనుభవిస్తే; **స్తేన ఏవ సః** – దొంగలతో సమానం. ఎలా చూపాలి? భగవంతుడేమీ ధనధాన్యాలు అడగటం లేదు. కేవలం తినేముందు తనకు నైవేద్యం పెట్టమంటున్నాడు. నివేదనం అంటే

కృతజ్ఞత చూపటం, ఇవ్వటం కాదు. అందువల్ల మన సంప్రదాయంలో మన జీవితంలోని ప్రతిక్షణమూ పూజ్యనీయమే! మనకు దైనందిన జీవితం వేరూ, పూజ వేరూ కాదు. ఏ పని చేపట్టినా, భగవంతుని తలుచుకుని చేస్తాము. ఇల్లు కట్టే ముందు, భూపూజ చేస్తాము. డ్రైవరు బస్సు నడిపే ముందు, భగవంతునికి నమస్కారం పెట్టుకుంటాడు. దైవప్రార్థన లేని జీవితం కేవలకర్మ! దైవప్రార్థన తోడైన జీవితం కర్మయోగం.

అందువల్ల కర్మ ఈశ్వరయజ్ఞంలా చేయాలి. **ఇది కర్మయోగసూత్రం 2**

శ్లో. 13 **యజ్ఞశిష్టాశినః సంతో ముచ్యంతే సర్వకిల్బిషైః ।**
**భుంజతే తే త్వఘం పాపా యే పచంత్యాత్మకారణాత్ ॥**
యజ్ఞశిష్టాశినః, సంతః, ముచ్యంతే, సర్వకిల్బిషైః,
భుంజతే, తే, తు, అఘమ్, పాపాః, యే, పచంతి ఆత్మకారణాత్ ॥

| | | | |
|---|---|---|---|
| యజ్ఞశిష్టాశినః | = యజ్ఞశిష్టాన్నమును భుజించినట్టి | ఆత్మకారణాత్ | = తమ శరీరపోషణకోసమే |
| సంతః | = సత్పురుషులు | పచంతి | = (అన్నమును) వండుకొందురో |
| సర్వకిల్బిషైః | = సర్వపాపములనుంచి | తే, తు | = వారైతే |
| ముచ్యంతే | = ముక్తులగుదురు | అఘమ్ | = పాపమునే |
| యే, పాపాః, (తు) | = ఏ పాపాత్ములైతే | భుంజతే | = భుజింతురు |

**యజ్ఞశిష్టాశినః సన్తః సర్వకిల్బిషైః ముచ్యన్తే**
**యే తు ఆత్మకారణాత్ పచంతి తే పాపాః అఘం భుంజతే ॥**

తా: యజ్ఞశిష్టాన్నమును తిను శ్రేష్ఠపురుషులు అన్ని పాపములనుంచి ముక్తులయ్యెదరు. తమ శరీరపోషణ కోసమే ఆహారమును సిద్ధపరచు (వండు)కొను పాపులు పాపమునే భుజింతురు.

**కర్మయోగ సూత్రం 3 – కర్మయోగాన్ని చిత్తశోధకంగా మలుచుకోవాలి.** మోక్షం కోరే వ్యక్తి మాత్రమే ఈ సూత్రాన్ని పట్టుకోగలడు. మోక్షం పొందటానికి ఒక్కటే మార్గం ఉంది. అది ఆత్మజ్ఞానం పొందటం. అది తప్ప వేరే మార్గం లేదు.

**నాన్యః పన్థా అయనాయ విద్యతే**

మోక్షం పొందటానికి ఆత్మజ్ఞానం పొందటం ఒక్కటే మార్గమయినా, చిత్తశుద్ధి లేకపోతే ఆత్మజ్ఞానం పొందలేమని శాస్త్రం చెబుతుంది. ఆలయంలో దైవప్రతిష్ఠ చేసేముందు, ఆ ప్రదేశాన్ని శుద్ధి చేయటానికి, అనేక పూజలు చేస్తారు. అలాగే ఆత్మజ్ఞానం పొందే ముందు చిత్తశుద్ధి పొందాలి. చిత్తశుద్ధి పొందకుండా వేదమంత్రాలు నేర్చుకుంటే, వేదం నన్ను శుద్ధి చేయటం మాట దేవుడెరుగు, నేను వేదాన్ని కలుషితం చేస్తాను. అందువల్ల వేదం నేర్చుకునే ముందు, ఉపనయన సంస్కారం పొందాలి. సంస్కారం అంటే శుద్ధి చేసే తతంగం.

ఒక గోడమీద రంగు వేయటానికి కూడా, దాని ముందు శాండ్ పేపర్‌తో దాన్ని శుద్ధి చేస్తారు. అలాగే, మనస్సనే గోడనుంచి రాగద్వేషాలు, కామక్రోధాలు, లోభమోహాలు, మదమాత్సర్యాలనే మలినాలను పోగొట్టాలి.

దానికి వాడే శాండ్‌పేపర్ కర్మయోగం. చిత్తశుద్ధి కోరుకునే సాధకుడు, ప్రాపంచిక ప్రయోజనాలకోసం పాటుపడడు. కర్మయోగం ద్వారా ధనప్రాప్తి కలగవచ్చు, కలగకపోవచ్చు కాని చిత్తశుద్ధి కలిగి తీరుతుంది.

**ఈశ్వరార్పితం నేచ్ఛయా కృతం**
**చిత్తశోధకం ముక్తిసాధకమ్** – ఉపదేశ సారమ్ 3.

ఈశ్వరార్పణబుద్ధితో కర్మ చేస్తే, చిత్తశుద్ధి కలిగి, మోక్షసాధన అవుతుంది అది.

**నేహాభిక్రమనాశోఽస్తి ప్రత్యవాయో న విద్యతే ।**
**స్వల్పమప్యస్య ధర్మస్య త్రాయతే మహతో భయాత్ ॥** – 2.40

కర్మయోగానికి ఓటమి లేదు. ఒక వ్యాపారం చేస్తే, అందులో లాభం పొందితే, విజయం సాధించినట్టు; లేకపోతే ఓటమి పొందినట్టు అంటారు. కాని కర్మయోగంలో అలా కాదు.

**యజ్ఞ శిష్టాశినః సంతః** – ఎవరైతే వారి జీవితాన్ని ప్రార్థనగా మలుచుకుని, వచ్చిన ఫలాన్ని ఈశ్వరప్రసాదంగా స్వీకరిస్తారో,

**సర్వకిల్బిషైః ముచ్యంతే** – పాపాలన్నింటినుంచీ విడవడతాడు.

మనం ఒక పుస్తకం కొన్నప్పుడు, దానిమీద ఏదైనా రాసి ఉంటే, దాన్ని తిరిగి ఇచ్చేసి, ఇంకోటి కొంటాము. కాని అదే పుస్తకాన్ని తీసుకువెళ్ళి స్వామీజీచేత సంతకం పెట్టించుకుంటాము. అలాగే ఎవరైనా ఏదైనా కొంచెం తిని ఇస్తే, ఎంగిలి అని దాన్ని తీసుకోము. కాని దేవుని ప్రసాదం అని ఏదైనా ఇస్తే, మనం తీపి తినకూడని పరిస్థితి అయినా, కొంచెం భక్తిగా తీసుకుంటాము.

పాపాన్ని శాస్త్రం ఎలా నిర్వచిస్తుంది? ఆత్మజ్ఞానానికి అడ్డు పడేదేదైనా పాపమే. ధనం ఉండి, ఆధ్యాత్మికతకు రాకపోతే అది పాపం. దాని బదులుగా ధనం లేకపోయినా, ఆధ్యాత్మిక చింతన ఉంటే పేదరికం వరం అవుతుంది. అందువల్ల ఆధ్యాత్మిక ఎదుగుదలకు తోడ్పడేది పుణ్యం, దానికి ఆటంకం కలుగజేసేది పాపం.

ఆధ్యాత్మిక చింతనకు ప్రాథమిక ఆటంకం ఏది? **మోహం.** అవివేకం. ఏమిటా అవివేకం? జగత్తు నాకు ఆనంద హేతువు లేదా దుఃఖహేతువు అనుకోవటం అవివేకం. ఎందుకు? నిజంగా ఆనందం బాహ్యవస్తువులో ఉంటే ఆ వస్తువు అందరికీ ఆనందాన్ని సమానంగా ఇవ్వాలి కదా! సంగీతం విషయమే తీసుకోండి – పాశ్చాత్యసంగీతం ఒకరికి ఆనందం కలుగజేస్తే, సాంప్రదాయ సంగీతం ఇంకొకరికి వీనులవిందుగా ఉంటుంది. ఇప్పుడు చెప్పండి, ఆనందం సంగీతంలో ఉందా; మీలో ఉందా? మీలోనే ఉంది. ప్రపంచం దుఃఖహేతువూ కాదు, ఆనంద హేతువూ కాదు. ప్రపంచాన్ని తప్పుపట్టి, దాన్ని మార్చాలని మీరు ప్రయత్నం చేస్తుంటే, మీరు మోహంలో ఉన్నట్టు అర్థం. ప్రపంచాన్ని కొంతమేరకు మార్చినా, ఆ మార్పు శాశ్వతం కాదు. అందువల్ల ప్రపంచంలో ఆనందం ఉంది అనుకోవటం మోహం.

ఈ మోహం పోవాలంటే, నాకు ఆనందాన్ని కలుగజేసేది ప్రపంచం కాదు, నా దృక్పథం అని మీరు అర్థం చేసుకోవాలి. మీరు ప్రపంచాన్ని చూచిన తీరులో మీకు ఆనందం లేదా దుఃఖం కలుగుతున్నది. అందువల్ల మీరు మార్చాల్సింది ప్రపంచాన్ని కాదు. మీ దృక్పథాన్ని. మీ దృక్పథంలో మార్పు, జ్ఞానంవల్లనే కలుగుతుంది. ప్రపంచాన్ని తప్పు పట్టకుండా మీరు జ్ఞానం వైపు మొగ్గు చూపితే మీరు ఆధ్యాత్మిక సాధకులు అవుతారు. ఆనందంకోసం బాహ్యవస్తువుల వెంట పరుగులు తీయటం మోహం. దీన్ని ఖండిస్తూ శంకరులవారు అద్భుతమైన రచన చేశారు. అదే భజగోవిందం. దాన్ని **మోహ ముద్గరః** అని కూడా అంటారు. ముద్గరః అంటే సుత్తి. మీ మోహాన్ని సుత్తితో కొట్టి నాశనం చేస్తుంది భజగోవిందం. ఒక్కొక్కటిగా విశ్లేషించుకుంటూ వస్తారు శంకరులవారు. ఆనందం దేనిలో ఉంది? మీ కుటుంబంలోనా, ధనంలోనా?

**యావద్విత్తోపార్జనసక్తః తావన్నిజపరివారో రక్తః**
**పశ్చాజ్జీవతి జర్జరదేహే వార్తాం కోఽపి న పృచ్ఛతి గేహే** – భజగోవిందమ్

మీ కుటుంబమంతా మిమ్మల్ని గౌరవించేది మీ సంపాదన ఉన్నంత వరకే! అందువల్ల కర్మయోగి ఈ మోహంనుంచి బయటపడాలి. అతను తను చేయాల్సింది ప్రపంచాన్ని మార్చటం కాదు, జ్ఞానం పొందాలని అర్థం చేసుకుంటాడు. అలా చేయనివారి పరిస్థితి ఏమిటి?

**భుంజతే తే త్వఘం పాపాః** – కర్మయోగి కానివారిని కృష్ణపరమాత్మ తీవ్రంగా విమర్శిస్తున్నాడు. వారు పాపం తింటున్నారంటున్నాడు. ఎవరు?

**ఆత్మకారణాత్ పచంతి** – కేవలం తమకోసమే వండుకునే వారు. ఇక్కడ వంట అంటే అన్ని కర్మలూ వస్తాయి. పంచమహాయజ్ఞాల్లో ఒకటిగా మనుష్యయజ్ఞాన్ని చూశాము. మన సాంప్రదాయం ప్రకారం అతిథికి భోజనం పెట్టకుండా మనం మాత్రమే తినకూడదు. అందువల్ల కంచి శంకరాచార్యులు ఒక మార్గం సూచిస్తున్నారు. ప్రతిరోజూ అతిథికి భోజనం పెట్టలేకపోతే, వంట చేసేముందు, రోజుకొక గుప్పెడు బియ్యం తీసి పక్కన పెట్టి, నెల లేదా ఆరునెలల తర్వాత, అన్నదానం జరిగేచోటుకు తీసుకువెళ్ళి అది ఇవ్వాలి. అన్నదానం చాలా ముఖ్యం. అందువల్ల అన్నదానం చేయకుండా తినేవారు తినేది కూరన్నమో, చారు అన్నమో కాదు, తీవ్రమైన పాపాన్నిచ్చే అన్నం. స్వార్థపరుడు అంతకంతకూ ఆత్మజ్ఞానానికి దూరం తొలగిపోతుంటే, నిస్వార్థపరుడు ఆత్మజ్ఞానానికి దగ్గరవుతాడు. ఆ విధంగా కర్మయోగం పవిత్రుణ్ణి చేస్తుంది.

శ్లో. 14 **అన్నాద్భవంతి భూతాని పర్జన్యాదన్నసంభవః ।**
**యజ్ఞాద్భవతి పర్జన్యో యజ్ఞః కర్మసముద్భవః ॥**
అన్నాత్, భవంతి, భూతాని, పర్జన్యాత్, అన్నసంభవః,
యజ్ఞాత్, భవతి, పర్జన్యః, యజ్ఞః, కర్మసముద్భవః ॥

| | | | |
|---|---|---|---|
| భూతాని | = ప్రాణులన్నియు | పర్జన్యః | = వర్షము |
| అన్నాత్ | = అన్నమునుంచి | యజ్ఞాత్, భవతి | = యజ్ఞమువల్ల కలుగును |
| భవంతి | = ఉత్పన్నములగును | యజ్ఞః | = యజ్ఞము (ఇక్కడ పుణ్యము) |
| పర్జన్యాత్ | = వర్షమువల్ల | కర్మసముద్భవః | = విహితకర్మలవల్ల ఏర్పడును |
| అన్నసంభవః | = అన్నోత్పత్తియగును | | |

**భూతాని అన్నాత్ భవన్తి । పర్జన్యాత్ అన్నసమ్భవః ।**
**పర్జన్యః యజ్ఞాత్ భవతి । యజ్ఞః కర్మసముద్భవః ॥**

తా: ప్రాణులన్నియును అన్నమునుంచి ఉత్పన్నములగును. వర్షమువల్ల అన్నోత్పత్తి యగును. వర్షము యజ్ఞము (పుణ్యము)వల్ల కలుగును. పుణ్యము విహితకర్మలవల్ల ఏర్పడును.

**కర్మయోగం సూత్రం 4 – కర్మయోగాన్ని ధర్మాచరణగా చేయాలి.** 14, 15 శ్లోకాల్లో కర్మయోగాన్ని ధర్మంగా వర్ణిస్తున్నాడు కృష్ణపరమాత్మ. సృష్టిలో సమతుల్యతను నిలిపేది ధర్మం.

మనం ద్వీపంలా ఒంటరిగా లేము. సమాజంలో ఒక భాగంగా ఉన్నాము. మనకు ఇష్టం ఉన్నా లేకపోయినా మనం సృష్టిలో ఒక భాగం; తోటి మనుష్యులతో, జంతువులతో, ప్రకృతితో సహజీవనం చేయాలి. ప్రకృతిలో అడవులు, నదులు, పర్యావరణం అన్నీ వస్తాయి. మన జీవనం ఋతువులతో ముడిపడి ఉంది.

మనిషి తప్ప తక్కినవన్నీ ముందే ప్రోగ్రామ్ చేయబడి వస్తాయని ఇంతకు ముందు కూడా చూశాము. చెట్లు ఎవరికీ హాని చేయవు. జంతువులు పర్యావరణాన్ని కలుషితం చేయవు. మనుష్యజాతికి మాత్రమే ఫ్రీవిల్ ఇవ్వటంవల్ల, తద్వారా మనిషి బుద్ధిని ఉపయోగించటంవల్ల, అతని ధీశక్తివల్ల విశ్వాన్నంతటినీ స్వర్గంగా మలచగలడు, లేదా సర్వనాశనం చేయగలడు. పులులు, సింహాలు రెచ్చిపోయినా ఏమీ భీభత్సం జరగదు. మనిషి రెచ్చిపోతేనే ప్రమాదం.

అందువల్ల మనం దేవుణ్ణి నమ్మినా నమ్మకపోయినా, మోక్షాన్ని నమ్మినా నమ్మకపోయినా, పుణ్యాన్ని నమ్మినా నమ్మకపోయినా, చిత్తశుద్ధిని నమ్మినా నమ్మకపోయినా, ప్రకృతిలో సమతుల్యత నిలపటం కోసమైనా కర్మయోగాన్ని పాటించాలి. సృష్టి అంతా లయబద్ధంగా ఉందని ఒప్పుకుని తీరాలి. ఎందుకంటే ప్రతిక్షణమూ సృష్టిలోని ప్రతిదీ ఒకదానితో ఒకటి ముడిపడి ఉందని చూపిస్తుంది. అందువల్ల మనం జీవితాన్ని బాధ్యతారహితంగా నడపలేము.

ప్రతిదీ ఒక వృత్తాకారంలో జరుగుతుంది. ఉదాహరణకు మనం ఆక్సిజన్‌ను పీల్చుకుని కార్బన్‌డైఆక్సైడ్‌ను వదిలితే, వృక్షాలు కార్బన్‌డైఆక్సైడ్ పీల్చుకుని ఆక్సిజన్‌ను వదులుతాయి. కాని మనమేం చేస్తున్నాము? ఆ చెట్లనన్నిటినీ నిర్దాక్షిణ్యంగా కొట్టివేస్తున్నాము. ఒక ఇంటిని పడగొట్టి 32 ఫ్లాట్లని కట్టేసుకుంటున్నాము. దానికోసం ఆ ఇంటి ఆవరణలోనూ, బయటా ఉన్న మహావృక్షాలను కూకటివేళ్ళతో సహా పెకళించి వేస్తున్నాము. ఆ వృత్తాన్ని చీలుస్తున్నాము. దానివల్ల నష్టపోయేది ఎవరు? మనమే!

ఇటువంటి వృత్తాలు ఎన్నో ఉన్నాయి. పదార్థం, శక్తి ఒక వృత్తం. కృష్ణపరమాత్మ ఇంకొక వృత్తం తీసుకున్నాడు ఉదాహరణగా. ఏమిటది? శ్లోకంలో చూద్దాము.

**అన్నాద్భవంతి భూతాని** – అన్ని జీవరాశులూ అన్నంనుంచి పుట్టాయి. ఇది మనకు ప్రత్యక్షంగా కూడా అనుభవమే. అన్నం తినకపోతే, నీరసించి పోతాము. ఈ శరీరం అన్నంనుంచి పుట్టింది. భూతాని అంటే అన్ని జీవరాశులు. అన్నం అంటే అన్నమే కాదు, ఆహారం.

**పర్జన్యాదన్నసంభవః** – వానవల్ల అన్నం వస్తుంది. వానమీదే పంటలు ఆధారపడి ఉంటాయి. అతివృష్టి, అనావృష్టిల్లో ఏదొచ్చినా పంట సరిగ్గా పండదు.

**యజ్ఞాద్భవతి పర్జన్యః** – పుణ్యంవల్ల వాన కురుస్తుంది. ఇక్కడ యజ్ఞం అంటే అపూర్వం లేదా అద్భుతం. కనపడని అంశంవల్ల వాన కురుస్తుంది. అందువల్ల దానిని అదృష్టం అనీ పుణ్యం అనీ అంటారు. పుణ్యంవల్ల వానలు కురవటం ఏమిటి? ఏదో కట్టుకథలా ఉందే అనకండి. పుణ్యం అంటే ప్రకృతిలో సమతుల్యత ఉంటేనే సకాలంలో వర్షాలు కురుస్తాయి. ఋతువులు ప్రకృతిలోని సమతుల్యతకు ప్రతీకలు. వాటిలో వానలనుబట్టి ప్రకృతిలో సమతుల్యత గురించి చెప్పేవారు పూర్వం. ఇప్పుడు దాన్ని విజ్ఞానశాస్త్రపరంగా వర్ణిస్తున్నాము. చెట్లు కొట్టేస్తున్నాము కాబట్టి మేఘాలు సరిగ్గా ఏర్పడవనీ, అందువల్ల వానలు కురవటం లేదనీ, అందువల్ల అడవులను ధ్వంసం చేయకూడదనీ అంటారు. దీన్నే పూర్వం యజ్ఞం అన్నారు.

**యజ్ఞః కర్మసముద్భవః** – యజ్ఞం ఎలా వస్తుంది? కర్మయోగంవల్ల అవుతుంది. ప్రకృతిని పరిరక్షిస్తేనే, సృష్టిని గౌరవిస్తేనే, పుణ్యం కలుగుతుంది. మనం కొత్తగా ఏమీ సమతుల్యతని తీసుకురానవసరం లేదు. ప్రకృతిలో ముందే ఉంది. మనం చేయాల్సిందల్లా దాన్ని చెడగొట్టకుండా ఉండటమే. కొంతమంది చూడండి, ఏదైనా పని చేస్తుంటే సహాయం చేస్తామని వచ్చి, అదంతా చెత్తగా చేసి పెడతారు. వారు మన పనిలో వేలు పెట్టకపోవటమే వారు చేసే కొండంత మేలు మనకు.

మనం ఏదైనా నది దగ్గరికి వెళితే ఏం చేస్తాం? చల్లగా ఉందేమోనని ముందు కాలుపెట్టి చూస్తాము. శాస్త్రం అలా కాదు, ముందు నమస్కారం చేయండి, తరువాత ప్రోక్షణం చేయండి, ఆ తర్వాత నీటిలోకి దిగండి అంటున్నది. కొంతమందికి నీటిలో ఉమ్మేసే అలవాటు ఉంది. అలా చేయకూడదు. నీటిని, గాలిని, అగ్నిని పూజించాలి. అందువల్ల గౌరవంతో కూడిన జీవనం, కర్మయోగంతో కూడిన జీవనం, ఈ సమతుల్యతను నిలబెడుతుంది. తమిళంలో ఒక సామెత ఉంది – ప్రకృతిమీద గౌరవం ఉన్న వ్యక్తి ఒక్కరున్నా కూడా అతనికోసమన్నా వాన కురుస్తుంది.

ఇప్పుడు వృత్తం మళ్ళీ ఒకసారి చూస్తే – మనం అన్నంనుంచి పుట్టాము. అన్నం వాననుంచి పుట్టింది. వాన పుణ్యంనుంచి పుట్టింది. పుణ్యం కర్మనుంచి పుట్టింది. కర్మ ఎక్కడనుంచి వచ్చింది? నానుంచే వచ్చింది. ఆ విధంగా కర్మ, నేను ఒకదానిమీద ఒకటి పరస్పరం ఆధారపడివున్నాము. అందువల్ల నేను ప్రపంచంలో జీవించాలంటే, ప్రపంచానికి నావంతు ధర్మం నేను నెరవేర్చాలి. అప్పుడే వృత్తం పూర్తి అవుతుంది. నేను తింటూంటే నేను తీసుకుంటున్నాను; నేను పనిచేస్తే నేను ఇస్తున్నాను; ఈ విధంగా వృత్తం పూర్తి అవుతుంది.

ఆ విధంగా పుణ్యం కర్మనుంచి వచ్చింది తరువాత కర్మ నానుంచి అంటే సర్వభూతాలనుంచి వచ్చింది అని కలుపుకోవాలి. అలా వృత్తం అవుతుంది. వృత్తం పూర్తవ్వాలంటే ఇవ్వటం, తీసుకోవటం రెండూ ఉండాలి. ఇది మామూలు అంశమైన ఆహారం విషయంలోనే చూడవచ్చు. రోజుకు మూడుసార్లు ఆహారం తీసుకుంటే దానికి తగ్గ వ్యాయామం చేయాలి. లేకపోతే ఆరోగ్యం దెబ్బ తింటుంది. ఇది ఆరోగ్యవృత్తం. అలాగే ఏదైనా జ్ఞానం పొందితే, దాన్ని నలుగురితో పంచుకోకపోతే బ్రహ్మరాక్షసులవుతారని పూర్వం శపించేవారు కూడా. ఇది జ్ఞానవృత్తం. నన్ను ఎవరైనా ప్రేమిస్తే, నేను నా ప్రేమను మళ్ళీ అందరికీ పంచాలి. ఇది భావపరమైన వృత్తం.

మనకు ఇవ్వటం తెలీదు, పుచ్చుకోవటమే తెలుసు. ఫ్రీగా వస్తే ఫినాయిల్ కూడా త్రాగుతాడని సామెత. అలాంటి అలవాటు ఉన్న ఒక వ్యక్తి జ్యోతిష్కుని దగ్గరకు వెళ్ళాడట. ఆ జ్యోతిష్కుడు నీకు శని వస్తున్నాడు అంటే వచ్చింది తీసుకోవటమే అలవాటు ఉన్న అతను, 'ఓ! రానివ్వండి, సంతోషం,' అన్నాడుట. అందువల్ల మనకు తీసుకోవటం ప్రత్యేకించి నేర్పనవసరం లేదు. ఇవ్వటమే నేర్పాలి.

ఇవ్వటమనే ఈ జీవనవిధానాన్ని వేదాలు బోధించాయి. ఈ వేదాలను ఈశ్వరుడు ఇచ్చాడు.

**తస్మాత్ సర్వగతం బ్రహ్మ** – అందువల్ల ఈ వైదికబోధ సర్వవ్యాపకం. వైదికసంప్రదాయం ఎక్కడెక్కడ ఉంటే, అక్కడంతా వైదికబోధ ఉంటుంది. ముఖ్యంగా –

**నిత్యం యజ్ఞే ప్రతిష్ఠితమ్** – ఎక్కడ యజ్ఞం జరుగుతుందో; ఎక్కడ త్యాగం ఉందో; ఎక్కడ దానం ఉందో అక్కడ వైదికబోధ నెలకొని ఉంటుంది.

శ్లో. 15 **కర్మ బ్రహ్మోద్భవం విద్ధి బ్రహ్మాక్షరసముద్భవమ్ ।**
**తస్మాత్ సర్వగతం బ్రహ్మ నిత్యం యజ్ఞే ప్రతిష్ఠితమ్ ॥**
కర్మ, బ్రహ్మోద్భవమ్, విద్ధి, బ్రహ్మ, అక్షరసముద్భవమ్,
తస్మాత్, సర్వగతమ్, బ్రహ్మ, నిత్యమ్, యజ్ఞే, ప్రతిష్ఠితమ్ ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| కర్మ | = | కర్మ (సముదాయము) | తస్మాత్ | = | అందువల్ల |
| బ్రహ్మోద్భవమ్ | = | వేదములనుంచి ఉత్పన్నములైనవనియు | సర్వగతమ్ | = | సర్వవ్యాపియైన |
| | | | బ్రహ్మ | = | పరమాత్మ |
| బ్రహ్మ | = | వేదము(లు) | నిత్యమ్ | = | సర్వదా |
| అక్షర సముద్భవమ్ | = | నాశరహితుడైన పరమాత్మనుంచి ప్రకటితము లైనవనియు | యజ్ఞే | = | యజ్ఞమునందు |
| | | | ప్రతిష్ఠితమ్ | = | ప్రతిష్ఠితుడైన వానినిగా (తెలుసుకొనుము) |
| విద్ధి | = | తెలుసుకొనుము | | | |

**కర్మ బ్రహ్మోద్భవం విద్ధి బ్రహ్మ అక్షరసముద్భవమ్ ।**
**తస్మాత్ సర్వగతం బ్రహ్మ యజ్ఞే నిత్యం ప్రతిష్ఠితమ్ ॥**

తా: వేదాలు విహితకర్మలకు మూలములు. వేదాలు నిత్యుడైన పరమాత్మనుంచి ఉద్భవించినవని తెలుసుకొనుము. అందువల్ల సర్వవ్యాప్తియు, అవ్యయుడును అయిన పరమాత్మ సర్వదా యజ్ఞములయందే ప్రతిష్ఠితుడై యున్నాడు.

ఏ కర్మ చేస్తే మంచిది? ఏది ప్రకృతికి హానికరం? ఇదెలా తెలుస్తుంది మనకు? ఉదాహరణకు రిఫ్రిజిరేటర్లు వచ్చి స్త్రీలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. కాని అవి ప్రకృతికి హాని చేస్తున్నాయి. అలాగే కార్లు, వాహనాలు. ఇవన్నీ ప్రకృతికి హానికరం.

అందువల్ల కృష్ణపరమాత్మ నేను సూచించిన జీవనవిధానాన్ని పాటించండి అంటున్నాడు. మతపరమైన జీవనవిధానానికి ఇప్పుడు కారణం తెలియకపోవచ్చు, కాని శాస్త్రం చెప్పిందంటే అది ప్రకృతిని దృష్టిలో పెట్టుకుని చెప్పినదే.

**కర్మ బ్రహ్మోద్భవం విద్ధి** – వేదాలు జీవనవిధానాన్ని సూచించాయి. ఇక్కడ బ్రహ్మ అంటే వేదాలు. అందువల్ల కర్మ గురించి మనకు వేదాలవల్ల తెలుస్తుంది. వేదాలు అపౌరుషేయాలు – సాక్షాత్తు ఆ భగవంతుణ్ణుంచే వచ్చాయి. పురుషబుద్ధినుంచి వచ్చిన జ్ఞానాన్ని, తర్వాత వచ్చిన వేరెవరో ఖండిస్తారు. అది శాశ్వతం కాదు. శాస్త్రం అలా కాదు. అది కొన్నివేల సంవత్సరాలనుంచి నిలబడి వుంది. అందులో ఏదైనా పొరపాటు దొరికితే, ఆ పొరపాటు దానిది కాదు; సరిగ్గా అర్థం చేసుకోలేని మన బుద్ధిది.

**బ్రహ్మాక్షరసముద్భవమ్** – వేదాలు ఈశ్వరుణ్ణుంచి వచ్చాయి. అక్షరం అంటే భగవంతుడు; బ్రహ్మ అంటే వేదాలని ముందు చూశాము. అందువల్ల ఈ వైదిక బోధ సర్వవ్యాపకం. వైదిక సంప్రదాయం ఎక్కడెక్కడ ఉంటే, అక్కడంతా వైదికబోధ ఉంటుంది. ఎక్కడ యజ్ఞం జరుగుతుందో; ఎక్కడ త్యాగం ఉందో; ఎక్కడ దానం ఉందో అక్కడ వైదికబోధ నెలకొని ఉంటుంది.

భగవంతుణ్ణుంచి, ఈ వేదాలను, వారి సత్త్వగుణంచేత ఋషులు అందుకున్నారు.

**శతేషు జాయతే శూరః సహస్రేషు చ పండితః**
**వక్తా శతసహస్రేషు దాతా భవతి వా న వా**

వందల మందిలో ఒక్కరు ధైర్యంగా ఉంటారు; వేలాది మందిలో ఒక్కరు నిజమైన పండితుడుగా ఉంటారు; లక్షల మందిలో ఒక్కరే అసలైన వక్త అవుతాడు. కాని అసలైన దాత విషయమేమిటి? సృష్టి మొత్తంలోకి ఒక్క వ్యక్తి ఉంటే ఉండవచ్చు, లేకపోతే లేకపోవచ్చు.

కర్మయోగం = ఇవ్వటం

**న కర్మణా ప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వమానశుః**
**పరేణ నాకం నిహితం గుహాయాం విభ్రాజదేతద్యతయో విశంతి ॥** – కైవల్యమ్ 3

ఇవ్వటం నేర్చుకుంటేనే, చివరగా ఆత్మజ్ఞానం కలిగినప్పుడు, అహంకారాన్ని కూడా ఇవ్వగలుగుతాము. ముందుగా మమకారాన్ని వదులుకుంటాము. దాన్ని దానం అంటారు; తర్వాత అహంకారాన్ని వదులుకుంటాము.

**కర్మయోగం = మమకార త్యాగం; జ్ఞానయోగం = అహంకార త్యాగం**

శ్లో. 16 **ఏవం ప్రవర్తితం చక్రం నానువర్తయతీహ యః ।**
**అఘాయురింద్రియారామో మోఘం పార్థ స జీవతి ॥**
ఏవమ్, ప్రవర్తితమ్, చక్రమ్, న, అనువర్తయతి, ఇహ, యః,
అఘాయుః, ఇంద్రియారామః, మోఘమ్, పార్థ, సః, జీవతి ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| పార్థ! | = | ఓ పార్థా! | న, అనువర్తయతి | = | అనుసరింపడో (తన కర్తవ్యమును పాటింపడో) |
| యః | = | ఎవరైతే | | | |
| ఇహ | = | ఈ లోకమున | సః | = | అతడు (అటువంటి) |
| ఏవమ్ | = | ఈ విధముగా (పరంపరగా) | ఇంద్రియారామః | = | ఇంద్రియసుఖలోలుడైనవాడు |
| ప్రవర్తితమ్ | = | ప్రచలితమైన | అఘాయుః | = | పాపాత్ముడు |
| చక్రమ్ | = | సృష్టిచక్రమును | మోఘమ్, జీవతి | = | వ్యర్థముగా జీవించును |

**హే పార్థ! ఏవం ప్రవర్తితం చక్రం యః ఇహ న అనువర్తయతి ।**
**సః ఇంద్రియారామః అఘాయుః మోఘం జీవతి ॥**

తా: ఓ అర్జునా! ఇట్లు పరంపరాగతముగా కొనసాగుచున్న సృష్టిచక్రమునకు అనుకూలంగా ప్రవర్తింపనివాడు అనగా తన కర్తవ్యములను పాటింపక ఇంద్రియ సుఖలోలుడైనవాడు పాపి. వాని జీవితం వ్యర్థము.

ఈ విధంగా కర్మయోగం అంటే ఇవ్వటం, కర్మ అంటే తీసుకోవటం. కర్మయోగి తాను ఎంత ఎక్కువగా ఇవ్వగలిగితే అంత ఎక్కువగా విజయవంతమయినట్టుగా భావిస్తాడు. అదే కేవల కర్మచేసే వ్యక్తి ఎంత ఎక్కువగా దాచుకోగలిగితే అంత ఎక్కువగా విజయవంతమయినట్టుగా భావిస్తాడు. పురాణాలు ఇలాంటి కర్మయోగులను కీర్తిస్తాయి. ఉదాహరణకు శిబిచక్రవర్తి.

ఎవరో గీతా సారాంశాన్ని ఆ పదాన్ని తిరగేసి చూడవచ్చు అన్నారు. గీతా, గీతా, గీతా, గీ... తా...గీ... తాగీ. త్యాగీ అంటే విజయవంతమైన వ్యక్తి. అందువల్ల కృష్ణపరమాత్మ ఎక్కువ తీసుకుని తక్కువ ఇచ్చే వ్యక్తిని గట్టిగా విమర్శిస్తున్నాడు. అటువంటి వారిని పాపులన్నాడు.

**ఏవం ప్రవర్తితం చక్రం** – ఈ విధంగా ఇలా ఇచ్చి పుచ్చుకోవటాల ద్వారా విశ్వంలోని చక్రం నడుస్తున్నది. చక్రం అంటే విశ్వంలోని సమతుల్యత, ఈ విధంగా నడుస్తున్నది. ఏ విధంగా? ఇచ్చి పుచ్చుకోవడం సమపాళ్ళలో ఉంది. ఇంకా చెప్పాలంటే ఇవ్వటం ఎక్కువా, తీసుకోవటం తక్కువగా నడుస్తున్నది.

**యః న అనువర్తయతి** – ఒకవేళ ఎవరైనా ఇలా నడుచుకోకపోతే,

**అఘాయుః** – అఘాయు అంటే అతని జీవితం పాపపంకిలం; అతను ఒక పాపి.

**ఇంద్రియారామః** – ఇంద్రియలోలుడు. ఇంద్రియాలకు బానిస.

**మోఘం పార్థ స జీవతి** – ఓ పార్థా! అటువంటి వ్యక్తి జీవితం వ్యర్థముగా గడుస్తుంది.

అతని జీవితం వ్యర్థం. అతనివల్ల అతనికీ, సమాజానికీ కూడా ఏమీ లాభం లేదు. అతనికి ఎందుకు ప్రయోజనం లేదంటే, ఇంద్రియాలకు లోనయి సుఖాలలో మునిగి తేలుతుంటాడు కాబట్టి. జీవితంలో ఏమీ సాధించలేడు. తిని, తాగి, పిల్లలని కంటే అదేం పెద్ద ఘనకార్యం కాదు. ఎందుకంటే ఆ పనిని జంతువులు కూడా చేస్తాయి. ఆరోగ్యకరమైన దీర్ఘాయుష్షు కలిగివుండటం ఘనకార్యమేమీ కాదని వివేకానందులవారు ఎక్కడో అన్నారు. ఎందుకంటే తాబేలు 350 సంవత్సరాలు జీవిస్తుంది. కొబ్బరిచెట్టు కూడా ఎన్నో సంవత్సరాలు జీవిస్తుంది. అందువల్ల ఎన్నో సంవత్సరాలు బ్రతికాను; నాకు ముగ్గురు కొడుకులు, నలుగురు కూతుర్లు ఉన్నారు; నాకు 24 మనవళ్ళు, 72 మునిమనవళ్ళు ఉన్నారని మురిసిపోవటంలో అర్థం లేదు. అదేమీ ఘనవిజయం కాదు. ఎందుకంటే పందులకు ఇంకా పెద్దకుటుంబాలు ఉంటాయి.

అటువంటి వ్యక్తి జీవితం అతనికీ బరువే, సమాజానికీ బరువే. ఎందుకంటే అతను ఏమీ ఇవ్వటంలేదు. అటువంటి వ్యక్తి మరణిస్తే జాలి చూపకపోగా, భూభారం తగ్గిందని సంతోషిస్తారు బంధుకోటి. అసలు విజయం కర్మలోనూ, మోక్షంలోనూ ఉంది.

కొన్ని జంతువులు బ్రతికినా, మరణించినా మేలు చేసేవిగా ఉంటాయి. దానికి ఉదాహరణ ఏనుగు. ఏనుగు బ్రతికినా, మరణించినా ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. కొన్ని జంతువుల చర్మం, పళ్ళు, జుట్టు, కొమ్ములు అనేక వాటికి వాడతారు. కాని మనిషో? పైన చెప్పినటువంటి వ్యక్తి జీవించినా లాభంలేదు; మరణించినా ప్రయోజనం లేదు. తన జీవితంలో ధర్మం పాటించి, తరువాత మోక్షం పొందితేనే దానికి విలువ. అందువల్ల అది పాటించని వారి జీవితం వృథా అంటున్నాడు కృష్ణపరమాత్మ.

శ్లో. 17 **యస్త్వాత్మరతిరేవ స్యాత్ ఆత్మతృప్తశ్చ మానవః ।**
**ఆత్మన్యేవ చ సంతుష్టః తస్య కార్యం న విద్యతే ॥**
యః, తు, ఆత్మరతిః, ఏవ, స్యాత్, ఆత్మతృప్తః, చ, మానవః,
ఆత్మని, ఏవ, చ, సంతుష్టః, తస్య, కార్యమ్, న, విద్యతే ॥

| | | | |
|---|---|---|---|
| తు | = కాని | ఆత్మని, ఏవ | = ఆత్మయందే |
| యః, మానవః | = ఏ మనుజుడు | సంతుష్టః | = సంతుష్టుడై |
| ఆత్మరతిః, ఏవ | = ఆత్మయందే రమించునో | స్యాత్ | = ఉండునో |
| చ | = ఇంకా | తస్య | = అతనికి |
| ఆత్మతృప్తః | = ఆత్మయందే తృప్తిచెందునో | కార్యమ్ | = ఎటువంటి కర్తవ్యమూ |
| చ | = అదే విధంగా | న, విద్యతే | = (మిగిలి) ఉండదు |

**యః తు మానవః ఆత్మరతిః ఏవ ఆత్మతృప్తః చ ఆత్మని ఏవ సన్తుష్టః చ స్యాత్ ।**
**తస్య కార్యం న విద్యతే ॥**

తా: ఆత్మజ్ఞానమును పొందిన జ్ఞానియైన మహాత్ముడు నిత్యమైన ఆత్మయందే రమించును. అతడు పూర్ణకాముడు. కనుక ఆత్మయందే తృప్తినొందును. అతడు ఆత్మయందే నిత్యసంతుష్టుడు. అటువంటి వానికి ఎటువంటి కర్తవ్యమును ఉండదు.

ఈ మంత్రంలో, తర్వాత వచ్చే మంత్రంలో కృష్ణపరమాత్మ కర్మయోగంయొక్క ప్రయోజనం గురించి చెబుతున్నాడు. ఒక విషయం చాలా స్పష్టంగా గుర్తుంచుకోవాలి. గీత కాని, వేదం కాని కర్మయోగమే అంతిమలక్ష్యం అని ఎన్నడూ చెప్పదు. కర్మయోగం జ్ఞానాన్నివ్వదు కాబట్టి కర్మయోగం మోక్షాన్ని ఇవ్వదు; అందువల్ల కర్మయోగాన్ని అంతిమలక్ష్యంగా చూడకూడదు. అలాగని కర్మయోగం అప్రయోజనం అని కూడా అనకూడదు. ఎందుకంటే కర్మయోగం మాత్రమే చిత్తశుద్ధిని ఇవ్వగలదు. అందువల్ల ఎవరైనా సరే, ముందు కర్మయోగం పాటించి, చిత్తశుద్ధి పొంది, దాని తరువాత ఇంకా ఉన్నతమైన సాధనకు వెళ్ళాలి.

ఇక్కడే అందరూ పొరపాటు పడుతుంటారు. కర్మయోగమే మోక్షాన్నిస్తుంది అనుకుంటారు. అలా కాదని ఇక్కడ స్పష్టంగా చూపిస్తున్నాడు కృష్ణపరమాత్మ. అయితే ఏది తరువాత వచ్చే దశ? **జ్ఞానయోగం!** సమాజానికి సేవ చేసి, చిత్తశుద్ధి పొంది, కర్మయోగం మాని లేదా తగ్గించి, ఆత్మ విచారణ మొదలుపెట్టాలి. ముందే చూసినట్టుగా మన ప్రాథమిక సమస్య ఆత్మ అజ్ఞానం. ఆత్మ అజ్ఞానం తొలగించుకుంటే కాని ఎంత ఆధ్యాత్మిక సాధన చేసినా లాభం లేదు. అందువల్ల కర్మయోగంనుంచి ఎదగాలి.

**ఆరురుక్షోర్మునేర్యోగం కర్మ కారణముచ్యతే ।**
**యోగారూఢస్య తస్యైవ శమః కారణముచ్యతే ॥** – 6.3

కర్మయోగంనుంచి జ్ఞానయోగానికి రావాలి. తల్లిగర్భంలో శిశువు తొమ్మిది నెలలు ఉంటుంది. ఆ తొమ్మిది నెలలు ఆ శిశువుకు ఎంతో ముఖ్యమైన కాలం. ఆ తల్లిగర్భం శిశువు ఎదుగుదలకు తోడ్పడుతుంది. కాని తొమ్మిది నెలలు దాటాక, అదే తల్లిగర్భం శిశువుకు ఆటంకం అవుతుంది. అందువల్ల ఆ శిశువు బయటకు రావటానికి ప్రకృతే ఏర్పాటు చేసింది. శిశువు ఎదుగుదల ఇంక బయట జరగాలి, లోపల కాదు.

అదే విధంగా కర్మయోగం తల్లిగర్భంలాంటిది; దాన్నుంచి బయటకు రావాలి. మొదటి దశను ప్రవృత్తి మార్గమనీ, రెండవ దశను నివృత్తి మార్గమనీ అంటారు. ప్రవృత్తి మార్గంలో బాహ్యాముఖంగా ఉంటే, నివృత్తి మార్గంలో అంతర్ముఖులవుతాము. అంతర్ముఖులయ్యాక **నేనెవరు** ప్రశ్నను వేసుకోవాలి.

ఇంతవరకూ జీవితం యాంత్రికంగా గడుపుతూ వచ్చాము. అందరూ చేస్తున్నారు కాబట్టి మనమూ చేస్తున్నాము. ఎల్.కె.జి.నుంచి పది దాకా చదివి, తరువాత ఇంటర్మీడియట్, తరువాత ఇంజనీరింగ్ చేసి, ఉద్యోగం సంపాదించి, పెళ్ళి చేసుకుని, పిల్లలను కని, వారికి చదువులు చెప్పించి, వారికి పెళ్ళిళ్ళు చేసి – అలా సాగిపోతుంది యాంత్రికంగా! ఇప్పటికైనా ప్రశ్న వేసుకోవాలి.

**కస్త్వం కోఽహం కుత ఆయాతః, కా మే జననీ కో మే తాతః ॥**

**ఇతి పరిభావయ సర్వమసారమ్, విశ్వం త్యక్త్వా స్వప్నవిచారమ్ ॥** – భజగోవిందమ్ 23

జీవితం అంటే ఏమిటి? నా స్వరూపమేమిటి? నేనెందుకు ఈ భూమ్మీదకు వచ్చాను? నా అంతిమలక్ష్యం ఏమిటి? ఈ ప్రశ్నలకు జవాబులు జ్ఞానయోగంలో దొరుకుతాయి.

ఈ జ్ఞానయోగం వేదాంత శ్రవణ, మనన, నిదిధ్యాసనల ద్వారా కలుగుతుంది. ఆ జ్ఞానాన్ని పొంది, అర్థం చేసుకుని, జీర్ణించుకుంటే నా అసలు స్వరూపం తెలుస్తుంది. నేను పూర్ణుడను అని అర్థమవుతుంది. అది తెలిస్తే జీవితంలో పోరాటం ముగిసిపోతుంది.

ఉదాహరణకు పూరీ విషయమే తీసుకోండి. పూరీని నూనెలో వేస్తే అది నూనెలో పరుగులు పెడుతుంది. పరుగులు పెడుతుండగా పొంగుతూ వస్తుంది. ఎప్పుడైతే పూర్తిగా పొంగుతుందో అప్పుడే దాని పరుగులు ఆగిపోతాయి. **ఆత్మన్యేవ ఆత్మనః తుష్టః.** అది పూర్ణత్వాన్ని పొందేసింది. పూర్ణత్వం పదాన్ని కుదిస్తే పూరీ. అందువల్ల మీరు పూరీని ఎప్పుడు తిన్నా, మీ జీవితలక్ష్యమైన పూర్ణత్వాన్ని అది గుర్తు చేస్తున్నదని అర్థం చేసుకోండి. అది పూర్ణత్వం పొందేదాకా పూరీ పరుగులు తీసినట్టుగా మీరు కూడా పరుగులు తీస్తున్నారు.

**జ్ఞానయోగానికి రానిదే కర్మయోగం అసంపూర్ణం**

**కర్మయోగం లేనిదే జ్ఞానయోగం అసంభవం**

అందువల్ల కర్మయోగం పాటించి, జ్ఞానయోగానికి వచ్చి, మోక్షం పొందండి. కర్మయోగం గురించి వివరంగా చెప్పి, జ్ఞానయోగం గురించి టూకీగా చెప్తున్నాడు కృష్ణపరమాత్మ. ఇప్పుడు శ్లోకం చూద్దాము.

**మానవః** – జ్ఞానయోగిని మానవః అంటారు.

అతను తెలివైన వ్యక్తి. ఎందుకంటే అతను సమస్యను సరిగ్గా అర్థం చేసుకున్నాడు. దయానంద స్వామీజీ అద్భుతంగా చెబుతారు **'సమస్య నువ్వే, పరిష్కారము నువ్వే.'** ఇంతవరకూ సమస్య బాహ్యంగా ఉంది అనుకుంటున్నాము– కుటుంబసభ్యులతో, ఉద్యోగంతో, పరిస్థితులతో. కాని తెలివైన వ్యక్తి ఆత్మవిచారణకు వచ్చి, గురుశాస్త్ర ఉపదేశం ద్వారా నేర్చుకుంటాడు. గురువు ద్వారా శాస్త్రం నేర్చుకున్నప్పుడు ఒక మహాఅద్భుతాన్ని కనుగొంటాడు; కనీ వినీ ఎరుగని విషయాన్ని కనుగొంటాడు. ఇంతవరకూ వేటికోసం బాహ్యంగా పరుగులు పెట్టాడో, అవి తనలోనే ఉన్నాయని అర్థం చేసుకుని ఆశ్చర్యపోతాడు.

**భద్రత కావాలనుకుంటే, తను భద్రతకు ప్రతీక**

**పూర్ణత్వం కావాలనుకుంటే, తను పూర్ణపురుషుడు**

**శాంతి, ఆనందం కావాలనుకుంటే, తను శాంతికి నిలయం, ఆనందస్వరూపుడు**

**ఆత్మరతిరేవ స్యాత్** – అంతకు ముందు బాహ్యవస్తువులతో ఆనందపడ్డాడు. ఇప్పుడు అంటే ఆత్మజ్ఞానం పొందాక ఆనందంగా ఉన్నాడు. ఆ ఆనందం బాహ్యవస్తువులనుంచి వచ్చింది కాదు. తనలోనే ఆనందం పొందేవాడు. అది అతని స్వస్వరూపం.

**ప్రజహాతి యదా కామాన్ సర్వాన్ పార్థ మనోగతాన్ ।**
**ఆత్మన్యేవాత్మనా తుష్టః స్థితప్రజ్ఞస్తదోచ్యతే ॥** – 2.55

**ఆత్మతృప్తశ్చ** – తన విషయంలో పూర్తిగా తృప్తి చెందుతాడు. ఇంకా ఎక్కువ కావాలనుకోడు. ఎందుకంటే అతను పూర్ణుడు. పూర్ణత్వం అంటే అనంతం. అనంతాన్ని మించి ఇంకోటి లేదు. లౌకిక ప్రపంచంలో ఎంత సాధించినా దానికన్నా ఉన్నతమైనదేదో ఉంటుంది.

**ఆత్మన్యేవ చ సంతుష్టః** – అతను ఆత్మలోనే తృప్తి చెందుతాడు. బాహ్యవస్తువులమీద ఆధార పడడు. నేను ఆనందాన్నిచ్చే వస్తువుల్లో ఒకణ్ణి కాను, నేనే ఆనందస్వరూపుడను అని తెలుసుకుంటాడు.

**తస్య కార్యం న విద్యతే** – దాని తరువాత అతని జీవితంలో ఏ విధమైన పోరాటం ఉండదు. దాని తరువాత ఏం చేసినా పూర్ణత్వంకోసం చేయడు. పూర్ణత్వంతో చేస్తాడు.

ఇదే జ్ఞానికీ, అజ్ఞానికీ మధ్య వ్యత్యాసం. జ్ఞాని పూర్ణత్వంతో చేస్తే, అజ్ఞాని పూర్ణత్వంకోసం పని చేస్తాడు. పూర్ణత్వంకోసం చేసే పనిని సంసారం అంటారు. పూర్ణత్వంతో చేసే పనిలో ఆనందం ఉంటుంది. దాన్ని లీల అంటారు. అందువల్లనే రామలీల, కృష్ణలీల పదాలు వాడతారు.

శ్లో. 18 **నైవ తస్య కృతేనార్థో నాకృతేనేహ కశ్చన ।**
**న చాస్య సర్వభూతేషు కశ్చిదర్థవ్యపాశ్రయః ॥**
న, ఏవ, తస్య, కృతేన, అర్థః, న, అకృతేన, ఇహ, కశ్చన,
న, చ, అస్య, సర్వభూతేషు, కశ్చిత్, అర్థవ్యపాశ్రయః ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| తస్య | = | అటువంటి మహాపురుషునకు | చ | = | అలాగే |
| ఇహ | = | ఈ లోకమున | సర్వభూతేషు | = | సమస్త ప్రాణులందును |
| కృతేన | = | కర్మాచరణమువల్ల | అస్య | = | ఇతనికి |
| కశ్చన, అర్థః | = | ఏ ప్రయోజనమూ | కశ్చిత్ | = | ఏ |
| న (అస్తి) | = | ఉండదు | అర్థ వ్యపాశ్రయః | = | స్వార్థసంబంధమూ |
| అకృతేన | = | కర్మ చేయకుండుటవల్ల | న (అస్తి) | = | ఉండదు |
| ఏవ, న (అస్తి) | = | (ప్రయోజనమూ) ఉండదు | | | |

**ఇహ కృతేన తస్య అర్థః న ఏవ, అకృతేన (అపి) కశ్చన ।**
**అస్య (అర్థః) న, (తథా) సర్వభూతేషు చ (అస్య) కశ్చిత్ అర్థవ్యపాశ్రయః న ॥**

తా: అటువంటి మహాత్ముడు ఈ జగత్తునందు కర్మలు చేయుటవల్ల, చేయకుండుటవల్ల అతనికి ఏ ప్రయోజనమూ ఉండదు. అతనికి సర్వప్రాణులతోను స్వార్థపరమైన సంబంధము ఏ విధముగను, ఏమాత్రము ఉండదు.

జ్ఞానయోగి ఆంతరస్వేచ్ఛను కనుగొంటాడు. బాహ్యంగా ఎన్నటికీ స్వేచ్ఛను పొందలేము. ఎందుకంటే శారీరకంగా మనం అనేక బాహ్యవిషయాలమీద ఆధారపడతాము. మనకు ఆహారం కావాలి, వస్త్రాలు కావాలి, నిలువ నీడ కావాలి, ఆఖరికి రోడ్డుమీద కారు ప్రయాణం చేస్తున్నా కూడా ట్రాఫిక్ నియమాలు పాటించాలి. నిజానికి శారీరక స్వేచ్ఛను కోరకూడదు; శారీరకంగా ఉన్న పరిమితులను ఇష్టపూర్వకంగా అంగీకరించి, నియమాలను పాటించాలి. అప్పుడది బంధకత్వం అవదు. బాహ్యంగా నియమాలు ఉన్నాయని అంగీకరించటమే స్వేచ్ఛ. కాని ఆంతరంగా చూస్తే పూర్తిగా స్వేచ్ఛను పొందగలము. ఆ అంతరస్వేచ్ఛను మోక్షం అంటారు.

ఈ జ్ఞాని ఎంత స్వేచ్ఛగా ఉంటాడంటే అతను పనిచేసినా బాధపడడు, చేయకపోయినా బాధపడడు. కొంతమంది పనిచేయకుండా ఒకక్షణం ఖాళీగా కూర్చోలేరు. వారికి సెలవు వస్తోందంటేనే భయం. ఆరోజు ఏం పనులు చేయాలో వంద ప్రణాళికలు ముందే వేసుకుంటారు. అలాంటి వారిని 'నీకు నడుం నొప్పి ఉంది, ఒక నెల మంచం దిగకు,' అంటే వారి పని అయిపోతుంది.

ఇంకోరకం మనుష్యులు ఉంటారు. వారు ఇటు చెంబు తీసి అటు పెట్టరు. దాహం వేస్తున్నా లేవరు. ఎవరైనా అటువైపు వచ్చేదాకా చూసి, వారిని నీళ్ళు తెచ్చిపెట్టమంటారు. కృష్ణపరమాత్మ జ్ఞాని ఈ రెండు కోవలకూ చెందడని చెబుతున్నాడు.

**తస్య కృతేన అర్థః న** – జ్ఞాని కర్మ ద్వారా ఏమీ ఫలాన్ని ఆశించడు.

**న అకృతేన ఇహ కశ్చన** – పని చేయకపోవటంవల్ల కూడా ఏమీ ఫలాన్ని ఆశించడు. అంటే అతను పనిమీద కాని, పని చేయకపోవటంమీద కాని ఆధారపడడు.

మనకు వృద్ధాప్యం ఒక పెద్ద బెంగ. కనులు కనపడవు; చెవులు వినపడవు; ఎవరితోనైనా మాట్లాడదామంటే వారు మనను చూస్తూనే ఆమడదూరం పారిపోతారు. ఆర్థికంగా ఏలోటూ లేకపోవచ్చు కాని మానసికంగా ఒంటరితనం భరించలేనిది. వయస్సు పెరుగుతున్నకొద్దీ మనుషులు దూరమవుతూ వస్తారు. మరణం కొంతమందిని దూరం చేస్తే, వేరే కారణాలు మరికొంతమందిని దూరం చేస్తాయి. పెంపుడు కుక్క చనిపోతే చాలారోజులు కృంగిపోతారు కొంతమంది. ఒక భర్త అయితే వచ్చే జన్మలో మా ఆవిడ పెంపుడు కుక్కగా పుట్టాలనుకుంటాడు. ఎందుకు? ఆవిడ ఎక్కడికైనా వెళ్ళి రాగానే భర్త తిన్నాడో, తాగాడో చూడకుండా కుక్కకు ఏమైనా పెట్టావా, లేదా? అని అడుగుతుందిట.

**న చాస్య సర్వభూతేషు కశ్చిదర్థవ్యపాశ్రయః** – సృష్టి మొత్తంలో జ్ఞాని ఎవరిమీదా ఆధారపడడు.

అందువల్ల మన ప్రయాణం ప్రపంచంమీద ఆధారపడటంనుంచి దేవునిమీద ఆధారపడటం దశకు వచ్చి, దేవునిమీద ఆధార పడటం దశనుంచి మనమీద మనం ఆధారపడటం దశకు రావాలి.

**ప్రపంచంమీద ఆధారపడటం – కేవలకర్మ**

**దేవునిమీద ఆధారపడటం – కర్మయోగం**

**మనమీద మనం ఆధారపడటం – జ్ఞానయోగం**

సంసారంనుంచి భక్తికి, భక్తినుంచి జ్ఞానానికీ మన ప్రయాణం. జ్ఞానంయొక్క పరాకాష్ఠ గురించి చెబుతున్నాడు కృష్ణపరమాత్మ. జ్ఞాని ఎవరిమీదా ఆధారపడడు.

శ్లో. 19 **తస్మాదసక్తః సతతం కార్యం కర్మ సమాచర ।**
**అసక్తో హ్యాచరన్ కర్మ పరమాప్నోతి పూరుషః ॥**
తస్మాత్, అసక్తః, సతతమ్, కార్యమ్, కర్మ, సమాచర,
అసక్తః, హి, ఆచరన్, కర్మ, పరమ్, ఆప్నోతి, పూరుషః ॥

| | | | |
|---|---|---|---|
| తస్మాత్ | = అందువల్ల | పూరుషః | = మనుష్యుడు |
| సతతమ్ | = ఎల్లప్పుడును | అసక్తః | = ఆసక్తిరహితుడై |
| అసక్తః | = ఆసక్తిరహితుడవై | కర్మ | = కర్మ(ల)ను |
| కార్యమ్, కర్మ | = కర్తవ్యకర్మను | ఆచరన్ | = ఆచరించుచు |
| సమాచర | = చక్కగా ఆచరింపుము | పరమ్ | = పరమాత్మను |
| హి | = ఎందుకంటే | ఆప్నోతి | = పొందును |

**తస్మాత్ అసక్తః సతతం కార్యం కర్మ సమాచర ।**
**హి పూరుషః అసక్తః కర్మ ఆచరన్ పరమ్ ఆప్నోతి ॥**

తా: అందువలన నీవు నిరంతరము ఆసక్తిరహితుడై కర్తవ్యకర్మలను చక్కగా ఆచరింపుము. ఎందుకంటే కర్మఫలములందు అభిమానము వీడి కర్మలను సదా ఆచరించు మనుష్యునకు పరమాత్మ ప్రాప్తి కలుగును.

అందువల్ల కృష్ణపరమాత్మ అర్జునునికి సలహా ఇస్తున్నాడు. అర్జునా! ఇప్పుడు నీ లక్ష్యం చాలా స్పష్టంగా ఉంది. మోక్షం అంటే భావపరంగా పూర్తి స్వేచ్ఛ. పూర్ణత్వం నీ లక్ష్యం. ఎందుకంటే దానికోసమే మన పోరాటమంతా. తెలిసో తెలియకో అంతర్గత స్వేచ్ఛకోసమే మన పోరాటమంతా. ఆ అంతర్గత స్వేచ్ఛ, ఆత్మజ్ఞానం పొందితేనే సాధ్యం.

అందువల్ల స్వేచ్ఛ కావాలంటే ఆత్మజ్ఞానం పొందాలి. ఆత్మజ్ఞానం పొందాలంటే చిత్తశుద్ధి కావాలి. చిత్తశుద్ధి అంటే రాగద్వేషాలనుంచి స్వేచ్ఛ పొందాలి. అశుద్ధం అంటే మోహం. ఆ మోహం ప్రపంచం ఆనందహేతువు లేదా దుఃఖహేతువు అనుకోవటంనుంచి వస్తుంది. ప్రపంచం ఆనందహేతువు లేదా దుఃఖహేతువు అనుకున్నాళ్ళు ప్రపంచాన్ని మార్చటానికి ప్రయత్నిస్తూ, ఓడిపోతూ ఉంటారు.

**అజ్ఞాత అహం దుఃఖ హేతుః, జ్ఞాత అహం సుఖ హేతుః**

అర్థం చేసుకోని నేను దుఃఖానికి కారణాన్ని; అర్థం చేసుకున్న నేను సుఖానికి కారణాన్ని. ఈ విషయం అర్థం చేసుకునే వరకూ మోహంలో ఉంటాను; ప్రపంచాన్ని మార్చటానికి ప్రయత్నిస్తూ ఉంటాను. ఈ మోహం కర్మయోగంవల్ల పోతుంది.

మన ప్రయాణం టూకీగా –

**కర్మయోగం పాటించి, చిత్తశుద్ధి పొందాలి**
**జ్ఞానయోగం పాటించి, పూర్ణత్వం అర్థం చేసుకుని మోక్షం పొందాలి.**

**తస్మాత్** – అందువల్ల.

**కార్యం కర్మ సమాచర** – కర్మయోగం పాటించు.

అందువల్ల కర్మయోగంతో నీ ప్రయాణాన్ని మొదలుపెట్టు. కార్యం అంటే మన ధర్మం. ఈ సందర్భాలలో అర్జునుని ధర్మం ఏమిటి? మహాభారతయుద్ధం చేయటం. అది ఎలా చేయాలి?

**అసక్తః** – భవిష్యత్తు గురించి భయపడకుండా, గతం గురించి కలత చెందకుండా, వర్తమానంలో ఉండి ఏం చేయాలో దాన్ని మనస్ఫూర్తిగా చేయాలి.

**సతతమ్** – అలా ఎప్పుడూ ఉండాలి.

**అసక్తో హ్యాచరన్ కర్మ** – నువ్వు చేయాల్సిన కర్మను సరియైన దృక్పథంతో చేస్తే;

**పరమాప్నోతి పూరుషః** – మోక్షం పొందుతావు.

పరం అంటే మోక్షం. అటువంటి తెలివైన కర్మయోగి సరియైన దృక్పథంతో పనిచేసి, తప్పకుండా మోక్షం పొందుతాడు. కాని వెంటనే కాదు. ప్రయాణం గుర్తుంచుకోండి: కర్మయోగం – చిత్తశుద్ధి – జ్ఞానయోగం – ఆత్మజ్ఞానం – మోక్షం. అందువల్ల అర్జునా! విల్లంబులు తీసుకుని యుద్ధం చేయి.

శ్లో. 20 **కర్మణైవ హి సంసిద్ధిమ్ ఆస్థితా జనకాదయః ।**
**లోకసంగ్రహమేవాపి సంపశ్యన్ కర్తుమర్హసి ॥**
కర్మణా, ఏవ, హి, సంసిద్ధిమ్, ఆస్థితాః, జనకాదయః,
లోకసంగ్రహమ్, ఏవ, అపి, సంపశ్యన్, కర్తుమ్, అర్హసి ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| జనకాదయః | = | జనకుడు మొదలగు జ్ఞానులు గూడ | హి | = | కావున |
| కర్మణా, ఏవ | = | (ఆసక్తిరహిత) కర్మాచరణము ద్వారానే | లోకసంగ్రహమ్ | = | లోకహితమును |
| సంసిద్ధిమ్ | = | పరమసిద్ధిని | సంపశ్యన్, అపి | = | దృష్టియందుంచు కొనుచూ |
| ఆస్థితాః | = | పొందియుండిరి | కర్తుమ్, ఏవ | = | (కర్మ) చేయుటకే |
| | | | అర్హసి | = | (నీవు) తగియున్నావు |

**హి జనకాదయః కర్మణా ఏవ సంసిద్ధిమ్ ఆస్థితాః ।**
**అపి లోకసంగ్రహమ్ ఏవ సమ్పశ్యన్ కర్తుమ్ అర్హసి ॥**

తా: జనకుడు మొదలగు జ్ఞానులు గూడ ఆసక్తిరహితముగా కర్మలను ఆచరించుటవల్లనే పరమసిద్ధిని పొందిరి. కావున నీవును లోకహితార్థమై కర్మలను ఆచరించుటయే సముచితము.

ఇది విన్నాక అర్జునుడు ఇంకా సందేహంలో పడవచ్చు. ఈ సందేహం చాలామందికి ఉంటూనే ఉంటుంది. గృహస్థుగా ఉంటూ, మోక్షం ఎలా పొందుతాము అంటారు. ఎందుకంటే గృహస్థుకు బోలెడు బరువు బాధ్యతలు ఉంటాయి. గృహస్థాశ్రమంనుంచి బయటకు వచ్చి, సన్న్యాసం స్వీకరిస్తేనే మోక్షం గురించి ఆలోచించవచ్చు అనుకుంటారు. అర్జునుని పరిస్థితి కూడా అలాగే ఉంది.

గృహస్థుకన్నా కూడా రాజు బాధ్యత ఇంకా ఎక్కువ ఉంటుంది కదా! రాజుకి దేశం గురించి బాధ్యత ఉంటుంది. దూరపు కొండలు నునుపు అంటారు. ఏ ఆశ్రమానికుండే అవస్థ ఆ ఆశ్రమానికి ఉంటుంది. కొంతమంది సన్న్యాసులను అడిగితే, పొరపాటున కూడా సన్న్యాసం తీసుకోవద్దని సలహా ఇస్తారు. పైగా సన్న్యాసాశ్రమం తీసుకుంటే వెనక్కి రాలేరు. అది ఒన్‌వే ట్రాఫిక్. సన్న్యాసి సన్న్యాసాన్ని సన్యసించలేడు.

జీవితంలో ప్రతిదశనీ ఆశ్రమం అంది శాస్త్రం. ఆశ్రమంలో సన్న్యాసి మాత్రమే జీవించడు. గృహస్థు నడిపే జీవితాన్ని కూడా గృహస్థాశ్రమం అంటుంది. దీని ఉద్దేశ్యం మనం ఆశ్రమాన్ని ఇల్లుగా, ఇంటిని ఆశ్రమంగా మలుచుకోవచ్చు. ఇంటికీ ఆశ్రమానికీ మధ్య ఉన్న వ్యత్యాసం ఏమిటి? దానిమీద ఉన్న బంధకత్వంలో ఉంది తేడా. బంధకత్వం ఉంటే అది ఇల్లు; బంధకత్వం లేకపోతే అది ఆశ్రమం. సన్న్యాసికి బంధకత్వం ఉండదు కాబట్టి, ఆయన నివసించేదాన్ని ఆశ్రమం అంటారు. అందువల్ల ఈ రెండింటి మధ్య భేదం బాహ్యంగా లేదు. అందులో నివసించే వారివల్ల ఉంది.

అందువల్ల గృహస్థులు కూడా ఆ ఆశ్రమంలో ఉంటూనే మోక్షాన్ని పొందగలరు అని కృష్ణభగవానుడు చెబుతున్నాడు. నిజానికి ఈ శ్లోకం గృహస్థులను స్తుతించే శ్లోకం. గొప్ప రాజులు, ఒకపక్క రాజ్యబాధ్యతలను వహిస్తూనే, మోక్షం పొందారు. అందరికీ తెలిసిన, ఉపనిషత్తుల్లో పేర్కొన్న, అటువంటి రాజు జనకుడు. ఆయనను రాజర్షి అంటారు.

బృహదారణ్యకోపనిషత్తులో రాజులు జ్ఞానులయి ఉన్న సందర్భాలు చూస్తాము. దానికి ఒక ఉదాహరణ గార్గ్య – అజాతశత్రువుల సంవాదం. అజాతశత్రువు రాజు. గార్గ్యుడు బ్రాహ్మణుడు. గార్గ్యుడు బ్రహ్మ గురించి చెబుతానని అజాతశత్రువు దగ్గరికి వెళతాడు. కాని ఆయనకు తెలిసింది సగుణబ్రహ్మ మాత్రమే. నిర్గుణబ్రహ్మ గురించి తెలియదు. **ఏతావన్నూ** – ఇంతేనా నీకు తెలిసింది అన్నాడు రాజు. ఎందుకంటే నిర్గుణ బ్రహ్మజ్ఞానం పొందకపోతే ఆ జ్ఞానం అసంపూర్ణం. **ఉపత్వాయానీతి** – అంత పండితుడు గార్గ్యుడు వెంటనే అజాతశత్రువును తనకు నిర్గుణబ్రహ్మ గురించి బోధించమన్నాడు. **ప్రతిలోమం చైతద్యద్ బ్రాహ్మణః క్షత్రియ ముపేయాదబ్రహ్మ మే వక్ష్యతీతి** – ఒక బ్రాహ్మణుడు, ఒక క్షత్రియుణ్ణి బ్రహ్మజ్ఞానం బోధించమని కోరటం విరుద్ధంగా ఉంది. అయినా ఫర్వాలేదు. **వ్యేవ త్వా జ్ఞపయిష్యామి** – నేను నీకు బోధిస్తాను అంటాడు. అలాగే జనకుడు కూడా బాధ్యతగల గృహస్థుగా ఉంటూ, కర్మయోగం పాటించి, చిత్తశుద్ధి పొంది, జ్ఞానం పొంది, మోక్షం పొంది, నలుగురికి బోధించగలిగాడు. అందువల్ల అర్జునా! నువ్వు జీవితంనుంచి పారిపోనవసరం లేదు, గృహస్థాశ్రమంలో ఉంటూనే జ్ఞానం పొందవచ్చు.

**జనకాదయః** – జనకుడు, అశ్వపతి, అజాతశత్రువు మొదలైన రాజులు;

**సంసిద్ధిమ్ ఆస్తితాః** – మోక్షం పొందారు. ఎలా?

**కర్మణా ఏవ** – బాధ్యతలు నిర్వర్తిస్తూ గృహస్థాశ్రమంలోనే ఉంటారు. వారిలాగా అర్జునుడు కూడా ధర్మయుద్ధం చేస్తూ, గృహస్థాశ్రమంలో ఉంటూ, జ్ఞానం పొంది, గృహస్థజ్ఞాని అవవచ్చు. నాల్గవ అధ్యాయంలో **గృహస్థజ్ఞాని** గురించి కృష్ణపరమాత్మ చెబుతాడు.

ఈ ఉదాహరణతో అర్జునునికి ధైర్యం నూరిపోయటంతో కర్మయోగం అయిపోయింది. ఈ శ్లోకంలోని రెండవ పాదంనుంచి వేరే విషయాన్ని చర్చించబోతున్నాడు కృష్ణపరమాత్మ. ఆ కొత్త అంశం ఎందుకు చెప్పబోతున్నాడో తెలుసుకోవాలి ముందు.

**3. జ్ఞాని విధులు శ్లోకాలు 20 (రెండవ పాదం) – 29**

17,18వ శ్లోకాల్లో కృష్ణపరమాత్మ కర్మయోగం చిత్తశుద్ధి పొందటానికి, తరువాత జ్ఞానం పొందటానికి ముఖ్యమని చెప్పాడు. అతను జ్ఞానం పొందాక ముక్తి పొందుతాడని, అప్పుడు అతనికి కర్మయోగం చేసి తీరనవసరం లేదనీ చెప్పాడు. ఎందుకంటే జ్ఞానం పొందాక అతను ముక్తపురుషుడు అవుతాడు. అలాంటప్పుడు కర్మయోగం తప్పనిసరి కాదు. లక్ష్యం పొందేవరకే మార్గం అవసరం, లక్ష్యం పొందిన జ్ఞానికి కర్మ అవసరం లేదు.

**నైవ తస్య కృతేనార్థో నాకృతేనేహ కశ్చన ।**
**న చాస్య సర్వభూతేషు కశ్చిదర్థవ్యపాశ్రయః ॥** – 3.18

జాగ్రత్తగా గమనించండి; కృష్ణపరమాత్మ జ్ఞానికి **కర్మ అవసరం లేదు అన్నాడు కాని, కర్మ చేయకూడదు అనలేదు**. అంటే కర్మ చేస్తే చేయవచ్చు, లేకపోతే లేదు. రమణమహర్షిలాగా మౌనంగా ఉండవచ్చు లేదా శంకరాచార్యులలాగా ఎక్కువగా హుషారుగా ఉండవచ్చు. ఇది విని అర్జునుడు తను కూడా జ్ఞానిగా భావించి, కర్మసన్న్యాసం చేయవచ్చు. జ్ఞానాన్ని కొలిచే పరికరం ఏదీలేదు. వయస్సు కాని, గడ్డం కాని, వేషధారణ కాని నిరూపించలేదు. జ్ఞానమే దానికి కొలత. ఆ జ్ఞానం ఎదుటివారికి తెలియదు కాబట్టి, ఫలానా వ్యక్తిని జ్ఞాని అని గుర్తించలేము. అది ఎవరికి వారే గ్రహించుకోవాలి.

నాకు జ్ఞానం వచ్చింది, నేను కర్మలు చేయను అని అర్జునుడు అంటాడేమోనని కృష్ణపరమాత్మ జ్ఞాని కూడా కర్మలు చేయాలని చెబుతాడు. ఎందుకు?

**లోకసంగ్రహమేవాపి సంపశ్యన్ కర్తుమర్హసి** – లోక సంగ్రహంకోసం. జ్ఞాని సమాజంలో ఉన్నాడు. తనకోసం కాకపోయినా, లోకంకోసం కర్మ చేయాలి. లోకానికి మేలు చేయటంకోసం చేయాలి. ఈ అంశాన్ని కృష్ణపరమాత్మ ప్రవేశపెడుతున్నాడు. ఇది మన సాంప్రదాయంలో ఉన్న ఒక ప్రాథమిక సూత్రాన్ని ఆధారం చేసుకుని చెప్పినది.

మన సాంప్రదాయంలో ధార్మికజీవనవిధానం గురించి తెలుసుకోవటానికి మూడు మార్గాలు ఉన్నాయి. ధార్మికజీవనం తెలియకపోతే ఇష్టం వచ్చినట్టు ప్రవర్తిస్తారు. వారు రాగద్వేషాలకు అనుగుణంగా ప్రవర్తిస్తారు. ఇంకో విధంగా చెప్పాలంటే మంచి, చెడు విచక్షణ లేని చిన్నపిల్లల లాగా ప్రవర్తిస్తారు. చిన్నపిల్లలు ఎవరైనా

వారిని ఎత్తుకోగానే వారి బట్టలు తడిపేస్తారు. వారికి ఆ తేడా తెలియదు. అలా తనకు తోచినట్టు ప్రవర్తించేవ్యక్తిని **ప్రాకృత పురుషుడు** అంటారు. ధర్మం ఎరిగి ప్రవర్తించే వ్యక్తిని **సంస్కృత పురుషుడు** అంటారు. సంస్కృత పురుషుడుగా ఉండాలంటే, మీకు తోచింది చేయకూడదు, ధర్మమైనది చేయాలి. ధర్మాధర్మాలు ఎలా తెలుస్తాయి? మూడు మార్గాలు ఉన్నాయి.

1. **శ్రుతి** – వేదంలోని పూర్వమీమాంస సూత్రాలు చెబుతాయి.

**అథాఽతో ధర్మజిజ్ఞాసా**

వేదాలు అపౌరుషేయాలు. సాక్షాత్తూ ఆ పరమాత్మనుంచి వచ్చాయి. పురుషబుద్ధినుంచి వచ్చిన జ్ఞానం మారుతూ ఉంటుంది. ఇవాళ మంచి అన్నదాన్ని, రేపు విజ్ఞానశాస్త్రం తప్పుగా నిరూపిస్తుంది.

2. **స్మృతి** – స్మృతి అంటే వేదాలనుంచి వచ్చిన శాస్త్రములు. రామాయణభారతాలు. కొన్ని వందల సంవత్సరాల ముందు ఉన్న ధర్మసూత్రాల్లో కొన్ని ఇప్పుడు పాటించలేము. ఉదాహరణకు శాస్త్రం బాత్‌రూమ్ 50 అడుగుల దూరంలో ఉండాలంటుంది. ఇప్పుడు ఉన్న చిన్న ఇళ్ళలో అది పాటించాలంటే పక్కవారి ఇంటికి వెళ్ళాలి. అందువల్ల శాస్త్రాన్ని క్షుణ్ణంగా అర్థం చేసుకుని, నేటి కాలమాన పరిస్థితులకు అనుగుణంగా చెప్పగలిగేవారు, సమాజశ్రేయస్సు కోరేవారు కావాలి.

**యే తత్ర బ్రహ్మణాః సమ్మర్శినః యుక్తా ఆయుక్తాః**
**అలూక్షా ధర్మకామాస్స్యుః యథా తే తత్ర వర్తేరన్**
**తథా తత్ర వర్తేథాః ఏష ఆదేశః ఏష ఉపదేశః** – తైత్తిరీయమ్

3. **శిష్టాచార్యులు** – ధర్మానికి ప్రతీకలుగా నిలిచినవారు. వారు ధర్మాన్ని పాటిస్తారు కాబట్టి, వారిని ఆదర్శంగా తీసుకోవచ్చు.

ఈ మూడింటిలోనూ మూడవ మార్గం ఎక్కువ శక్తివంతమైనది. ఎందుకంటే తక్కిన రెండూ అక్షరరూపంలో చూస్తే, మూడవదాన్ని అక్షరాలా చూస్తాము. అందువల్ల కృష్ణపరమాత్మ శిష్టాచార్యులను శ్రేష్ఠాచార్యులు అంటున్నాడు. ఈ శ్రేష్ఠాచార్యులు ఎవరు? తల్లి, తండ్రి, గురువు. ఊహ తెలియని వయస్సులో తల్లిదండ్రుల ప్రభావం ఉంటుంది. తరువాత గురుకులవాసం వెళ్ళినప్పుడు గురువును దగ్గరగా గమనించటంవల్ల గురువు ప్రభావం ఉంటుంది.

స్వామీజీ ఒకప్పుడు అందరికీ క్యాసెట్లు పంచేవారు. ఒకరెవరో ఆ క్యాసెట్టు పోగొట్టుకుని ఆ విషయం చెప్పటానికి భయంభయంగా వచ్చారుట. స్వామీజీ 45 నిముషాలు తిడతారనుకుంటే, ఆయన చిరునవ్వు నవ్వి ఏం ఫర్వాలేదన్నారుట. స్వామీజీ కోపం తెచ్చుకోకూడదని సంవత్సరాల తరబడి చెప్పే మాటలకు ప్రతీకగా నిలబడేసరికి, ఆ శిష్యుడు ఆ సన్నివేశాన్ని మర్చిపోలేకపోయాడు. గంటల తరబడీ ఇచ్చే సలహాకన్నా ఒక్కక్షణం చేసే పని ప్రభావం చాలా ఉంటుంది. అది ఒక పాఠంగా మనస్సులో నిలిచిపోతుంది.

**యథా మాతృమాన్ పితృమాన్ ఆచార్యవాన్ బ్రవేతి తథా షైవలి రాహ** – బృహదారణ్యకోపనిషత్తు

శిష్టాచార్యులు తల్లి, తండ్రి, గురువు. వీరు కాక రాజు కూడా. అర్జునుడు ఒక బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్నాడు. విలువిద్యలో ఆరితేరినవాడు, స్వర్గానికి వెళ్ళివచ్చినవాడు, శక్తిమంతుడు. ప్రజలు అతను ఏం చేస్తే అది ఆచరించటానికి సిద్ధంగా ఉంటారు.

దురదృష్టవశాత్తు ప్రజలు చెడు పనులు అనుసరించటానికి మొగ్గు చూపుతారు. విశ్వామిత్రుడు, దుర్వాసుడు ఎన్నో మంచి పనులు చేశారు. కాని ప్రజలు వాళ్ళు చేసిన చెడ్డ పనులకు ప్రాముఖ్యతనిస్తారు. దుర్వాసునికి కోపం ఎక్కువ అంటారు. విశ్వామిత్రుడు మేనక వెంట పడ్డాడంటారు. కాని విశ్వామిత్రుడు గాయత్రి మంత్రాన్ని దర్శించాడు. అందువల్ల అర్జునుడు శ్రేష్ఠాచార్యుడుగా ఉండాలి. శ్రేష్ఠాచార్యుని లక్షణాలు ఈ శ్లోకాల్లో చూస్తాము.

శ్లో. 21 **యద్యదాచరతి శ్రేష్ఠః తత్తదేవేతరో జనః ।**
**స యత్ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే ॥**
యత్, యత్, ఆచరతి, శ్రేష్ఠః, తత్, తత్, ఏవ, ఇతరః, జనః,
సః, యత్, ప్రమాణమ్, కురుతే, లోకః, తత్, అనువర్తతే ॥

| | | |
|---|---|---|
| శ్రేష్ఠః | = | శ్రేష్ఠపురుషుడు |
| యత్, యత్ | = | ఏమేమి |
| ఆచరతి | = | ఆచరించునో |
| ఇతరః, జనః | = | ఇతర జనసముదాయము |
| తత్, తత్, ఏవ | = | అటువంటి దానినే |
| (ఆచరతి) | = | ఆచరించును |
| సః | = | అతడు |
| యత్, ప్రమాణమ్ | = | దేనిని ప్రమాణముగా |
| కురుతే | = | చేయునో (స్వీకరించునో) |
| లోకః | = | లోకము |
| తత్, అనువర్తతే | = | దానిననుసరించి ప్రవర్తించును |

**యత్ యత్ శ్రేష్ఠః ఆచరతి తత్ తత్ ఏవ ఇతరః జనః ఆచరతి ।**
**సః యత్ ప్రమాణం కురుతే లోకః తత్ అనువర్తతే ॥**

తా: శ్రేష్ఠుడైన పురుషుని ఆచరణమునే (ప్రవర్తననే) ఇతరులును అనుసరింతురు. అతడు నిల్పిన (ప్రతిష్ఠించిన) ప్రమాణములనే లోకులందరును పాటించెదరు.

ఇవన్నీ నేర్చుకుని, పాటించటానికి ఉపయోగపడే మంత్రాలు.

**శ్రేష్ఠః యత్ యత్ ఆచరతి** – శ్రేష్ఠమైన పురుషుడు ఏది ఆచరిస్తే,

**ఇతరః జనః తత్ ఏవ (ఆచరతి)** – ఇతరులు అదే ఆచరిస్తారు.

తండ్రి పొద్దున్నే లేచి దీపారాధన చేసి పూజ చేస్తే, పుత్రుడు కూడా అదే చేస్తాడు. అదే తండ్రి పొద్దున్నే సిగరెట్టు కాలిస్తే, పుత్రుడు కూడా పెన్నో, పెన్సిలో నోట్లో పెట్టుకుని సిగరెట్టు కాలుస్తున్నట్టు చేస్తాడు.

**సః యత్ ప్రమాణం కురుతే** – శ్రేష్ఠపురుషుడు ప్రమాణంగా ఏం చేస్తే

**లోకస్తదనువర్తతే** – లోకం మొత్తం దాన్ని ఆచరిస్తుంది.

పుస్తకాలలో నేర్చుకున్నదానికన్నా, ప్రత్యక్షంగా చూసినదాని ప్రభావం ఎక్కువగా ఉంటుంది. పుస్తకాలు ఆడియో అయితే, పెద్దల జీవనవిధానం వీడియో. ఒక్కపని, వేలాది పుస్తకాలతో సమానం. **సత్యం వద** అని పిల్లవాడు తండ్రినుంచీ, పుస్తకాలనుంచీ నేర్చుకుంటాడు. కాని తండ్రికి ఒక ఫోను వస్తే, 'నేను లేనని చెప్పు,' అంటాడు కొడుకుతో. అప్పుడు బాబు పరిస్థితి ఎలా ఉంటుందో ఒక్కసారి ఆలోచించండి! సత్యహరిశ్చంద్రుడి కథలు గాలికెగిరిపోతాయి. తండ్రి చెప్పిన అబద్ధమే మిగులుతుంది. ఇలాంటివి పుస్తకాలకే పరిమితం కాబోలు, జీవితంలో **సత్యం వధ** పాటించాలి కాబోలు అనుకుంటాడు.

అలాగే తల్లి కూడా! తల్లి గర్భంలో ఉండగానే తల్లి ఆలోచనలు పుట్టబోయే పాపాయికి తెలుస్తాయిట. తల్లి తనను ఆప్యాయంగా స్వీకరిస్తుందో, ఇప్పటికే చాలామంది పిల్లలు ఉండి, తను భారంగా రాబోతున్నదో తెలుస్తుందిట. పాపాయి రాకకోసం అందరం ఆనందంగా ఎదురు చూస్తున్నామని తెలియజేసే వేడుకలే సీమంతం, బాలసారెలు.

అంతేకాదు, తల్లిదండ్రులు పోట్లాడుకుంటుంటే పాపాయికి వారి భాష అర్థం కాకపోయినా, వాతావరణం వేడెక్కటం తెలుస్తుంది. అందువల్ల మొదటి గురువులు తల్లిదండ్రులు, తరువాత ఆచార్యుడు.

శ్లో. 22 **న మే పార్థాస్తి కర్తవ్యం త్రిషు లోకేషు కించన ।**
**నానవాప్తమవాప్తవ్యం వర్త ఏవ చ కర్మణి ॥**
న, మే, పార్థ, అస్తి, కర్తవ్యమ్, త్రిషు, లోకేషు, కించన,
న, అనవాప్తమ్, అవాప్తవ్యమ్, వర్తే, ఏవ, చ, కర్మణి ॥

| | | | |
|---|---|---|---|
| పార్థ! | = ఓ పార్థా! | చ | = ఇంకా |
| మే | = నాకు | అవాప్తవ్యమ్ | = పొందదగిన వస్తువేదియునూ |
| త్రిషు, లోకేషు | = ముల్లోకములందును | అనవాప్తమ్, న | = పొందబడకుండా లేదు |
| కించన, కర్తవ్యమ్ | = ఎటువంటి కర్తవ్యమూ | కర్మణి, ఏవ | = (అయినను నేను) కర్మయందే |
| న, అస్తి | = లేదు | వర్తే | = ప్రవర్తిల్లుచున్నాను |

**పార్థ! మే త్రిషు లోకేషు కించన కర్తవ్యం న అస్తి ।**
**అనవాప్తమ్ అవాప్తవ్యం చ న (అస్తి) ॥ కర్మణి వర్తే ఏవ ॥**

తా: ఓ అర్జునా! ఈ ముల్లోకములందును నాకు కర్తవ్యము అనునది లేదు. అలాగే పొందదగిన వస్తువులలో ఏదియును నేను పొందనిదియును లేదు. అయినను నేను కర్మలయందే ప్రవర్తిల్లుచున్నాను.

ఇక్కడ కృష్ణపరమాత్మ తననే ఉదాహరణగా చూపుతున్నాడు. తల్లి, తండ్రి, గురువులే కాదు ఇంకా కొంతమంది శ్రేష్ఠులను చూపించాలి. పురాణాల్లో పాత్రలను తీసుకుంటే ఒక్కొక్కరు ఒక్కొక్క మంచి లక్షణానికి ప్రతీకలు.

ఉదాహరణకు హనుమంతుడు పిల్లలందరికీ పెద్ద హీరో. ఒక సూపర్‌మేన్. తేలికగా సముద్రాన్ని దాటేశాడు. రాముడు ఒక కొమ్మ తెమ్మంటే మొత్తం కొండనే తీసుకువచ్చాడు. రాక్షసులను దోమలను చంపినట్టు చంపాడు.

ఇలాంటి సాహసోపేతమైన కథలు పిల్లలు ఇష్టపడతారు. కాని అతని కథ ద్వారా శాస్త్రం కొన్ని ముఖ్యమైన విలువలను కూడా నేర్పిస్తుంది.

ఆంజనేయస్వామి సీతమ్మవారికోసం వెతికే ప్రయత్నంలో రావణుడి అంతఃపురంలోకి కూడా వెళతాడు. అక్కడ ఎందరో అంతఃపుర స్త్రీలను చూస్తాడు. అయ్యో, అంతఃపురంలోకి వెళ్ళానే! పెద్ద తప్పు చేశానే అని ముందు బాధపడతాడు. తర్వాత తను ఏ దురుద్దేశంతోనూ వెళ్ళలేదనీ, సీతమ్మవారిని వెతకటానికే వెళ్ళానని, తనను తాను ఓదార్చుకుంటాడు. నిజమే గదా! ఆవుని వెతకాలంటే ఆవుల మందలోనే వెతకాలి; సీతను వెతకాలంటే స్త్రీల మధ్యలోనే వెతకాలి. నేను నా తల్లిని వెతుకుతున్నానన్నాడు. దీన్నిబట్టి పరస్త్రీలను ఎలా చూడాలో తెలుస్తుంది. పరస్త్రీలను తల్లితో సమానంగా చూడాలి. ఇది ఒక విలువ.

ఇంత వెతికినా సీతాదేవి కనబడక పోయేసరికి, ఆంజనేయస్వామికి తన తప్పు తెలిసివచ్చింది. 'నేను నా గురించి గొప్పగా భావించుకున్నాను, నేను వెతకగలననుకున్నాను, కాని నా స్వామి కరుణ లేనిదే నేను సాధించలేను,' అని తెలుసుకున్నాడు. అప్పుడు కళ్ళు మూసుకుని ప్రార్థించాడు.

**నమోస్తు రామాయ సలక్ష్మణాయ దేవ్యై చ తస్యై జనకాత్మజాయై**

**నమోస్తు రుద్రేంద్రయమానిలేభ్యః నమోస్తు చంద్రార్కమరుద్గణేభ్యః**

దీన్నిబట్టి మానవశక్తి ఒక్కటే చాలదు, దైవకృప కూడా తోడవ్వాలని అర్థమవుతుంది. ఇది ఇంకొక విలువ.

లక్ష్మణుడు మానవాళికి ఇంకొక ఆదర్శ పురుషుడు. అతను సాక్షాత్తూ ఆదిశేషుడు. శక్తిమంతుడు. సుగ్రీవుడు కొన్ని నగలు చూపించి అవి సీతాదేవివేమో చూడమని లక్ష్మణుణ్ణి అడిగితే, లక్ష్మణుడు అన్నాడు –

**నాహం జానామి కేయూరే నాహం జానామి కంకణే**

**నూపురే త్వభి జానామి నిత్యం పాదాభివందనాత్**

నాకు సీతాదేవి కేయూర కంకణాలు తెలియవు, నేను ఎన్నడూ తల పైకెత్తి ఆమె మొహం వైపు చూడలేదు, కాని రోజూ పాదాభివందనాలు చేస్తుండటంవల్ల కాలి అందెలను మాత్రం గుర్తు పట్టగలను అన్నాడు.

ఆ విధంగా పురాణాల్లో ఎందరో ఆదర్శపురుషులు ఉన్నారు. వారు గొప్ప శక్తిమంతులు, పండితులు, భక్తులు. వారు ధనాన్ని, గురువును, పరస్త్రీలను, ఇతరులను ఎంతో గౌరవంగా చూసేవారు. అటువంటి ఆదర్శపురుషులు లేకపోతే నేటి టీ.వీ. హీరోలు, సినిమా హీరోల ప్రభావం ఎక్కువై పోతుంది. నలుగురినీ ప్రభావితం చేసే ఇటువంటివారు ఆదర్శవంతంగా లేకపోతే చెడు ప్రభావం పడుతుంది.

కృష్ణపరమాత్మ తన ఉదాహరణే చెబుతున్నాడు. ఆయన అవతారపురుషుడు. జ్ఞానికన్నా ఎక్కువ. జ్ఞాని ముందు సంసారిగా ఉండి, తరువాత జ్ఞానం పొందుతాడు. కాని అవతారపురుషుడు ముందే జ్ఞాని. తను జ్ఞాని అయినా అర్జునుని రథసారథిగా వచ్చాడు. రథసారథి చేసే పనులన్నీ చేశాడు. స్వధర్మం పాటించాలి కాబట్టి చేస్తాడు. గృహస్థుగా స్వధర్మం పాటించాలి కాబట్టి కుచేలుడు వస్తే, అతిథి దేవోభవ సూత్రాన్ని పాటించాడు. అతనికి పాదపూజ చేశాడు. దుష్టశిక్షణకోసం తన మామ కంసుణ్ణి చంపాడు.

**పార్థ మే త్రిషు లోకేషు కర్తవ్యం న అస్తి** – నాకు మూడు లోకాల్లోనూ సాధించాల్సింది ఏమీ లేదు. కృష్ణపరమాత్మ చిత్తశుద్ధి పొందటానికి కర్మలు చేయనవసరం లేదు. ఎందుకంటే భగవంతునిగా ఆయన **నిత్యశుద్ధుడు**. జ్ఞానిగా నిత్యశుద్ధుడు.

**నానవాప్తమవాప్తవ్యమ్** – నేను సాధించని పురుషార్థం అంటూ ఏదీ లేదు. ధర్మార్థకామమోక్షాలనే నాలుగు పురుషార్థాలు నాలో ఒక భాగం. అందువల్లనే దేవుణ్ణి భగవాన్ అంటారు. భగ అంటే ఆరు రకాల ఐశ్వర్యం; వాన్ అంటే ఉన్నవాడు. ఆరు రకాల ఐశ్వర్యం ఉన్నవాడు భగవాన్.

**ఐశ్వరస్య సమగ్రస్య వీర్యస్య యశసః శ్రియః**
**జ్ఞానవైరాగ్యయోశ్చైవ షణ్ణాం భగ ఇతీరణః**

ఐశ్వర్యం అంటే అధికారం; ఈశ్వరుడు అంటే రాజు; ఐశ్వర్యం అంటే అన్నిటికీ అధికారి; వీర్యం–ధైర్యం; యశః–కీర్తి; శ్రియః–ఐశ్వర్యం; జ్ఞానం, వైరాగ్యం; సమగ్రస్య – ఈ ఆరు సమగ్రంగా ఉన్నాయి. నా దగ్గర కొన్ని రూపాయలు ఉంటే అది 'భగ' అవదు. పనివారిమీద అధికారం ఉంటే అది 'భగ' అవదు. పైన చెప్పిన ఆరు పూర్తిస్థాయిలో ఉండాలి. అందువల్ల భగవంతుడు సాధించాల్సింది ఏమి లేదు. ఇంతవరకూ సాధించనిదీ ఏమీ లేదు. కాని కృష్ణపరమాత్మ ఏమంటున్నాడు?

**వర్త ఏవ చ కర్మణి** – కాని నేను కర్మలు చేస్తూనే ఉన్నాను. నా వర్ణాశ్రమధర్మం ప్రకారం చేస్తున్నాను. వర్ణం–క్షత్రియ వర్ణం, ఆశ్రమం–గృహస్థాశ్రమం. ఈ రెండు ధర్మాలూ నిర్వర్తిస్తూనే ఉన్నాను. నేనే నా ధర్మాన్ని తప్పించుకోలేనప్పుడు, ఓ అర్జునా! నువ్వు జ్ఞానివయినా కూడా నీ ధర్మాన్ని నెరవేర్చక తప్పదు.

శ్లో. 23 **యది హ్యహం న వర్తేయం జాతు కర్మణ్యతంద్రితః ।**
**మమ వర్త్మానువర్తంతే మనుష్యాః పార్థ సర్వశః ॥**
యది, హి, అహమ్, న, వర్తేయమ్, జాతు, కర్మణి, అతంద్రితః,
మమ, వర్త్మ, అనువర్తంతే, మనుష్యాః, పార్థ, సర్వశః ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| హి | = | ఎందుకంటే | న, వర్తేయమ్ | = | ప్రవర్తింపకున్నచో (గొప్ప హాని కలుగును, ఎందుకంటే) |
| పార్థ | = | ఓ పార్థా! | మనుష్యాః | = | మనుజులు |
| యది | = | ఒకవేళ | సర్వశః | = | అన్నివిధములా |
| జాతు | = | ఎప్పుడైనను | మమ | = | నాయొక్క |
| అహమ్ | = | నేను | వర్త్మ | = | మార్గమునే |
| అతంద్రితః | = | సావధానుడనై | అనువర్తంతే | = | అనుసరించెదరు |
| కర్మణి | = | కర్మయందు | | | |

**యది హి అహమ్ అతన్ద్రితః కర్మణి జాతు న వర్తేయమ్ ।**
**(తర్హి) హే పార్థ! మనుష్యాః సర్వశః మమవర్త్మ అనువర్తన్తే ॥**

తా: ఓ పార్థా! ఎప్పుడైనను నేను సావధానుడనై కర్మలందు ప్రవర్తింపకున్నచో లోకమునకు గొప్ప హాని సంభవించును. ఎందుకనగా మనుష్యులందరును అన్ని విధాల నా మార్గమునే అనుసరింతురు.

పెద్దవారు బాధ్యతగా ప్రవర్తించకపోతే దాని పర్యవసానమేమిటో ఇందులో చెబుతున్నాడు కృష్ణపరమాత్మ. సమాజం నాయకులనుకున్నవారిని గుడ్డిగా, గొర్రెలమందలా అనుసరిస్తుంది. సరియైన మార్గదర్శకులు లేకపోతే వారికి నచ్చిన వారిని అనుసరించటంవల్ల అంతా అయోమయంగా ఉంటుంది. దీన్నే సంకరః అని అంటున్నాడు కృష్ణపరమాత్మ.

ఉదాహరణకు రోడ్డుమీద ఎర్రలైటు వెలిగి, అన్ని వాహనాలు ఆగిన సమయంలో ఎవరో దాన్ని పట్టించుకోకుండా ముందుకు దూసుకువెళితే ఏమవుతుంది? అందరూ అతనిలాగా ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తారు. అలా అనేక స్థాయిల్లో నియమ ఉల్లంఘనలు జరిగిపోతుంటాయి.

**యది హి అహం న వర్తేయమ్** – ఒకవేళ నేను నా ధర్మాన్ని సరిగ్గా నిర్వర్తించకపోతే; అది కూడా ఎలా?

**జాతు కర్మణి అతంద్రితః** – కర్మను శ్రద్ధగా చేయకపోతే;

**మమ వర్త్మానువర్తంతే మనుష్యాః** – అందరూ నన్ను అనుసరిస్తారు;

**సర్వశః** – అన్ని విధాలుగా.

మనకి ఒక పనివల్ల ప్రత్యక్షంగా ప్రయోజనం కలగదని తెలిసీ, ఇతరులకోసం ఆ పని చేస్తుంటే మామూలుగా మనం ఏం చేస్తాం? దాన్ని అంత శ్రద్ధగా చేయము. అందువల్ల కృష్ణపరమాత్మ ఆ పనిని శ్రద్ధగా చేయాలని చెబుతున్నాడు. మనం ప్రత్యక్షంగా లాభం పొందకపోయినా, మన కుటుంబసభ్యులకు మార్గదర్శకులం అవుతున్నాము. అదే గొప్ప విషయం.

పైగా, అందరూ కృష్ణపరమాత్మను అనుసరించటానికి చూస్తారు. దొంగలు కూడా కృష్ణపరమాత్మ వెన్న దొంగలించాడని చెబుతారు. కృష్ణపరమాత్మ ఎన్నో మంచి పనులు చేశాడు. కాని మనుష్యులు వారికి కావాల్సినవే తీసుకుంటారు. వర్త్మ అంటే జీవనవిధానం. రామాయణం అంటే రామునియొక్క అయణం, అంటే రాముడు పాటించిన మార్గం.

ప్రజలు ఎంత గుడ్డిగా ఎదుటివారిని అనుసరిస్తారో చూపటానికి ఒక కథను చెబుతారు. ఒకసారి ఒక బ్రాహ్మణుడు రామేశ్వరం వెళ్ళాడు. అతనికొక రాగిచెంబు ఉంది. సముద్రస్నానానికి వెళ్ళేముందు ఆ రాగిచెంబును ఎక్కడన్నా భద్రంగా దాచాలనుకున్నాడు. ఇసుకలో దాన్ని దాచాడు. కాని కొంతదూరం వెళ్ళాక అతనికి అనుమానం వచ్చింది. ఇంత విశాలమైన ప్రాంతంలో ఎక్కడ దాచానో ఎలా తెలుస్తుంది అనుకున్నాడు. అనుకున్న వెంటనే దానిపైన శివలింగంలా ఇసుకతో చేశాడు. ఇంకేదైనా ఆకారమయితే ఎవరి దృష్టినైనా ఆకర్షిస్తుందేమోననే భయంతో శివలింగం చేశాడు. కాని అదే పెద్ద ముప్పు తెచ్చి పెట్టింది.

అతని తరువాత స్నానానికి వచ్చిన వ్యక్తి సముద్రంలో బ్రాహ్మణుణ్ణి, ఇసుకలో శివలింగాన్ని చూశాడు. ఓహో! స్నానం చేసేముందు ఇక్కడ రామేశ్వరంలో ఇలా సైకతలింగం చేయాలి కాబోలు అనుకున్నాడు. వెంటనే అతను కూడా ఇంకో శివలింగం చేశాడు. తర్వాత వచ్చినతను ఏం చేశాడో, వేరే చెప్పాలా? అలా ఆ బ్రాహ్మణుడు స్నానం చేసి బయటకు వచ్చేసరికి వందల కొద్దీ శివలింగాలు ఉద్భవించాయి. అందులో అతని శివలింగం, దానికింద ఉన్న రాగిచెంబు ఏది? తన బాధను వెల్లడిస్తూ ఇలా అన్నాడు ఆ బ్రాహ్మణుడు –

**గతానుగతికో లోకాః న లోకా పరమార్థికాః**
**సేతే సైకత లింగేన నష్టమ్మే తామ్ర భాజనమ్**

జనుల గొర్రెలమంద స్వభావంవల్ల నేను సముద్రపుటుడ్డున చేసిన సైకతలింగం ఏదో తెలియటం లేదు. ఈ గొర్రెలమంద స్వభావం ఒక్కోసారి మరీ వింతగా కూడా ఉంటుంది. ఎవరో చిరిగిన జీన్స్‌ప్యాంట్ వేసుకుంటే అది ఫ్యాషన్. కొత్త జీన్స్‌ప్యాంట్‌ని కొని, తుపాకీలతో దానికి చిల్లులు పొడిచి మరీ అమ్ముతారు. పైగా వాటికి ఖరీదెక్కువ కూడా. అలాగే మిగిలిపోయిన ఆహారంతో ఎవరో ఏదో కొత్త వంటకం చేస్తే, మనుష్యులు పనిగట్టుకుని ఆహారాన్ని మిగిల్చి, ఆ వంటకం చేయటం నేర్చుకుంటారు. అందువల్ల పెద్దలు జాగ్రత్తగా ఉండాలి.

శ్లో. 24 **ఉత్సీదేయురిమే లోకా న కుర్యాం కర్మ చేదహమ్ ।**
**సంకరస్య చ కర్తా స్యామ్ ఉపహన్యామిమాః ప్రజాః ॥**
ఉత్సీదేయుః, ఇమే, లోకాః, న, కుర్యామ్, కర్మ, చేత్, అహమ్,
సంకరస్య, చ, కర్తా, స్యామ్, ఉపహన్యామ్, ఇమాః, ప్రజాః ॥

| | | | |
|---|---|---|---|
| చేత్, అహమ్ | = ఒకవేళ నేను | సంకరస్య | = సాంకర్యమునకు |
| కర్మ | = కర్మను | కర్తా | = కర్తను |
| న, కుర్యామ్ | = చేయనిచో | స్యామ్ | = అగుదును |
| ఇమే, లోకాః | = ఈ లోకములు | ఇమాః, ప్రజాః | = ఈ ప్రజలందరినీ |
| ఉత్సీదేయుః | = కష్టనష్టముల పాలగును | ఉపహన్యామ్ | = కష్టముల పాలుచేసిన వాడనగుదును |
| చ | = ఇంకా (నేను) | | |

**అహం కర్మ న కుర్యాం చేత్ ఇమే లోకాః ఉత్సీదేయుః ।**
**సంకరస్య కర్తా స్యామ్ ఇమాః ప్రజాః చ ఉపహన్యామ్ ॥**

తా: నేను కర్మలను ఆచరించుట మానినచో ఈ లోకములన్నియును నశించును. అంతేగాదు, లోకములందు అల్లకల్లోలములు (సాంకర్యములు) చెలరేగును. ప్రజానష్టము వాటిల్లును. అప్పుడు అందులకు నేనే కారకుడనయ్యెదను.

అందువల్ల కృష్ణపరమాత్మ చెబుతున్నాడు, నేను నా స్వధర్మాన్ని పరిత్యజిస్తే, తక్కినవారు కూడా వారి స్వధర్మాన్ని పరిత్యజిస్తారు. స్వధర్మం కూడా పంచమహాయజ్ఞాలలోకి వస్తుంది. దాని పరిణామాలు వెంటనే రావు. ఆఖరికి

ఆరోగ్యవిషయంలో కూడా. ఆరోగ్యాన్ని పట్టించుకోకపోతే, ముందు కొన్ని సూచనలను ఇస్తుంది. అప్పుడూ పట్టించుకోకపోతే దాని ఫలితం దారుణంగా ఉంటుంది.

పర్యావరణ విషయంలో కూడా అంతే. ఒక మనిషి తన ఇంటి ముందు చెట్టును కొట్టివేస్తే, రాత్రికి రాత్రే ఆ ఊరిలోని ప్రజలందరూ చచ్చిపోరు, కాని అన్ని ఇళ్ళు పడగొట్టి వందలకొద్దీ ఫ్లాట్లు కట్టేస్తే మనుష్యులు పెరిగిపోతారు, చెట్లు తగ్గిపోతాయి.

ముంబైలో చెంబూర్ అనే ప్రాంతంలో పొగమంచు ఎప్పుడూ ఉంటుంది. రసాయనాల కాలుష్యంవల్ల ఏర్పడింది ఈ పొగమంచు. దానివల్ల అనేక ఆరోగ్యసమస్యలను ఎదుర్కొంటుంటారు అక్కడి ప్రజలు. దానికి పరిష్కారం లేదు. ఇదే పరిస్థితి దేశమంతా ఉంటే ఎలా ఉంటుందో ఒక్కసారి ఊహించండి! అందువల్ల సృష్టిని నాశనం చేస్తే దాని ఫలితాలు అనుభవించక తప్పదు.

**ఇమే లోకాః ఉత్సీదేయుః** – అందువల్ల అందరూ నాశనమవుతారు, వెంటనే కాకపోయినా తరువాత అయినా.

**కర్మ అహం న కుర్యాం చేత్** – నేను నా ధర్మాన్ని నెరవేర్చకపోతే, నేను ఆదర్శంగా ఉండక పోతే, ఏమవుతుంది?

**సంకరస్య చ కర్తా స్యామ్** – వర్ణాశ్రమధర్మాల విషయాల్లో పూర్తి అయోమయంలో పడిపోతారు.

**ఇమాః ప్రజాః (అహమ్) ఉపహన్యామ్** – ఈ ప్రజలందరినీ నేను కష్టాలపాలు చేసినవాడినవుతాను.

ఈ వర్ణాశ్రమధర్మాల గురించి నాల్గవ అధ్యాయంలో వస్తుంది. అప్పుడు వివరంగా చూద్దాము. కాని ఇప్పుడు ఒక అంశం చూడాలి. ఒక వృత్తిని ఎన్నుకోవాలంటే రెండు పద్ధతుల్లో ఎన్నుకోవచ్చు అంటుంది శాస్త్రం.

1. **గుణాన్నిబట్టి కర్మ** – ఇష్టాన్నిబట్టి వృత్తిని ఎన్నుకోవటం. అలా ఇష్టమైన కర్మ చేస్తే, దాన్ని శ్రద్ధగా చేస్తాము. జీతంకోసం చేస్తే శనివారం ఎప్పుడొస్తుందా అని ఎదురుచూస్తాము. అదే మనకిష్టమైన పని చేస్తే అలసట అనేదే తెలియదు.

2. **జాతినిబట్టి కర్మ** – జాతినిబట్టి వృత్తిని ఎన్నుకోవటం. దానిలో ఒక లాభం ఉంది. పుట్టినప్పటినుంచి తండ్రి చేసే పని చూస్తూ ఉండటంవల్ల అతి తేలికగా నేర్చుకుంటారు. డాక్టరు కొడుకు పెన్నో, పెన్సిలో తీసుకుని ఇంజక్షన్ ఇస్తున్నానంటాడు. సంగీతవిద్వాంసుని కొడుకు చిన్నప్పటినుంచే సంగీతంలో ప్రావీణ్యం సంపాదిస్తాడు. అలా నాలుగు తరాలుగా సంగీతవిద్వాంసులు అయినవారు ఉన్నారు.

కాని ఏది ఎన్నుకున్నా డబ్బుకోసం మాత్రం ఎన్నుకోవద్దంటుంది శాస్త్రం. ఒకప్పుడు ఎక్కడ చూసినా బ్యాంకు ఉద్యోగాలకోసం ఆరాటపడేవారు. ఇప్పుడు ఎక్కడ చూసినా కంప్యూటర్ రాజ్యమేలుతున్నది. బ్రాహ్మణులు తక్కిన వర్ణాల ధర్మాలకు వెళుతున్నారు కాని బ్రాహ్మణధర్మాన్ని పాటించటం లేదు. అంటే వేదాలు నేర్చుకోవటం లేదు. ఆ మాటకొస్తే గాయత్రీమంత్రమే గుర్తుండని పరిస్థితి వస్తున్నది. బ్రాహ్మణుడు నా పుత్రుడు మాత్రం సన్న్యాసి అవకూడదు అంటాడు. సంస్కృతం జోలికే ఎవరూ పోవటం లేదు. కాలేజీల్లో నేర్చుకున్నా, అది నేర్చుకున్నట్టు

అవదు. ఎందుకు? వారు 98 మార్కులు వస్తాయని నేర్చుకుంటారు అంతేకాని భాషమీద మక్కువతో కాదు. పైగా సంస్కృతం పరీక్ష ఇంగ్లీషులో రాయవచ్చు. అందువల్ల తేలికగా రాసేస్తారు.

అందువల్ల స్వధర్మం గుణంమీద కాని, జాతిమీద కాని ఆధారపడి నెరవేర్చాలి కాని, డబ్బుమీద ఆధారపడి చేయకూడదు. అర్జునా! నీకిష్టం ఉన్నా లేకపోయినా, నీ క్షత్రియధర్మాన్ని నెరవేర్చు. నీ గుణం కూడా క్షత్రియగుణమే. అందువల్ల నీ ధర్మాన్ని పాటించు.

శ్లో. 25 **సక్తాః కర్మణ్యవిద్వాంసో యథా కుర్వంతి భారత ।**
**కుర్యాద్విద్వాంస్తథాసక్తః చికీర్షుర్లోకసంగ్రహమ్ ॥**
సక్తాః, కర్మణి, అవిద్వాంసః, యథా, కుర్వంతి, భారత,
కుర్యాత్, విద్వాన్, తథా, అసక్తః, చికీర్షుః, లోకసంగ్రహమ్ ॥

| | | | |
|---|---|---|---|
| భారత! | = ఓ అర్జునా! | విద్వాన్ | = విద్వాంసుడు కూడ |
| కర్మణి, సక్తాః | = కర్మయందు ఆసక్తులైన | లోకసంగ్రహమ్ | = లోకహితమును |
| అవిద్వాంసః | = అజ్ఞానులు | చికీర్షుః | = చేయగోరువాడై |
| యథా | = ఏ విధముగా | తథా | = ఆ విధముగానే |
| కుర్వంతి | = (కర్మలను) ఆచరింతురో | కుర్యాత్ | = (కర్మలను) ఆచరింపవలెను |
| అసక్తః | = ఆసక్తిరహితుడైన | | |

**భారత! యథా అవిద్వాంసః కర్మణి సక్తాః కుర్వన్తి ।**
**తథా లోకసంగ్రహం చికీర్షుః విద్వాన్ అసక్తః (సన్ కర్మ) కుర్యాత్ ॥**

తా: ఓ అర్జునా! అజ్ఞానులు కర్మలయందు ఆసక్తులై వాటిని ఆచరించినట్లుగా విద్వాంసుడు (జ్ఞాని) కూడా లోకహితార్థమై ఆసక్తిరహితుడై కర్మలను ఆచరింపవలెను.

అజ్ఞాని కర్మ చేయాలి, జ్ఞాని కూడా కర్మ చేయాలి అంటున్నాడు కృష్ణపరమాత్మ. కాకపోతే వారి లక్ష్యాల్లో వ్యత్యాసం ఉంటుంది. అజ్ఞాని చిత్తశుద్ధి, జ్ఞానం, మోక్షం దశలవారీగా పొందటానికి కర్మ చేస్తాడు. జ్ఞానికి ఈ మూడూ ఉన్నాయి. అతను సమాజానికి ఆదర్శప్రాయంగా నిలవటానికి కర్మ చేస్తాడు.

ఇద్దరూ కర్మ చేస్తారు కాని వారి దృక్పథాల్లో వ్యత్యాసం ఉంటుంది. జ్ఞాని అంటే ఎవరో ముందు అర్థం చేసుకోవాలి. జ్ఞానం అంటే రెండు, రెండు కూడితే నాలుగు అని నేర్చుకునే లౌకికజ్ఞానం కాదు. ఆ విధంగా అందరం జ్ఞానులమే. శాస్త్రం ప్రకారం జ్ఞానం అంటే, నా స్వరూపం పూర్ణత్వం, నా స్వరూపం భద్రత, నా స్వరూపం ఆనందం అని అర్థం చేసుకోవటం. నేను కోరే శాంతి, భద్రత, ఆనందాలు నా స్వస్వరూపం. అహం పూర్ణః అస్మి, అహం అమృతః అస్మి. నేను బాహ్యంగా ఆనందంకోసం పరుగులు తీయనవసరం లేదు.

అజ్ఞానికి ఈ విషయం తెలియదు కాబట్టి బాహ్యవస్తువుల వెంట పరుగులు తీస్తాడు. తను అసంపూర్ణుడనుకుని, పూర్ణత్వంకోసం ప్రాకులాడతాడు. ఆనందంకోసం అలమటిస్తాడు. దేనితోనో బంధం పెంచుకుంటాడు. దేనిమీదో

ఆధారపడతాడు. అందువల్ల వీరిద్దరి దృక్పథాల్లో చాలా వ్యత్యాసం ఉంటుంది. అజ్ఞాని ఆనందంకోసం కర్మ చేస్తాడు; జ్ఞాని ఆనందంతో కర్మ చేస్తాడు.

**ఆనందంకోసం కర్మ చేస్తే నేను మహాసంసారిని**
**ఆనందంతో కర్మ చేస్తే నేను ముక్తుణ్ణి**

ఆనందంకోసం కర్మ చేస్తే, ఆ కర్మ కష్టం అవుతుంది. అదే కర్మ ఆనందంతో చేస్తే అది లీల అవుతుంది. చాలామంది ఆనందంకోసం చేస్తారు కాబట్టి జీవితం ఎలా ఉంది అంటే, 'ఆ! ఏదో సాగుతోంది,' అంటారు. అన్ని భాషల్లో ఇంచుమించు ఇలాగే ఉంటుంది. చల్తాహై అంటారు హిందీలో.

కృష్ణపరమాత్మ జ్ఞాని గురించి మాట్లాడేటప్పుడు, ఇక్కడ గృహస్థ జ్ఞాని గురించి మాట్లాడుతున్నాడని మర్చిపోకూడదు. గృహస్థ జ్ఞాని ధర్మపరమైన ఆ కర్మలను మానకూడదు. చాలామంది స్వామీజీని అడుగుతుంటారు, 'మేము భగవద్గీత శిష్యులం కదా, మేము సంధ్యావందనం చేయటం, శ్రాద్ధకర్మలు చేయటం మానేయవచ్చా?' దానికి సూత్రం ఇది: కర్మను తగ్గించుకుని, కొంతభాగం చేయాలి. అంటే రోజుకి మూడు, నాలుగు గంటలు పూజ చేసే అలవాటు ఉంటే, దాన్ని కొన్ని గంటలు తగ్గించి, వేదాంతం నేర్చుకోవటంలో గడపవచ్చు అంతే కాని ఆ తగ్గించిన సమయాన్ని టి.వి. చూడటంలో గడపకూడదు. గృహస్థుగా ఉంటే తన ధర్మాన్ని పూర్తిగా త్యజించకూడదు.

అజ్ఞాని బంధం పెంచుకుని కర్మ చేస్తే, జ్ఞాని బంధం పెంచుకోకుండా కర్మ చేస్తాడు. ముందే చెప్పినట్టుగా ఒకరు ఆనందంకోసం కర్మ చేస్తే, ఇంకొకరు ఆనందంతో కర్మ చేస్తారు. **ఆత్మన్యేవాత్మనా తుష్టః**

జ్ఞాని ఎప్పుడూ ఆనందంలో ఉంటాడు. జ్ఞానికి బంధం లేదు, అజ్ఞానికి ఉంది. ఇది ముఖ్య భేదం. దీన్నే సాంకేతికంగా తరువాత వచ్చే శ్లోకాల్లో వివరిస్తున్నాడు కృష్ణపరమాత్మ.

శ్లో. 26 **న బుద్ధిభేదం జనయేదజ్ఞానాం కర్మసంగినామ్ ।**
**జోషయేత్ సర్వకర్మాణి విద్వాన్ యుక్తః సమాచరన్ ॥**
న, బుద్ధిభేదమ్, జనయేత్, అజ్ఞానామ్, కర్మసంగినామ్,
జోషయేత్, సర్వకర్మాణి, విద్వాన్, యుక్తః, సమాచరన్ ॥

యుక్తః = పరమాత్మస్వరూపమందు నిశ్చలముగా ఉండునట్టి
విద్వాన్ = జ్ఞాని
కర్మసంగినామ్ = శాస్త్రోక్త కర్మలందు ఆసక్తులైన
అజ్ఞానామ్ = అజ్ఞానులకు
బుద్ధిభేదమ్ = బుద్ధియందు భ్రమను (కర్మలందు అశ్రద్ధను)
న, జనయేత్ = కల్గింపరాదు
సర్వకర్మాణి = (స్వయముగా) విధ్యుక్త కర్మలను అన్నింటిని
సమాచరన్ = చక్కగా ఆచరించుచు
జోషయేత్ = ఆచరింపజేయవలెను

**విద్వాన్ కర్మసంగినామ్ అజ్ఞానాం బుద్ధిభేదం న జనయేత్ ।**
**(కిన్తు) యుక్తః సమాచరన్ సర్వకర్మాణి జోషయేత్ ॥**

తా: పరమాత్మస్వరూపమందు నిశ్చలస్థితిని పొందిన జ్ఞాని శాస్త్రవిహితకర్మలను ఆసక్తితో ఆచరించు అజ్ఞానుల బుద్ధులను భ్రమకు లోనుచేయరాదు. అనగా కర్మలయందు వారికి అశ్రద్ధను కలిగింపరాదు. పైగా తాను కూడా శాస్త్రవిహితములైన సమస్త కర్మలను చక్కగా చేయుచు వారితో గూడ అలాగే చేయింపవలెను.

ఇక్కడ జ్ఞానికి ఒక ముఖ్యమైన సలహా ఇస్తున్నాడు కృష్ణపరమాత్మ. నిజానికి జ్ఞానికి ఈ సలహా అవసరం లేకపోయినా, కృష్ణపరమాత్మ ఒక విషయాన్ని స్పష్టం చేస్తున్నాడు. శంకరాచార్యులవారు తరచు ఈ శ్లోకాన్ని ఉటంకిస్తుంటారు.

మనం శాస్త్రాధ్యయనం చేస్తే, అందులో ఒక ప్రత్యేకత కనబడుతుంది. ఆ ప్రత్యేకత ఏమిటంటే పరస్పర విరుద్ధమైన భావాలు చెబుతున్నట్టుగా ఉంటుంది. జాగ్రత్తగా చూడండి. చెబుతుంది అనటం లేదు. **చెబుతున్నట్టుగా ఉంటుంది** అంటున్నాము. అంటే నిజానికి విరుద్ధంగా లేదు. ఎందుకలా ఉందంటే మనశాస్త్రం ఏదో ఒక స్థాయి వారికి చెప్పదు. అన్ని రకాల సాధకులకు చెబుతుంది.

డాక్టరు కూడా అంతే కదా! రోగికి తగ్గట్టుగా సలహా ఇస్తాడు. చిక్కిపోతున్న రోగిని బాగా తినమంటాడు. లావెక్కుతున్న రోగిని ఆహారం తగ్గించమంటాడు. దీన్ని సాంకేతికపరంగా చెప్పాలంటే **అధికారి భేదం** అంటారు. ఒకరి ఆహారం ఇంకొకరికి విషం అంటారు గదా! అలాగే ఒకరికి సరిపోయిన పద్ధతి ఇంకొకరికి సరిపోదు. అందువల్ల శాస్త్రం ఒకచోట కొన్ని విషయాలను స్తుతిస్తే, ఇంకోచోట వాటిని తీవ్రంగా విమర్శిస్తుంది. ఉదాహరణకు వేదపూర్వభాగంలో కర్మకాండను బాగా స్తుతిస్తుంది.

**తదేతత్ సత్యమ్ మన్త్రేషు కర్మాణి కవయో యాన్యపశ్యంస్తాని త్రేతాయాం బహుధా సన్తతాని।**
**తాన్యాచరథ నియతం సత్యకామాః ఏష వః పన్థాః సుకృతస్య లోకే॥** – ముండకమ్ 1.2.1

కర్మ చేయమని గట్టిగా చెబుతుంది. అదే ఉపనిషత్తులో అదే అధ్యాయంలో కొన్ని మంత్రాల తరువాత దాన్ని తీవ్రంగా విమర్శిస్తుంది.

**ప్లవాహ్యేతే అదృఢా యజ్ఞరూపాః అష్టాదశోక్తమవరం యేషు కర్మ ।**
**ఏతచ్ఛ్రేయో యేఽభినన్దన్తి మూఢాః జరామృత్యుం తే పునరేవాపి యన్తి ॥**

కర్మలు చేసేవారిని మూఢులు అంది. అలాగే నిత్యకర్మలు చేయమని ఒకచోట చెబుతుంది.

**అగ్నిహోత్రం చ స్వాధ్యాయప్రవచనే చ అతిథయశ్చ స్వాధ్యాయప్రవచనే చ**
**మానుషం చ స్వాధ్యాయప్రవచనే చ ప్రజా చ స్వాధ్యాయప్రవచనే చ**
**ప్రజనశ్చ స్వాధ్యాయప్రవచనే చ ప్రజాతిశ్చ స్వాధ్యాయప్రవచనే చ** – తైత్తిరీయమ్

ఇంకోచోట కర్మవల్ల అమృతత్వం పొందలేవు అంటుంది.

**న కర్మణా న ప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వమానశుః**
**పరేణ నాకం నిహితం గుహాయాం విభ్రాజతే యద్యతయో విశంతి ॥** – కైవల్యమ్ 3

ఒకచోట గృహస్థాశ్రమాన్ని కీర్తిస్తూ, ఇంకోచోట భార్యా పిల్లలవల్ల మోక్షం రాదు అంటుంది. అందువల్ల ఇటువంటి పరస్పరవిరుద్ధమైన వాక్యాలను చూస్తే వేదాలను అందుకున్న ఋషులే సందిగ్ధంలో పడ్డారు అనుకునే ప్రమాదం ఉంది.

ఇలా పరస్పరవిరుద్ధంగా కనిపించే విషయాలను ఎలా పరిష్కరించాలి? దీనికి ఒకటే మార్గం ఉంది. ఒకచోట అది వరంగా ఉంటే, అదే వస్తువు ఇంకోచోట ఆటంకం అవుతుంది. ఉదాహరణకు తల్లిగర్భంలోని శిశువు విషయమే తీసుకోండి. మొదటి తొమ్మిది నెలలు ఆ శిశువు తల్లి గర్భంలోనే పెరగగలదు. అక్కడ కావాల్సిన రక్షణ ఉంటుంది శిశువుకు. అందువల్లనే, ఒకవేళ శిశువు తొమ్మిది నెలలలోపే పుడితే, ఇంక్యుబేటర్‌లో పెడతారు. అంటే తల్లిగర్భంలో ఉండే రక్షణను ఏర్పాటు చేస్తారు.

కాని తల్లిగర్భంలోనే బాగుంది, అంతా తల్లి చూసుకుంటుంది అని శిశువు అక్కడే ఉండిపోదు గదా! శిశువూ ఉండలేదు, తల్లీ భరించలేదు. త్యాగేనైకే – దేన్ని త్యాగం చేయాలి? తల్లి గర్భాన్ని! ప్రకృతే ఏర్పాటు చేసింది, సమయమాసన్నమవగానే శిశువు బయటకు రావటానికి! ఇప్పుడు తల్లిగర్భం ఆటంకమా, వరమా అని అడిగితే మీ జవాబు ఏమిటి? తొమ్మిది నెలలూ వరం, ఆ తరువాత దాని ఎదుగుదలకు ఆటంకం.

ఇదే సూత్రం జీవితంలో అన్నింటికీ వర్తిస్తుంది. ప్రాథమిక దశలో ఎదుగుదలకు అవసరమైనది, తరువాత అవసరం ఉండదు. అరటిపండు విషయం తీసుకోండి! అది పండుగా అవటానికి దాని తొక్క అవసరం. అది పక్వమవనప్పుడు, ఆ తొక్కను తీయలేము. కాని అదే పండయ్యాక, ఆ తొక్కని తీసేసి తింటాము. ఇది పండవటానికి తొక్క ఉపయోగపడిందని తొక్కతోపాటు తినము కదా! తొక్క కూడా తేలికగా వస్తుంది.

**త్ర్యంబకం యజామహే సుగంధిం పుష్టివర్ధనమ్ ।**
**ఉర్వారుకమివ బంధనాత్ మృత్యోర్ముక్షీయ మాఽమృతాత్ ॥** – మృత్యుంజయ మంత్రమ్

ఓ దేవా! నేను ఒక ఆశ్రమంలో అడుగుపెట్టాను. నేను అక్కడ నేర్చుకుని, ఎదిగి, దాన్నుంచి బయటకు వచ్చేలాగా చేయి. బ్రహ్మచర్య ఆశ్రమంలో అడుగుపెట్టి, విద్య నేర్చుకుని, దాన్నుంచి బయటకు వచ్చి, గృహస్థాశ్రమంలో అడుగుపెట్టాలి. అలాగే వానప్రస్థ, సన్న్యాసాశ్రమాలు కూడా. దీని ఉద్దేశ్యం – జీవితంలో ప్రతిదానికీ విలువ కొంతవరకే ఉంటుంది.

కర్మ కూడా, ఆధ్యాత్మిక సాధకునికి తల్లిగర్భంలాగే ఉంటుందంటాడు కృష్ణపరమాత్మ. శారీరకంగా ఎదిగినా కూడా, ఆధ్యాత్మికంగా పసిపాపాయిలమే! అందువల్ల కర్మ అనే గర్భంలో అడుగుపెట్టండి, ఎన్నో కర్మలు చేయండి, సమాజానికి సేవ చేయండి, పంచమహాయజ్ఞాలు చేయండి, అంతర్గతంగా ఎదగండి అంటున్నది శాస్త్రం. అది కర్మ గొప్పదనం. కాని ఆ కర్మను ఎన్నాళ్ళు చేయాలి? శాశ్వతంగా కర్మతో బంధం పెంచుకోకూడదు–

**కృతిమహోదధౌ పతనకారణం ఫలమశాశ్వతం గతి నిరోధకమ్**

కర్మలు చేస్తుంటే అది ఒక ఊబి. అందులో అంతకంతకూ కూరుకుపోతారు. అదెలా ఉంటుందంటే, పులితోక పట్టుకున్నట్టుంటుంది. మీరు పులితోకను పట్టుకున్నారనుకోండి, అది మిమ్మల్ని పట్టుకోవటానికి గుండ్రంగా తిరుగుతూ ఉంటుంది. దాన్ని తప్పించుకోవటానికి మీరు కూడా గుండ్రంగా తిరుగుతూనే ఉంటారు. మీరు అలసిపోవాలే గాని అది అలసిపోదు. మీరు ఆ తోకను వదిలితే కాని పరుగు ఆపలేరు.

కర్మ కూడా పులితోక వంటిదే. అందువల్ల కొంతసేపు దాన్ని పట్టుకోండి. కాని తరువాత దానిని వదిలేసి వేదాంత శ్రవణ మనన నిదిధ్యాసనలకు ఎలా రావాలో తెలుసుకోండి. కాని ఈ విషయంలో జ్ఞాని బహిరంగసభలో చెప్పేటప్పుడు జాగ్రత్త వహించాలని కృష్ణపరమాత్మ చెబుతున్నాడు. కర్మను వదిలేయమని చెప్పినప్పుడు, విన్నవారిలో పరిపక్వత ఉంటే, ఇది అద్భుతమైన సలహా. ఎందుకంటే అది వదిలేసి శ్రవణ, మనన, నిదిధ్యాసనలకు వస్తాడు. కాని మిథ్యాచారుని విషయం అంతకు ముందు చూశాము కదా!

**కర్మేంద్రియాణి సంయమ్య య ఆస్తే మనసా స్మరన్ ।**
**ఇంద్రియార్థాన్ విమూఢాత్మా మిథ్యాచారః స ఉచ్యతే ॥** – 3.6

పరిపక్వత లేని ఒక వ్యక్తి కర్మను పరిత్యజించాడనుకోండి! ఏమవుతుంది? అతను కుటుంబబాధ్యతలను నెరవేర్చలేడు, ఎందుకంటే, కర్మను పరిత్యజించాడు. కాని వేదాంతానికి వచ్చేటంత బుద్ధి కుశలత లేదు. అటు కర్మా లేదు, ఇటు జ్ఞానానికీ రాలేదు. ఖాళీ సమయం చాలా ఉంది. ఏం చేస్తాడు దానితో? ఆనందాలలో తేలియాడతాడు. అందువల్ల అందరినీ కర్మ మానమని చెప్పవద్దంటాడు కృష్ణపరమాత్మ.

జాగ్రత్తగా వినండి! మీరు ఎవరినైనా వేదాంతం నేర్చుకోమని చెపితే, వారిని వారి పూజలూ, జపాలూ కొనసాగించమని చెప్పాలి.

**న జనయేత్ కర్మసంగినామ్ బుద్ధిభేదమ్** – కర్మసంగి అంటే ఇంకా కర్మమీద, దాని ఫలాలమీద ఆసక్తి ఉన్నవాడు. అటువంటి వారిని సందిగ్ధంలో పడేయవద్దు. వారికి వైరాగ్యం నేర్పించవద్దు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

కృష్ణపరమాత్మ కర్మచేసేవారిని కించపరచటం లేదు. వారు చేస్తున్నది తప్పు కూడా కాదు. బెలూన్‌కోసం ఏడుస్తున్న బాబుతో నీకు 500 రూపాయలిస్తాను, దానితో నువ్వు ఎన్ని బెలూన్లనైనా కొనుక్కోగలవు అంటే అతను ఒప్పుకోడు. బెలూనే కావాలని మారాం చేస్తాడు. ఆ నోటుని పొరపాటున చేతిలో పెడితే, దాన్ని చింపి పోగులు పెడతాడు కూడా! మీకు తీరిక ఉంటే మీరు కూడా బాబుతో కలిసి బెలూన్‌తో ఆడండి, కాని 25వ పుట్టినరోజునాడు కూడా ఆ బాబు బెలూనే కావాలన్నాడంటే మాత్రం అది చింతించాల్సిన సందర్భమే.

అలాగే చాలామంది కూడా ఆధ్యాత్మిక బాబులు. వారికి ధనం, పేరు, ప్రఖ్యాతలు కావాలి. ఆధ్యాత్మిక బాబుల్లాగా ఉండటం పాపమేమీ కాదు. అందువల్ల అలాంటివారిని ప్రోత్సహించమంటున్నాడు కృష్ణపరమాత్మ. ఎవరైనా శిష్యుడు వచ్చి స్వామీజీతో 'స్వామీజీ, నేను గీత నేర్చుకుంటున్నాను, కాని నాకు బాగా ధనం సంపాదించాలని ఉంది, తప్పా?' అని అడిగితే, స్వామీజీ అంటారు గదా, తప్పే అంటే అతను మర్నాటినుంచి గీత క్లాసుకి రాడు. అతనికి పేరు ప్రఖ్యాతులమీద మోజుంటే అతన్ని విమర్శించి ఇంకో న్యూనతా భావాన్ని సృష్టించకూడదు. ఇప్పటికే

మనిషికి బోలెడు న్యూనతా భావాలు ఉంటాయి. దీన్ని **ఆధ్యాత్మ న్యూనతా భావన** అంటారు. అందువల్ల శాస్త్రం, ధనం సంపాదించమనే చెబుతుంది, కాని అది ధర్మబద్ధంగా ఉండాలి.

**ధర్మావిరుద్ధో భూతేషు కామోఽస్మి భరతర్షభ** – 7.11

నేను ధర్మబద్ధమైన కోరికల్లో ఉన్నాను అంటాడు కృష్ణపరమాత్మ.

చాలామంది స్వామీజీతో అంటుంటారు, 'వేదాంతం కాలేజీ విద్యార్థులకు బోధించాలి; మేము డెబ్బయోపడిలో పడ్డాము, మేము నేర్చుకుని పెద్దగా లాభంలేదు. ఎందుకంటే మేము అంతిమ ప్రయాణానికి టికెట్టు కొనుక్కుని సిద్ధంగా ఉన్నాము.' కాలేజీ విద్యార్థులకు బోధించేటప్పుడు అర్థకామాలు పొందటానికి ప్రయత్నించండి, తప్పులేదు కాని వాటిని ధర్మబద్ధంగా సాధించండి అని చెప్పాలి. వాటికి విలువలను జోడించండి, భక్తిని కలపండి, అప్పుడు వీటిని పాటించండి అనాలి. అర్థకామాల వెంట పరుగులు తీసాక వారే ఒకరోజు గ్రహిస్తారు.

**పరీక్ష్య లోకాన్ కర్మచితాన్ బ్రాహ్మణో నిర్వేదమాయాన్నాస్త్యకృతః కృతేన ।**
**తద్విజ్ఞానార్థం స గురుమేవాభిగచ్ఛేత్ సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్ ॥** – ముండకమ్ 1.2.12

**యదా తే మోహకలిలం బుద్ధిర్వ్యతితరిష్యతి ।**
**తదా గంతాసి నిర్వేదం శ్రోతవ్యస్య శ్రుతస్య చ ॥** – 2.52

అందువల్లనే గురువు కావాలి. శాస్త్రాన్ని సరిగ్గా నేర్చుకుంటే అందులో పరస్పరవిరుద్ధమైన భావనలు లేవని తెలుస్తుంది. అందువల్ల కృష్ణపరమాత్మ చెబుతున్నాడు – కర్మను విమర్శించవద్దు, పూజలను ఆక్షేపించవద్దు, ఆలయాలకు వెళితే ఆటంకపరచవద్దు. ధనంమీద మోజు ఉంటే ఖండించవద్దు. కాకపోతే ఒకమాట కలపండి 'నువ్వు కొంత సొమ్మును ఏదైనా ఆశ్రమానికి దానం చేయి.'

**బుద్ధిభేదం న జనయేత్** – వైరాగ్యాన్ని నొక్కి చెప్పి, వారిని అయోమయంలో పడవేయవద్దు. వైరాగ్యం బలవంతపెడితే వచ్చేది కాదు, దానంతట అదే వస్తుంది.

ఇప్పుడు కూడా మీకు బెలూన్‌మీద మోజుందా? లేదు కదా? బెలూన్‌మీద మోజు పోవటానికి మీరేం చేసారు? నాకు బెలూన్‌మీద మోజు పోవాలని ధ్యానం చేశారా? లేదే? మీకు మళ్ళీ ఎవరైనా బెలూన్ చూపిస్తే 'అయ్యో, నాకు బెలూన్ చూపించకండి, నేను దాన్ని వదిలేశాను, చూస్తే మళ్ళీ నాకు మోజు కలుగుతుంది,' అంటారా? లేదే? ఆ బెలూన్‌తో పిల్లలతో కలిసి ఆడవచ్చు కూడా కాని ఇప్పుడు మీకు దానిమీద రాగమూ లేదు, ద్వేషమూ లేదు! దీన్నే పరిణతి అంటారు; అతీతంగా ఎదగటం అంటారు; వైరాగ్యం కలగటం అంటారు. బలవంతంగా వైరాగ్యం తెప్పించటానికీ, సహజపరిణతికీ మధ్య వ్యత్యాసం ఏమిటి? మొదటి సందర్భంలో వ్యక్తి ఆముదం తాగిన మొహం పెడతాడు; చిరునవ్వు చెరిగిపోతుంది; ఏదో కోల్పోయినట్టుగా ఉంటాడు. అందువల్ల పరిణతి చెందాక స్వయంగా వైరాగ్యం పెంచుకోవాలి. అంతవరకూ, వేదాంతంతో పాటు పూజలను కూడా ప్రోత్సహించండి.

**జోషయేత్** – అందువల్ల మీ పూజలు మానవద్దని జ్ఞాని కాని, ఆధ్యాత్మిక గురువు కాని చెప్పాలి. కొంతమంది మేమసలు పూజ చేస్తే కదా, మానే ప్రసక్తి వచ్చేది అంటారు. పూజలు చేస్తూంటే మానకండి; చేసే ప్రసక్తే లేకపోతే కనీసం గాయత్రీ జపం చేయండి. మాకు ఉపనయనం అవలేదు అంటే గాయత్రీ జపం రెండు రకాలుగా చేస్తారు. ఉపనయనం అయినవారు చేసే పద్ధతి, అవనివారు చేసే పద్ధతి. అలా రెండో పద్ధతిలో చేయండి. అందువల్ల పూజ, జపం, పారాయణం మానవద్దు. కనీసం మానసపూజ చేయండి.

**విద్వాన్ (జోషయేత్)** – విద్వాన్ అంటే గృహస్థజ్ఞాని. అతను అజ్ఞానులందరినీ కర్మ చేయమని ప్రోత్సహించాలి. ఎలా ప్రోత్సహించాలి? కేవలం మాటలతో కాదు, చేతలతో చేసి చూపాలి. వంద మాటలకన్నా ఒక చేత చాలు అని సామెత. 'సత్యం వద' అని మీరు వందసార్లు చెప్పి, ఒక్కసారి అబద్ధం చెప్పినా చాలు, ఇన్నిసార్లు చెప్పిన మాట విలువ పోతుంది.

**సమాచరన్ (జోషయేత్)** – గృహస్థజ్ఞాని కేవలం మాటలతో చెప్పటం కాదు, స్వయంగా ఆచరించి చూపాలి. శంకరాచార్యులు పూజ చేయనవసరం లేదు. ఆయన ఒక సన్న్యాసి. కాని శంకరమఠాల్లో పూజలు జరుగుతున్నాయంటే, అవి వచ్చిన సందర్శకులకు ఆదర్శంగా నిలవటంకోసం. సమాచరన్ అంటే అతను ఆచరణ చేసి చూపాలి. అది కూడా ఎలా? చేయాలి కాబట్టి అని, యాంత్రికంగా కాదు.

**యుక్తః** – మనస్ఫూర్తిగా చెయ్యాలి. అంకితభావంతో చెయ్యాలి. శ్రద్ధగా చెయ్యాలి. అలా జ్ఞాని తాను అంకితభావంతో చేస్తూ ఇతరులచేత చేయించాలి.

శ్లో. 27 **ప్రకృతేః క్రియమాణాని గుణైః కర్మాణి సర్వశః ।**
**అహంకారవిమూఢాత్మా కర్తాఽహమితి మన్యతే ॥**
ప్రకృతేః, క్రియమాణాని, గుణైః, కర్మాణి, సర్వశః,
అహంకారవిమూఢాత్మా, కర్తా, అహమ్, ఇతి, మన్యతే ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| కర్మాణి | = | కర్మలన్నియును | అహంకార | = | అంతఃకరణమందు అహంకార |
| సర్వశః | = | అన్ని విధముల | విమూఢాత్మా | | మోహితుడైన అజ్ఞాని |
| ప్రకృతేః, గుణైః | = | ప్రకృతి గుణముల ద్వారా | అహం, కర్తా, ఇతి | = | 'నేనే కర్తను' అని |
| క్రియమాణాని | = | చేయబడుచుండును | మన్యతే | = | తలంచును |

**ప్రకృతేః గుణైః కర్మాణి సర్వశః క్రియమాణాని ।**
**అహంకార విమూఢాత్మా అహం కర్తా ఇతి మన్యతే ॥**

తా: వాస్తవముగా కర్మలన్నియును అన్ని విధముల ప్రకృతి గుణముల ద్వారానే చేయబడుచుండును. అహంకార విమూఢాత్ముడు (అహంకారముచే మోహితమైన అంతఃకరణము గల అజ్ఞాని) 'ఈ కర్మలకు నేనే కర్తను,' అని భావించును.

ఈ రెండు శ్లోకాలు కూడా (27, 28) చాలా ముఖ్యమైనవి. వీటిలో మొత్తం ఉపనిషత్తుల సారం వస్తుంది. ఇవి ఈ మూడవ అధ్యాయంలో ముఖ్యమైన శ్లోకాలే కాదు, మొత్తం గీతలోనే ముఖ్యమైన శ్లోకాలు. వీటిలో జ్ఞాని చేసే కర్మకూ, అజ్ఞాని చేసే కర్మకూ మధ్యనున్న సాంకేతిక భేదాన్ని చూపిస్తున్నాడు కృష్ణపరమాత్మ. ముందు ఈ శ్లోకాల సారాంశాన్ని చూద్దాము.

ప్రతివ్యక్తిలోనూ రెండు 'నేను'లు ఉన్నాయి. వాటిని పెద్ద నేను, చిన్న నేను అంటారు. సంస్కృతంలో చిన్ననేనును అహంకారమనీ, పెద్దనేనును ఆత్మ అనీ అంటారు. ఆత్మని సాక్షి అనీ, చైతన్యస్వరూపం అని కూడా అంటారు. కృష్ణపరమాత్మ తరచు పురుషః అనే పదాన్ని వాడతాడు. పురుషః అనే పదం సాంకేతిక పదం. పురుషః అంటే పురుషుడు కాదు, ఆత్మ.

ఈ ఆత్మ లేదా చైతన్యంకు ఐదు లక్షణాలు ఉన్నాయి.

1. చైతన్యం – శరీరంలో ఒక భాగం కాని, లక్షణం కాని, దాన్నుంచి ఉత్పత్తి అయిన వస్తువు కాని కాదు.
2. చైతన్యం – స్వతంత్రవస్తువు. అది శరీరం అంతటా వ్యాపించి, దాన్ని ప్రకాశింపచేస్తుంది.
3. చైతన్యం – శరీరసరిహద్దులకే పరిమితమవలేదు.
4. చైతన్యం – శరీరం నాశనమయితే నాశనమవదు. శరీరపతనానంతరం కూడా చైతన్యం ఉంటుంది.
5. చైతన్యం – శరీరం లేకపోయినా ఉంటుంది కాని కనబడదు. దాన్ని ప్రతిబింబింపచేసే మాధ్యమం లేదు కాబట్టి అది కనిపించదు. అంతమాత్రాన చైతన్యం లేనట్టు కాదు.

ఈ చైతన్యాన్ని వివరంగా రెండవ అధ్యాయంలో 12 నుంచి 25 శ్లోకాల గురించి చూచినప్పుడు చూశాము. దీనికొక ఉదాహరణ కూడా చూద్దాము. అది కాంతి–పుస్తకం.

1. కాంతి – పుస్తకంలో ఒక భాగం కాని, లక్షణం కాని, దాన్నుంచి ఉత్పత్తి అయిన వస్తువు కాని కాదు.
2. కాంతి – స్వతంత్ర వస్తువు. అది పుస్తకం అంతటా వ్యాపించి, దాన్ని ప్రకాశింపచేస్తుంది.
3. కాంతి – పుస్తకం సరిహద్దులకే పరిమితమవలేదు.
4. కాంతి – పుస్తకం నాశనమయితే నాశనమవదు. పుస్తక పతనానంతరం కూడా కాంతి ఉంటుంది.
5. కాంతి – పుస్తకం లేకపోయినా ఉంటుంది కాని కనబడదు. దాన్ని ప్రతిబింబింపచేసే మాధ్యమం లేదు కాబట్టి అది కనిపించదు. అంతమాత్రాన కాంతి లేనట్టు కాదు.

అందువల్లనే చైతన్యాన్ని జ్యోతి అని కూడా అంటారు. ఈ చైతన్యం నా అసలునేను. ఆధ్యాత్మిక సాధకులు ఈ అసలునేనును తెలుసుకుని, అదే నేనుగా స్వీకరించాలి. ఎందుకంటే, ఎప్పుడైతే నేను చైతన్యాన్ని అని అర్థం చేసుకుంటానో అప్పుడే నేను శాశ్వతం అవుతాను.

**అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతం గమయ** – జ్ఞాని దేశకాలపరిచ్ఛిన్నం లేని బ్రహ్మను తాను అని అర్థం చేసుకుంటాడు.

అహంకారం లేదా చిన్న నేను అంటే ఏమిటి? అది ముఖ్యంగా మనస్సు. అది పరిచ్ఛిన్నమైనది, శరీరంలో ఉన్నది. చైతన్యంవల్ల చేతనం పొందినది. చైతన్యంవల్ల చేతనం పొందింది అని ఎందుకంటున్నామంటే, మనస్సు స్వతహాగా జడం! కాని చైతన్యం పొంది కర్తగా అయి, సుఖదుఃఖాలను అనుభవిస్తున్నది. ఈ అహంకారమే మరణమప్పుడు ఈ శరీరాన్ని వదిలి, ఇంకొక శరీరాన్ని తీసుకుంటుంది. అలా అహంకారం పునరపి జననం, పునరపి మరణం పొందుతూ ఉంటుంది.

మనలో ఈ రెండు నేనులూ ఉన్నప్పుడు నేను దుఃఖభూయిష్ఠమైన అహంకారంగా కొనసాగాలా? నా స్వస్వరూపాన్ని తెలుసుకోవాలా? అది మనచేతిలోనే ఉంది. మనం అనేక హక్కుల గురించి పోరాడుతాము– భర్త హక్కు, పిల్లల హక్కులు వగైరా కాని మనిషిగా మనకొక పెద్ద హక్కు ఉంది – మోక్షం పొందే హక్కు.

ఒక అబ్బాయికి తండ్రి ఆస్తి ఒక కోటి రూపాయలు ఉన్నాయి. అది ఆ అబ్బాయికే వస్తాయి కాని, ఆ ఆస్తి వివరాల కాగితాలు ఎక్కడ ఉన్నాయో తెలియదు. అందువల్ల అతను బీదవాడిగా జీవితం గడుపుతాడు. ఎవరో వచ్చి మీ నాన్నకు కోటి రూపాయలు ఉన్నాయి అని చెపితే, నాకేం డబ్బులు వద్దు, నాకిలా ముష్టి ఎత్తుకోవటమే బాగుంది అన్నాడనుకోండి, అతన్ని చూసి జాలి పడటం తప్ప మనమేం చేయలేము.

నిజానికి మనం ఆ కుర్రవానిలానే ప్రవర్తిస్తున్నాము. కొంచెం ప్రేమకోసం, కొంచెం భద్రతకోసం, కొంచెం శాంతికోసం అందరినీ బ్రతిమాలుతున్నాము. కోట్లకొద్దీ ఆస్తి ఉంది, లంకంత ఇల్లు ఉంది, రెండు మూడు కార్లు ఉన్నాయి అయినా భిక్షాటన చేస్తున్నాము. ఎందుకు? కాసింత ప్రేమకోసం! మా పిల్లలకు మాతో గడిపేందుకు క్షణం తీరిక లేదు అని వాపోతాము. కాని వేదాంతం మనకు కోటి రూపాయల ఆస్తిని ఇస్తున్నది, పత్రాలతో సహా! లౌకిక జీవితంలో కోటి రూపాయల ఆస్తి ఉన్నా, నలుగురు పిల్లలు ఉంటే వారు పంచుకునేసరికి ఒక్కొక్కరికీ పాతిక లక్షలే వస్తాయి. కాని వేదాంతంలో అలా కాదు. అది ఇచ్చే ఆస్తి అనంతం. అనంతాన్ని సగం నీకు, సగం నాకు అనలేము. అనంతంలోంచి అనంతం తీసినా అనంతమే ఉంటుంది.

**పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే ...**

ప్రేమకోసం అలమటించే బదులు, మీరే ప్రేమను పంచండి. మీ చైతన్యస్వరూపాన్ని మీరు అర్థం చేసుకోండి అంటున్నది వేదాంతం. అహంకారం వీడి చైతన్యానికి రండి అంటున్నది.

శాస్త్రం అహంకారం పదాన్ని రెండు భిన్నసందర్భాలలో భిన్న అర్థాలతో వాడుతుంది. ధర్మశాస్త్రం ప్రకారం అహంకారం అంటే గర్వం; వినయానికి భిన్నమైన పదం. కాని వేదాంతంలో అహంకారం అంటే గర్వం కాదు. అహంకారమంటే కార్యకరణసంఘాతం. దీన్నే బాడీమైండ్ కాంప్లెక్స్ అంటారు. ఈ కార్యకరణసంఘాతం జడమైన పంచభూతాలతో చేయబడింది కాబట్టి, అది కూడా జడమే! కార్యకరణసంఘాతానికి ప్రతీక అయిన మనస్సు కూడా జడమే. అది చేతనత్వం చూపుతున్నదంటే, దానికి కారణం అరువు తెచ్చుకున్న చైతన్యం.

ఈ గదిలో రెండు ఫ్యానులున్నాయి. చూడటానికి రెండూ ఒకటిగానే ఉన్నా, ఒకటి తిరుగుతున్నది; ఇంకొకటి తిరగటం లేదు. అంటే దాని అర్థమేమిటి? తిరుగుతున్న ఫ్యాను వెనుక కనబడని అంశమేదో ఉందన్నమాట.

దాన్నే విద్యుచ్ఛక్తి అంటారు. అది అర్థమయితే, మనస్సు విషయం కూడా అర్థమవుతుంది. బల్లను మనం ఏంచేసినా దానికి కోపం రావటం లేదు కాని, మనస్సుకు మాత్రం చటుక్కున కోపం వస్తుంది. ఎందుకు? అది చైతన్యంనుంచి చేతనాన్ని అరువు తెచ్చుకుంది కనుక. దీన్ని **స అభాస** అంటారు. దీన్నే **అహంకారం** అంటారు. దానికి చేతనాన్ని అరువు ఇచ్చే చైతన్యాన్ని **ఆత్మ** అంటారు. ఆత్మ నా స్వరూపం; అహంకారం నా ఆగంతుక స్వరూపం.

ఆత్మ, అహంకారాల మధ్య అనేక భేదాలున్నాయి. అవి – అహంకారం అల్పం, ఆత్మ అనంతం; అహంకారం అనిత్యం, ఆత్మ నిత్యం; అహంకారం సవికారం, ఆత్మ నిర్వికారం; అహంకారం కర్త భోక్త, ఆత్మ అకర్త అభోక్త; అహంకారం సంసారి, ఆత్మ అసంసారి.

మనందరిలోనూ ఈ ఆత్మ, అహంకారాలు రెండూ ఉంటాయి. ఎవరికీ కేవలం అహంకారం మాత్రమే ఉండదు. ఎందుకంటే ఆత్మ లేనిదే అహంకారానికి ఉనికి లేదు. అహంకారాన్ని చిన్ననేను అనీ, ఆత్మను పెద్దనేను అనీ అంటారని చూశాము. ఇప్పుడు శాస్త్రం ఏది మీ స్వభావంగా భావిస్తారో అది మీ ఇష్టం అంటున్నది. కాకపోతే అహంకారానికి ఓటు వేస్తే, (నిజానికి మనం చేస్తున్నది అదే) సంసారానికి సిద్ధంగా ఉండండి అంటున్నది శాస్త్రం. ఎందుకంటే అహంకారానికి ఇంకోవైపు సంసారం ఉంటుంది. ఈ రెండూ ఒక నాణానికి బొమ్మ, బొరుసు లాంటివి. అందువల్ల మీరు అహంకారం వైపు మొగ్గు చూపితే, సంసారం వైపు మొగ్గు చూపినట్టే! అహంకారానికి ప్రారబ్ధకర్మ, సంచితకర్మ, ఆగామికర్మలు ఉంటాయి. ప్రారబ్ధకర్మ క్షయం అయినా, ఆగామి కర్మలు పోగుచేసుకునే అవకాశం ఉంటుంది. ఒకవేళ ఆగామికర్మలు పోగుచేసుకోకపోయినా జన్మజన్మలనుంచీ పోగుచేసుకు వస్తున్న సంచితకర్మ ఉండనే ఉంది. అందువల్ల అహంకారం జీవితంలోని ఒడిదుడుకులను ఎదుర్కోక తప్పదు. అహంకారానికి మోక్షం సాధ్యం కాదు!

దీనికి ఒకటే పరిష్కారం ఉంది. అక్బరు దర్బారులో బీర్బల్‌కు ఒక సమస్య ఇచ్చాడు ఒకసారి. ఒక గీత గీసి, దాన్ని ముట్టుకోకుండా, చెరపకుండా, దాన్ని చిన్నది చేయాలన్నాడు. అతను దాన్ని చాలా తేలిగ్గా పరిష్కరించాడు. పక్కన ఇంకో పెద్దగీత గీశాడు. ఇచ్చిన గీతను ముట్టుకోలేదు కాని, పక్కన పెద్దగీత ఉండటంవల్ల అది చిన్నదిగా కనబడుతుంది. గృహిణులు కూడా ఈ పద్ధతి పాటిస్తుంటారు – ఒక్కోసారి సాంబారులో ఉప్పు ఎక్కువయిందనుకోండి, అందులోని ఉప్పు తీయలేరు, కాని దాని రుచి తగ్గించటానికి కొంచెం నీరు కలుపుతారు. అంటే ఉప్పును ముట్టుకోకుండా ఉప్పును తగ్గించారు.

ఇది వేదాంత పద్ధతి. అహంకారం సంసారంనుంచి తప్పించుకోలేదు. సంసారం ఉంటే చావు పుట్టుకలు, అనారోగ్యాలు, రాగద్వేషాలు అన్నీ వెన్నంటే ఉంటాయి. అవతార పురుషులే వీటిని తప్పించుకోలేరు, ఇంక మానవమాత్రుల విషయం వేరే చెప్పాలా? అందువల్ల దీనికి ఒక్కటే పరిష్కారం ఉంది అన్నాం కదా! ఏమిటది? దాని పక్కన పెద్దగీత గీయటమే! పెద్దగీత గీయటం అంటే మన ఉన్నతనేను గురించి తెలుసుకోవటం. నేను నిత్యశుద్ధ ముక్తస్వభావుణ్ణి; ఆనందస్వరూపుణ్ణి; అనంతుణ్ణి; సర్వవ్యాపకుణ్ణి; నేను అహంకారాన్ని కాను అని అర్థం చేసుకుంటే సమస్యలు అల్పంగా కనిపిస్తాయి.

కొంతమంది దీనగాథలు కథల్లో చదువుతుంటాము. నియంత ఉన్న రాజ్యాల్లో కొంతమంది దారుణంగా బాధలు పడతారు. ఆహారం ఉండదు, డబ్బులు ఉండవు, శరీరం దెబ్బలతో వాచిపోయి ఉంటుంది. అలాంటి దీనస్థితిలో అష్టకష్టాలు పడి పొరుగురాజ్యానికి చేరుకుంటారు. అక్కడికి చేరగానే స్వేచ్ఛను అనుభవిస్తారు. ఆ స్వేచ్ఛ ముందు అంతకుముందు పడ్డ బాధలన్నీ దూదిపింజల్లా ఎగిరిపోతాయి.

అదేవిధంగా ఎప్పుడైతే జ్ఞాని తన ఉన్నతస్థాయి గురించి అర్థం చేసుకుంటాడో, అప్పుడే తను పడ్డ బాధలన్నీ గాలికి ఎగిరిపోతాయి. శారీరక, మానసిక బాధలు ఏవీ బాధించవు. అదే అజ్ఞాని విషయానికి వచ్చేసరికి ఉన్నతస్థాయికి ఎదగడు కాబట్టి ప్రతి ఒక సమస్య భూతద్దంలోంచి కనిపిస్తుంది. ఉప్పు ఎక్కువ ఉన్న సాంబారును నోట్లో పెట్టుకోలేనట్టు సమస్యలు ఎక్కువ ఉన్న సంసారాన్ని భరించలేడు.

ఈ వ్యత్యాసం గురించి వివరించ దలుచుకున్నాడు కృష్ణపరమాత్మ. 27వ శ్లోకంలో అహంకారానికి లొంగిన అజ్ఞాని గురించి చెప్పబోతున్నాడు. అతనికి ఒక బిరుదు కూడా ఇస్తున్నాడు. సంగీతవిద్వాంసునికి సంగీత శిఖామణి అని బిరుదు ఇచ్చినట్టుగా అజ్ఞానశిఖామణికి కృష్ణపరమాత్మ **అహంకార విమూఢాత్మా** అని బిరుదును ఇస్తున్నాడు. 28వ శ్లోకంలో జ్ఞాని గురించి చెబుతున్నాడు. ఈ శ్లోకంలో కొన్ని సాంకేతిక పదాలు ఉన్నాయి. వాటిని మనం స్పష్టంగా అర్థం చేసుకోవాలి.

**ప్రకృతిః** – ప్రకృతి పదానికి అనేక అర్థాలున్నాయి. ఇక్కడ అర్థం **మాయ**. అంటే ప్రాథమిక వస్తువు.

**గుణః** – ఇక్కడ గుణః అంటే కార్యం, వికారం. ప్రకృతిః అంటే వస్తువు, గుణః అంటే కార్యం. అందువల్ల ప్రకృతేః గుణైః అంటే వస్తువునుంచి వచ్చిన కార్యం. సృష్టిలో ఉన్న ఏ జడపదార్థమైనా కూడా వస్తువునుంచి వచ్చిన కార్యమే. గడియారం ప్రకృతిగుణం; పుస్తకం ప్రకృతిగుణం.

ఇక్కడ కృష్ణపరమాత్మ దృష్టిలో ప్రకృతిగుణం అంటే గడియారమో, పుస్తకమో కాదు. కార్యకరణసంఘాతం. అది జడం. అది పంచభూతాలనుంచి ఏర్పడిందనీ, సూక్ష్మపంచభూతాలు మాయ (ప్రకృతి)నుంచి ఏర్పడ్డాయనీ తత్త్వబోధలో చూశాము. అందువల్ల శరీరం, మనస్సు జడమైనా, మనస్సుకు చైతన్యాన్ని ప్రతిబింబించే లక్షణం ఉండటంవల్ల, ఇవి చేతనత్వం పొందాయి. అందువల్ల ఇంకో విధంగా చెప్పాలంటే అహంకారాన్ని ప్రతిబింబ చైతన్యం అనీ, ఆత్మను బింబచైతన్యం అనీ అంటారు. విద్యుచ్ఛక్తివల్ల ఫ్యాను తిరిగినట్టుగా అరువు తెచ్చుకున్న చైతన్యంవల్ల శరీరం, మనస్సు చైతన్యవంతం అయ్యాయి. ఈ ప్రకృతి గుణాన్నే అహంకారం అంటారు. అందువల్ల ప్రకృతిగుణం లక్ష్యార్థం అహంకారం, అంటే ప్రతిబింబ చైతన్యంతో కూడిన కార్యకరణ సంఘాతం. ఈ నేపథ్యంతో ఈ శ్లోకాన్ని చూద్దాము.

**కర్మాణి ప్రకృతేః గుణైః క్రియమాణాని** – కర్మలన్నీ ప్రకృతి గుణాలే చేస్తాయి. ప్రకృతి గుణాలు అంటే కార్యకరణ సంఘాతం. కార్యకరణసంఘాతం అంటే అహంకారం. అందువల్ల కర్మలన్నీ అహంకారంవల్లనే జరుగుతాయి.

**సర్వశః** – ఎల్లప్పుడూ, ఎటువంటి పరిస్థితిలోనూ అహంకారమే కర్మలు చేస్తుంది. దీనివల్ల గ్రహించే అర్థమేమిటి? అహంకారం మాత్రమే పని చేస్తుంది అంటే ఆత్మ పని చేయదు. స్వామీజీ ప్రసంగం ఇచ్చే గదిలో కాంతిని

తీసుకుంటే ఈ విషయం అర్థమవుతుంది. ఆ గదిలో జరిగే కార్యకలాపాలన్నీ ఆ గదంతా వ్యాపించిన కాంతి చలువవల్లే జరుగుతున్నాయి. శిష్యులు వస్తున్నారు, కాంతి చూపుతున్నది దాన్ని; శిష్యులు చుట్టుపక్కల చూస్తున్నారు, కాంతి చూపుతున్నది దాన్ని; కొంతమంది పుస్తకం చూస్తున్నారు, కాంతి చూపుతున్నది దాన్ని; కొంతమంది నోట్సు రాసుకుంటున్నారు, కాంతి చూపుతున్నది దాన్ని; ఎవరిదో పెన్ను మొరాయిస్తున్నది, కాంతి చూపుతున్నది దాన్ని. ఆ విధంగా అక్కడ జరుగుతున్న కార్యక్రమాలనన్నిటినీ కాంతి చూపుతున్నది కాని, అది గదిలోకి రాదు, గదిలోంచి వెళ్ళదు, కూర్చోదు, నిల్చోదు, పెన్ను తీసుకోదు, నోట్సు రాయదు. ఒక్క ముక్కలో చెప్పాలంటే ఏ పనీ చేయదు.

కాంతి ఏ పనీ చేయనప్పుడు ఎందుకు అనవసర ఖర్చు అని మీరు లైట్లు ఆర్పేసారనుకోండి, ఏమవుతుంది అప్పుడు? ఏమీ అవదు. అంటే ఏ పనీ అవదు. కాంతి తనంతట తాను పని చేయదు; కాని కాంతి సమక్షంలోనే అన్ని పనులూ అవుతాయి. ఇదే సూత్రం ఆత్మకు కూడా వర్తిస్తుంది. ఆత్మ ఏ పనీ చేయదు; కాని ఆత్మ సమక్షంలోనే అహంకారం అన్ని పనులూ చేస్తుంది.

**అహంకారవిమూఢాత్మా** – అజ్ఞానులందరూ ఈ అహంకారం అనే మోహంలో పడుతున్నారు. కర్తా-భోక్తా అహంకారంలో పడిపోయి, అదే నేను అనుకుంటున్నారు. వారు దాని మోహంలో ఎంతగా పడిపోయారంటే, వారు అసలు ఉన్నత స్వభావం గురించి ఆలోచించే తీరిక లేకుండా ఉన్నారు. ఇదెలా ఉందంటే, బిచ్చమెత్తుకునే వ్యక్తి దగ్గరకెళ్ళి నువ్వెందుకిలా బిచ్చమెత్తుకుంటున్నావు, అక్కడ గుడిసెల్లో నీకొక స్వంత గుడిసె ఉంది, దాని కింద లంకెబిందెలు ఉన్నాయి, వెళ్ళి తవ్వుకో అని ఎవరన్నా చెప్పినా, 'పోవయ్యా! నాకు అక్కడదాకా వెళ్ళి లంకెబిందెలు తవ్వుకునే తీరికలేదు, నేను అడుక్కోవాలి,' అన్నట్టుంది.

మీకు ఆస్తిపత్రాలు సిద్ధంగా ఉన్నాయి. వేదం వచ్చి చెబుతున్నది 'మోక్షం మీ జన్మహక్కు. దాన్ని కోరండి,' అని. తిలక్ 'స్వాతంత్ర్యం నా జన్మహక్కు' అన్నాడు. శాస్త్రం 'ఆధ్యాత్మ స్వాతంత్ర్యం మీ జన్మహక్కు,' అంటున్నది.

**ఉత్తిష్ఠత జాగ్రత ప్రాప్య వరాన్నిబోధత**

కాని స్వాతంత్ర్యంకోసం లేచే తీరిక ఎవరికీ లేదు. అహంకారం వెంట పరుగులు తీయటమే సరిపోతుంది. శిష్యులు రావటానికి అనువుగా స్వామీజీ రకరకాల సమయాల్లో బోధ చేస్తారు. ఒకరోజు పొద్దున్నే చెపితే; ఇంకోరోజు పదకొండు గంటలకు చెబుతారు; మరోచోట ఆదివారం చెబుతారు; ఊహు, అందరూ రాలేరు. పోనీ ఆడియో ఫైల్స్ ఉన్నాయి, కొని, మీకు తీరుబడి ఉన్నప్పుడు వినండి అంటే వారికి తీరుబడే ఉండదు. ఈ ఆడియో ఫైల్స్‌ను ఇంటికి పంపి, తీసుకువెళ్ళే సదుపాయం ఏమయినా ఉందా అంటారు. లేదా మూడు నెలల పాటు అద్దెకు తీసుకోవచ్చా అంటారు. ఏది చెప్పండి, వారికేదో కుంటిసాకు సిద్ధంగా ఉంటుంది. అటువంటి వారికోసం మనం నిశ్శబ్దంగా దేవునికి ప్రార్థన చేయటం తప్ప చేయగలిగిందేమీ లేదు. అహంకారం వారిని కర్మల్లో కూరుకుపోయేలా చేస్తుంది. అటువంటి వ్యక్తిని అహంకారవిమూఢాత్మా అన్నాడు కృష్ణపరమాత్మ. నేను ఈ బాధాతప్తమైన అహంకారాన్నా, లేక దీనికన్నా ఉన్నతుణ్ణా అనే ప్రశ్న వేసుకోనివ్వదు వారిని.

**కస్త్వం కోహం కుత ఆయాతః, కా మే జననీ కో మే తాతః ॥**
**ఇతి పరిభావయ సర్వమసారమ్, విశ్వం త్యక్త్వా స్వప్నవిచారమ్ ॥** – భజగోవిందం

ప్రాథమిక ప్రశ్నలు వేసుకునే తీరిక లేదు. ఒక సినిమాకి వెళ్ళినప్పుడు సినిమా మొదలయ్యే ముందు తెరను చూస్తాము. కాని సినిమా మొదలయ్యాక అందులో ఎంతగా లీనమైపోతామంటే తెర ఉందనే విషయమే మర్చిపోతాము. నిజమైన తెరను పట్టించుకోము, నిజంకాని తారలను చూస్తూ వారి కష్టసుఖాలలో మమేకం చెందుతూ, ఏడుస్తూ, నవ్వుతూ ఉంటాము.

**కర్తా అహమ్ ఇతి మన్యతే** – నేను కర్తను అనుకుంటాడు అజ్ఞాని. అజ్ఞాని అహం కర్తా, అహం భోక్తా అనుకుంటాడు కాని అహం బ్రహ్మ అస్మి అని తెలుసుకోనే తెలుసుకోడు.

**ఆర్ద్రం జ్వలతి జ్యోతిరహమస్మి.... జుహోమి స్వాహా**

అన్నీ అద్భుతమైన మంత్రాలు. కాని ఈ విమూఢుడు తెలుసుకోలేడు. విమూఢుడు అంటే మూఢుల్లో కెల్లా మూఢుడు. శాస్త్రం రెండు పదాలూ వాడుతోంది. వీరి మధ్య భేదం ఇలా ఉంటుంది. ఒక వ్యక్తి గోడలో మేకు కొడుతున్నాడు. ఎంతకీ గోడలోకి దూరకపోతే, మేకు కేసి చూశాడుట. మేకు యొక్క సూదిమొన తనవైపూ, దాని తల గోడవైపూ ఉంది. తన పక్కనున్నవాడితో అన్నాడుట కదా, 'ఒరేయ్, ఇది చూశావా! ఈ మేకును తయారుచేసిన వాడికెంత బుర్రలేదో కదా! మేకు తలనేమో గోడవైపు, సూదిమొన ఇటువైపు తయారుచేశాడు,' అన్నాడు. లేచివచ్చి దాన్ని చూసిన వాడి చెలికాడు, 'అరేయ్, వాడు సరిగ్గానే చేశాడు, నువ్వే సరిగ్గా కొట్టటం లేదు. ఈ మేకును కొట్టాల్సింది ఈ గోడకు కాదు,' అని చెప్పి ఆ మేకును అలాగే పట్టుకొని ఎదురు గోడకు వెళ్ళాడు. మొదటివాడు మూఢుడయితే, వాణ్ణి సరిదిద్దినవాడు విమూఢుడు. కృష్ణపరమాత్మ అజ్ఞానిని నువ్వు మామూలు మూఢుడివి కాదు, విమూఢుడివి అంటున్నాడు. ఇదీ అజ్ఞాని చేసే కర్మ.

జ్ఞాని చేసే కర్మ ఎలా ఉంటుంది?

శ్లో. 28 **తత్త్వవిత్తు మహాబాహో గుణకర్మవిభాగయోః ।**
**గుణా గుణేషు వర్తంత ఇతి మత్వా న సజ్జతే ॥**
తత్త్వవిత్, తు, మహాబాహో, గుణకర్మవిభాగయోః,
గుణాః, గుణేషు, వర్తంతే, ఇతి, మత్వా, న, సజ్జతే ॥

| | | | |
|---|---|---|---|
| తు | = అయితే | గుణాః | = గుణములన్నియు |
| మహాబాహో! | = ఓ అర్జునా! | గుణేషు | = గుణములందే |
| గుణకర్మ | = గుణవిభాగ, కర్మ | వర్తంతే | = ప్రవర్తిల్లును |
| విభాగయోః | విభాగములయొక్క | ఇతి, మత్వా | = అని తలంచి |
| తత్త్వవిత్ | = తత్త్వము తెలిసికొన్న జ్ఞానయోగి | న, సజ్జతే | = ఆసక్తుడు కాడు |

**మహాబాహో! గుణకర్మ విభాగయోః తత్త్వవిత్ తు ।**
**గుణాః గుణేషు వర్తన్తే ఇతి మత్వా న సజ్జతే ॥**

తా: కాని, అర్జునా! గుణవిభాగతత్త్వమును, కర్మవిభాగతత్త్వమును తెలిసికొన్న జ్ఞానయోగి గుణములే గుణములందు ప్రవర్తిల్లుచున్నవని భావించి, వాటియందు ఆసక్తుడు కాడు.

ఇంతవరకూ అజ్ఞాని విషయం చూశాము. అజ్ఞాని అహంకారమే తను అనుకుని, తన ఉన్నతస్థాయిని తెలుసుకోలేకున్నాడు. తనకు తెలియదు, చెబితే వినడు. అంటే వినిపించుకోడు. అదీ అజ్ఞాని పరిస్థితి.

మరి జ్ఞాని మాటేమిటి? జ్ఞానికి కూడా అహంకారం ఉంటుంది. ఈ విషయం స్పష్టంగా అర్థం చేసుకోవాలి. అహంకారమంటే ఏమిటి? కార్యకరణసంఘాతం అన్నాం. కార్యకరణసంఘాతం అంటే ఏమిటి? శరీరం–మనస్సు. జ్ఞానికి శరీరం లేకపోతే బోధ ఎలా చేస్తాడు? అతని ప్రారబ్ధకర్మకు తగ్గ శరీరం అతనికి ఉంటుంది.

జ్ఞానికి మనస్సు ఉంటుందా? ఇదొక పెద్ద అయోమయం. వేదాంతంలో జ్ఞానికి **మనోనాశః** అనే పదం వాడతారు. అందువల్ల ఈ అయోమయం. నిజానికి జ్ఞానికి అద్భుతమైన మనస్సు ఉంటుంది. కృష్ణపరమాత్మే ఇంకోచోట దాన్ని గొప్పగా వర్ణిస్తాడు –

**అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవ చ ।**
**నిర్మమో నిరహంకారః సమదుఃఖసుఖః క్షమీ ॥** – 12.13

జ్ఞానిది జాలిగుండె. జాలి ఎక్కడ ఏర్పడుతుంది? మనస్సులో! మరి మనోనాశః ఎందుకు అన్నారు? అది లక్ష్యార్థం. ఏదైతే ఆరోగ్యంగా ఉందో, దాన్ని మనం బరువుగా భావించము. ఇది కూడ అందమైన సిద్ధాంతం. మనవేళ్ళు బాగుంటే వాటికేసి కూడా చూడము. అదే గోరుచుట్టు వస్తే పదేపదే చూసుకుంటాము. భారంగా అనిపిస్తుంది. బట్టలు అతికినట్టు సరిపోతే వాటి ధ్యాసే ఉండదు; మరీ బిగుతుగా ఉంటే ఇబ్బందిగా పదిసార్లు కదులుతాము. చెప్పుల విషయమూ అంతే; శరీరం విషయమూ అంతే. శరీరం ఆరోగ్యంగా ఉన్నంతసేపూ శరీరం ఉన్నట్టు దృష్టి రాదు. అలాగే జ్ఞాని మనస్సు విషయం కూడ. జ్ఞానికి రాగద్వేషాలు, కామక్రోధాలు ఉండవు కాబట్టి మనస్సు తేలిగ్గా ఉంటుంది. కాబట్టి మనోనాశః అన్నారు.

శాస్త్రాన్ని సరిగ్గా అర్థం చేసుకోనివారికి మనస్సు భారంగా ఉంటుంది, సరిగ్గా అర్థం చేసుకుంటే ఎంతమాత్రమూ భారం కాదు. ఇదంతా ఎందుకు చూస్తున్నామంటే జ్ఞానికి కూడా శరీరం ఉంటుంది, జ్ఞానికి కూడా మనస్సు ఉంటుంది. కాని జ్ఞాని తన ఉన్నతస్థితి గురించి తెలుసుకుంటాడు కాబట్టి అతని అహంకారం అతనికి భారంగా ఉండదు.

శాస్త్రం జ్ఞానిని వేయించిన గింజతో పోలుస్తుంది. దగ్ధ బీజవత్. వేయించిన గింజ నాశనమవదు, ఉంటుంది, తినటానికి ఇంకా రుచిగా ఉంటుంది. కాని ఎంత మాత్రమూ మొలకెత్తదు. అలాగే జ్ఞాని అహంకారం కూడా అన్ని పనులూ చేస్తుంది. అది కూడా తింటుంది, మాట్లాడుతుంది, ప్రయాణాలు చేస్తుంది. కాని సంసారంలోకి మొలకెత్తదు. దీనికి బంధకత్వం ఉండదు. ఈ **అహంకారం అలంకారం** మాత్రమే. దీనికి ప్రతీక ఈశ్వరుడు. భయపెట్టే పామును తన మెడలో భూషణంగా ధరిస్తాడు. అలా అహంకారమనే పాము జ్ఞానికి అలంకారం మాత్రమే. ఇప్పుడు శ్లోకం చూద్దాము.

**మహాబాహో! తత్త్వవిత్తు** – ఓ అర్జునా! జ్ఞానికి సత్యం తెలుసు. తత్త్వం పదాన్ని రెండు రకాలుగా విడదీయవచ్చు. ఇక్కడ దాన్ని ఒక పదంగాను, ఒక సఫిక్స్‌గాను విడదీయాలి. తత్+త్వమ్. అంటే సత్యం. తత్త్వవిత్ అంటే సత్యం తెలిసినవాడు. దేని సత్యం?

**గుణకర్మవిభాగయోః** – ఇక్కడ కూడా సరిగ్గా అర్థం చేసుకోవాలి. గుణ అంటే అంతకు ముందు శ్లోకంలో చూసిన అర్థమే. ప్రకృతిగుణం. ప్రకృతిగుణం అంటే అహంకారం అని చూశాము. అహంకారాన్ని కర్త అని కూడా అంటారు. జ్ఞానికి కర్మలన్నీ కర్త అయిన అహంకారానికి చెందినవేనని స్పష్టంగా తెలుసు. ఆత్మకు ఏ కర్మ అంటదని తెలుసు.

చేయి–కాంతి ఉదాహరణ గుర్తు పెట్టుకోండి. మీరు చేతిని కదిపినప్పుడు, కదలిక చేతిది మాత్రమే; కాంతిది కాదు. కాంతి కదలదు, కదలలేదు. అది సర్వవ్యాపకంగా ఉంది. అదే విషయం ఆత్మ–అనాత్మలకు వర్తిస్తుంది. అహంకారం అనాత్మ. ఆత్మ నిత్యం, సర్వగతం, స్థాణువు, సనాతనం. పునర్జన్మ గురించి మాట్లాడేటప్పుడు అది అహంకారానికి వర్తిస్తుంది. అహంకారం ఒక లోకంనుంచి ఇంకో లోకానికి ప్రయాణిస్తుంది.

జ్ఞానికి, కర్మలు అహంకారానికి చెందినవనీ, ఆత్మ అకర్తా, అభోక్తా అని తెలుసు. అంతేకాదు, అహంకారం పని చేయకుండా ఖాళీగా కూర్చోదనీ తెలుసు. గృహస్థాశ్రమం వదిలేసి, సన్యాసాశ్రమంలోకి వెళ్ళినా పనులు చేస్తూనే ఉంటుంది. కాకపోతే పేర్లు మారతాయి అంతే. ఆహారం ఇప్పుడూ తినక మానదు – కాకపోతే ఇప్పుడు దాన్ని భిక్ష అంటాడు. అందువల్ల జ్ఞాని అహంకారానికి ఇవ్వాల్సిన ప్రాముఖ్యతను ఇస్తాడు కాని దానికి అనవసరమైన ప్రాముఖ్యతను ఇవ్వడు. శారీరక ఆరోగ్యం బాగుండాలన్నా కూడా అహంకారం పని చేయాలి. ఏ భాగాన్ని వాడకపోతే, ఆ భాగం పనిచేయదు. ఇప్పుడు ఆయుష్షు పెరిగింది. దానికి తగ్గ ఆరోగ్యం కూడా ఉండాలి. అందువల్ల మనం శారీరకంగా, మానసికంగా పనులు చేస్తూనే ఉండాలి.

అందువల్ల అహంకారం కర్తగా ఉండితీరాలి. అహంకారం కర్తగా ఉన్నన్నాళ్ళూ భోక్తగా కూడా ఉండక తప్పదు. అందువల్ల అహంకారం స్థాయిలో జీవితం అనేక కర్మల, అనేక కర్మఫలాల సముదాయం. కొన్ని కర్మఫలాలు ఆనందాన్ని కలుగజేస్తే, కొన్ని కర్మఫలాలు దుఃఖాన్ని లేదా బాధను కలుగజేస్తాయి. ఇదంతా అహంకారం తీరుతెన్నులు; దీన్ని తప్పించుకోలేము అని జ్ఞానికి తెలుసు.

**గుణాగుణేషు వర్తంతే** – గుణః అంటే కార్యకరణసంఘాతం అనీ, అంటే అహంకారం అనీ చూశాము. మొదటి గుణ పదం అహంకారానికి చెందినది. ప్రపంచం కూడా కార్యమే. వస్తువునుంచి వ్యష్టి వచ్చాడు, జగత్తు కూడా వచ్చింది.

వ్యష్టిలోనూ, జగత్తులోనూ మూడు గుణాలు ఉన్నాయి. వ్యక్తి జగత్తులో వ్యవహారం నడుపుతూనే ఉంటాడు. వ్యవహారం నడిపినప్పుడు ఆనందమూ కలుగుతుంది, దుఃఖమూ కలుగుతుంది.

జగత్తు ఆనందం కలుగజేయటం లేదు అని జగత్తునుంచి పారిపోలేము. హృషీకేశ్ వెళ్ళినా, ఉత్తరకాశీ వెళ్ళినా, బదరీనాథ్ వెళ్ళినా, మనుష్యులు చాలామందే ఉంటారు. అందువల్ల పారిపోవటానికి ప్రయత్నించి లాభం లేదు; జగత్తులో వ్యవహారం నడపక తప్పదని గ్రహించాలి. జ్ఞాని ఆ విషయాన్ని అర్థం చేసుకుంటాడు.

ఎందుకు జ్ఞాని అహంకారాన్ని, జగత్తుతో వ్యవహారాన్ని నడపనిస్తాడు? ఎందుకంటే ఏ కర్మ ఫలం వచ్చినా అది తననేమీ చేయదు, తను ఉన్నతస్థాయికి చెందినవాడని తనకు తెలుసు కాబట్టి. కలలో కలిగిన బాధలేవీ

ఇలలో ఉన్న మనిషిని ఏమీ చేయలేనట్టే, తెర మీద జరిగే సన్నివేశాలేవీ తెరను ఏమీ చేయలేనట్టే, అహంకారానికి కలిగిన సుఖదుఃఖాలేవీ చైతన్యమైన తనను ఏమీ చేయలేవని తెలుసుకుంటాడు.

**ఇతి మత్వా న సజ్జతే** – ఈ విషయం తెలుసుకుని, జ్ఞాని చలించడు. జ్ఞాని బంధకత్వం లేకుండా ఉండగలడు. తన అహంకారాన్ని సాక్షీభూతంగా చూడగలడు.

లోకంలో ఎవరైనా మరణిస్తే, మనం చలించము. పైగా గీతలోంచి వాక్యాలు చెబుతాము.

**జాతస్య హి ధ్రువో మృత్యుః ।**

అదే మన దగ్గరవారి మరణం సంభవిస్తేనో! మనం బెంబేలెత్తి పోతాము. వేదాంతం జీవనసత్యాలనేమీ మార్చదు. వేదాంతం సాక్షీభూతంగా చూడటం నేర్పిస్తుంది అంతే. దగ్గరవారి మృత్యువును కూడా సాక్షీభూతంగా చూడటం నేర్పిస్తుంది. **జాతస్య హి ధ్రువో మృత్యుః** – ప్రకృతి నియమం అయితే అది మన వారికి కూడా వర్తిస్తుంది. కాని అప్పుడు దేవుడికి జాలి, దయ లేదని దేవుణ్ణి నిందిస్తాము. అంటే సమస్య దేవునిలో కాదు, సమస్య మనలోనే ఉంది. మనకు సాక్షీభూతంగా చూడటం రాదు.

మనకు రెండు రకాల సూత్రాలు ఉన్నాయి. ఒకటి ఎదుటివారికి, ఇంకొకటి మనకు. ఎదుటి వారు సరియైన సమయానికి మరణించాలి; మనవారు మాత్రం ఎప్పటికీ ఉండాలి. దేవుని దర్శనంలో మనవంతు వచ్చేవరకూ ముందువారు జరగటం లేదని తిట్టుకుంటాము. అదే మనవంతు వచ్చేసరికి ఎవరైనా మనను తోస్తే చికాకు పడిపోతాము. దేవుని దగ్గర గంటన్నా ఉండాలి అనుకుంటాము. అంటే మనకొక నియమం, వారికొక నియమమూ! అందువల్ల దేవుని నియమాలను అంగీకరించలేము.

జ్ఞాని అలా కాదు. అతను ప్రకృతి నియమాలననుసరించి జరిగే దేనికీ బాధపడడు. వృద్ధాప్యం వచ్చిందా – చిరునవ్వుతో స్వీకరిస్తాడు; ఆరోగ్యం పాడయిందా – బాధపడడు; బంధం తెగిపోతోందా– కృంగిపోడు. ఇలా ఏదొచ్చినా చిరునవ్వుతో స్వీకరించటాన్ని **జీవన్ముక్తి** అంటారు. అందువల్ల కృష్ణపరమాత్మ చెబుతున్నాడు ఇతి మత్వా – ఈ జ్ఞానంతో, న సజ్జతే – జ్ఞాని చలించడు.

శ్లో. 29 **ప్రకృతేర్గుణసమ్మూఢాః సజ్జంతే గుణకర్మసు ।**
**తానకృత్స్నవిదో మందాన్ కృత్స్నవిన్న విచాలయేత్ ॥**
ప్రకృతేః, గుణసమ్మూఢాః, సజ్జంతే, గుణకర్మసు,
తాన్, అకృత్స్నవిదః, మందాన్, కృత్స్నవిత్, న, విచాలయేత్ ॥

| | | | |
|---|---|---|---|
| ప్రకృతేః | = ప్రకృతియొక్క | అకృత్స్నవిదః | = మిడిమిడి జ్ఞానముగల |
| గుణసమ్మూఢాః | = గుణములచే మోహితులైనవారు | మందాన్ | = మందబుద్ధులను |
| గుణకర్మసు | = గుణములందును, కర్మలందును | కృత్స్నవిత్ | = జ్ఞాని |
| సజ్జంతే | = ఆసక్తులైయుందురు | న, విచాలయేత్ | = భ్రమకు గురిచేయరాదు |
| తాన్ | = అటువంటి | | |

**ప్రకృతేః గుణసమ్మూఢాః గుణకర్మసు సజ్జన్తే ।**
**తాన్ అకృత్స్నవిదః మందాన్ కృత్స్నవిత్ న విచాలయేత్ ॥**

తా: ప్రకృతి గుణములచే పూర్తిగా మోహితులైన మనుష్యులు ఆ గుణములందును, కర్మలందును మిక్కిలి ఆసక్తులగుదురు. అటువంటి మిడిమిడి జ్ఞానముగల మందబుద్ధులైన అజ్ఞానులను పూర్తిగా తెలిసిన జ్ఞాని భ్రమకు గురిచేయరాదు.

కృష్ణపరమాత్మ మళ్ళీ అజ్ఞాని విషయానికి వస్తున్నాడు. 27వ శ్లోకంలో చెప్పిన భావాన్నే మళ్ళీ మొదటి పాదంలో చెబుతున్నాడు.

**ప్రకృతేర్గుణసమ్మూఢాః** – అజ్ఞాని సాక్షిచైతన్యంలా చూడలేడు.

ప్రకృతిగుణ = కార్యకరణసంఘాతం = అహంకారం. ఈ విషయం మర్చిపోకూడదు. సమ్మూఢః అంటే అజ్ఞాని అని చూశాము. అందువల్ల అజ్ఞాని పూర్తిగా మోహంలో పడిపోతాడు. ఇంతకు ముందు చెప్పినట్టు అతనికి రెండు సూత్రాలు ఉంటాయి. తన అహంకారానికి ఒకటి, ఇతరుల అహంకారానికి ఇంకొకటి. దీన్ని మోహం అంటారు. ఈ మోహంవల్ల ఏమవుతుంది?

**గుణకర్మసు సజ్జంతే** – వారు పూర్తిగా అహంకారంలోనూ, అది చేసే కర్మలోనూ మునిగి పోతారు. ఇక్కడ కూడా గుణ అంటే అహంకారం. వారు ఈ కర్మల్లో ఎంత లోతుగా మునిగి పోతారంటే నేను ఈ కర్తా భోక్తా అహంకారాన్నా లేక ఇంతకన్నా ఉన్నతస్థాయి నాకు ఏమన్నా ఉందా అని ప్రశ్నించుకునే తీరిక ఉండదు.

**బాలస్తావత్క్రీడాసక్తః, తరుణస్తావత్తరుణీసక్తః ।**
**వృద్ధస్తావచ్చిన్తాసక్తః పరమే బ్రహ్మణి కోఽపి న సక్తః** – భజగోవిందమ్

బాల్యంలో ఆటలు, యవ్వనంలో స్త్రీలోలత్వం, వృద్ధాప్యంలో చింతలతో జీవితమంతా గడిచిపోతుంది. ఇంక గీత నేర్చుకునే సమయమేది? అహంకారమే వారిమీద రాజ్యమేలుతున్నది.

అటువంటి వారిని జ్ఞాని ఏం చేయాలి? ఎటువంటి వారిని? అజ్ఞానంవల్ల, అహంకారంలో కూరుకుపోయిన వారిని. అటువంటి వారిని కర్మలు వదిలేసి హృషీకేశ్‌కో, ఉత్తరకాశీకో వెళ్ళిపొమ్మని సలహా ఇవ్వకూడదు అంటున్నాడు కృష్ణపరమాత్మ. కర్మలు బంధిస్తాయి. కర్మఫలాలు సంసారంలో పడవేస్తాయి. నిజమే కాని, అహంకారాన్ని పరిపక్వం చేయటానికి ప్రాథమికంగా కర్మలు కావాలి. అందువల్ల ఏ కర్మ అయితే బంధాన్ని కలుగజేస్తుందో అదే కర్మ అహంకారం పండటానికి తోడ్పడుతుంది.

అరటిపండు ఉదాహరణ ముందు కూడా చూశాము. అది పచ్చిగా ఉండగా తోలు వలవలేము. కాని అది పరిపక్వం చెందగానే తేలిగ్గా వలవగలము. ఎందుకు? అప్పుడు తోలుతో పనిలేదు. తోలువల్లనే అది పండయింది కాబట్టి దాన్ని తోలుతో తింటాను అనకూడదు. ఓ దేవా! అన్ని బంధాలూ ఉంచు, కుటుంబం ఒక తోలు. ఒక వ్యక్తి పెళ్ళి కాకముందు పిల్లల పెంపకానికి ఐదు సిద్ధాంతాలను తయారు చేసుకున్నాడుట. కాని నిజంగా పిల్లలు

పుట్టాక ఏ సిద్ధాంతమూ పనిచేయలేదు. ఇప్పుడు ఐదుగురు పిల్లలు, సిద్ధాంతాలు మటుమాయం. గృహస్థాశ్రమం, జీవాత్మ పరిపక్వం చెందటానికి ఒక తోలు. బాహ్యంగా అన్నింటినీ త్యజించలేకపోయినా, అంతర్గతంగా బంధవిముక్తులం కావాలి. అందువల్ల జ్ఞాని సంసారాన్ని త్యజించమని సలహా ఇవ్వకూడదు. సంసారంలో ఉంటూ, కర్మయోగాన్ని పాటించమని చెప్పాలి.

పరిపక్వం చెందినట్టు ఎలా తెలుస్తుంది? సాధనచతుష్టయసంపత్తివల్ల తెలుస్తుంది. అది ఎలా పొందాలో, కృష్ణపరమాత్మ ముందు ముందు చర్చిస్తాడు.

**తాన్ మందాన్ కృత్స్నవిత్ న విచాలయేత్** – జ్ఞాని అజ్ఞానిని అయోమయంలో పడేయకూడదు. కృత్స్నవిత్ అంటే జ్ఞాని. కృత్స్నమ్ అంటే సంపూర్ణజ్ఞానం. సంపూర్ణజ్ఞానం అంటే అహంకారం గురించిన జ్ఞానం, ఆత్మ గురించిన జ్ఞానం – రెండూ పొందినవాడు. మందః అంటే అజ్ఞాని. అతనికి సగం జ్ఞానమే ఉంటుంది. అతనికి అహంకారం గురించి మాత్రమే తెలుసు.

**అకృత్స్నవిదః (మందః)** – కృష్ణపరమాత్మ అజ్ఞానిని మందుడు అంటున్నాడు. అతనికి అహంకారం గురించి మాత్రమే తెలుసు కాబట్టి.

**న జాయతే మ్రియతే వా కదాచిత్ నాయం భూత్వా భవితా వా న భూయః ।**
**అజో నిత్యః శాశ్వతోఽయం పురాణో న హన్యతే హన్యమానే శరీరే ॥** – 2.20

ఈ ఆత్మ గురించి వారికి తెలియదు. అందువల్ల వారు అజ్ఞానులు. న విచాలయేత్ – జ్ఞాని సన్న్యాసం గురించి చెప్పి వారిని ఇబ్బంది పెట్టకూడదు. అందువల్లనే మన సాంప్రదాయంలో సన్న్యాసం గురించి బహిరంగంగా చెప్పరు. పరిపక్వం చెందని వ్యక్తి సన్న్యాసం స్వీకరిస్తే, అటువంటి వ్యక్తి సన్న్యాసానికీ, శాస్త్రానికీ, తనకూ, సమాజానికీ – అందరికీ ప్రమాదమే. అందువల్లనే ఆ వ్యక్తిని పూర్తిగా గమనించాకనే సన్న్యాసం ఇప్పిస్తారు.

ఈ విషయాన్ని దయానందస్వామి అద్భుతంగా చెబుతారు. ఎవరైనా వచ్చి 'స్వామీ! నేను సన్న్యాసం స్వీకరించాలా?' అని అడిగితే 'వద్దు,' అనేస్తారు టక్కున. అతని ప్రశ్నలోనే అతనికి స్వీకరించే ఉద్దేశ్యం లేదని అర్థమవుతుంది. అందువల్ల అజ్ఞానికి సన్న్యాసాన్ని ఎన్నడూ బోధించవద్దు. అతని కర్తవ్యం నెరవేర్చేలాగా చేయండి. అతను పరిపక్వం చెందాక, అతను బంధాలను వదులుకోనవసరం లేదు. బంధాలే అతన్ని వదిలిపోతాయి. బెలూన్‌మీద మక్కువ ఎలా సహజంగా మాయమయిందో, అలాగే బంధాలు కూడా వాటంతట అవే మాయమవుతాయి. పిల్లవాడిగా ఉన్నప్పుడు ఏ వస్తువులకోసం మీరు తపన పడ్డారో, వాటిమీద మోజు సహజంగానే పోతుంది. అది కూడా చాలా సహజంగా, మీకు తెలియకుండానే పోతుంది. నాకు బెలూన్ మమకారం పోయింది అని మీరు గ్రహించరు, వార్తా పత్రికల్లో ప్రకటించరు.

అందువల్ల జ్ఞాని అజ్ఞానిని అయోమయంలో పడేయకూడదు.

శ్లో. 30 **మయి సర్వాణి కర్మాణి సన్న్యస్యాధ్యాత్మచేతసా ।**
**నిరాశీర్నిర్మమో భూత్వా యుధ్యస్వ విగతజ్వరః ॥**
మయి, సర్వాణి, కర్మాణి, సన్న్యస్య, అధ్యాత్మచేతసా,
నిరాశీః, నిర్మమః, భూత్వా, యుధ్యస్వ, విగతజ్వరః ॥

| | | | |
|---|---|---|---|
| అధ్యాత్మచేతసా | = అంతర్యామినైన నాయందు లగ్నమైన మనస్సు ద్వారా | నిరాశీః | = ఆశారహితుడవు |
| | | నిర్మమః | = మమతారహితుడవు |
| సర్వాణి, కర్మాణి | = సమస్త కర్మలను | విగతజ్వరః | = సంతాపరహితుడవు |
| మయి | = నాయందు | భూత్వా | = అయి |
| సన్న్యస్య | = సమర్పించి | యుధ్యస్వ | = యుద్ధమొనర్పుము |

**మయి అధ్యాత్మచేతసా సర్వాణి కర్మాణి సంన్యస్య నిరాశీః ।**
**నిర్మమః విగతజ్వరః భూత్వా యుధ్యస్వ ॥**

తా: అంతర్యామిని, పరమాత్మను అయన నాయందే నీ చిత్తమును ఉంచి, కర్మలనన్నింటినీ నాకే అర్పించి, ఆశా మమతా సంతాపములను వీడి, యుద్ధము చేయుము.

ముందు శ్లోకంతో జ్ఞానికి కృష్ణపరమాత్మ ఇచ్చే సలహా అయిపోయింది. అది 20వ శ్లోకంలోని రెండవపాదంలో మొదలయి 29 వరకూ వచ్చింది. అంతకుముందు అజ్ఞానులకు సలహా ఇచ్చాడు. అజ్ఞానులు కర్మను చిత్తశుద్ధి కోసం చేస్తే, జ్ఞానులు లోకసంగ్రహంకోసం చేయాలి. **చిత్తశుద్ధికోసం అజ్ఞాని చేసే కర్మను కర్మయోగం** అంటారు. జ్ఞాని చేసే కర్మను కర్మయోగం అనరు. కర్మయోగి పదం అజ్ఞానికే వాడతారు. జ్ఞాని చేసే కర్మను జ్ఞాని లీల అని లేదా జ్ఞాని కర్మ అని అంటారు.

**4. కర్మ యోగప్రాముఖ్యత శ్లోకాలు 30-35.** ఇప్పుడు మళ్ళీ కర్మయోగం అంశానికి వస్తున్నాడు కృష్ణపరమాత్మ. మొత్తం కర్మయోగాన్ని ఒక్క శ్లోకంలో కుదించాడు. ఈ కర్మయోగం జ్ఞానికా, అజ్ఞానికా? ఇప్పుడే చూశాము – కర్మయోగం అజ్ఞానికే! అర్జునుడు అజ్ఞాని కిందికే వస్తాడు. అందువల్ల నీ ధర్మాన్ని కర్మయోగంగా ఆచరించు అని చెబుతున్నాడు కృష్ణపరమాత్మ అర్జునునికి.

**కర్మయోగానికి ఆయువుపట్టు శ్లోకం –** కర్మయోగాన్ని 5 సూత్రాలుగా లేదా 5 అంశాల కార్యక్రమంగా నిర్వచిస్తున్నాడు. కర్మయోగం సంక్షిప్తంగా వస్తున్నది కాబట్టి ఇది చాలా ముఖ్యమైన శ్లోకం. ఆ ఐదు ఒక వరుస క్రమంలో వచ్చేటట్టుగా, మనం శ్లోకాన్ని మలుచుకుంటున్నాము.

కర్మయోగానికి 5 సూత్రాలు –1. **వివేకబుద్ధి** 2. **ఈశ్వరార్పణ బుద్ధి** 3. **ప్రసాద బుద్ధి** 4. **అమానిత్వం** 5. **సమత్వం**

1. **వివేకబుద్ధి – అధ్యాత్మచేతసా** – నిత్యానిత్యవస్తువివేకం. దీన్నే **వివేకబుద్ధి** అంటారు శంకరులవారు. కర్మయోగి అవాలంటే జీవితంలో ఏది ముఖ్యమో ముందు అది తెలుసుకోవాలి. దానికి నిత్యానిత్యవస్తువివేకం చేయాలి.

నిత్యవస్తువు మోక్షం; అనిత్యవస్తువు ధర్మార్థకామాలు. మీ జీవితం అర్థవంతంగానూ, ప్రయోజనకరంగానూ, విలువైనదిగానూ ఉండాలంటే మీరు మోక్షానికి ప్రాధాన్యత ఇవ్వాలి.

**యః ఆత్మానం విదిత్వా అస్మాత్ లోకాత్ ప్రైతి సః బ్రాహ్మణః** – బృహదారణ్యకోపనిషత్తు

ఎవరైతే తన జీవితాన్ని ఆత్మజ్ఞానంకోసం వినియోగిస్తారో, ఎవరైతే ఆత్మజ్ఞానం పొందాక మరణిస్తారో, అతన్నే **బ్రాహ్మణుడు** అంటారు. అంతే కాదు, అలా ఆత్మజ్ఞానం పొందకుండా మరణించినవారిని **కృపణుడు** అంటారు. అందువల్ల మోక్షం ముఖ్యసాధనగా ఉండాలి. ధర్మార్థకామాలను వద్దనటం లేదు, అది బాగా గుర్తుపెట్టుకోండి; మనస్సు విశ్రాంతి పొందటానికి సరదాలు ఉండాలి. దాన్ని కామం అంటారు. మంచి గురువును పొందటానికి పుణ్యం ఉండాలి. అందువల్ల ధర్మార్థకామాలను వదులుకోకూడదు. కాని అవే అంతిమలక్ష్యాలు కాదు. అవి అంతిమలక్ష్యమైన మోక్షం పొందటానికి మార్గాలు అని అర్థం చేసుకోవాలి. ధనమే మీ అంతిమలక్ష్యం అనుకుంటే, మీరు ఎన్నటికీ కర్మయోగి అవలేరు. కర్మయోగికి ధనం మార్గం మాత్రమే; లక్ష్యం కాదు.

**ఆహారార్థం కర్మకుర్యాదజస్రమ్**
**స్యాదాహారః ప్రాణసంధారాణార్థం**
**ప్రాణాధార్యాః తత్త్వజిజ్ఞాసనార్థమ్**
**తత్త్వమ్ జ్ఞేయమ్ యేన భూయో న దుఃఖమ్**

**ఆహారార్థం కర్మకుర్యాదజస్రమ్** – ఆహారంకోసం పని చేసి తీరాలి; తిండి తినటం ఎందుకు?

**స్యాదాహారః ప్రాణసంధారాణార్థం** – తిండి తినటం జీవించి ఉండటం కోసం.

**ప్రాణధార్యాః తత్త్వజిజ్ఞాసనార్థమ్** – జీవించి ఉండటం ఆత్మజ్ఞానం పొందటంకోసం. ఆత్మజ్ఞానం పొందటం ఎందుకు?

**తత్త్వమ్ జ్ఞేయమ్ యేన భూయో న దుఃఖమ్** – ఆత్మజ్ఞానం పొందటం దుఃఖం పోగొట్టుకోవటానికి, అంటే మోక్షం పొందటంకోసం.

## మొదటి సూత్రం – వివేక బుద్ధి

2. **ఈశ్వరార్పణ బుద్ధి – మయి సర్వాణి కర్మాణి సన్న్యస్య–** ఇక్కడ సన్న్యాస పదాన్ని జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. మామూలుగా సన్న్యాసం అంటే పరిత్యజించటం. కాని ఇక్కడ అర్పించటం. ఏమిటి అర్పించటం? సర్వాణి కర్మాణి – చేసే కర్మలన్నీ. ఎవరికి? మయి – (భగవంతుడు చెబుతున్నాడు) నాకు. ఈశ్వరార్పణ బుద్ధితో మీరు చేసే కర్మలన్నిటినీ అర్పించండి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**యద్యత్ కర్మకరోమి తత్తదఖిలమ్ శంభో తవారాధనం** – ఓ ఈశ్వరా! నేను ఏంచేసినా అది నీ ఆరాధనే! మన మతంలో భగవానుడు ఎక్కడో లేడు, సృష్టిలోని ప్రతివస్తువులోనూ ఉన్నాడు. అందువల్ల కర్మయోగం చేయాలంటే ఎక్కడికో వెళ్ళనవసరం లేదు. ఏంచేసినా ఈశ్వరార్పణబుద్ధితో చేస్తే చాలు.

ఈశ్వరార్పణబుద్ధితో చేస్తే కలిగే ప్రయోజనమేమిటి?

మనం చేసే ప్రతి పనిని అద్భుతంగా చేయటానికి ప్రయత్నిస్తాము. స్వామీజీకి ఏదైనా పెట్టాలంటే ఎలా శ్రద్ధ పెట్టి చేస్తామో, అలా ఏ పనిచేసినా ప్రేమతో చేస్తాము. పనినే ఆరాధనగా మలుచుకుంటాము. ఎప్పుడైతే ఆధ్యాత్మిక లక్ష్యం మన ప్రాథమిక లక్ష్యమవుతుందో అప్పుడే మనం చిత్తశుద్ధికోసం పాటుపడాలి. చిత్తశుద్ధి పొందటానికి ఒకటే మార్గం – భగవంతునితో అనుసంధానం పొందటమే. అది ఎలా చేయాలి? చేసే ప్రతి పనిని ఆరాధనగా చేయాలి.

## రెండవ సూత్రం – ఈశ్వరార్పణ బుద్ధి

3. **ప్రసాదబుద్ధి– నిరాశీః** – నిరాశీః అంటే ఇక్కడ ఫలితం గురించి బెంగ పెట్టుకోకపోవటం. ఈ విషయాన్ని కూడా సరిగ్గా అర్థం చేసుకోవాలి. కృష్ణపరమాత్మ ఫలితం గురించి ప్రణాళిక వేసుకోవద్దు అనటం లేదు; ఫలితం గురించి బెంగ పెట్టుకోవద్దు అంటున్నాడు అంతే.

ఎక్కడికన్నా వెళ్ళాలంటేనే ప్రణాళిక వేస్తారు. బస్టాండుకు వెళ్ళి 'ఏ బస్సు వెళుతుంది,' అంటే అతను మిమ్మల్ని తిరిగి ప్రశ్నిస్తాడు, 'మీరు ఎక్కడికి వెళ్ళాలి?' అందువల్ల **మీరు చేసే ప్రతి ఒక్క పని కూడా మీరు పొందాలనుకున్న లక్ష్యంమీద ఆధారపడి ఉంటుంది.** అందువల్ల కృష్ణపరమాత్మ ప్రణాళికను ఖండించటం లేదు. బెంగపడటాన్ని ఖండిస్తున్నాడు.

ప్రణాళిక వేరు, బెంగ వేరు. ప్రణాళిక మీరు కావాలని చేసే కర్మ. మీకిష్టమైనప్పుడు మీరు చేయవచ్చు. ఏ కాశీకో వెళ్ళాలనుకుంటే నలుగురితో చర్చించి, నాలుగు రకాల ఆలోచనలు చేసి, చివరికి ఒక ప్రణాళిక వేసుకోవచ్చు. ప్రణాళిక మీరు చేయవచ్చు, చేయకపోవచ్చు, తరువాత మార్చుకోవచ్చు కూడా. కాని బెంగపడటం అలా కాదు. అది మీ చేతిలో లేదు. ఒకవేళ మీరు ప్రయత్నపూర్వకంగా చేయగలిగితే మీకు సలహా ఇవ్వవచ్చు– సరే అయితే రేపు 6–6.30 వరకూ పద్మాసనంలో కూర్చుని ముందు మీ పెద్దకొడుకు గురించి, తరువాత తండ్రి గురించి, ఆ తరువాత రెండవ అమ్మాయి గురించి ఐదేసి నిముషాల పాటు వరుసగా ఆందోళన చెందండి. కాని అది మీ అసంకల్పిత ప్రతిచర్య.

ప్రణాళిక మిమ్మల్ని సమర్థవంతులుగా చేస్తే, ఆందోళన చెందటం మీ సమర్థతను తగ్గించి వేస్తుంది. రెండూ భవిష్యత్తుకు సంబంధించినవే కాని ఒకటి మిమ్మల్ని సమర్థవంతులను చేస్తే, ఇంకోటి మీ సమర్థతను తగ్గించివేస్తుంది. వేదాంతం ప్రణాళిక వేయటాన్ని విమర్శించటం లేదు; వేదాంతం బెంగను విమర్శిస్తున్నది.

**నిరాశీః** అంటే ఆందోళన వదిలేసి కర్తృత్వం చేయమంటున్నది. ప్రణాళిక వేయండి. దాన్ని ఆచరణలో పెట్టండి, తక్కినది భగవంతునికి వదిలివేయండి. ఆందోళన పడకుండా ఎలా ఉండగలము? చెప్పటం తేలికే కాని ఆచరణలో పెట్టటం కష్టం అంటారు కొంతమంది. ధ్యానంలో కూర్చుంటే భగవంతుడు పలుకుతాడో లేదో కాని ఆందోళన ముందు దూసుకు వచ్చేస్తుంది అంటారు. ఆందోళన ఎందుకు వస్తుందంటే భవిష్యత్తును ఎదుర్కొనే ధైర్యం లేక. అందువల్ల దానికి ఒకటే మార్గముంది. భవిష్యత్తును ఎదుర్కొనే సంసిద్ధతను పెంచుకోవాలి. కాశీకి

అన్ని ఏర్పాట్లు చేసుకున్నాను, కాని అనుకోనిది జరిగితేనో అంటారు. మంచి జరగాలని ఆశించండి, చెడు జరిగినా స్వీకరించే సంసిద్ధతను పెంచుకోండి.

ఏ కర్మ చేసినా దానికి ఫలం ఉండితీరుతుంది. ఫలం లేని కర్మ అంటూ ఉండదు. కాకపోతే ఎటువంటి ఫలితం వస్తుందో మనకు తెలియదు. కర్మయోగి ఎటువంటి ఫలం వచ్చినా స్వీకరించే సంసిద్ధతను పెంచుకోవాలి. ఎందుకంటే భగవంతుడు మనకు ఎన్నడూ అన్యాయం చేయడు. మనం అనుకున్నది అనుకున్నట్టుగా జరగకపోతే, పొరపాటు భగవంతునిలో లేదు, నేను వేసుకున్న లెక్కలో ఉంది. మానవ కంప్యూటర్ తప్పు చేస్తుందేమో కాని, భగవంతుని కంప్యూటర్‌లో తప్పులుండవు. అందువల్ల ఏదొచ్చినా చిరునవ్వుతో స్వీకరించగలగాలి. దీన్నే ప్రసాదబుద్ధి అంటారు.

## మూడవ సూత్రం - ప్రసాద బుద్ధి

4. **అమానిత్వం–నిర్మమః–** మమకారం లేకపోవటం. ఏదైనా విజయం సాధించగానే, అంతా నావల్లే జరిగింది. నేను చక్కగా ప్రణాళిక వేశానంటూ గొప్పలు పోతాము. అదే విఫలమయితే ఎవరో ఒకరి మీదకు తోసేస్తాము.

కృష్ణపరమాత్మ విజయం నీ ఒక్కడివల్లనే అనుకోకు అంటున్నాడు. ఏ విజయం తీసుకున్నా దాని వెనక అనేక అంశాలుంటాయి, మీ అధీనంలో లేని అంశాలు కూడా ఉంటాయి. అవి మీకు అనుగుణంగా ఉంటే విజయం సాధిస్తారు, లేకపోతే విఫలమవుతారు. మీకు తెలియని అంశాలతో పోలిస్తే, మీ ప్రమేయం చాలా తక్కువ. అందువల్ల విజయం వస్తే పొంగిపోండి, నేను గెలిచాను అని చెప్పండి కాని గెలిచాను తరువాత ఫుల్‌స్టాప్ పెట్టకుండా కామా పెట్టి, ఈశ్వర అనుగ్రహంవల్ల అని చెప్పండి. మీకు తెలియకుండా ఉన్న అనేక అంశాలను కలిపి ఈశ్వర అనుగ్రహం అనవచ్చు. వినయం చూపండి. గర్వం చూపకండి.

ఒక వేదాంతం క్లాసుకు మీరు వెళ్ళి వినాలంటే అనేక అంశాలు తోడవ్వాలి. మీరు శ్రమ పెట్టి వెళ్ళి వినాలి. కాని దానితో ఆగదు – కరెంటు ఉండాలి, ఆధ్యాత్మిక, అధిభౌతిక, అధిదైవిక ఆటంకాలు అనేకం ఉండవచ్చు. మీ ప్రయత్నం లేదనటం లేదు. పురుషార్థం ఉంది ఖచ్చితంగా. కాని దాని శాతం ఈశ్వర అనుగ్రహంతో పోలిస్తే చాలా తక్కువ. అందువల్ల వినయం, లేదా మమత్వ అభావం చూపాలి. దీన్ని అమానిత్వం అంటాడు కృష్ణపరమాత్మ పదమూడవ అధ్యాయంలో. నేను కష్టపడి పనిచేశాను, అది ఈశ్వరకృపవల్ల అని చెప్పగలగాలి.

## నాలుగవ సూత్రం - అమానిత్వం

5. **సమత్వం – విగత జ్వరః –** ఈ అంశం ముందు చెప్పిన నాలుగు అంశాల సహజ పరిణామమే. మొదటి నాలుగూ పాటిస్తే ఐదవది దానంతట అదే అలవడుతుంది. అయినా అది కూడా ముఖ్యం కాబట్టి, కృష్ణపరమాత్మ దానిని కూడా చెబుతున్నాడు. అది విగతజ్వరం. జ్వరం రెండు రకాలు – ఒకటి స్థూలశరీరజ్వరం లేదా కాయిక జ్వరం; ఇంకొకటి మానసజ్వరం. అది ఒత్తిడి, అలసటవల్ల వస్తుంది. మనం దేని గురించైనా తీవ్రంగా ఆలోచించినప్పుడు మెదడు వేడెక్కిపోయింది అంటాము కదా! విగతజ్వరం అంటే సమత్వం –

**సమత్వం యోగ ఉచ్యతే**

మీరు కర్తా, భోక్తలు కాబట్టి, ఈ రెండింటిలోనూ మీ సమత్వం దెబ్బ తింటుంది. మీకు ఇష్టంలేని ఉద్యోగం చేస్తే, మనస్సు ప్రశాంతంగా ఉండదు. చదివింది ఒకటి, చేయాలనుకున్నది ఒకటి, చేయాల్సి వస్తున్నది ఇంకొకటి. కుటుంబంకోసం ఇష్టం లేకపోయినా ఆ పని చేయాల్సివస్తుంది. కర్తగా అలా ఇష్టంలేని పని చేస్తే, అనేక రోగాలు వస్తాయి. అందువల్ల చేస్తున్న పనిని ఇష్టపడేలా చేసుకోండి. ఆ ఉద్యోగంలోనే ఏదైనా కొత్తగా, ఉత్సాహం కలిగేలా చేయండి. **ధృత్యుత్సాహసమన్వితః** (18వ అధ్యాయం) అన్నాడు కృష్ణపరమాత్మ. ఉత్సాహానికి మారుపేరులా ఉండాలి. అప్పుడు కర్తగా సమత్వం ఏర్పడుతుంది.

రెండవ సమస్య భోక్తగా వస్తుంది. వచ్చిన ఫలం మీకు నచ్చినట్టు ఉండదు. దానికోసం అందరినీ విమర్శిస్తారు. ఆఖరికి ఆ దేవుణ్ణి కూడా దుయ్యబడతారు. అందువల్ల వచ్చినదానిని ప్రసాదబుద్ధితో స్వీకరించాలి. భగవంతుడు అన్యాయం చేయడు, మీకు ఎంత కష్టం కలిగినా, అది న్యాయమే అని అనుకోవాలి. దానిని చిరునవ్వుతో స్వీకరించాలి. ఇలా అంటే కొంతమంది, 'అది న్యాయమే, భగవంతుడు అన్యాయం చేయడని తెలుసు, కాని నేను భరించలేను,' అంటారు. దానికి పరిష్కారంగా ఆ భగవంతుణ్ణే శరణు వేడాలి. 'ఓ దేవా! నువ్వు చేసింది సబబే, కాని దాన్ని స్వీకరించే గుండెధైర్యం నాకు లేదు. దాన్ని నవ్వుతూ స్వీకరించే ధైర్యాన్ని నాకు ఇవ్వు,' అనాలి. దీన్ని విగతజ్వరం అంటారు. అర్జునునికి కర్తగా సమస్య ఉంది. తన ఆత్మీయులను, గురువులను సంహరించాలి –

**గురూనహత్వా హి మహానుభావాన్**
**శ్రేయో భోక్తుం భైక్ష్యమపీహ లోకే** – 2.5

ఒకవేళ యుద్ధంలో జయించినా ఆనందంగా ఉండలేడు. ఎందుకంటే అతని ఆనందం అనేకమంది రక్తం చిందించటంవల్ల వస్తుంది.
**యుధ్యస్వ –** కాని అర్జునునికి వేరే మార్గం లేదు. అతను యుద్ధం చేసితీరాలి; విజయమో, వీరస్వర్గమో పొందితీరాలి. అందువల్ల సమత్వం పాటించి తీరాలి.

## ఐదవ సూత్రం – సమత్వం

ఈ ఐదు సూత్రాలూ టూకీగా – వివేకబుద్ధి, ఈశ్వరార్పణబుద్ధి, ప్రసాదబుద్ధి, అమానిత్వం, సమత్వం. సంవత్సరానికి ఒకటి చొప్పున పాటించినా కూడా పాటించి తీరాల్సిన కర్మయోగం.

శ్లో. 31 **యే మే మతమిదం నిత్యమనుతిష్ఠంతి మానవాః ।**
**శ్రద్ధావంతోఽనసూయంతో ముచ్యంతే తేఽపి కర్మభిః ॥**
యే, మే, మతమ్, ఇదమ్, నిత్యమ్, అనుతిష్ఠంతి, మానవాః,
శ్రద్ధావంతః, అనసూయంతః, ముచ్యంతే, తే, అపి, కర్మభిః ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| యే, మానవాః | = | ఏ మనుష్యులు | అనుతిష్ఠంతి | = | అనుసరింతురో |
| అనసూయంతః | = | దోషదృష్టి లేనివారై | తే, అపి | = | వారు |
| శ్రద్ధావంతః | = | శ్రద్ధగలవారై | కర్మభిః | = | కర్మలనుంచి |
| మే, ఇదమ్, మతమ్ | = | నా, ఈ మతమును | ముచ్యంతే | = | ముక్తులవుతారు |
| నిత్యమ్ | = | సర్వదా | | | |

**యే మానవాః శ్రద్ధావంతః అనసూయంతః ఇదం మే మతం నిత్యమ్ ।**
**అనుతిష్ఠంతి, తే అపి కర్మభిః ముచ్యన్తే ॥**

తా: దోషదృష్టి లేకుండ శ్రద్ధాయుక్తులై నా ఈ మతమును అనుసరించు మానవులు సమస్త కర్మబంధములనుంచి ముక్తులవుతారు.

ఇప్పుడొచ్చే రెండు శ్లోకాల్లోనూ కర్మయోగం పాటిస్తే కలిగే లాభమేమిటి, పాటించకపోతే కలిగే నష్టమేమిటి వివరిస్తున్నాడు కృష్ణపరమాత్మ. ఈ మంత్రంలో లాభం గురించి చెబుతున్నాడు.

**ఇదం మతం మానవాః అనుతిష్ఠంతి** – నా ఈ బోధను ఎవరైతే పాటిస్తారో. ఇదం మతం అంటే నా ఈ బోధను. ఏమిటా బోధ? కర్మయోగం! ఎప్పుడు?

**నిత్యమ్** – ఎల్లప్పుడూ. ఎలా పాటిస్తారు?

**శ్రద్ధావంతః** – ఈ బోధమీద శ్రద్ధతో. ఇది జరిగి తీరుతుంది అనే నమ్మకంతో. కర్మయోగం పాటిస్తే వచ్చే ఫలితాలు కంటికి కనబడేవి కావు. మీ జుట్టు పెరుగుతుంది, మీ బరువు తగ్గుతుందిలాంటి ఫలితాలు చెప్పలేము. అందులోనూ నిష్కామకర్మ చేస్తే కలిగే ఫలం అదృష్టపుణ్యం. అది మీకు మీరే గమనించాలి.

**అనసూయ** – అసూయ లేకుండా. వేదపరిభాషలో అసూయ అంటే మానసికంగా విమర్శ చేయటం. ఎంతసేపూ ఎదుటివారిలో తప్పులు పట్టటం. దయానందస్వామీజీ ప్రూఫ్‌రీడర్స్ మైండ్ ఉండకూడదు అంటారు. ప్రూఫ్‌రీడర్ ఉద్యోగం తప్పులు పట్టటం. దానికోసమే జీతమివ్వబడతాడు అతను. కాని నిజజీవితంలో అదిచేయకూడదు. మీ అబ్బాయి ప్రోగ్రెస్ రిపోర్టు తెచ్చాడు. మ్యాథ్స్‌లో 100%, ఇంగ్లీషులో 98%, సైన్సులో 95%, సోషల్లో 68%. మీరేం చేస్తారు? అద్భుతం, మ్యాథ్స్‌లో నూటికి నూరు వచ్చాయి అనరు. సోషల్లో ఎందుకు తగ్గింది అని తిట్టిపోస్తారు. ఆ పిల్లవాడు మానసికంగా కృంగిపోకపోతే, నిజంగా అతనిమీద దైవకృప ఉన్నట్టు అర్థం. మీ వాదనేమో నేనలా మెచ్చుకుంటూపోతే వాడికి గర్వం వచ్చి, చదవటం మానేస్తాడు అని. కాని తిడితే కృంగిపోయే ప్రమాదముంది. అందువల్ల విమర్శించకూడదు.

శాస్త్రాన్ని ఎన్నడూ తప్పుపట్టకూడదు అంటున్నాడు కృష్ణపరమాత్మ. శాస్త్రాన్ని తప్పుపడితే శాస్త్రమేమీ నష్టపోదు, ఋషులేమీ నష్టపోరు, భగవంతుడు కూడా ఏమీ నష్టపోడు. భగవంతునికేమీ సర్టిఫికెట్లు అవసరం లేదు. అందువల్ల నష్టపోయేది మనమే. అందువల్ల అసూయ ఉండకూడదు.

**పరగుణేషు దోషః ఆవిష్కరణమ్**

ఒకవేళ గీతలో నాకు దోషాలు కనబడితే ఏం చేయాలి? గుడ్డిగా స్వీకరించాలా? నేను బుద్ధిజీవిని, తార్కికంగా ఆలోచిస్తాను అనేవారికి రెండు జవాబులు ఉన్నాయి.

1. **తప్పులొదిలేసి, ఒప్పులు చూడండి** – నిజంగానే తప్పులున్నాయనుకుందాం. అలా ఉంటే, తప్పులు వొదిలేసి, అందులో ఉన్న అందమైన బోధను చూడండి అంటాము. బంగారు గనుల్లో బంగారం దొరికినప్పుడు అది స్వచ్ఛమైన బంగారంగా ఉండదు. అది స్వచ్ఛమైనది కాదని పారేస్తామా? లేదే! టన్నుల కొద్దీ ఖనిజాలను శుద్ధి చేస్తే కొన్ని గ్రాముల బంగారం మిగులుతుంది. అయినా దాన్ని వదులుకోము. ఎందుకంటే బంగారానికి మనమిచ్చే విలువ అంత ఎక్కువ. అలాగే గీతలో కూడా అవసరమైనవి స్వీకరించి, అనవసరమనుకున్నది వదిలేయాలి.

**యాన్యనవద్యాని కర్మాణి। తాని సేవితవ్యాని। నో ఇతరాణి।**
**యాన్యస్మాకగ్ం సుచరితాని। తాని త్వయోపాస్యాని** – తైత్తిరీయం – శీక్షావల్లీ

ఋషులే చెబుతున్నారు – మాలో నచ్చినదేదైనా ఉంటే తీసుకోండని.

2. **తప్పులుంటే మళ్ళీ శ్రద్ధగా చదవండి** – ఒకవేళ మీకు శాస్త్రంలో ఏమైనా తప్పులు కనబడితే, మీరు శాస్త్రాన్ని సరిగ్గా అర్థం చేసుకోనట్టు. శాస్త్రంలో తప్పేం లేదు, మీ శ్రద్ధలోనే లోటుంది. మీ బుద్ధి సరిపోలేదు. అందువల్ల ఈసారి సాంప్రదాయ గురువు సహాయంతో మళ్ళీ చదివితే ఆ శంకలు తీరుతాయి.

అనసూయ అంటే అలా తప్పులెన్నకుండా శ్రద్ధగా శాస్త్రాన్ని అధ్యయనం చేయటం. ఇది చాలా ముఖ్యమైన విలువ. ఈ పదాన్ని కృష్ణపరమాత్మ పదేపదే వాడతాడు. గీతని అధ్యయనం చేయటానికి కావాల్సిన నాలుగు అధికారాల్లో అనసూయ లక్షణం ఒకటి. ఈ అనసూయ లక్షణంతో కర్మయోగాన్ని పాటించిన వారికి ఏమవుతుంది?

**తే కర్మభిః ముచ్యంతే** – వారు కర్మలనుంచి విడివడతారు. అంటే కర్మఫలాలనుంచి కూడా విడివడతారు. అంటే జీవన్ముక్తులవుతారు.

కాని ఒక గమనిక కలపాలి ఇక్కడ – కర్మయోగంవల్ల మోక్షం పొందుతారని వచ్చింది. కాని కర్మయోగం చిత్తశుద్ధిని మాత్రమే కలుగజేస్తుందని, మోక్షాన్ని ఇవ్వదని ముందే చూశాము. అందువల్ల కర్మయోగం మోక్షాన్నిస్తుందంటే మధ్య దశలను మనం కలుపుకోవాలి. కర్మయోగం చిత్తశుద్ధిని కలుగజేస్తుంది. తద్వారా గురుప్రాప్తి, గురువు ద్వారా శాస్త్రాన్ని శ్రవణ మనన నిదిధ్యాసనల ద్వారా నేర్చుకునే అవకాశం కలిగి మోక్షం పొందుతాడు.

శ్లో. 32 **యే త్వేతదభ్యసూయంతో నానుతిష్ఠంతి మే మతమ్ ।**
**సర్వజ్ఞానవిమూఢాంస్తాన్ విద్ధి నష్టానచేతసః ॥**
యే, తు, ఏతత్, అభ్యసూయంతః, న, అనుతిష్ఠంతి, మే, మతమ్,
సర్వజ్ఞానవిమూఢాన్, తాన్, విద్ధి, నష్టాన్, అచేతసః ॥

| | | | |
|---|---|---|---|
| తు | = కాని | తాన్, అచేతసః | = అటువంటి మూర్ఖులను |
| యే | = ఎవరైతే | సర్వజ్ఞాన, విమూఢాన్ | = విపరీత జ్ఞానోపహతులైన వారిగా |
| అభ్యసూయంతః | = దోషారోపణ చేయువారై | నష్టాన్ | = భ్రష్టులైనవారిగా |
| మే, ఏతత్, మతమ్ | = నా, ఈ మతమును (ఉపదేశమును) | విద్ధి | = తెలిసికొనుము |
| న, అనుతిష్ఠంతి | = ఆచరింపరో | | |

**యే తు ఏతత్ అభ్యసూయన్తః మే మతం న అనుతిష్ఠన్తి ।**
**తాన్ సర్వజ్ఞానవిమూఢాన్ అచేతసః నష్టాన్ విద్ధి ॥**

తా: కాని నాయందు దోషారోపణ చేయుచు, నా ఈ ఉపదేశమును అనుసరింపని మూర్ఖులు సమస్త జ్ఞాన విషయములందును మోహితులై (విపరీత జ్ఞానోపహతులై) భ్రష్టులై, కష్టనష్టముల పాలయ్యెదరని తెలుసుకొనుము.

కృష్ణపరమాత్మ బోధను పాటించేవారి గురించి, అంతకుముందు శ్లోకంలో చెప్పి, ఇప్పుడు పాటించనివారి గురించి చెప్తున్నాడు. ఏదైనా మంచి విషయం పాటించటం కష్టం, పాటించక పోవటం తేలిక. మన ఇష్టం వచ్చినట్టు జీవిస్తే దాన్ని ప్రాకృతజీవనం అంటారు. శాస్త్రం విధించిన జీవన విధానంలో జీవిస్తే దాన్ని సంస్కృత జీవనం అంటారు. కర్మయోగం ప్రకారం జీవిస్తే అది సంస్కృతజీవనం. అది ఏటికి ఎదురీతవంటిది.

కొండ కిందకి దిగటం తేలిక. కొండ ఎక్కటం కష్టం.

**యే మే మతమ్ న అనుతిష్ఠంతి** – ఎవరైతే నా ఈ బోధను పాటించరో; ఎందుకు?

**అభ్యసూయంతః** – గీతాబోధలో తప్పులు పట్టటంవల్ల. వారు ఇది ఎప్పుడో ద్వాపరయుగానికి చెందినది, కలియుగానికి కాదు అని అంటారు.

**సర్వజ్ఞానవిమూఢాన్** – అటువంటివారు విమూఢులు. ఏ విషయంలో? సర్వజ్ఞానంలో. జ్ఞానాన్ని రెండుగా విభజిస్తారు – అపరావిద్య, పరావిద్య. ధర్మాధర్మాల గురించి చెప్పే జ్ఞానాన్ని అపరావిద్య అనీ, ఆత్మానాత్మల గురించి చెప్పే జ్ఞానాన్ని పరావిద్య అనీ అంటారు. అపరావిద్యను వేదపూర్వభాగం, పరావిద్యను వేద అంతభాగం బోధిస్తాయి. వీరికి పరావిద్య తెలియదు, అపరావిద్య కూడా తెలియదు.

**అచేతసః** – ఇటువంటి వారు అంటే శాస్త్రాన్ని అర్థం చేసుకోనివారు,

**నష్టాన్ విద్ధి** – ఆధ్యాత్మికంగా నష్టపోతారని తెలుసుకో.

శాస్త్రం కొన్ని విధులని విధించినప్పుడు, దాన్ని మీరు సానుకూలంగా తీసుకోవచ్చు లేదా ప్రతికూలంగా తీసుకోవచ్చు. ఉదాహరణకు మీరు డాక్టరు దగ్గరకు వెళితే ఆయన మీరు రోజూ వ్యాయామం చేయాలి, ఒక గంటసేపు నడవాలి అని చెప్పాడనుకోండి. బొత్తిగా నడకే అలవాటులేని మీకు గంటసేపు నడవటం ప్రయాసతో

కూడినపనే. కాని ఆయన అది ఎందుకు చెప్పాడు? మీ మేలు కోసమా? ఆయన మేలుకోసమా? ఈ చిన్న విషయం అర్థం చేసుకుంటే డాక్టరుని తప్పు పట్టరు. శాస్త్రం విషయంలో కూడా అంతే.

**మాతృపితృసహస్రేభ్యోఽపి హితైషిణా వేదేనోపదిష్టమ్** – శ్రుతి (వేదం) వెయ్యి తల్లులతో సమానం అంటున్నారు శంకరులవారు తన కఠోపనిషత్తు భాష్యంలో. తల్లి, తన పిల్లవానికి హాని చేసేది ఏదీ చెప్పదు; శ్రుతి కూడా అలా తన పిల్లలైన మనష్యులకు ఎన్నడూ హాని చేయదు. ఆ విషయం గ్రహించక, నా స్వాతంత్ర్యం పోతుంది, నా ఇష్టం వచ్చినట్టు ప్రవర్తిస్తాను అని ప్రతికూలంగా మాట్లాడేవారు ఆధ్యాత్మికంగా నష్టపోతారు. ఉన్నదొకటే జీవితం, దాన్ని వ్యర్థపరచుకోకూడదు. మళ్ళీ మనుష్యజన్మ ఎత్తుతామో లేదో తెలియదు. అందువల్ల జీవితాన్ని వృథా పరచుకోకూడదు.

శ్లో. 33 **సదృశం చేష్టతే స్వస్యాః ప్రకృతేః జ్ఞానవానపి ।**
**ప్రకృతిం యాంతి భూతాని నిగ్రహః కిం కరిష్యతి ॥**
సదృశమ్, చేష్టతే, స్వస్యాః, ప్రకృతేః, జ్ఞానవాన్, అపి,
ప్రకృతిమ్, యాంతి, భూతాని, నిగ్రహః, కిమ్, కరిష్యతి?

| | | | |
|---|---|---|---|
| భూతాని | = ప్రాణులన్నియు | సదృశమ్ | = తగినట్లుగా |
| ప్రకృతిమ్, యాంతి | = తమ స్వభావములకు లోబడి కర్మలను చేయుచుండును | చేష్టతే | = క్రియలను ఆచరించును |
| | | నిగ్రహః | = (అర్థములేని) పట్టుదల |
| జ్ఞానవాన్, అపి | = జ్ఞానియు | కిమ్, కరిష్యతి | = ఏమి చేయును? |
| స్వస్యాః, ప్రకృతేః | = తన ప్రకృతికి | | |

**జ్ఞానవాన్ అపి స్వస్యాః ప్రకృతేః సదృశం చేష్టతే ।**
**భూతాని ప్రకృతిం యాన్తి నిగ్రహః కిం కరిష్యతి? ॥**

తా: సమస్త ప్రాణులు తమతమ ప్రకృతులను అనుసరించి (స్వభావములకు లోబడి) కర్మలు చేయుచుండును. జ్ఞానియు తన ప్రకృతిని (స్వభావమును) అనుసరించియే క్రియలను ఆచరించును. ఎవ్వరైనను పట్టుబట్టి కర్మలను ఎలా త్యజింపగలరు?

శాస్త్రం నిర్ణయించిన మేరకు మనం ఒక ప్రత్యేకమైన వ్యక్తిత్వంతో పుడతాము. ప్రాథమికంగా మూడు గుణాలు. అవి – సత్త్వ, రజో, తమో గుణాలు. వీటిలో దేని మోతాదు ఎక్కువుంటే దానికి తగ్గట్టుగా ఉంటుంది మన వ్యక్తిత్వం. సత్త్వగుణం జ్ఞానాన్ని సూచిస్తే, రజోగుణం కర్మలు చేయటాన్ని సూచిస్తే, తమోగుణం ఈ రెండింటికీ భిన్నం. ఏ పనీ చేయనివ్వదు. ఈ మూడు గుణాలను ఆధారంగా చేసుకుని మానవాళిని నాలుగు తెగలుగా విభజించింది శాస్త్రం. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులుగా. వీటి గురించి వివరంగా నాలుగవ అధ్యాయంలో చూస్తాము. ఇప్పుడు తెలుసుకోవాల్సింది కొంతమంది జ్ఞానం పొందితే, కొంతమంది హుషారుగా కర్మలు చేస్తుంటే, మరికొంతమంది మందకొడిగా ఉంటారు. మన వ్యక్తిత్వానికి తగ్గ ఉద్యోగాన్ని ఎన్నుకుంటే ఏ బాధా

ఉండదు. మనం చేసే పని మన వ్యక్తిత్వానికి తగ్గదిగా ఉంటే, దాన్ని మనం ప్రేమిస్తాము. అందువల్ల మన గుణానికి తగ్గట్టుగా మన పనిని చేయమంటుంది శాస్త్రం.

అందువల్లనే విశ్వామిత్రుడు క్షత్రియునిగా పుట్టినా ఆయనలో సత్త్వగుణం ప్రధానంగా ఉండటంవల్ల బ్రహ్మర్షి అయ్యాడు. ద్రోణాచార్యుడు బ్రాహ్మణుడు, క్షత్రియునిలా మహాభారతయుద్ధంలో యుద్ధం చేయటానికి వచ్చాడు. అర్జునుడు క్షత్రియునిగా పుట్టాడు, పైగా క్షత్రియధర్మానికి ప్రతీకగా ఉన్నాడు; పదమూడేళ్ళ అరణ్యవాసంలో కందమూలాలు తిన్నప్పుడు, తపస్సు చేసుకుంటూ అరణ్యంలోనే ఉండిపోదామనుకోలేదు. ప్రతిక్షణమూ మహాభారత సంగ్రామానికి సిద్ధమవుతూనే ఉన్నాడు. అర్జునునికి యుద్ధమంటే ఇష్టమే! కాని ఇప్పుడు మోహంలో పడి తాత్కాలిక వైరాగ్యం వచ్చింది.

అందువల్ల కృష్ణపరమాత్మ నీ స్వభావం ప్రకారం చేయి అంటున్నాడు.

**స్వస్యాః ప్రకృతేః సదృశం చేష్టతే** – ఎవరి ప్రకృతి ప్రకారం వారు ప్రవర్తిస్తారు. ఇక్కడ ప్రకృతి అంటే సత్త్వరజస్తమో గుణాల్లో ఏది ఎక్కువ ఉంటే దాని ప్రకారం ప్రవర్తిస్తారు. అది మనిషి మనిషికీ భిన్నంగా ఉంటుంది. ముగ్గురు పిల్లలను ఒక గదిలో అనేక వస్తువుల మధ్య వేసి వారిని ఒంటరిగా వదిలి, ఏంచేస్తున్నారో చాటుగా చూడండి. ఒక బాబు సుద్దముక్క తీసుకుని రాయటమో, బొమ్మలు గీయటమో చేస్తే; ఇంకో బాబు మృదంగం వాయించటానికి ప్రయత్నిస్తే; మరో బాబు స్క్రూడ్రైవర్ తీసుకుని బొమ్మలను బాగుచేయటానికి ప్రయత్నిస్తాడు. అలా వారికి దేనిమీద మక్కువ ఉందో గమనించి, దానిలో వారు వృద్ధిలోకి వచ్చేలా చేయవచ్చు.

**(సదృశం చేష్టతే స్వస్యాః ప్రకృతేః) జ్ఞానవానపి** – జ్ఞాని జీవితం కూడా అతని ప్రకృతిమీద ఆధారపడి ఉంటుంది. జ్ఞానుల జీవితచరిత్రలు చదివితే, అందరూ జ్ఞానులే అయినా, అందరి జ్ఞానం సమానంగానే ఉన్నా వారి జీవనవిధానం భిన్నంగా ఉంటుంది. ఒక జ్ఞాని సమాజంనుంచి దూరంగా వెళ్ళిపోయి ఏ గుహలోనో ఒంటరిగా కూర్చోటానికి ఇష్టపడతాడు. ఇంకొక జ్ఞాని బయటకు వచ్చి, ఆశ్రమాలు లేదా సంస్థలు నెలకొల్పి, పుస్తకాలు రాయటం చేస్తాడు. వీరిలో ఏ జ్ఞాని గొప్ప? సమాజానికి సేవచేసే జ్ఞానా, సమాజంనుంచి దూరంగా వెళ్ళిన జ్ఞానా అంటే ఇద్దరూ గొప్పే. ఏం చేసినా జ్ఞాని జ్ఞానే! జ్ఞాని సమక్షమే ఒక పెద్ద వరం. మౌనంగా ఉన్న జ్ఞాని, ఇలా మౌనంగా కూడా ఉండవచ్చు అని పరోక్షంగా బోధిస్తున్నాడు. అందువల్ల జ్ఞాని జీవితం కూడా వారి వ్యక్తిత్వాన్నిబట్టి ఉంటుంది.

దయానంద స్వామీజీ, దేవుళ్ళకు కూడా భిన్నప్రవృత్తులు ఉంటాయని సరదాగా చెబుతారు. దేవుళ్ళు వాడే సంగీత వాయిద్యాలు చూస్తే వారి స్వభావానికి సంకేతాలుగా ఉంటాయి. సరస్వతీదేవి వీణ వాయిస్తుంది; కృష్ణపరమాత్మ వేణునాదాన్ని గ్రోలుతాడు.

**ప్రకృతిమ్ యాంతి భూతాని** – అన్ని జీవాలు, వాటి స్వభావం ప్రకారం ప్రవర్తిస్తాయి. ఇక్కడ భూతాని అంటే జీవులు, పంచభూతాలు కాదు. జీవుల్లో జంతువులు, చెట్లు కూడా వస్తాయి. పులి స్వభావం వేరు, ఆవు స్వభావం వేరు.

**నిగ్రహః కిం కరిష్యతి** – నీ స్వభావాన్ని ఎందుకు అణగద్రొక్కుతావు? నీ ప్రకృతి ప్రకారం వెళ్ళు.

అర్జునునిలాంటి వారు ఏ హృషీకేశ్‌కో వెళ్ళి సన్న్యాసం స్వీకరించినా, వారిలో ఉన్న నాయకత్వపు లక్షణం వారిని ఊరికే ఉండనివ్వదు. అక్కడొక సన్న్యాసుల సంఘం పెట్టి, దేనికో దానికి పోరాటం సాగిస్తారు. కర్మయోగం చేసేపనిమీద ఆధారపడి ఉండదు, దృక్పథంమీద ఆధారపడి ఉంటుంది. బ్రాహ్మణుడు తన ధర్మాన్ని నిర్వర్తించాలంటే భగవంతునికి పూలు సమర్పిస్తాడు. క్షత్రియుని ధర్మం యుద్ధంలో శత్రువులను హతమార్చటం. రెండు ధర్మాలను కూడా ఈశ్వరార్పణభావనతో చేయవచ్చు.

**యత్కరోషి యదశ్నాసి .యజ్జుహోషి దదాసి యత్** – 9.27

శ్లో. 34 **ఇంద్రియస్యేంద్రియస్యార్థే రాగద్వేషౌ వ్యవస్థితౌ ।**
**తయోర్న వశమాగచ్ఛేత్ తౌ హ్యస్య పరిపన్థినౌ ॥**
ఇంద్రియస్య, ఇంద్రియస్య, అర్థే, రాగద్వేషౌ, వ్యవస్థితౌ,
తయోః, న, వశమ్, ఆగచ్ఛేత్, తౌ, హి, అస్య, పరిపన్థినౌ ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఇంద్రియస్య, | = | ప్రతి ఇంద్రియ | న, అగచ్ఛేత్ | = | లోను కారాదు |
| ఇంద్రియస్య, అర్థే | | విషయమునందు | హి, తౌ | = | ఎందుకంటే ఆ రెండును |
| రాగద్వేషౌ | = | రాగద్వేషములు | అస్య | = | ఇతనియొక్క (హితమునకు) |
| వ్యవస్థితౌ | = | దాగియుండును | పరిపన్థినౌ | = | విఘ్నములను కల్గించు శత్రువులు |
| తయోః వశమ్ | = | వాటి వశమునకు | | | |

**ఇంద్రియస్య అర్థే ఇంద్రియస్య రాగద్వేషౌ వ్యవస్థితౌ ।**
**తయోః వశం న ఆగచ్ఛేత్ తౌ హి అస్య పరిపన్థినౌ ॥**

తా: ప్రతి ఇంద్రియార్థమందు(ప్రతి ఇంద్రియవిషయమునందు) రాగద్వేషములు దాగియున్నవి. మనుష్యుడు ఈ రెండింటికిని వశము కాకూడదు. ఎందుకంటే ఈ రెండే మానవుని శ్రేయస్సునకు విఘ్నకారకములు, మహాశత్రువులు.

ఇంతకుముందు శ్లోకం చూస్తే, మనకు ఒక సందేహం కలగవచ్చు. ఏమిటది? అందరూ వారి ప్రకృతి లేదా స్వభావం ప్రకారం ప్రవర్తిస్తారు అన్నాడు. జ్ఞానులను కూడా వదల్లేదు. దయానందస్వామి దేవుళ్ళు కూడా భిన్నస్వభావాలు చూపిస్తారని చక్కగా వివరిస్తారు. సృష్టికర్త బ్రహ్మ రజోగుణం; స్థితికర్త విష్ణుమూర్తి సత్త్వగుణం; లయకర్త శివుడు తమోగుణం ఉపయోగిస్తారు అన్నారు. జాగ్రత్తగా చూడండి – తమోగుణం ఉంది అనటం లేదు, తమోగుణం ఉపయోగిస్తారు అన్నాము.

పైగా కృష్ణపరమాత్మ ముందు శ్లోకంలో నిగ్రహః కిమ్ కరిష్యతి అన్నాడు. అంటే పరోక్షంగా నీ స్వభావాన్ని అదుపులో పెట్టలేవు అంటున్నాడు.

దీనివల్ల కలిగే సందేహం ఏమిటి? మనకొక స్వభావం ఉండి, ఆ స్వభావాన్ని అదుపులో పెట్టలేని పరిస్థితి ఉంటే, మనకు అసలు ఫ్రీవిల్ లేదని చెప్పినట్టు అవుతుంది. నీ స్వభావాన్ని ఎలా అదుపులో పెట్టగలవు అంటే అది ప్రశ్న కాదు, దాన్ని అదుపులో పెట్టలేవు అని అర్థం. ఏం చేసినా అసలు స్వభావం పోదు.

**కర్పూరధూళి రచితాఌలవాలః కస్తూరికాకుంకుమలిప్తదేహః**

**సువర్ణకుంభైః పరిశిచ్యమానో నిజం గుణం ముంచతి కిం పలాండుః**

పలాండుః అంటే ఉల్లిపాయ. ఒకవ్యక్తి పలాండుయొక్క స్వభావాన్ని మారుద్దామనుకున్నాడు. వాసన ద్రవ్యమైన కర్పూరాన్ని ఒక పాత్రగా చేసి, ఉల్లిపాయను దాని మధ్యలో పెట్టాడు. ఆ ఉల్లిపాయమీద కుంకుమ, కస్తూరి లేహ్యం (సుగంధ ద్రవ్యాలు) పూశాడు. దానికి పన్నీరుతో అభిషేకం చేశాడు. అడుగున కర్పూరం, మధ్యలో కస్తూరి ద్రవ్యాలు, పైన పన్నీరు. 45 నిమిషాల తరువాత ఉల్లిపాయను తీసుకుని ముక్కు దగ్గర పెట్టుకుంటే ఏముంది? ఉల్లిపాయ వాసనే వస్తున్నది! నిజమ్ గుణమ్ – నిజస్వరూపం పోలేదు.

ఉల్లిపాయకు తన స్వభావమున్నట్టుగా, మనందరికీ మన స్వభావాలు ఉన్నాయి. మన స్వభావాన్ని అదుపులో పెట్టుకోలేమని కృష్ణపరమాత్మ అంటే మనకసలు ఫ్రీవిల్ లేనట్టా? మనను మార్చుకోలేమా? ఈ సందేహం రావచ్చు. దానికి జవాబు ఈ శ్లోకంలో ఇస్తున్నాడు. మనిషికి ఫ్రీవిల్ ఉందని నిరూపించే శ్లోకం ఇది. అందువల్ల ఇది చాలా ముఖ్యమైన శ్లోకం. జంతువులకూ, చెట్లకూ లేవు. మనిషి ఒక్కడే ప్రణాళిక వేసి, దాన్ని ఆచరణలో పెట్టగలడు. మనిషి ఒక్కడే తనను తాను సరిదిద్దుకోగలడు, మెరుగు పెట్టుకోగలడు. ఎలా?

**ఇంద్రియస్యేంద్రియస్యార్థే రాగద్వేషౌ వ్యవస్థితౌ** – మనకు ప్రాథమికంగా ఒక స్వభావం ఉంటుంది. ఆ స్వభావాన్ని బట్టే మన మనస్సులో ఆలోచనలు ఏర్పడతాయి. ఈ ఆలోచనలు కొనసాగితే, ఈ ఆలోచనలు బలంగా రూపుదిద్దుకుంటే, అవి మాటలుగా మారతాయి. ఆ తరువాత అవే ఆచరణలోకి మారతాయి. అలా మనకు మూడు స్థాయిలున్నాయి. స్వభావంనుంచి ఆలోచన; ఆలోచననుంచి పదాలు; పదాలనుంచి కర్మ. అంటే స్వభావం, వృత్తి, వాక్కు, కర్మ.

ఈ స్వభావం ఆలోచనలను ఉత్పత్తి చేస్తుంది. ఎటువంటి ఆలోచనలను? రాగద్వేషౌ వ్యవస్థితౌ – మీ స్వభావంవల్ల ప్రపంచాన్ని రెండుగా విభజిస్తారు. అవి మీకు నచ్చే అంశాలు, నచ్చని అంశాలు. స్వభావం రాగద్వేషాలవృత్తులను ఉత్పత్తి చేస్తుంది కాబట్టి, వాటి రాకమీద మీకేమీ అధికారం లేదు. మీ ప్రమేయం లేకుండా అవి మనస్సులో చోటు చేసుకుంటాయి. ఏదైనా ఊరు వెళ్ళినా, కొన్ని మిమ్మల్ని ఆకర్షిస్తాయి, కొన్ని మీకు నచ్చవు. కొంతమంది కలిసి బయట ఊరుకు వెళ్ళినా, ఒకరు మసాలాదోశ తినటానికి, ఇంకొకరు పూల దుకాణానికి, మరొకరు బంగారం దుకాణానికి పరుగులు తీస్తే, నాలుగో వ్యక్తి ఏమీ చేయకుండా అలా నిలుచుండిపోతాడు. ఇదంతా స్వభావంవల్ల జరుగుతుంది. దాన్ని తప్పించుకోలేరు. నిజానికి మనమంతా రాగద్వేషాల మూటలం. ఇంటర్వ్యూలలో కూడా చూడండి, ఆ ప్రశ్నలన్నీ మీ రాగద్వేషాలమీద ఆధారపడి ఉంటాయి. మీకే పుస్తకం ఇష్టం, మీకే వ్యక్తి ఇష్టం, మీకే ప్రాంతం ఇష్టం వగైరా. **నిజానికి ఒక వ్యక్తిని వర్ణించాలంటే అతని ఇష్టాయిష్టాలను చర్చించకుండా చేయలేరు.**

వ్యవస్థితౌ – అంటే ఉండి తీరతాయి. అతని స్వభావానికి తగ్గట్టుగా రాగద్వేషాలు ప్రతి ఒక్కరిలో ఉండి తీరతాయి. అది ప్రకృతిసహజం. దాన్ని ఎవరూ తప్పించుకోలేరు. దేవుళ్ళు కూడా దీనికి భిన్నంగా లేరని చూశాము. ధ్యానశ్లోకాలు వారు వేసుకునే ఆభరణాలను, వస్త్రాలను, ఆయుధాలను వర్ణిస్తాయి.

**యాకుందేందు తుషారహార ధవళా యా శుభ్రవస్త్రావృతా యా వీణా ...**

సరస్వతీదేవికి తెల్లని వస్త్రాలు ఇష్టం. వీణ వాయిస్తుంది.

తమాషా ఏమిటంటే వేదాంతానికి వచ్చాక కూడా, శిష్యులు స్వామీజీని అడుగుతుంటారు 'స్వామీజీ, మీకు ఏ వేదాంతగ్రంథం ఇష్టం? గీత, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు, పంచదశి, వివేకచూడామణి – వీటిల్లో ఏదిష్టం?' ఒకవేళ ఫలానాది ఇష్టమంటే మళ్ళీ అందులో ఏ అధ్యాయం ఇష్టం, ఏ మంత్రం లేదా శ్లోకం ఇష్టం అంటారు.

ఆ విధంగా ఆలోచన రావటం మన చేతిలో లేదు. **ఆలోచన మన స్వభావాన్నిబట్టి వస్తుంది.** కాకపోతే ఈ ఆలోచనను పెంచి పోషించాలా, మొగ్గగానే తుంచేయాలా అనేది మన చేతిలో ఉంది. అందువల్ల మొదటి ఆలోచన రాకుండా ఆపలేము, కాని వచ్చాక దాన్ని కొనసాగించాలా, సమర్థించాలా, దాన్నించి తెలివిగా మన బుద్ధిని మరలించాలా? ఇది మన చేతిలో ఉంది. మన ఫ్రీవిల్‌లో ఇది మొదటి దశ. **ఆలోచనలను పెంచి పోషించాలా, వద్దా?**

ఏ ఆలోచనలనైతే పెంచి పోషిస్తామో అవే అంతకంతకూ బలమవుతాయి. ఎప్పుడైతే అవి బలమవుతాయో, అప్పుడే అవి మాటల రూపంలో బయటకు వస్తాయి. ఎవరినైనా మనం పదేపదే మనస్సులో తిట్టుకుంటుంటే, ఏదో ఒక దుర్ముహూర్తాన మనకు తెలియకుండా ఆ మాటలు బయటకు దూసుకు వచ్చేస్తాయి. మనం ఒక పదం వాడామంటే అది అప్రయత్నంగా కాదు. అది ఆలోచనల సౌధం. ఐస్‌బర్గ్ కొనవంటిది – ఒక వ్యక్తిని కోపంగా తిడుతున్నామంటే అది అనుకోకుండా జరగలేదు; అతనిమీద కోపం గంటల తరబడి లేదా రోజుల తరబడి రూపుదిద్దుకుంటున్నది. ఆలోచనలు రాకుండా మనం చేయలేము కాని, ఆలోచనలను అదుపులో పెట్టుకోవటం ద్వారా మన మాటలను మనం అదుపులో పెట్టుకోగలము. మన ఫ్రీవిల్‌లో ఇది రెండవ దశ. **ఆలోచనలను అదుపులో పెట్టటం ద్వారా మన మాటలను అదుపులో పెట్టగలము.**

మన అధీనంలో ఉన్న మూడవదశ మనం చేసే కర్మ. ఈ ఆలోచనలే కర్మలోకి దిగుతాయి. సూక్ష్మాతి సూక్ష్మమైన ఆలోచన ఫలితమే స్థూలాతి స్థూలమైన కర్మ లేదా చర్య. ఆలోచన వచ్చినప్పుడు, మనం దాన్ని అదుపులో పెట్టగలిగితే, మన చర్యలను కూడా అదుపులో పెట్టగలము.

అందువల్ల కృష్ణపరమాత్మ చెబుతున్నాడు –

**ఫ్రీవిల్ రెండవ ఆలోచనను అదుపులో పెట్టగలదు**<br>
**ఫ్రీవిల్ పదాలను అదుపులో పెట్టగలదు**<br>
**ఫ్రీవిల్ చర్యలను అదుపులో పెట్టగలదు**

కాని ఫ్రీవిల్ మొదటి ఆలోచనను అదుపులో పెట్టలేదు, అది స్వభావంనుంచి వచ్చింది కాబట్టి. అందువల్ల చెడు ఆలోచనలు వస్తే మనం తప్పు చేసినట్టు భావించనవసరం లేదు. కాని ఆ చెడు ఆలోచనలను పెంచి పోషించకుండా జాగ్రత్త పడాలి. మన వివేకం ఉపయోగించి, ఆ ఆలోచనల మంచిచెడ్డలను బేరీజు వేసి, చెడు అయితే మొగ్గలోనే త్రుంచివేయాలి.

**తయోర్న వశమాగచ్ఛేత్** – ఆ ఆలోచనల వశంలో పడకు. వాటి వశంలో ఎప్పుడు పడతాము? వాటిని పెంచి పోషిస్తేనే. వాటిని మనం వద్దని నిశ్చయించుకుంటే, అవి మనల్నేమీ చేయలేవు.

దీనికొక అద్భుతమైన ఉదాహరణను ఇస్తారు. ఒక మంట ఉంటే, అది చాలా చిన్నదిగా ఉంటే, గాలి దానికి శత్రువు. గాలి ఆ మంటను ఆర్పేస్తుంది. అదే మంట అడవిలో ఒక పెద్ద జ్వాలగా మండుతుంటే, గాలి దాన్ని ఏమీ చేయలేదు. పైగా శత్రువును ఎదుర్కోలేకపోతే, శత్రువుతో చేయి కలుపు సూత్రం ప్రకారం, చిన్నమంటకు శత్రువైన గాలి, పెద్ద జ్వాలకు తోడయి, దాన్నింకా ప్రజ్వలంగా మండేలా చేస్తుంది.

ఇదే సూత్రం మన ఆలోచనలకు కూడా వర్తిస్తుంది. ఆలోచన చిన్నమంటలా బలహీనంగా ఉన్నప్పుడు, మన బుద్ధి దాన్ని అరికట్టగలదు. కాని అది పెరిగి పెద్దదయితే మాత్రం, అది మనకు వ్యసనంగా మారితే మాత్రం బుద్ధి ఏమీ చేయలేదు. దానికే బుద్ధి బానిస అవుతుంది. అందువల్ల రాగద్వేషాలకు లోనుకాకూడదు, వాటిని మొగ్గలోనే త్రుంచివేయాలి.

రెండు విషయాలను మొగ్గలోనే త్రుంచివేయాలట – శత్రువు, వ్యాధి. శత్రువును వదిలేస్తే, అతను బలం పుంజుకుంటాడు. అలాగే వ్యాధిని మొదట్లోనే నయం చేయించుకోకపోతే, అది ఏ క్యాన్సరులోకో దిగే ప్రమాదముంది. మనలో అంతర్గతంగా ఉన్న కామక్రోధాది శత్రువులను మొగ్గలోనే త్రుంచివేయాలి. లేకపోతే

**తౌ హ్యస్య పరిపన్థినౌ** – అవి మన ఆధ్యాత్మిక మార్గంలో శత్రువులవుతాయి.

ఈ శ్లోకం సారాంశం –

**మొదటి ఆలోచన మాత్రమే మన అధీనంలో లేదు.**
**కాని రెండవ ఆలోచన, మాటలు, చర్యలు మన అధీనంలో ఉన్నాయి.**

వాటిని ఫ్రీవిల్‌తో అదుపులో పెట్టగలము.

శ్లో. 35 **శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మాత్ స్వనుష్ఠితాత్ ।**
**స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః ॥**
శ్రేయాన్, స్వధర్మః, విగుణః, పరధర్మాత్, స్వనుష్ఠితాత్,
స్వధర్మే, నిధనమ్, శ్రేయః, పరధర్మః, భయావహః ॥

| | | | |
|---|---|---|---|
| స్వనుష్ఠితాత్ | = బాగుగా ఆచరింపబడిన | స్వధర్మే | = స్వధర్మమునందు |
| పరధర్మాత్ | = ఇతరుల ధర్మముకన్నా | నిధనమ్ | = మరణము (అయినను) |
| విగుణః | = గుణరహితమే అయినను | శ్రేయః | = శ్రేయస్కరము |
| స్వధర్మః | = స్వధర్మము | పరధర్మః | = ఇతరుల ధర్మము |
| శ్రేయాన్ | = అత్యుత్తమమైనది | భయావహః | = భయమును గొలుపునది |

**స్వనుష్ఠితాత్ పరధర్మాత్ విగుణః స్వధర్మః (అపి) శ్రేయాన్ ।**

**స్వధర్మే నిధనం శ్రేయః । పరధర్మః భయావహః ॥**

తా: పరధర్మమునందు ఎన్నో సుగుణములు ఉన్నను స్వధర్మమునందు అంతగా సుగుణములు లేకున్నను చక్కగా అనుష్ఠింపబడు ఆ పరధర్మముకన్నా స్వధర్మాచరణమే ఉత్తమము. స్వధర్మాచరణమునందు మరణించుటయు శ్రేయస్కరమే. పరధర్మాచరణము భయావహము.

ఈ శ్లోకంతో కర్మయోగానికి ముక్తాయింపు పలుకుతున్నాడు కృష్ణపరమాత్మ. ఏ పని చేసినా రెండు అంశాలను దృష్టిలో పెట్టుకుని చేయాలి – స్వభావం, ధర్మం. స్వభావాన్ని ప్రకృతి అని కూడా అంటారు. అర్జునుని ప్రకృతి రజోగుణ ప్రకృతి. యుద్ధం చేయటం అతని ప్రకృతి. దాన్ని గౌరవించాలి. కాని అది ధర్మపరంగా ఉండాలి.

**శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మాత్ స్వనుష్ఠితాత్** – పరిపూర్ణంగా పాటించిన పరధర్మం కన్నా అసంపూర్ణంగా పాటించిన స్వధర్మమే మేలు! ఉదాహరణకు రోడ్డుమీద కారులో వెళుతున్నారు మీరు. మీరు ఎంతదూరం వెళ్ళినా సమస్య లేదు, కాని ట్రాఫిక్ సిగ్నల్సును పాటించాలి. మీ ప్రయాణం మీ ప్రకృతిని సూచిస్తే, ట్రాఫిక్ సిగ్నల్సు ధర్మాన్ని సూచిస్తాయి. మీ ప్రయాణం ఈ రెండింటికీ తగ్గట్టుగా ఉండాలి. అలాగే మీ జీవితపయనం కూడా మీ స్వభావానికీ, ధర్మానికీ తగ్గట్టుగా ఉండాలి. స్వభావం, ధర్మాల మేలు కలయికను **స్వధర్మం** అంటారు. సరిగ్గా చేయకపోయినా ఫర్వాలేదు కాని స్వధర్మాన్ని పాటించాలి.

ఒక ధనికుని ఇంట్లో ఒక గూర్ఖా ఉండేవాడు. ఒకరోజు పొద్దున్నే ఆ ధనికుడు ఢిల్లీకి వెళ్ళబోతుంటే, ఆ గూర్ఖా పరుగుపరుగున వచ్చి, ఆయనను వెళ్ళవద్దనీ, తనకు ఆయన విమానం కూలి, ఆయన మరణించినట్లుగా పీడకల వచ్చిందనీ చెప్పాడు. ఆ కల తెల్లవారుఝామున వచ్చిందని విని, ఆ ధనికుడు కూడా వెళ్ళటానికి సంకోచించాడు. తెల్లవారుఝామున వచ్చే కలలు నిజమవుతాయంటారని విన్నాడు. అలాగే వెళ్ళలేదు. ఆ పనివాడి కల నిజమయింది కూడా!

అలాగే ఆయన వెళ్ళాల్సిన విమానం కూలి కొందరు మరణించారు. తన ప్రాణాన్ని కాపాడినందుకు యజమాని తనను మెచ్చుకుంటాడని ఆశించాడు గూర్ఖా. అతను ఆశించినట్టే యజమాని పిలిచి అతన్ని మెచ్చుకుని, డబ్బు కూడా ఇచ్చాడు. కాని అతను మురిసిపోయేలోగా, ఇవాల్టినుంచి నిన్ను పనిలోంచి తీసేస్తున్నాను అన్నాడు. కారణం? అతను పరధర్మం చేయటమే! పరధర్మం పరిపూర్ణంగా చేశాడు. యజమాని ప్రాణాలు కాపాడాడు కాని గూర్ఖాగా తన ధర్మం (మేలుకుని ఉండటం) నిర్వర్తించలేదు. అందువల్ల పరిపూర్ణ పరధర్మం, అసంపూర్ణ స్వధర్మంకన్నా తక్కువ స్థాయికి చెందుతుంది.

**స్వధర్మే నిధనం శ్రేయః** – స్వధర్మం నిర్వర్తించటంలో మరణించాల్సి వచ్చినా ఫర్వాలేదు.

**పరధర్మో భయావహః** – పరధర్మం ఆచరిస్తే తనకూ, తక్కినవారికి కూడా అది హానికరం.

దీనితో కర్మయోగం అంశం పూర్తయింది. ఇప్పుడు అర్జునుడు ఒక ప్రశ్న వేస్తాడు; దానికి కృష్ణపరమాత్మ అద్భుతంగా జవాబు చెబుతాడు.

**అర్జున ఉవాచ**

శ్లో. 36 **అథ కేన ప్రయుక్తోఽయం పాపం చరతి పూరుషః ।**
**అనిచ్ఛన్నపి వార్ష్ణేయ బలాదివ నియోజితః ॥**
అథ, కేన, ప్రయుక్తః, అయమ్, పాపమ్, చరతి, పూరుషః,
అనిచ్ఛన్, అపి, వార్ష్ణేయ, బలాత్, ఇవ, నియోజితః ॥

| | | | |
|---|---|---|---|
| వార్ష్ణేయ! | = ఓ కృష్ణా! | బలాత్, నియోజితః ఇవ | = బలవంతము చేయబడినట్లుగా |
| అథ | = మరి | కేన, ప్రయుక్తః | = ఎవరిచే ప్రేరితుడై |
| అయమ్, పూరుషః | = ఈ పురుషుడు | పాపమ్ | = పాపము(ల)ను |
| అనిచ్ఛన్, అపి | = ఇష్టపడకున్నను | చరతి | = ఆచరించును |

**వార్ష్ణేయ అథ కేన ప్రయుక్తః అయం పూరుషః అనిచ్ఛన్ అపి ।**
**బలాత్ నియోజితః ఇవ పాపం చరతి ॥**

తా: అర్జునుడు పలికెను – ఓ కృష్ణా! మానవుడు తనకు ఇష్టం లేకున్నను ఇతరులు బలవంతము చేసినట్లుగా దేని ప్రభావముచే ప్రేరితుడై పాపములను చేయుచుండును?

**5. కామక్రోధ లక్షణాలు, నివారణ శ్లోకాలు 36–43.** కర్మయోగం అంటే **ఈశ్వరార్పణ రూపేణ స్వధర్మ అనుష్ఠానం.** అందువల్ల కర్మయోగి ధర్మాన్ని పాటించాలి. ధర్మం అంటే విలువలను పాటించాలి. విలువలను ప్రత్యేకించి ఎవరూ బోధించనవసరం లేదు. దయానందస్వామీజీ, దొంగకు కూడా విలువలు తెలుసు అంటారు. ఎందుకు? దొంగతనం తప్పని అతనికి తెలియటంవల్లనే, తను చేసే దొంగతనాలను అర్ధరాత్రి చేస్తాడు. పైగా ఇంకో దొంగతో కలిసి దోచుకున్న డబ్బును, రెండో దొంగ తీసుకుని పారిపోతే, నా డబ్బును అతను దొంగలించుకుపోయాడు అంటాడు. అందువల్ల ధర్మం తెలియకపోవటం కాదు సమస్య. అందరికీ ధర్మం తెలుసు. ఎదుటివారు నాకు ఏది చేయకూడదనుకుంటానో, అది నేను వారికి చేయకూడదు. అదే ధర్మం అంటే. నన్ను ఎవరూ హింసించకూడదనుకుంటే, నేను ఎవరినీ హింసించకూడదు. నన్ను ఎవరూ ద్వేషించకూడదనుకుంటే, నేను ఎవరినీ ద్వేషించకూడదు.

**జానామి ధర్మం న చ మే ప్రవృత్తిః, జానామి అధర్మం న చ మే నివృత్తిః**

అన్నాడు దుర్యోధనుడు. నాకు ధర్మమేదో తెలుసు, కాని నేను పాటించలేకుండా ఉన్నాను; అధర్మమేమిటో తెలుసు, కాని అదే చేస్తున్నాను.

**కేనాపి దేవేన హృది స్థితేన, యథా నియుక్తోఽస్మి తథా కరోమి**

నాలో ఏదో శక్తి ఉన్నట్టుంది. అది నా అంతరాత్మకు విరుద్ధంగా నాచేత పని చేయిస్తున్నది అన్నాడు.

అందువల్ల ధర్మాన్ని పాటించాలనే సదుద్దేశం ఉన్నా కూడా మనుష్యులచేత చెడుపనులు చేయించే ఆ శక్తి ఏమిటి? కొంతమంది దేవుడే చేయిస్తున్నారనుకుంటారు. **శివుడాజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు** అంటారు. కొంతమంది ఎవరో రాక్షసుడు చేయిస్తున్నాడనుకుంటారు. మరి కొంతమంది గ్రహాలను నిందిస్తారు. అంటే ఎవరో ఒకరిమీదకు నింద వెయ్యాలని చూస్తారు.

**అనిచ్ఛన్నపి** – అధర్మం చేయాలని లేకపోయినా కూడా;

**అయం పాపం చరతి పూరుషః** – అధర్మం చేస్తారు.

**బలాదివ నియోజితః** – ఏదో తెలియని బలమైన శక్తివల్ల బలవంతంగా చేసినట్టు కనిపిస్తారు.

**అథ కేన ప్రయుక్తః** – ఏ శక్తివల్ల అధర్మం చేస్తున్నారు?

**వార్ష్ణేయ** – ఓ కృష్ణా!

అర్జునుని ప్రశ్న ఇది – అధర్మం చేయాలని లేకపోయినా, ఏ శక్తివల్ల మనుష్యులు అధర్మం చేస్తున్నారు?

ఎవరైనా నుదిటిమీద తుపాకి పెట్టి ఏదైనా బలవంతం చేసినట్టుగా, ఏ శక్తి అబద్ధం చెప్పు, అక్రమాలు చేయి అని ప్రేరేపిస్తున్నది? ఈ ప్రశ్న చాలా ముఖ్యమైన ప్రశ్న. ఈ సందేహం ఎప్పుడో అప్పుడు మనందరికీ కూడా కలుగుతుంది.

**శ్రీభగవాన్ ఉవాచ**

శ్లో. 37 **కామ ఏష క్రోధ ఏష రజోగుణసముద్భవః ।**
**మహాశనో మహాపాప్మా విద్ధ్యేనమిహ వైరిణమ్ ॥**
కామః, ఏషః, క్రోధః, ఏషః, రజోగుణసముద్భవః,
మహాశనః, మహాపాప్మా, విద్ధి, ఏనమ్, ఇహ, వైరిణమ్ ॥

| | | | |
|---|---|---|---|
| రజోగుణసముద్భవః | = రజోగుణమునుంచి ఉత్పన్నమైన | మహాపాప్మా | = మిక్కిలి పాపిష్ఠిది |
| ఏషః, కామః | = ఈ కామమే | ఇహ | = ఈ విషయమున |
| క్రోధః | = క్రోధము | ఏనమ్ | = దీనిని |
| ఏషః | = ఇది | వైరిణమ్ | = శత్రువుగా |
| మహాశనః | = ఎంత తిన్నను తృప్తిలేనిది (తిండిపోతు) | విద్ధి | = తెలుసుకొనుము |

**రజః గుణసముద్భవః మహాపాప్మా మహా అశనః ఏషః కామః ।**
**ఏషః క్రోధః (అస్తి, త్వం) ఏనమ్ ఇహ వైరిణం విద్ధి ॥**

తా: శ్రీభగవానుడు పలికెను – రజోగుణమునుంచి ఉత్పన్నమగునదే కామము. ఇదియే క్రోధరూపమును దాల్చును. ఇది మహాశనము. భోగానుభవములతో ఇది చల్లారునది గాదు. పైగా అంతులేని పాపకర్మా చరణములకు ఇదే ప్రేరకము. కనుక ఈ విషయమున దీనిని పరమశత్రువుగా తెలుసుకొనుము.

ఈ శ్లోకంనుంచి చివరి శ్లోకం వరకూ కృష్ణపరమాత్మ అర్జునుని ప్రశ్నకు జవాబు చెబుతున్నాడు. మిమ్మల్ని అదుపులో పెట్టే శక్తి బాహ్యంగా లేదు. మీలోనే ఉంది అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఆ శక్తి పేరు అజ్ఞానం. అజ్ఞానం కూడా రెండుస్థాయిల్లో ఉంది. మొదటిస్థాయిలో ధర్మ అధర్మ అజ్ఞానం ఉంటే, పైస్థాయిలో ఆత్మ అనాత్మల అజ్ఞానం ఉంది. అంటే ధర్మాధర్మ, ఆత్మానాత్మ అజ్ఞానమే మనని అదుపులో పెడుతున్న రాక్షసుడు. రాక్షసుడు పదం వాడాలంటే, అజ్ఞానమే రాక్షసుడు. వేరే ఏ శక్తీ లేదు.

కాకపోతే, కృష్ణపరమాత్మ అజ్ఞానం పదం వాడడు. ఎందుకంటే మనకు అజ్ఞానం అర్థం కాదు. అజ్ఞానం రెండు శక్తులుగా విడివడి మనను ఆడిస్తున్నది – ఒకటి కామం, ఇంకొకటి క్రోధం. అందువల్ల రాబోయే శ్లోకాల్లో కృష్ణపరమాత్మ కామక్రోధాలను వివరించబోతున్నాడు. దాన్ని మూడు అంశాలుగా చెప్పబోతున్నాడు. అవి – 1. కామక్రోధస్వరూపం; 2. కామక్రోధకారణం; 3. కామక్రోధపరిహారం.

**శ్రీ భగవాన్ ఉవాచ** – కృష్ణపరమాత్మ చెబుతున్నాడు. ధర్మాన్ని పాటించనివ్వకుండా చేసే శత్రువేమిటి?

**కామ ఏష క్రోధ ఏష** – కామం అంటే కోరిక. క్రోధం అంటే కోపం. ఏష అంటే ఇది. దగ్గరగా ప్రతి ఒక్కరూ అనుభవించేవి ఇవి. కోరిక అంటే ఏమిటో బాహ్యంగా చెప్పనవసరం లేదు. అలాగే కోపం కూడా. ముక్కుమీదే ఉంటుంది కోపం చాలామందికి. అవకాశం చూసి, ఛెంగున ఒక గెంతు గెంతుతుంది. అందువల్ల ఏష అనే సర్వనామం వాడాడు కృష్ణపరమాత్మ. అవి ఎలా పుడతాయి?

**రజోగుణసముద్భవః** – రజోగుణంనుంచి పుడతాయి. ప్రతి ఒక్కరిలో మూడు గుణాలుంటాయని చూశాము. అవి సత్త్వరజస్తమో గుణాలు. వాటి గురించి వివరంగా 14వ అధ్యాయంలో చూద్దాము. వీటిని ధార్మిక జీవనానికి అడ్డుపడే శక్తులుగా ఎందుకు అభివర్ణిస్తున్నాడు? కారణం ఇదీ –

**మహాశనః** – కామం స్వరూపం మహాశనం. అక్షరాలా చూస్తే మహాశనం అంటే అతిగా తినేవాడు. బకాసురుడులాగా తింటున్నావంటారు. కోరికలు కూడా అంతే. వాటికి అంతూ పొంతూ ఉండవు. ఎన్ని కోరికలు తీర్చుకున్నా కొత్త కోరికలు పుట్టుకొస్తూనే ఉంటాయి. చేతిలో డబ్బులే లేనప్పుడు వంద ఉంటే చాలనుకుంటాము. కాని వంద చేతిలో పడగానే లక్షలు కావాలనుకుంటాము. లక్షలు వస్తే చక్రవర్తి, చక్రవర్తి అయితే ఇంద్ర పదవి, ఇంద్ర పదవి వస్తే బ్రహ్మ పదవి – ఇలా ఆశలు ఊరుతూనే ఉంటాయి. ఎందుకిలా కోరికలు అనంతంగా సాగుతున్నాయి? ఇవన్నీ ఒక ప్రాథమిక కోరికమీద ఆధారపడి ఉన్నాయి. ఏమిటది? **అపూర్ణత్వం.** నాకేదో తక్కువైంది. ఇల్లు, భార్య, పిల్లలు, ఉద్యోగం, డబ్బు – ఇలా ఏ కోరిక కోరుకున్నా, అవి పైపై కోరికలే, వాటి వెనుక ఒకటే ప్రాథమిక కోరిక బలంగా ఉంది – నేను పూర్ణుణ్ణి అవాలి. అందువల్ల ఏ కోరిక తీరినా, పూర్ణత్వం వచ్చినట్టు అనిపించదు. అశాశ్వమైన వస్తువులు, శాశ్వతమైన ఆనందాన్ని ఇవ్వవు అంటుంది వేదాంతం.

**అశాశ్వతం + అశాశ్వతం = అశాశ్వతం**

అది శాశ్వతం అవదు. అందువల్ల మన ప్రయత్నమే అసంబద్ధంగా ఉంది. అశాశ్వతమైన నేను అశాశ్వతమైన వస్తువులు పొంది, శాశ్వతానందాన్ని పొందాలనుకుంటున్నాను.

**ఆనందం గురించిన అపోహ = మీకు తీరిన కోరికలు / మీకున్న కోరికలు** – స్వామి చిన్మయానంద

మీకు 10 కోరికలుంటే, అందులో నాలుగు తీరితే మీ ఆనందం 4/10 అవుతుంది. అలా అయితే పదవ కోరిక తీరేసరికి 10/10 అయి, పూర్ణానందం అవాలి కదా! కాని అవదు. ఎందుకంటే పదవ కోరిక తీరేసరికి మీకు కోరికలు 1000 అయిపోతాయి. అప్పుడు ఆనందం ఎంత? 10/1000. అంటే ఆనందం దొరకదు. అందువల్ల అవస్థ పడుతూనే ఉంటారు. అందువల్ల కోరికను **మహాశనం** అన్నాడు కృష్ణపరమాత్మ. ఈ కోరికల్లో ఎంతగా మునిగిపోతారంటే, గీత క్లాసుకు వెళ్ళటానికి కాని, ప్రార్థన చేయటానికి కాని, గుడికి వెళ్ళటానికి కాని, మతగ్రంథాలు చదవటానికి కాని తీరికే ఉండదు. మతపరమైన జీవితం గడిపితేనో, ఆధ్యాత్మగ్రంథాలు చదివితేనో ప్రాథమిక సమస్య ఎక్కడుందో తెలుస్తుంది. కాని మీ కోరిక మీ శత్రువు అవుతుంది. అది మిమ్మల్ని ప్రాపంచిక అంశాల వైపుకు లాగేస్తున్నది.

**పరాంచి ఖాని వ్యతృణత్స్వయంభూః తస్మాత్పరాఙ్ పశ్యతి నాన్తరాత్మన్ ।**
**కశ్చిద్ధీరః ప్రత్యగాత్మనామైక్షదావృత్తచక్షురమృతత్వమిచ్ఛన్ ॥** – కఠ 2.1.1

మన ఇంద్రియాలు బాహ్యాముఖంగా ఉండటంవల్ల బాహ్యప్రపంచాన్నే చూస్తున్నాము. అంతర్ముఖుల మవటం లేదు. ఇంద్రియజన్య కోరికలు మనలను బహిర్ముఖులను చేస్తున్నాయి. క్రోధం కూడా ఒక సమస్య. అది మనలో హింసాప్రవృత్తిని కలుగజేస్తుంది. హింస చేయటం పాపం.

**శ్రూయతాం ధర్మసర్వస్వం శ్రుత్వా చ అవధార్యతామ్।**
**ఆత్మనః ప్రతికూలాని పరేశాం న సమచరేత్।।** – మహాభారతమ్

ధర్మరాజుకు చేయబడ్డ బోధ ఇది. ధర్మశాస్త్రం మొత్తం చెబుతున్నాను నీకు. ఇది విని బాగా గుర్తుంచుకో. నీకు ఏది బాధ కలిగిస్తుందో, ఆ పనిని నువ్వు ఇతరులకు చేయకు. ధర్మసూత్రాన్ని ఇంతకన్నా సూక్ష్మంగా ఎవరూ చెప్పలేరు.

**పరోపకారః పుణ్యాయ పాపాయ పరపీడనం**

ఎదుటివారికి మంచి చేస్తే అది పుణ్యం, వారిని హింసిస్తే అది పాపం. కోపం వస్తే మాట తూలుతాము, చెయ్యి కూడా చేసుకుంటాము.

**మహాపాప్మా** – కోపం వస్తే పాపం చేస్తాము. అది ఆధ్యాత్మిక నిచ్చెననుంచి మనను కిందకు తోస్తుంది. కోరిక ఒక వ్యక్తిని బహిర్ముఖం చేస్తే, కోపం అతన్ని ఆవేశపరుణ్ణి చేస్తుంది. ఈ రెండు గుణాలున్న వ్యక్తి ధర్మాన్ని పాటించలేడు, కర్మయోగాన్ని పాటించలేడు. అందువల్ల ఈ రెండూ శత్రువులు.

**వైరిణమ్ విద్ధి** – ఈ రెండూ, కామక్రోధాలు, నీ శత్రువులని తెలుసుకో!

ఇదే విషయాన్ని గీతలో తరచు చెబుతూనే ఉంటాడు కృష్ణపరమాత్మ.

**శక్నోతీహైవ యః సోఢుం ప్రాక్శరీరవిమోక్షణాత్ ।**
**కామక్రోధోద్భవం వేగం స యుక్తః స సుఖీ నరః ॥** – 5.23

ఈ శరీరాన్ని విడవకముందే, కామక్రోధాదులను అదుపులో పెట్టగలగాలి.

**త్రివిధం నరకస్యేదం ద్వారం నాశనమాత్మనః**
**కామఃక్రోధస్తథా లోభః తస్మాదేతత్త్రయం త్యజేత్** – 16.21

నరక ద్వారాలు మూడు ఉన్నాయి. అవి కామ క్రోధ లోభాలు. అందువల్ల ఇవి మనుష్యులకు శత్రువులు.

ఇక్కడ ఒక విషయం గమనించాలి మనం. కామక్రోధాలు రెండయితే, వాటికి ద్వివచనం వాడాలి కృష్ణపరమాత్మ. సంస్కృతంలో ఏకవచనం, బహువచనమే కాక ద్వివచనం కూడా ఉంది. కాని ఇక్కడ ఏకవచన పదాలే వాడాడు. **ఏషః, రజోగుణసముద్భవః, వైరిణమ్** – ఎందుకంటే ఈ రెండింటినీ కలిపి ఒకటే అంశంగా చూస్తున్నాడు కృష్ణపరమాత్మ. నిజం కూడా అంతే. అవి రెండు భిన్న అంశాలు కాదు; ఒక నాణేనికి ఉన్న రెండు వైపులు. ఎలా చెప్పగలము?

రెండవ అధ్యాయంలో చూశాము. కోరిక తీరకపోతే కోపం వస్తుంది; తీరితే లోభం కలుగుతుంది. ఇక్కడ మొదటి భాగమే తీసుకుంటాము. కోరిక తీరకపోతే కోపం వస్తుంది. అందువల్ల కామానికి మారుపేరు క్రోధం. పైగా కోరిక ఎంత తీవ్రంగా ఉంటే క్రోధం అంత ఎక్కువగా వస్తుంది. వారం తరువాత రాబోయే క్రికెట్ మ్యాచ్ చూడటానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు – సెలవు పెట్టారు, చిరుతిండి ఏర్పాటు చేసుకున్నారు, ఎవరూ రాకుండా ముందే చెప్పుకున్నారు, అంతా అయింది అనుకుని ఆరోజు తీరిగ్గా సోఫాలో కూర్చుంటే ఆ రోజంతా పవర్‌కట్ అని అప్పుడే తెలుస్తుంది. అప్పుడెంత కోపం వస్తుందో మీకే తెలుసు!

ఈ కోపాన్ని ఎలా ఎదుర్కోవాలో వచ్చే శ్లోకంలో కృష్ణపరమాత్మ చెబుతున్నాడు.

శ్లో. 38 **ధూమేనావ్రియతే వహ్నిః యథాదర్శో మలేన చ ।**
**యథోల్బేనావృతో గర్భః తథా తేనేదమావృతమ్ ॥**
ధూమేన, ఆవ్రియతే, వహ్నిః, యథా, ఆదర్శః, మలేన, చ,
యథా, ఉల్బేన, ఆవృతః, గర్భః, తథా, తేన, ఇదమ్, ఆవృతమ్ ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| యథా | = | ఏ విధముగా | ఆదర్శః | = | అద్దము |
| ధూమేన | = | పొగతో | ఆవ్రియతే | = | కప్పబడియుండునో |
| వహ్నిః, చ | = | అగ్నియు | యథా | = | ఎలా |
| మలేన | = | దుమ్ముతో | ఉల్బేన | = | మావి (మాయ) చే |

| | | | |
|---|---|---|---|
| గర్భః | = గర్భము | తేన | = ఆ కామముచే |
| ఆవృతః | = కప్పబడియుండునో | ఇదమ్ | = ఈ జ్ఞానము |
| తథా | = అలాగే | ఆవృతమ్ | = కప్పబడియుండును |

**యథా ధూమేన వహ్నిః యథా మలేన ఆదర్శః చ ఆవ్రియతే ।**
**యథా ఉల్బేన గర్భః ఆవృతః (ఆవ్రియతే), తథా తేన ఇదమ్ ఆవృతమ్ ॥**

తా: పొగచే అగ్నియు, ధూళిచే అద్దము, మావిచే గర్భము కప్పివేయబడునట్లు, జ్ఞానము కామముచే ఆవృతమై యుండును.

ఇంతకుముందు శ్లోకంలో కృష్ణపరమాత్మ కామం ఎలా మన శత్రువో అభివర్ణించాడు. కామం, క్రోధం రెండు భిన్నమైనవి కావనీ, కామమే క్రోధంగా మారుతుందనీ చూశాము. అందువల్ల కృష్ణపరమాత్మ కామం గురించే వివరిస్తున్నాడు.

కోరిక అనే అనారోగ్యాన్ని నయం చేయాలంటే, ముందు ఆ అనారోగ్యం ఎలా సమస్యను సృష్టిస్తుందో చూడాలి. కామం మన వివేకశక్తిని, తార్కికబుద్ధిని, ఆలోచనాశక్తిని కప్పివేస్తుంది అంటున్నాడు కృష్ణపరమాత్మ. కఠోపనిషత్తులో బుద్ధిని రథం నడిపే రథచోదకునితో పోలుస్తాడు యమధర్మరాజు. ఎలాగైతే రథచోదకుడు ఆ వాహనం ఎటు వెళ్ళాలో నిర్ణయిస్తాడో, అలాగే మన బుద్ధి మనం ఎటు వెళ్ళాలో నిర్ణయించాలి. మనం ఆధ్యాత్మిక చింతన చేయాలా? వ్యవహారికంలో మునిగితేలాలా? ఏది ముఖ్యం? ఇది బుద్ధి నిశ్చయించాలి.

కామం ఏం చేస్తుంది?

**తేన ఇదమ్ ఆవృతమ్** – తేన అంటే కామంవల్ల; ఇదమ్ – జ్ఞానం లేదా వివేకశక్తి; ఆవృతమ్ – కప్పబడింది. కామంవల్ల వివేకశక్తి కప్పబడింది. ఎలా కప్పబడిందో చూపటానికి మూడు ఉదాహరణలిస్తున్నాడు కృష్ణపరమాత్మ.

**ధూమేనావ్రియతే వహ్నిః** – పొగవల్ల అగ్ని కప్పబడింది. ఎందుకు ఈ ఉదాహరణ ఇచ్చాడు? అగ్ని ఒక జ్యోతి. అది అంతటినీ ప్రకాశింపజేయగలదు, కాని దట్టమైన పొగ దాన్ని కప్పేయటంవల్ల, అగ్ని తను చేసే పనిని అంటే అంతటినీ ప్రకాశింపజేసే పనిని చేయలేకపోతున్నది. ఇది మొదటి ఉదాహరణ.

**యథాదర్శో మలేన చ** – అద్దం మట్టితో కప్పబడింది. అద్దాన్ని మట్టి కప్పితే అద్దం తను చేసే పనిని అంటే మన మొహాన్ని ప్రతిబింబింపజేసే పనిని చేయలేకపోతున్నది. ఇది రెండవ ఉదాహరణ.

**యథోల్బేనావృతో గర్భః** – గర్భస్థ శిశువు గర్భంలో కప్పబడింది. గర్భస్థ శిశువును గర్భం కప్పితే శిశువు తను చేసే పనిని అంటే ఏ పనినీ చేయలేకపోతున్నది. ఇది మూడవ ఉదాహరణ.

అదే విధంగా బుద్ధి కోరికతో కప్పబడింది. బుద్ధిని కోరిక కప్పితే, బుద్ధి తను చేసే పనిని అంటే వివేకాన్ని ఉపయోగించే పనిని చేయలేక పోతున్నది. ఈ మూడు ఉదాహరణలకూ ప్రత్యేకత ఉంది.

1. అగ్నిని పొగ కప్పినప్పుడు ఆ పొగను తొలగించటం తేలిక. కొంచెం ఆ పొగను ఊదితే పొగ మాయమవుతుంది.
2. అద్దాన్ని మట్టి కప్పినప్పుడు అలా పొగను ఊదినట్టు ఊదితే పోదు. ఒక గుడ్డ తెచ్చి దాన్ని తుడవాలి. ఒక్కోసారి తడిగుడ్డతో తుడవాలి. అవసరమైతే గట్టిగా ఒత్తి తుడవాలి. అందువల్ల ఇది మొదటిదానికన్నా కష్టం.
3. గర్భస్థ శిశువును గర్భం కప్పినప్పుడు ఆ శిశువేమీ చేయలేదు. ఆ శిశువు గర్భంలో తొమ్మిదినెలలు పెరిగి బయటకు వచ్చేదాకా ఆగాలి. అప్పుడే అది ఏమైనా చేయగలదు.

అదే విధంగా కోరికలు కూడా మూడు రకాలు.

1. కొన్ని కోరికలను వివేకబుద్ధితో తేలికగా పారద్రోలగలము. నిజానికి మనకున్న అన్ని కోరికలనూ తీర్చనవసరం లేదు.
2. కొంచెం తీవ్రంగా ఉన్న కోరికకు బుద్ధి పనిచేయదు. ఆ కోరిక తీర్చుకోవాల్సిందే. దానికి పాఠం అనుభవం ద్వారా నేర్చుకోవలసిందే.
3. మరీ తీవ్రంగా ఉన్న కోరిక విషయంలో చూస్తూ కూర్చోవాల్సిందే. ఏమీ చేయలేము. బెలూన్‌మీద కోరిక ఉన్న పిల్లవాడికి సర్ది చెప్పలేము. అతనికి ఆ కోరిక పోయేదాకా, వేచి చూడాల్సిందే! అలాగే కొంతమంది బ్రహ్మచర్య ఆశ్రమం, గృహస్థాశ్రమం, వానప్రస్థాశ్రమాలు అనుభవించి తీరాల్సిందే! కొంతమంది కోరిక అప్పుడు కూడా తీరదు; ఎన్నో జన్మలు ఎత్తుతూనే ఉండాలి.

తంబూరశ్రుతిలాగా నాకు కావాలి, నాకు కావాలి అనే కోరిక ఉంటూనే ఉంటుంది. వస్తువుమీద కోరిక మారుతుందేమో కాని, కావాలనే కోరిక మారదు. ఒకటి తీరితే ఇంకోటి కావాలి. సంగీతంలో రాగాలు మారతాయి కాని శ్రుతి మారదు. అలాగే కోరిక మారదు. అజ్ఞానంవల్ల కామక్రోధాలు ఏర్పడితే, వాటివల్ల ధర్మాన్ని ఉల్లంఘిస్తున్నాము. ఇంగ్లీషులో కామా (,) అంటే ఫుల్‌స్టాప్ లేదు అని అర్థం. అలాగే కామానికి కూడా కామా తప్ప ఫుల్‌స్టాప్ లేదు. కామం బుద్ధిని కప్పేస్తుందని చూశాము.

రావణాసురుడు గొప్ప శివభక్తుడు. సాక్షాత్తూ శివుడే అతన్ని దీవించాడు. వేదాలు నేర్చుకున్నాడు. అయినా అతని కోరిక అతని బుద్ధిని కప్పేసింది. ఎంతమంది చెప్పినా వినలేదు.

**క్రోధాద్భవతి సమ్మోహః సమ్మోహాత్ స్మృతివిభ్రమః ।**

**స్మృతిభ్రంశాద్బుద్ధినాశో బుద్ధినాశాత్ ప్రణశ్యతి ॥** – 2.63

రెండవ అధ్యాయంలో చెప్పిన సమ్మోహాన్ని 38లో ఆవరణ శక్తిగా వివరిస్తున్నాడు. అగ్నిని పొగ కప్పినట్టుగా, అద్దాన్ని దుమ్ము కప్పినట్టుగా, గర్భస్థ శిశువును గర్భం కప్పినట్టుగా, వివేకబుద్ధిని కోరిక తాత్కాలికంగా కప్పేస్తుంది. ఆ సమయంలో అధర్మంగా ప్రవర్తిస్తాడు.

**కామోఽకార్షీత్, మన్యురకార్షీత్ నమో నమః** – సంధ్యా వందనమ్

ఓ భగవంతుడా, కోరికవల్ల, క్రోధంవల్ల నేను ధర్మాన్ని ఉల్లంఘించాను.

**కామోఽ కార్షీత కామః కరోతి నాఽ హమ్ కరోమి కామః కర్తా నాఽ హం కర్తా**
**కామః కారయితా నాఽ హమ్ కారయితా ఏషా తే కామకామాయ స్వాహా**

కామానికి ఆహుతి సమర్పిస్తున్నాను. ఎందుకు? అది ఎలాగన్నా నన్ను వదిలి వెళ్ళాలన్న ఆశతో.

**మన్యురకార్షీత్ నమో నమః, మన్యుః అకార్షీత్**
**మన్యుః కరోతి నాహం కరోమి, మన్యుః కర్తా నాహం కర్తా**
**మన్యుః కారయితా నాహం కారయితా**
**ఏషా తే మన్యో మన్యవే స్వాహా**

అలా కామక్రోధాలకు పూజ చేస్తాము. అవి జంట రాక్షసులు. పురాణాల్లో చూడండి. జంట రాక్షసులను చూస్తాము – మధుకైటభులు; రావణ కుంభకర్ణులు; హిరణ్యకశిప హిరణ్యాక్షులు. వారు పురాణాల్లో వచ్చే రాక్షసులు మాత్రమే కాదు. వారు మనలో ఉన్న కామక్రోధాలకు ప్రతిరూపాలు. అందువల్ల ఉపాకర్మ యందు 108 లేదా 1008 సార్లు కామోఽ కార్షీత జపం చేస్తారు. ఎందుకంటే ఈ రెండూ వారి వివేకబుద్ధిని కప్పివేస్తున్నాయి కాబట్టి. ఇదే విషయం 39వ శ్లోకంలో ఇంకా వివరించబడింది.

శ్లో. 39 **ఆవృతం జ్ఞానమేతేన జ్ఞానినో నిత్యవైరిణా ।**
**కామరూపేణ కౌంతేయ దుష్పూరేణానలేన చ ॥**
ఆవృతమ్, జ్ఞానమ్, ఏతేన, జ్ఞానినః, నిత్యవైరిణా,
కామరూపేణ, కౌంతేయ, దుష్పూరేణ, అనలేన, చ ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| చ | = | ఇంకా | జ్ఞానినః | = | జ్ఞానికి |
| కౌంతేయ! | = | ఓ అర్జునా! | నిత్యవైరిణా | = | నిత్యవైరి అయిన |
| అనలేన | = | అగ్నివంటిది | ఏతేన | = | ఈ కామముచే |
| దూష్పూరేణ | = | పూరింపసాధ్యము కానిది | జ్ఞానమ్ | = | జ్ఞానము |
| కామరూపేణ | = | కామరూపాత్మక మైనది | ఆవృతమ్ | = | కప్పబడి ఉంటుంది |

**కౌంతేయ! నిత్యవైరిణా ఏతేన దుష్పూరేణ కామరూపేణ ।**
**చ అనలేన జ్ఞానినః జ్ఞానమ్ ఆవృతమ్ ॥**

తా: ఓ అర్జునా! కామము అగ్నితో సమానమైనది. అది ఎన్నటికిని చల్లారదు. జ్ఞానులకు అది నిత్యవైరి. అది మనుష్యుని జ్ఞానమును కప్పివేయుచుండును.

ఇంతకుముందు శ్లోకంలో **తథా తేనేదమావృతమ్** అన్నాడు కృష్ణపరమాత్మ. దాన్ని ఈ శ్లోకంలో వివరిస్తున్నాడు. కామక్రోధాలు రెండు భిన్న అంశాలు కాదు. ఒకటే అని ముందే చూశాము. ఒకే బొమ్మని రెండు కోణాల్లో

చూసినట్టు ఊహించుకోవాలి. ఇక్కడ కృష్ణపరమాత్మ కామాన్ని వర్ణిస్తున్నాడు, దాన్నే క్రోధానికి కూడా అన్వయించుకోవాలి. ఎటువంటి కామం?

**దుష్పూరేణానలేన చ** – కోరికను అగ్నితో పోలుస్తున్నాడు. అగ్ని ఎక్కడ ఉంటే, అక్కడ ఆ ప్రాంతాన్ని కాని, ఆ వ్యక్తిని కానీ దహించివేస్తుంది. అలాగే కామం కూడా అది ఎక్కడ ఉంటే ఆ ప్రాంతాన్ని దహించివేస్తుంది. కామం ఉండేది మనస్సులో. అందువల్ల ఆ మనస్సును దహించివేస్తుంది. ఎలా?

అనలేన – అగ్నిలాగా. అనలః ఎందుకు? అలం అంటే తృప్తి. అనలం అంటే తృప్తి లేకపోవటం. అగ్నిలో ఎంత ఆజ్యం పోసినా తృప్తి చెందదు. ఎన్ని ఆహుతులు వేసినా అగ్ని చల్లారకపోగా, ఇంకా ప్రజ్వలంగా మండుతుంది. అదే విధంగా మీ కోరిక తీరిస్తే, అది చల్లారకపోగా, ఇంకా ఎక్కువగా కోరికలను కోరుతుంది.

ఒక వ్యక్తికి ఒకరోజు ఎగ్జిబిషన్‌లో ఏదో లక్కీడిప్ తగిలింది. అందులో అతనికి వాచీ వచ్చింది. చాలా మురిసిపోయాడు. కాని ఆ మురిపెం ఒకరోజు కూడా మిగలలేదు. ఎందుకు? మర్నాడు అదే లక్కీడిప్‌లో స్కూటర్ ఇచ్చారు. ఆరోజు గెలిచివుంటే స్కూటర్ వచ్చేది కదా అని వాపోయాడు. అసలు లేనేలేని స్కూటర్ పోయిందని బాధపడుతున్నాడు తప్ప వచ్చిన వాచీని చూసి మురిసిపోవటం లేదు. దీన్నే కామం అంటారు. అందువల్ల అది దుష్పూరేణ అయింది. ఎటువంటి అగ్ని?

**కామరూపేణ** – ఎన్నటికీ తీరని కోరిక రూపంలో ఉంది.

**జ్ఞానినః నిత్యవైరిణా** – జ్ఞానులకు ఆ కోరిక నిత్యవైరి.

ఇక్కడ కృష్ణపరమాత్మ ఒక అద్భుతమైన విషయాన్ని చెబుతున్నాడు. కోరిక శాస్త్రం నేర్చుకునేవారికి, అంటే గీత నేర్చుకునేవారికి నిత్యశత్రువు అంటున్నాడు. అంటే గీత నేర్చుకోనివారికి కాదుట! ఎందుకు? గీత నేర్చుకోనివారికి, కోరిక చెడ్డదని తెలియదు. అందువల్ల దాన్ని చిన్నచూపు చూడరు. వారికి వచ్చిన కోరికలను తీర్చుకుంటూ, వాటి ఫలితాలను అనుభవిస్తూ ఉంటారు. వారికి తప్పు చేస్తున్నామన్న భావన ఉండదు. కాని గీత నేర్చుకునేవారికి, ఆ అపరాధ భావన ఉంటుంది. అదెలా?

ఉదాహరణకు ఒక వ్యక్తికి మధుమేహం ఉంది కాని అతనికి ఆ విషయం తెలియదనుకుందాము. అప్పుడా వ్యక్తి ఏం చేస్తాడు? హాయిగా జిలేబీలను, లడ్డూలను తింటాడు. తరువాత అవి తినటంవల్ల చక్కెర పెరిగి, అవస్థ కలిగితే, అవస్థ పడతాడు. అంటే అతను తిన్నాకే అవస్థ పడతాడు. మధుమేహం ఉందని తెలిసినవ్యక్తి ఏం చేస్తాడు? తనకు చక్కెరవ్యాధి ఉందని తెలుసు, స్వీటు తినకూడదని తెలుసు, అయినా కోరిక అధిగమిస్తుంది. చటుక్కున జిలేబీలను, లడ్డూలను తినేస్తాడు. అతని పరిస్థితి ఎలా ఉంటుంది? స్వీటు తినకముందు, తిన్నాకా కూడా అవస్థ పడతాడు. ముందేమో అపరాధభావన, తరువాతేమో అవస్థ. మొదటి వ్యక్తికి ఆ తర్వాత కలిగే అవస్థే ఉంటుంది కాని అపరాధభావన ఉండదు.

అందువల్ల గీత నేర్చుకోనివారు అజ్ఞానంలో ఉండటంవల్ల, తరువాత మాత్రమే అవస్థ పడతారు. కాని గీత నేర్చుకుంటున్నవారు, ముందు అపరాధభావనకు లోనవుతారు. అందువల్ల అయితే పూర్తి అజ్ఞానంలో అన్నా ఉండాలి

లేదా పూర్తిగా ఆ విషయం తెలియనైనా తెలియాలి. మిడిమిడి జ్ఞానం ఉంటే ప్రమాదం. అందువల్ల సగం తెలిసిన వ్యక్తికి సమస్య. ఏమిటా సమస్య?

**జ్ఞానమావృతమ్** – ఆ కోరికవల్ల వివేకశక్తి కప్పబడుతుంది. ఆధ్యాత్మిక విద్యార్థికి, గొప్ప ఐశ్వర్యం వివేకబుద్ధే. అతని ఆధ్యాత్మిక జీవనంలో మొదటిభాగం కర్మయోగం. అక్కడ ధర్మాధర్మాల వివేకం చూపించాలి. ఏది ధర్మమో, ఏది అధర్మమో తెలియాలి. ఆ వివేకం చూపటానికి బుద్ధి కావాలి. కర్మయోగం దాటి జ్ఞానయోగానికి వస్తే ఆత్మానాత్మ వివేకం చూపించాలి. ఏది సత్యమో, ఏది మిథ్యో తెలియాలి. దానికీ బుద్ధి కావాలి. వ్యవహారిక ఐశ్వర్యం ఉన్నా లేకపోయినా, ఆధ్యాత్మిక ఐశ్వర్యమైన ఈ బుద్ధి ఉండాలి. సాధనచతుష్టయసంపత్తిలో ఇది చాలా ముఖ్యమైనది. కామం అనే దొంగ; వివేకశక్తిని దొంగిలిస్తుంది. దాన్నుంచి జాగ్రత్తగా మనను మనం కాపాడుకోవాలి.

శ్లో. 40 **ఇంద్రియాణి మనో బుద్ధిరస్యాధిష్ఠానముచ్యతే ।**
**ఏతైర్విమోహయత్యేష జ్ఞానమావృత్య దేహినమ్ ॥**
ఇంద్రియాణి, మనః, బుద్ధిః, అస్య, అధిష్ఠానమ్, ఉచ్యతే,
ఏతైః, విమోహయతి, ఏషః, జ్ఞానమ్, ఆవృత్య, దేహినమ్ ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఇంద్రియాణి | = | ఇంద్రియములు | ఏషః | = | ఇది (ఈ కామము) |
| మనః | = | మనస్సు | ఏతైః | = | మనస్సు,బుద్ధి,ఇంద్రియములతో |
| బుద్ధిః | = | బుద్ధి | జ్ఞానమ్ | = | జ్ఞానమును |
| అస్య | = | దీనికి | ఆవృత్య | = | కప్పివేసి |
| అధిష్ఠానమ్ | = | నివాసస్థానము అని | దేహినమ్ | = | జీవాత్మను |
| ఉచ్యతే | = | చెప్పబడును | విమోహయతి | = | మోహితముగా జేయును |

**ఇంద్రియాణి మనః బుద్ధిః అస్య అధిష్ఠానముచ్యతే ।**
**ఏషః ఏతైః జ్ఞానమావృత్య దేహినం విమోహయతి ॥**

తా: ఇంద్రియములు, మనస్సు, బుద్ధి ఈ కామమునకు నివాసస్థానములు. ఇది (ఈ కామము) మనస్సు, బుద్ధి, ఇంద్రియముల ద్వారా జ్ఞానమును కప్పివేసి, జీవాత్మను మోహితునిగా చేయును.

ఇప్పుడు మనం ముముక్షువులం, జిజ్ఞాసులం. కామం మన శత్రువు. కామానికీ, మనకూ మధ్య యుద్ధం జరుగుతున్నది. ఈ యుద్ధంలో గెలవటమెలా? దానికి కృష్ణపరమాత్మ యుద్ధం ఉదాహరణే తీసుకున్నాడు. అర్జునుడు క్షత్రియుడు కాబట్టి, యుద్ధం ద్వారా చెబుతున్నాడు.

రెండు దేశాల మధ్య యుద్ధం జరగబోతున్నది. రెండు దేశాలు ఒకదానికొకటి చాలా దూరంగా ఉన్నాయి. అప్పుడు ఒకదేశం రెండో దేశానికి దగ్గరగా ఉన్న ఇంకో దేశంతో మైత్రి ఏర్పరుచుకుని, అక్కడ తన స్థావరం నెలకొల్పుతుంది. అక్కడ తన ఆయుధాలను, తన విమానాలను పెట్టుకుని, అక్కణ్ణుంచి యుద్ధం చేస్తుంది.

అందువల్ల శత్రుదేశం, ఈ దేశాన్ని ఎదుర్కోవాలంటే, ఈ స్థావరాలను నాశనం చేస్తే చాలు. దాని బలం వీగిపోతుంది.

ఇదే సూత్రం కామానికి కూడా వర్తిస్తుంది. కామం దాని స్థావరాలను ఎక్కడ నెలకొల్పింది? మూడు స్థావరాలున్నాయంటున్నాడు కృష్ణపరమాత్మ. ఏమిటవి?

1. **ఇంద్రియాణి** – ఐదు జ్ఞానేంద్రియాలు మొదటి స్థానం.

ఎందుకంటే అవే మొట్టమొదట విషయ వస్తువులను మనకు పరిచయం చేస్తాయి. టీ.వీ. కార్యక్రమాల మధ్యలో ప్రకటనలు వస్తాయి. అవి ఒక వస్తువు గురించి పదేపదే హోరెత్తించేస్తాయి. సూపర్‌సేల్ ఉంది అనో, 30% డిస్కౌంట్ అనో, రెండు కొంటే మూడు ఉచితమనో ఊదర గొట్టేస్తాయి.

2. **మనః** – మనస్సు. రెండవ స్థానం.

ప్రకటన వచ్చేది అరనిముషంసేపో, ఇంకా తక్కువ క్షణాలో! కాని ఇంద్రియాలనుంచి మనస్సు దాన్ని అందుకుని, దానిలో రికార్డు చేసుకుంటుంది. మామూలు టేప్‌రికార్డరు దీనిముందు ఎందుకూ పనికిరాదు. మీరు ఎక్కడో, ఏ ఊరో వెళ్ళినప్పుడు, గీత గుర్తుకు వస్తుందో రాదో కాని, ఇది మాత్రం మీకు అన్ని వివరాలతో పాటు గుర్తుకువస్తుంది.

ఇది ఒక రిలే రేసులాంటిది. ఇంద్రియాలు పట్టుకుని, మనస్సుకు అప్పజెప్పుతాయి. ఇంక అక్కడినుంచి వాసనామయ మనస్సు గొడవ చేయటం మొదలుపెడుతుంది. ముందు అది బాగుంది, అది బాగుంది అంటుంది; తరువాత అది కొంటే బాగుంటుంది, అది కొంటే బాగుంటుంది అంటుంది; ఆ తరువాత నాకు కావాలి, నాకు కావాలి అంటుంది; చివరికి అది లేకపోతే నేను బ్రతకలేను అంటుంది. ఎక్కడ మొదలై, ఎక్కడ తేలిందో చూశారా? అది లేకుండా ఇన్నాళ్ళు బ్రతికాము, కాని ఆ వస్తువు ఉన్నట్టు ఊహించుకుంటేనే బాగున్నట్టు అనిపిస్తుంది. కాబట్టి ఆ వస్తువు లేకపోతే ఉండలేము అనే పరిస్థితికి వస్తాము. స్కూటర్ నడపడంరాని వ్యక్తి స్కూటర్ పోయినట్టు బాధపడ్డట్టే ఉంటుంది మన పని కూడా.

3. **బుద్ధిః** – బుద్ధి లేదా వివేకబుద్ధి మూడవ స్థానం.

బుద్ధి తప్పుడు నిర్ణయం తీసుకోవటం ద్వారా ఆ కోరికకు తోడ్పడుతుంది. ఏమిటా తప్పుడు నిర్ణయం? బాహ్యవస్తువు నాకు ఆనందాన్నిస్తుంది అనుకోవటం. వేదాంతం ప్రకారం ఇది చాలా పెద్ద తప్పు. ఎందుకంటే బాహ్యవస్తువు కాని, వ్యక్తి కాని మనకు ఆనందాన్ని ఇవ్వలేరు, దుఃఖాన్ని ఇవ్వలేరు.

**అహమేవ సుఖహేతుః అహమేవ దుఃఖహేతుః**

నేనే సుఖదుఃఖాలు రెండింటికీ ఎలా కారణమవుతాను? దానికి రజ్జుసర్పభ్రాంతి ఉదాహరణ ఇస్తుంది వేదాంతం. చీకట్లో తాడుని చూచి పాము అనుకుంటాను. అది నాకు భయాన్ని లేదా దుఃఖాన్ని కలుగజేస్తుంది. అది పాము కాదు తాడు అని తెలిశాక నాకు దుఃఖం పోయి సుఖం కలుగుతుంది. అలాగే నేను ఆనందస్వరూపం అని తెలుసుకోలేక, దుఃఖాలను అనుభవిస్తున్నాను.

**అర్థం చేసుకుంటే నేను సుఖహేతువును, అర్థం చేసుకోకపోతే నేను దుఃఖహేతువును**

ప్రపంచం విషయమేమిటి? అది దుఃఖహేతువా? సుఖహేతువా? రెండూ కాదు. ప్రపంచం సుఖహేతువైతే నాకు ఏ వస్తువు ఆనందాన్ని ఇస్తుందో, అదే వస్తువు అందరికీ సమానంగా సుఖాన్ని ఇవ్వాలి. కాని అలా అవటం లేదు కదా! ఒక వ్యక్తికి తన ఇల్లు అమ్మి డబ్బులు వస్తే ఆనందం కలుగుతుంది. ఇంకొక వ్యక్తికి అదే ఇల్లు కొంటే ఆనందం కలుగుతుంది. ఒక వ్యక్తి ఒక స్త్రీని పెళ్ళి చేసుకుంటే దుఃఖం కలిగి, ఆమెకు విడాకులిస్తాడు. ఇంకో వ్యక్తి అదే స్త్రీని పెళ్ళి చేసుకుని ఆనందిస్తాడు. అంటే ఒకరికి ఆనందహేతువైన వస్తువు, ఇంకొకరికి దుఃఖహేతువు అవుతున్నది. దీన్నిబట్టి ఆనందం వస్తువులో లేదు అని తెలుస్తున్నది.

సుఖహేతుత్వం, దుఃఖహేతుత్వాలను నేనే వస్తువులమీద ఆరోపించుకుంటున్నాను. అందువల్ల బాహ్యవస్తువుల్లో ఆనందం వెతుక్కుంటున్నాను.

ఇంద్రియాలు వస్తువులను పరిచయం చేస్తాయి. మనస్సు దానిమీద తపనను పెంచుతుంది.
బుద్ధి అది ఆనందహేతువనే తప్పుడు నిర్ణయం చేస్తుంది.

**ఇంద్రియాణి మనో బుద్ధిరస్యాధిష్ఠానముచ్యతే –** అస్య – కామంయొక్క అధిష్ఠానాలు; ఏతైః – ఈ మూడు అంటే ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి – కామానికి అధిష్ఠానాలు;

**ఏషః విమోహయతి** – ఈ కోరికలు బుద్ధిని మోహంలో పడవేస్తాయి. ఎవరిని?

**దేహినమ్** – ఈ వ్యక్తిని; ఎలా?

**జ్ఞానమ్ ఆవృత్య** – జ్ఞానాన్ని కప్పివేయటం ద్వారా.

అంతకుముందు చూశాము, వివేకబుద్ధి ఉన్న అతనికి విషయవస్తువు ఆనందహేతువు కాకపోగా, దుఃఖహేతువు అని తెలుస్తుంది. ఎందుకంటే ఆ వస్తువుకు మూడు దోషాలు ఉన్నాయి –

1. **దుఃఖమిశ్రితత్వం** – ఒక వస్తువు పొందటంలో దుఃఖం ఉంది; దాన్ని నిలబెట్టకోవటంలో దుఃఖం ఉంది; అది పోతే ఇంకా ఎక్కువ దుఃఖం కలుగుతుంది.

2. **అతృప్తికరత్వం** – ఎంత పొందినా తృప్తిలేదు. వాచీ ఉచితంగా పొందినా, అతనికి తృప్తి లేదు, పొందని స్కూటర్ గురించిన బాధ తప్ప.

3. **బంధకత్వం** – ఒక వస్తువుమీద ఆధారపడ్డకొద్దీ, దానిమీద బంధం ఎక్కువవుతుంది. దానిమీద ఆధారపడకుండా ఉండలేము. కర్రలు పట్టుకుని నడుస్తున్నన్నాళ్ళూ కాళ్ళకు బలం చేకూరదు; కర్రలు వదిలేసి స్వతంత్రంగా నడిస్తేనే బలం వస్తుంది.

జ్ఞానికి విషయవస్తువుల్లో ఈ మూడు దోషాలు ఉన్నాయని తెలుసు కాని, కోరికతో కళ్ళు మూసుకుపోయిన వ్యక్తికి తెలియదు. ఇంతవరకూ కామం ఎలా మనను ఆక్రమిస్తుందో, దాని స్థావరాలేమిటో చూశాము; ఇప్పుడు వాటిని ఎలా ఎదుర్కోవాలో చూస్తాము.

శ్లో. 41 **తస్మాత్ త్వమింద్రియాణ్యాదౌ నియమ్య భరతర్షభ ।**
**పాప్మానం ప్రజహి హ్యేనం జ్ఞానవిజ్ఞాననాశనమ్ ॥**
తస్మాత్, త్వమ్, ఇంద్రియాణి, ఆదౌ, నియమ్య, భరతర్షభ,
పాప్మానమ్, ప్రజహి, హి, ఏనమ్, జ్ఞానవిజ్ఞాననాశనమ్ ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| తస్మాత్ | = | అందువలన | జ్ఞానవిజ్ఞాన | = | జ్ఞానవిజ్ఞానములను |
| భరతర్షభ! | = | ఓ అర్జునా! | నాశనమ్ | | నశింపజేయునట్టి |
| త్వమ్ | = | నీవు | ఏనమ్, పాప్మానమ్ | = | మహాపాపియైన ఈ కామమును |
| ఆదౌ | = | మొదట | హి | = | అవశ్యముగా |
| ఇంద్రియాణి | = | ఇంద్రియములను | ప్రజహి | = | సంహరింపుము |
| నియమ్య | = | అదుపుచేసి | | | |

**భరతర్షభ! తస్మాత్ త్వమ్ ఆదౌ ఇంద్రియాణి నియమ్య ।**
**జ్ఞానవిజ్ఞాన నాశనమ్ ఏనం పాప్మానం ప్రజహి హి ॥**

తా: కావున ఓ అర్జునా! మొదట ఇంద్రియములను వశపరచుకొనుము. పిదప జ్ఞానవిజ్ఞానములను నశింపజేయునట్టి మహాపాపియైన ఈ కామమును అవశ్యముగా సర్వశక్తులనొడ్డి రూపుమాపుము.

కామం ఒక వ్యక్తిని మోహంలో పడవేస్తున్నది కాబట్టి కామాన్ని ఎలా జయించాలో తెలుసుకోవాలి.

**జ్ఞానవిజ్ఞాననాశనమ్** – కామం జ్ఞానాన్ని, విజ్ఞానాన్ని నాశనం చేస్తుందంటున్నాడు కృష్ణపరమాత్మ. ఆత్మజ్ఞానం, ఆత్మవిజ్ఞానం రెండూ కూడా కామంవల్ల నాశనమవుతాయి. రెండు సాంకేతిక పదాలను వాడుతున్నాడు ఇక్కడ– జ్ఞానం, విజ్ఞానం. రెండూ ఆత్మకు చెందినవే. ఆత్మజ్ఞానాన్ని రెండు దశల్లో పొందుతాము – మొదటి దశను జ్ఞానమనీ, రెండవ దశను విజ్ఞానమనీ అంటారు.

**జ్ఞానం** – ఇది ప్రారంభదశ. ప్రారంభదశలో గురువు ఆత్మానాత్మవివేకం చూపిస్తాడు. దేహేంద్రియ మనోబుద్ధులు అనాత్మ అనీ, చైతన్యం ఆత్మ అనీ చెబుతాడు.

చైతన్యం లక్షణాలు ఐదు. అవి –

1. చైతన్యం – శరీరంలో ఒక భాగం కాని, లక్షణం కాని, దాన్నుంచి ఉత్పత్తి అయిన వస్తువు కాని కాదు.
2. చైతన్యం – స్వతంత్ర వస్తువు. అది శరీరం అంతటా వ్యాపించి, దానిని ప్రకాశింపచేస్తుంది.
3. చైతన్యం – శరీరం సరిహద్దులకే పరిమితమవలేదు.
4. చైతన్యం – శరీరం నాశనమయితే నాశనమవదు. శరీర పతనానంతరం కూడా చైతన్యం ఉంటుంది.
5. చైతన్యం – శరీరం లేకపోయినా ఉంటుంది కాని కనబడదు. దాన్ని ప్రతిబింబింపచేసే మాధ్యమం లేదు కాబట్టి అది కనిపించదు. అంతమాత్రాన చైతన్యం లేనట్టు కాదు.

ఇది పదేపదే విన్నాక, శిష్యుడు ఒక విషయం అర్థం చేసుకుంటాడు. **తను శరీరం అనీ, తన శరీరంలో ఆత్మ ఉంది** అనీ అనుకుంటాడు.

**విజ్ఞానం** – ఆ దశనుంచీ పై దశకు రావాలి. ఏమిటది? నేను శరీరం, నాలో ఆత్మ ఉంది దశనుంచి, **నేను ఆత్మను, నాకు శరీరం ఉంది** దశకు రావాలి. శరీరం నేను వాడే మాధ్యమం. జాగ్రదావస్థలో శరీరం ద్వారా నేను వ్యవహారం నడుపుతాను; సుషుప్తిలో వ్యవహారం నడపను. మైక్రోస్కోప్ వాడితే సూక్ష్మక్రిములను చూడగలను; అది పక్కన పెడితే చూడలేను. అలాగే బాడీస్కోప్ వాడితే ప్రపంచాన్ని చూడగలను; లేకపోతే లేదు. అందువల్ల నేను శరీరాన్ని కాను, శరీరాన్ని వాడే ఆత్మను.

**వాసాంసి జీర్ణాని యథా విహాయ నవాని గృహ్ణాతి నరోఽపరాణి ।**

**తథా శరీరాణి విహాయ జీర్ణాన్యన్యాని సంయాతి నవాని దేహీ ॥** – 2.22

వస్త్రాలను మార్చినట్టుగా, శరీరాన్ని మారుస్తాను. ఈ విషయం అర్థం చేసుకోవటానికి శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేయాలి. నేను ఆత్మ అని అర్థం చేసుకోగలగటం విజ్ఞానం.

**నాలో ఆత్మ ఉంది అని తెలుసుకోవటం జ్ఞానం లేదా పరోక్ష జ్ఞానం. నేను ఆత్మను అని అర్థం చేసుకోవటం విజ్ఞానం లేదా అపరోక్ష జ్ఞానం.**

ముందే విజ్ఞానం రాదు. ముందు నాలో ఆత్మ ఉంది అని అర్థం చేసుకుంటాము. ఏదైనా జ్ఞానం పొందాలన్నా, తరువాత విజ్ఞానం పొందాలన్నా కూడా అవి బుద్ధిలోనే జరగాలి; మనం బుద్ధిగా గీతా క్లాసులకు వెళ్ళాలి. లేకపోతే మనను కోరికలు 26 గంటలు (ఓవర్ టైం) పీడిస్తాయి. మనం కామానికి బానిస అయితే, గీత వినే తీరక ఉండదు; కామమే మనకు బానిస అయితే మనకు సమయం దొరుకుతుంది. అందరూ శాస్త్రాన్ని అధ్యయనం చేసి తీరాలి. చాలామందికి గీతను వృద్ధాప్యంలోనే నేర్చుకోవాలనే అపోహ ఉంది. రిటైర్ అయి, ఏమీ పని లేనప్పుడు నేర్చుకోవచ్చులే అనుకుంటారు. కామంతో మునిగి తేలుతున్నప్పుడు **'టైమ్ ఈజ్ మనీ'** అంటారు. **టైమ్ ఈజ్ మోక్ష** అనుకోరు ఎవరూ? టైమ్ లోనే జ్ఞానం పొందుతారు. గీత అధ్యయనానికి వెళ్ళే ఆ గంట, ఎక్కడైనా పనిచేస్తే ఇంకొంచెం డబ్బు వస్తుందనే ఉద్దేశ్యంలో ఉంటారు కొంతమంది. అందువల్ల కామం జ్ఞానవిజ్ఞానాన్ని నాశనం చేస్తుందన్నాడు కృష్ణపరమాత్మ.

**భజగోవిందం భజగోవిందం గోవిందం భజ మూఢమతే** – భజగోవిందం

కామం మోజులో పడ్డ మనిషిని మూఢమతి అంటున్నాడు శంకరులవారు. మూఢమతి అంటే మోహంలో పడ్డవాడు అని అర్థం. మోహం అంటే అవివేకం. ఏ విషయంలో అవివేకం? నాలుగు పురుషార్థాలలో దేనికి ప్రాముఖ్యతనివ్వాలో తెలియని అవివేకం. ఎంతసేపూ అర్థ కామాల వెంట పరుగు తీస్తారు తప్ప మోక్షానికి రావాలనుకోరు. ధర్మార్థకామాలను ప్రేయోమార్గమని, మోక్షాన్ని శ్రేయోమార్గమని అంటారు. మనకు ప్రియమైనది ప్రేయోమార్గం, మనకు శ్రేయస్కరమైనది శ్రేయోమార్గం. ఈ వ్యత్యాసాన్ని తెలుసుకున్న వ్యక్తిని వివేకి అంటారు.

**వ్యవసాయాత్మికా బుద్ధిః ఏకేహ కురునందన ।** – 2.41

జీవితలక్ష్యం ఎలా ఉండాలో ఇంత స్పష్టంగా ఉన్నా, అవివేకులు అర్థకామాలకే ప్రాముఖ్యతనిస్తారు. దీన్ని రాగద్వేషాల సమస్య అంటారు. దీన్నే కృష్ణపరమాత్మ **కామక్రోధాల సమస్య** అన్నాడు. ఇదంతా నేను అసంపూర్ణుడను అని అనుకోవటంవల్ల వస్తోంది.

**1. తాత్కాలిక పరిష్కారం –** ఈ కామాన్ని ఎదుర్కోవటానికి మొదటిమెట్టుగా మూడు మార్గాలనిచ్చాడు కృష్ణపరమాత్మ. దీన్ని **ఫస్ట్ ఎయిడ్ పద్ధతి** అనవచ్చు. ఫస్ట్ ఎయిడ్, ప్రాథమిక చికిత్స. ముందుగా అది అవసరమే కాని అక్కడితో ఆగిపోకూడదు, ఆసుపత్రికి తీసుకువెళ్ళి, సరియైన చికిత్స పొందేలాగా చేయాలి.

**తస్మాత్ త్వమింద్రియాణ్యాదౌ నియమ్య భరతర్షభ** – కామానికి ఫస్ట్ ఎయిడ్ పద్ధతి పాటించి దాని స్థావరాలను నాశనం చేయి. ఆ పద్ధతి – దమము, శమము, వివేకము.

ఎ. **దమము** – దమము అంటే ఇంద్రియ నిగ్రహం. ఇంద్రియాల ద్వారా మనస్సులోకి వెళ్ళేవాటిని ఇంద్రియాల దగ్గరే ఆపటం. కళ్ళముందు బోర్డు పెట్టుకోవాలి – **అనుమతి లేనిదే ప్రవేశం లేదు**. నా మనస్సు ఒక చెత్తబుట్ట కాదు, ఏది పడితే అది అందులోకి వెళ్ళటానికి. అలా ఇంద్రియాలను నిగ్రహించుకోవాలి.

బి. **శమము** – శమము అంటే మనోనిగ్రహం. ఒకసారి ఒక విషయం మనస్సులోకి వెళితే, మనస్సు ఆలోచనలను సృష్టిస్తుంది. ఈ ఆలోచనలను నేను గమనించి, అవసరమైతే వాటిని మొగ్గలోనే తుంచివేయాలి. ఎందుకంటే ఆలోచనలనుంచే నా మాటలు వస్తాయి. నా మాటలనుంచే నా పనులు వస్తాయి. శత్రువును, రోగాన్ని మొగ్గలోనే తుంచాలి అంటారు. ఇక్కడ శత్రువు అంతరశత్రువు. ఒక చెడు ఆలోచన నా ఆధ్యాత్మిక జీవనానికి అడ్డం పడవచ్చు. అందువల్ల మనస్సును నియంత్రించుకోవాలి.

సి. **వివేకము** – వివేకము అంటే ఆలోచించటం. ఆలోచన విషయంలో రెండు తప్పులు చేస్తాము– ఆలోచించకుండా తప్పులు చేస్తాము; ఆలోచించి మరీ తప్పులు చేస్తాము. తలుపులు కిందికి ఉన్నాయి, వంగి నడవమంటే ఒక వ్యక్తి అతి జాగ్రత్తగా ఎక్కడినుంచో వంగి నడుస్తూ వచ్చి, సరిగ్గా తలుపు దగ్గరకు వచ్చేసరికి తల ఎత్తాడుట! ఏముంది? చటుక్కున తల కొట్టుకుని బొప్పి కట్టింది. ఆలోచించి మరీ తప్పులు చేయటమంటే అది.

వివేకమంటే ఏమిటి? నిత్యానిత్యవస్తువివేకం చేయటం. బాహ్యంగా ఉన్న వస్తువు అశాశ్వతమనీ, అశాశ్వతమైన వస్తువు శాశ్వతమైన శాంతి భద్రతల నివ్వలేదనీ తెలుసుకోవాలి. ఎందుకంటే **అశాశ్వతం + అశాశ్వతం = అశాశ్వతం.** మొత్తం విశ్వాన్ని మీ చేతిలో పెట్టినా మీరు పరిపూర్ణులు కాలేరు.

**న విత్తేన తర్పణీయో మనుష్యః**

ఎంత ప్రాపంచిక ఐశ్వర్యం ఉన్నా అది అసంపూర్ణమే. ఈ విషయం తెలుసుకోవటానికి మీకు పి.హెచ్.డి.లు అవసరం లేదు. ఇంకా మీకు అనుమానంగా ఉంటే, అందరికన్నా ఎక్కువగా ధనకనకవస్తువాహనాలు ఉన్న ఎవరినైనా మీరు ప్రశ్నించి చూడండి. అతనికి ఏదో ఒక కొరత ఉండి తీరుతుంది!

**తప్పుగా అర్థం చేసుకున్న ప్రపంచం దుఃఖహేతువు**

**సరిగ్గా అర్థం చేసుకున్న నేను సుఖస్వరూపుడను**

ఆ విధంగా దమము, శమము, వివేకము – మూడూ వరుసగా ఇంద్రియాలను, మనస్సునూ, బుద్ధినీ అదుపులో పెడతాయి. ఈ మూడింటిలో మొట్టమొదట ఏది పాటించాలి? ఇంద్రియాలలో నోటిని అదుపులో పెడితే తక్కిన ఇంద్రియాలు వాటంతట అవే అదుపులోకి వస్తాయి. నోరు అంటే మాట్లాడే నోరు, తినే నోరు – రెండూ వస్తాయి.

**పాప్మానం ప్రజహి హ్యేనం** – అలా వాటిని అదుపులో పెట్టటం ద్వారా, కామాన్ని అదుపులో పెట్టు.

**జ్ఞానవిజ్ఞాననాశనమ్** – ఆ కామం ఎటువంటిదో ముందే చూశాము. జ్ఞానవిజ్ఞానాలను కప్పివేసే మోహం.

శ్లో. 42 **ఇంద్రియాణి పరాణ్యాహుః ఇంద్రియేభ్యః పరం మనః ।**
**మనసస్తు పరా బుద్ధిః యో బుద్ధేః పరతస్తు సః ॥**
ఇంద్రియాణి, పరాణి, ఆహుః, ఇంద్రియోభ్యః, పరమ్, మనః,
మనసః, తు, పరా, బుద్ధిః, యః, బుద్ధేః, పరతః, తు, సః ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఇంద్రియాణి | = | ఇంద్రియములు | పరమ్ | = | శ్రేష్ఠమైనది, సూక్ష్మమైనది |
| పరాణి | = | (విషయవస్తువులకన్నా) శ్రేష్ఠములు, బలీయములు, సూక్ష్మములు | మనసః, తు | = | మనస్సుకన్నా |
| | | | బుద్ధిః, పరా | = | బుద్ధి శ్రేష్ఠమైనది |
| | | | తు | = | ఇంకా |
| ఆహుః | = | (అని) అందురు | యః | = | ఏదైతే |
| ఇంద్రియేభ్యః | = | ఇంద్రియములకన్నా | బుద్ధేః, పరతః | = | బుద్ధికన్నా శ్రేష్ఠమైనదో |
| మనః | = | మనస్సు | సః | = | అది (ఆత్మ) |

**ఇంద్రియాణి పరాణి ఆహుః ఇంద్రియేభ్యః మనః పరమ్ ।**
**మనసః తు బుద్ధిః పరా యః తు బుద్ధేః పరతః సః ॥**

తా: విషయవస్తువులకన్నా, ఇంద్రియములు బలీయములు, సూక్ష్మములు, శ్రేష్ఠములు అని పేర్కొందురు. ఇంద్రియములకన్నా మనస్సు, దానికన్నా బుద్ధి శ్రేష్ఠమైనవి. ఆ బుద్ధికన్నా అత్యంత శ్రేష్ఠమైనది, సూక్ష్మమైనది ఆత్మ.

శమ, దమ, వివేకాలు – ఫస్ట్‌ఎయిడ్ వంటివే అని చూశాము. అవి తాత్కాలికంగా ఉపశమనం కలగజేస్తాయే కాని శాశ్వత పరిష్కారాన్ని ఇవ్వవు. మందుల్లో కూడా రెండు రకాలు ఉంటాయి. తాత్కాలిక ఉపశమనం, శాశ్వత పరిష్కారం. దగ్గు వస్తే దగ్గు మందు వేసుకుంటారు. అది తాత్కాలికంగా మీ దగ్గును తగ్గిస్తుంది అంతే. అలాగే శమ దమ వివేకాలు పాటించి తీరాలి కాని అక్కడితో ఆగకూడదు. శాశ్వతపరిష్కారం వెతుక్కోవాలి.

**2. శాశ్వత పరిష్కారం – ఆత్మజ్ఞానం మాత్రమే** శాశ్వత పరిష్కారాన్ని ఇవ్వగలదు. అలా ఎలా చెప్పగలరు? దానికి వెనక ఉన్న తర్కం ఇది: ఏదైనా కోరిక ఎందుకు కలుగుతున్నది? అపూర్ణత్వంవల్ల. ఎన్ని ఉన్నా ఇంకా ఏదో లేదు అనే కొరత. తంబూరశ్రుతి లాగా నాకు కావాలి, నాకు కావాలి శ్రుతి ఉంటూనే ఉంటుంది.

ఎన్నాళ్ళు? నేను పూర్ణుడుని అని అర్థం చేసుకునేంత వరకు! పూర్ణత్వభావన కలగగానే, అపూర్ణత్వం పోతుంది. అపూర్ణత్వం పోగానే, కోరికలు కూడా పోతాయి. పూర్ణత్వం అంటే నేను పరిపూర్ణుణ్ణి. నాకు ఏ కోరికా లేదు.

**నైవ తస్య కృతేనార్థో నాకృతేనేహ కశ్చన ।**

**న చాస్య సర్వభూతేషు కశ్చిదర్థవ్యపాశ్రయః ॥** – 3.18

అలాగే రెండవ అధ్యాయంలో

**ప్రజహాతి యదా కామాన్ సర్వాన్ పార్థ మనోగతాన్ ।**

**ఆత్మన్యేవాత్మనా తుష్టః స్థితప్రజ్ఞస్తదోచ్యతే ॥** – 2.55

నేను పరిపూర్ణుణ్ణి అయితే, నాకేమీ అవసరం లేదు. అంతా వైభోగమే! నీ చుట్టూ ఉన్నదాన్నంతటినీ వైభోగంగా మలచుకోవటమే వైభోగం అంటారు దయానందస్వామీజీ. ఉంటే ఆనందించు, లేకపోతే బాధపడకు. అది వైభోగం! ఏదైనా లేకపోతే దాన్ని కావాలనుకుంటే అది అవసరం అవుతుంది. అది అవసరం అనుకుంటే అది సంసారం; అది వైభోగం అనుకుంటే మోక్షం.

మన శరీరం ఒక వైభోగం; మన కళ్ళు, మన పళ్ళు, మన జుట్టు అన్నీ వైభోగమే! అలా ఆత్మజ్ఞానం పొందితేనే అనుకోగలము. అందువల్ల కామ-క్రోధాల సమస్యకు అంతిమ పరిష్కారం ఆత్మజ్ఞానం అని చెబుతున్నాడు కృష్ణపరమాత్మ 42, 43 శ్లోకాల్లో. ఆత్మజ్ఞానం పొందాలంటే ఆత్మ అంటే ఏమిటో తెలియాలి. కఠోపనిషత్తులో రెండు మంత్రాల్లో ఆత్మ గురించిన అద్భుతమైన నిర్వచనం వస్తుంది.

**ఇంద్రియేభ్యః పరా హ్యర్థా అర్థేభ్యశ్చ పరం మనః ।**

**మనసస్తు పరా బుద్ధిః బుద్ధేరాత్మా మహాన్పరః ॥** – కఠ 1.3.10

**మహతః పరమవ్యక్తమవ్యక్తాత్పురుషః పరః ।**

**పురుషాన్న పరం కించిత్ సా కాష్ఠా సా పరా గతిః ॥** – కఠ 1.3.11

ఈ రెండు మంత్రాలను ఒక్క శ్లోకంలోకి కుదించాడు కృష్ణపరమాత్మ. ఆత్మని నిర్వచించిన ఈ పద్ధతిని **అరుంధతీ దర్శన న్యాయం అనీ శాఖాచంద్ర న్యాయం** అనీ అంటారు.

అరుంధతీ నక్షత్రాన్ని చూపించాలంటే ఏం చేస్తారు? ముందు ఆకాశం వైపు చూపించి, ఆ నక్షత్రాలను చూడు అంటారు; తరువాత ఒక గాలిపటంలా ఉన్న నక్షత్రాల కూటమిని చూడు అంటారు. ఆకాశంలో నాలుగు నక్షత్రాలు గాలిపటం ఆకారంలో ఉండి, తోకలాగా మూడు నక్షత్రాలు ఉంటాయి. తరువాత ఆ తోకను చూడు అంటారు. ఆ తరువాత తోకలో ఉన్న మధ్య నక్షత్రాన్ని చూడు అంటారు. ఆ మధ్య నక్షత్రం పక్కన, దానికన్నా చిన్నగా ఉండి, మిణుకుమిణుకు మని మెరుస్తున్న నక్షత్రమే అరుంధతీనక్షత్రం అని చివరకి చెప్తారు.

శాఖాచంద్ర న్యాయం కూడా అంతే. ఒక పెద్ద చెట్టును చూపిస్తారు. దాని కొమ్మలను చూడు అంటారు. ఆకాశందాకా విస్తరించిన కొమ్మలను చూడు అంటారు. ఆ చిటారుకొమ్మల మధ్యలో గుండ్రంగా ఉండి, మిలమిల మెరుస్తున్నదే చంద్రుడని చెబుతారు.

ఇదే పద్ధతి ద్వారా ఉపనిషత్తు ఆత్మదర్శనం చేయిస్తుంది. దాన్ని పంచకోశవివేకం అంటారు. అరుంధతి దర్శనన్యాయం వంటిదే ఇది. స్థూలమైన వస్తువునుంచి సూక్ష్మాతి సూక్ష్మమైన వస్తువుకు చేసే ప్రయాణం ఇది. ఇక్కడ వాడిన పదం **పరా**. ఇది చాలా ముఖ్యమైన పదం. పరా పదాన్ని అక్షరాలా తీసుకుంటే దానికన్నా ఎక్కువ అని అర్థం. అలా స్థాయి పెంచుకుంటూ వస్తారు. ఒకదానికన్నా ఇంకొకటి ఎక్కువ అని చెప్పుకుంటూ వచ్చి, అన్నిటికన్నా ఎక్కువ లేదా అన్నిటికన్నా శ్రేష్ఠం ఆత్మ అని నిరూపిస్తుంది ఉపనిషత్తు.

పరా పదానికి ఇంకో ప్రత్యేకత కూడా ఉంది. కఠోపనిషత్తు భాష్యంలో శంకరులవారు దానికి మూడు అర్థాలు ఇస్తారు –

**పరా** – దానికన్నా శ్రేష్ఠమైంది; **మహతః** – దానికన్నా విస్తీర్ణమైనది; **ప్రత్యగాత్మా భూతశ్చ** – దానికన్నా నాకు మరింత దగ్గరైనది. ఈ దశలను గుర్తుపెట్టుకుని మన ప్రయాణం చేయాలి.

అంతేకాదు, నాలుగవ అంశం ఇంకొకటి ఉంది. సూక్ష్మతర అంశం, స్థూలతర అంశంకన్నా శక్తివంతమైనది. అందువల్ల సూక్ష్మతర అంశం, దానికన్నా తక్కువ అంశాన్ని అదుపులో పెడుతుంది. ఈ వివరాలను దృష్టిలో పెట్టుకుని ఈ స్థాయిలను చూద్దాము.

**ఇంద్రియాణి పరాణ్యాహుః** – విషయవస్తువులకన్నా ఇంద్రియాలు శ్రేష్ఠం. ఎందుకు? ఇంద్రియాలు చూస్తేనే విషయవస్తువులకు ఉనికి ఉంటుంది. కళ్ళు లేని వ్యక్తికి కంటికి కనబడే రూపాలు కనబడవు కదా! అంటే అతనికి వాటి ఉనికి లేనట్టే. అందువల్ల బాహ్యవస్తువులకన్నా ఇంద్రియాలు శ్రేష్ఠం.

**ఇంద్రియేభ్యః పరం మనః** – ఇంద్రియాలకన్నా మనస్సు శ్రేష్ఠం. ఇంద్రియాల వెనక మనస్సు లేకపోతే అవి పనిచేయవు.

ఉదాహరణకు మీరు ఎవరో బంధువును దింపుకోవటానికి స్టేషనుకు వెళతారు. అక్కడ ఎంతమంది మీ కళ్ళముందు తిరుగుతున్నా మీరు పట్టించుకోరు. మీ ఆలోచనంతా ఆ దిగబోయే వ్యక్తిమీదే ఉంటుంది. అందువల్ల ఎవరో తెలిసిన మొహం కనబడి, మీకు చిరునవ్వులు చిందించినా, మీరు తిరిగి నవ్వరు సరికదా, అటు చూడను కూడా చూడరు. వారు అతిగా ఊహించుకునే వ్యక్తులయితే, చూశావా, ఆరోజు అతన్ని ఫలానా వ్యక్తితో చూశాను, అతనికీ నాకూ పడదు. అతనేవేవో ఇతనికి నామీద నూరిపోసి ఉంటాడు. అందుకే నన్ను చూసి కూడా చూడనట్టు మొహం తిప్పేసుకున్నాడు అనుకుంటారు. నిజానికి జరిగిందేమిటి? మీరు అతన్ని చూడనేలేదు. అందువల్ల ఒక్కోసారి కొందరు అభావంగా చూసినట్టు అనిపిస్తుంది. అందువల్లనే మీరు ఏదైనా ప్రసంగానికి వెళ్ళినా, మీ మనస్సు బాగుండకపోతే, ఆ వక్త మాట్లాడే మాటలు ఏవో శబ్దంగా వినిపిస్తాయి తప్ప అవి అర్థం కావు.

> **అన్యత్రమనా అభూవం నాఽదర్శమన్యత్రమనా అభూవం నాఽశ్రౌషమితి ।**
> **మనసా హ్యేవ పశ్యతి మనసా శ్రుణోతి ॥** – బృహదారణ్యకమ్ 1.5.3

అందువల్ల ఖచ్చితంగా మనస్సువల్లనే మీరు చూస్తున్నారు, వింటున్నారు. కన్ను, చెవులు, వాటి వెనక మనస్సు ఉంటేనే పనిచేస్తాయి.

**మనసస్తు పరా బుద్ధిః** – మనస్సుకన్నా శ్రేష్ఠమైనది బుద్ధి.

మనస్సుకు రెండు ధర్మాలున్నాయి. **సంకల్ప వికల్పాత్మకం మనః.** చేయాలా, వద్దా అనే సంశయంలో పడవేస్తుంది మనస్సు. అది ఒక ధర్మం. రెండవది రాగద్వేషాలకు నిలయం మనస్సు. మనకు కలిగే అనేక భావోద్రేకాలకు కారణం మనస్సు. బుద్ధి అంటే నిశ్చయాత్మక బుద్ధి. డోలాయమానంగా ఊగే మనస్సుకు, మంచిచెడ్డలు చెప్పి, ఇది చేయమని నిశ్చయంగా చెప్తుతుంది బుద్ధి. బుద్ధిలో జ్ఞానం కలుగుతుంది. జ్ఞానంవల్ల మంచి, చెడులు బేరీజు వేసే విచక్షణ కలుగుతుంది.

**అశోచ్యానన్వశోచస్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే ।**

**గతాసూనగతాసూంశ్చ నానుశోచంతి పండితాః ॥** – 2.11

జ్ఞాని రాగద్వేషాల మోహంలో పడడు. జాగ్రత్తగా చూడండి; జ్ఞానికి రాగద్వేషాలు ఉండవు అనటం లేదు, జ్ఞాని రాగద్వేషాలతో కృంగిపోడు. రాగద్వేషాలు లేకపోతే అతనికీ రాయికీ తేడా ఉండదు. రాగద్వేషాలు ఉంటాయి కాని వాటికి కృంగిపోడు. ఎందుకంటే, అతనికి వాటితో ఎలా వ్యవహరించాలో తెలుసు. అతనికి కలిగిన జ్ఞానంవల్ల అజ్ఞానజనిత ఈర్ష్యాసూయలను, కామక్రోధాలను జయించగలడు.

అందువల్ల, బుద్ధివల్ల మనస్సుకున్న రెండు లక్షణాలనూ అదుపులో పెట్టవచ్చు. బుద్ధిలో ఉన్న జ్ఞానంవల్ల మనస్సులో ఉన్న సంశయాలను పారద్రోలవచ్చు. బుద్ధిలో ఉన్న జ్ఞానంవల్ల అజ్ఞానజనిత రాగద్వేషాలను అణగద్రొక్కవచ్చు. కఠోపనిషత్తులో అందమైన **రథకల్పన** చూస్తాము. అందులో శరీరాన్ని రథంతోనూ, ఇంద్రియాలను గుర్రాలతోనూ, మనస్సును పగ్గాలతోనూ, బుద్ధిని రథసారథితోనూ పోల్చారు. రథసారథి పగ్గాలను, పగ్గాల ద్వారా గుర్రాన్ని, గుర్రాల ద్వారా అది వెళ్ళే మార్గాలనూ అదుపులో పెడతాడు. అలాగే బుద్ధి మనస్సునూ, తద్వారా ఇంద్రియాలనూ అదుపులో పెడుతుంది. మనోమయకోశంకన్నా విజ్ఞానమయకోశం శ్రేష్ఠం.

**యో బుద్ధేః పరతస్తు సః** – బుద్ధికన్నా శ్రేష్ఠమైనది ఆత్మ. సః అంటే ఆత్మ.

ఆత్మవల్లనే నా బుద్ధిలో ఉన్న జ్ఞానమూ, అజ్ఞానమూ కూడా తెలుస్తున్నది. నాకు ఇంగ్లీషు తెలుసు అని తెలుస్తోంది; నాకు చైనా భాష రాదనీ తెలుస్తోంది. నా బుద్ధికి ఏది తెలుసో, ఏది తెలియదో నాకు తెలుస్తోంది. అంటే తెలియటం, తెలియక పోవటం బుద్ధియొక్క లక్షణాలు. అవి నాకు తెలుస్తున్నాయి. కాబట్టి నేను బుద్ధి కాదు. **నేను శరీరం కాదు, నేను ఇంద్రియాలు కాదు, నేను మనస్సు కాదు, నేను బుద్ధి కాదు.** ఈ నాలుగూ నేను తెలుసుకునే ఆబ్జెక్టులు.

దయానందస్వామీజీ కంటి డాక్టరుతో తన అనుభవం గురించి చాలా హాస్యంగా చెబుతారు. అమెరికాలో ఆధునిక పరికరాలున్న కంటిడాక్టరు దగ్గరికి వెళ్ళారట. ఆయన కూడా ఖాళీ ఫ్రేము పెట్టి, రకరకాల అద్దాలు మారుస్తూ, ఇప్పుడు కనిపిస్తోందా, ఇప్పుడు కనిపిస్తోందా అని అడుగుతూ వచ్చారుట. ఆయనకే తెలుస్తుంది

తనకు దేనివల్ల కనిపిస్తుందో అనుకున్నారట. కాని ఆయన స్వామీజీనే కనిపిస్తోందా అని అడగటంవల్ల ఒక విషయం అర్థమయిందట. తన కన్నుకున్న చూసే శక్తి, తన చెవికున్న వినికిడి శక్తి తనకే తెలుస్తుంది అని.

**అంధత్వమందత్వపటుత్వ ధర్మాః సౌగుణ్యవైగుణ్యవశాద్ధి చక్షుషః** – వివేక చూడామణి 101

కనులు పూర్తిగా పనిచేయకపోవటం, కొంచెం పనిచేయటం, సూదంటురాయిలా పనిచేయటం– అన్నీ నాకు తెలుస్తున్నాయి. ప్రపంచం ఆబ్జెక్టు, శరీరం ఆబ్జెక్టు. ఇంద్రియాలు ఆబ్జెక్టు, మనస్సు ఆబ్జెక్టు, బుద్ధి ఆబ్జెక్టు. మరి నేను? నేను ఆబ్జెక్టు కాదు. **ఎప్పటికీ సబ్జెక్టునే.**

**సబ్జెక్టు అయిన నేను ఎన్నటికీ ఆబ్జెక్టుగా చూడబడలేను.** నేను ఎన్నటికీ చూడబడలేకపోతే, నేను ఉన్నానో లేదో ఎలా తెలుస్తుంది? నేను ఉన్నట్టు చెప్పటానికి నిదర్శనమేమిటి? నిదర్శనం అవసరం లేదు. నా కంటి ముందు ఆబ్జెక్టు ఉందంటేనే సబ్జెక్టు అనే నేను ఉన్నట్టే అర్థం. నా కళ్ళను నేను చూసుకోలేను. కళ్ళు ఉన్నట్టు నిదర్శనం ఏమిటి? ఎదుటివారిని నేను చూడగలగటమే దానికి నిదర్శనం.

ఒక ఫోటోలో తొమ్మిదిమంది ఉంటే, అక్కడ కనీసం పదిమంది ఉండి ఉండాలంటారు ఒకరు. సెల్ఫీ తీసుకుని ఉండచ్చు కదా అంటారు ఇంకొకరు. సెల్ఫీ తీసుకున్నా, ఫోనులో కెమెరాతో తీసివుంటారు కదా! అంటే కెమేరా ఉన్నట్టా, లేనట్టా? కెమేరా ఫోటోలో లేదు, కాని దాని ఉనికిని శంకించలేము. అలాగే నా ఉనికిని నేను ఎన్నడూ శంకించనవసరం లేదు. దేని ఉనికివల్ల అన్నింటి ఉనికీ తెలుస్తోందో, దేని ఉనికినైతే ఎన్నడూ శంకించనవసరం లేదో అదే ఆత్మ. ఈ ఆత్మను నేనుగా గుర్తించాలి. అలా గుర్తిస్తే ఏమవుతుంది? తర్వాత వచ్చే శ్లోకంలో వస్తుంది.

శ్లో. 43 **ఏవం బుద్ధేః పరం బుద్ధ్వా సంస్తభ్యాత్మానమాత్మనా ।**
**జహి శత్రుం మహాబాహో కామరూపం దురాసదమ్ ॥**
ఏవమ్, బుద్ధేః, పరమ్, బుద్ధ్వా, సంస్తభ్య, ఆత్మానమ్, ఆత్మనా,
జహి, శత్రుమ్, మహాబాహో, కామరూపమ్, దురాసదమ్ ॥

| | | | |
|---|---|---|---|
| ఏవమ్ | = ఈ విధముగా | సంస్తభ్య | = వశపరచుకొని |
| బుద్ధేః | = బుద్ధికన్నా | మహాబాహో! | = ఓ మహాబాహో! |
| పరమ్ | = సూక్ష్మము, బలీయము, శ్రేష్ఠమైనది ఆత్మయని | దురాసదమ్ | = దుర్జయమైన |
| | | కామరూపమ్ | = కామమనెడి |
| బుద్ధ్వా | = తెలిసికొని | శత్రుమ్ | = శత్రువును |
| ఆత్మనా | = బుద్ధి ద్వారా | జహి | = నిర్మూలింపుము |
| ఆత్మానామ్ | = మనస్సును | | |

**మహాబాహో! ఏవం (ఆత్మానం) బుద్ధేః పరం బుద్ధ్వా ।**
**ఆత్మనా ఆత్మానం సంస్తభ్య కామరూపం దురాసదం శత్రుం జహి ॥**

తా: ఈ విధముగా బుద్ధికన్నా ఆత్మ పరమైనదని అనగా సూక్ష్మము, బలీయము, మిక్కిలి శ్రేష్ఠము అయినదని తెలిసికొని, ఓ మహాబాహూ! బుద్ధి ద్వారా మనస్సును వశపరచుకొని, దుర్జయ శత్రువైన కామమును నిర్మూలింపుము.

**ఏవం బుద్ధేః పరం బుద్ధ్వా** – అందువల్ల, అర్జునా! నీ అంతిమలక్ష్యం ఈ చైతన్యతత్త్వాన్ని తెలుసుకోవటమే! ఈ ఆత్మ లేదా చైతన్యతత్త్వం ఎటువంటిది? బుద్ధికన్నా శ్రేష్ఠమైనది. ఈ ఆత్మ నేను అని స్వీకరించగలగాలి. ఈ చైతన్యానికున్న ఐదు లక్షణాలను ఇంతకుముందు చూశాము.

దీనికి ఉదాహరణగా చేయి–కాంతి తీసుకుంటాము.

ఇక్కడేముంది అని చేతిని చూపించి అడిగితే చేయి ఉంది అంటాము కాని కాంతి గురించి చెప్పము. కాంతి చేతికి భిన్నంగా ఉండి, చేయి అంతటా వ్యాపించి, దాన్ని ప్రకాశింపచేస్తుంది. అది చేతివరకే కాక, సర్వవ్యాపకంగా ఉంటుంది – అలాగే చైతన్యం కూడా సర్వవ్యాపకం.

చైతన్యం అనేది ఒకటి ఉందనీ, అది సర్వవ్యాపకమైనదనీ తెలుసుకుంటే చాలదు; ఆ **చైతన్యం నేనే** అని స్వీకరించాలి. సోపాధిక శరీరం నేను కాదు; నిరుపాధిక చైతన్యాన్ని నేను అని జీర్ణించుకోవాలి. మార్పు అంటే లావు శరీరాన్ని సన్నగా చేయటం కాదు; మార్పు అంటే ఈ శరీరం నేనునుంచి శరీరానికి అతీతంగా ఎదిగి, నేను నిరాకారబ్రహ్మను అనగలగాలి. అయితే మనోబుద్ధి అహంకారాలు ఏమిటి? నేను నా అవసరానికి కళ్ళజోడు వాడతాను కాని, నేను కళ్ళజోడు కాదు. అలాగే నిరాకారమైన నేను, వ్యవహారం నడపటానికి సాకారమైన శరీరాన్ని, మనస్సును వాడతాను, సుషుప్తిలో అవి పడుకుంటాయి కాబట్టి వ్యవహారం నడపను. కాని నేను ఉన్నాను.

సుషుప్తిలో నేను ఉన్నాను అని చెప్పటానికి ఏమిటి నిదర్శనం? నిద్రపోతే ఒకవేళ అది శాశ్వత నిద్ర అయ్యేటట్టయితే, ఎవరూ నిద్రపోరు. ఏదో విధంగా మేలుకుని కూర్చుంటారు. నిద్రలో వ్యవహారం నడిపే నేను లేను కాని; వ్యవహారం నడపని, నిర్వికారమైన నేను ఉన్నాను.

**శరీరాన్ని, మనస్సును వాడతాను, పక్కన పెడతాను**
**అవి నాకు పరికరాలే కాని అవి నేను కాదు.** – మనోబుద్ధ్యహంకార చిత్తాని నాఽహమ్

ఇదీ వేదాంత బోధ. తరువాత ఏం చేయాలి?

**ఆత్మనా ఆత్మానం సంస్తభ్య** – ఈ కొత్త నేనును స్వీకరించి, పాత భావాలను పారద్రోలాలి. నా పాత భావాలు ఏమిటి? నేను పరిమిత, బాధాతప్త అశాశ్వత జీవిని. పుట్టినప్పటినుంచి నేను పరిచ్ఛిన్నుడను, అశాశ్వతుడను అనే తెలుసు నాకు. ఆనందం నాలో దొరుకుతుందని తెలియదు; అందువల్ల బాహ్యవస్తువుల వెంట పరుగులు తీశాను.

ఈ ఆలోచనా విధానాన్ని మార్చుకుని జ్ఞాననిష్ఠలో ఉండాలి. అంటే ఈ బోధను జీర్ణించుకోవాలి. రెండవ అధ్యాయంలోని పదం వాడాలంటే **స్థితప్రజ్ఞ భావనలో** ఉండాలి. ప్రజ్ఞకూ స్థితప్రజ్ఞకూ మధ్య ఏమిటి తేడా?

ప్రజ్ఞ అంటే గీతాబోధ వింటున్నంతవరకూ ఆ బోధలో ఉండి; బయటకు వచ్చి, చెప్పులు వేసుకోగానే పాత బాధలు, కష్టాలు, నష్టాలు, దుఃఖాలు, కోపాలు, తాపాలు దూసుకు రావటం. స్థితప్రజ్ఞత అంటే క్లాసులో ఉండి బోధ వింటున్నప్పుడు మాత్రమే కాక, ఎప్పటికీ ఆ జ్ఞాననిష్ఠలో ఉండగలగటం. జీవితంలో ఒక కష్టం ఎదురైనప్పుడు ఆ జ్ఞానం ఆదుకుంటే అది జ్ఞాననిష్ఠ.

ఆ జ్ఞాననిష్ఠలో ఎలా ఉండాలి? నిదిధ్యాసనం చేయటం ద్వారా! నిదిధ్యాసనం అంటే ఈ బోధలో నిలబడటం. దానికోసం పదేపదే శ్రవణం చేయవచ్చు, మననం చేసుకోవచ్చు. ఎవరితోనైనా చర్చించవచ్చు, నేర్చుకున్నది వ్రాయవచ్చు, ఎవరికన్నా బోధించవచ్చు. ఏం చేశారన్నది కాదు ముఖ్యం ఎంతసేపు అందులో నిలిచారన్నది ముఖ్యం.

ఇక్కడ ఆత్మ అంటే మనస్సు. ఆత్మానం సంస్తభ్య అంటే మనస్సును మనస్సుతో అదుపులో పెట్టుకోవాలి. అంటే నిదిధ్యాసనం ద్వారా ఆ బోధలో నిలబడాలి. నిదిధ్యాసనం అంటే కళ్ళు మూసుకుని చేసే ధ్యానం కాదు.

**జహి శత్రుం మహాబాహో** – ఎప్పుడైతే నేను ఈ చైతన్యాన్ని అని అర్థం చేసుకుంటావో, అప్పుడు పూర్ణత్వం పొందుతావు. అర్జునా, శరీరానికి పరిమితి ఉంది కాని చైతన్యమైన నాకు పరిమితి లేదు. నేను పూర్ణుడను అని అర్థం చేసుకుంటే కోరికలకు చోటేది? అందువల్ల ఓ అర్జునా! నువ్వు శత్రువును నాశనం చేయి. ఏ శత్రువు?

**కామరూపమ్** – తీరని కోరికరూపంలో ఉన్న శత్రువు. ఎటువంటి కోరిక?

**దురాసదమ్** – అర్థం కాని కామం. ఎందుకు? చాలామందికి కామం అంటే ఏమిటో తెలియదు. అందువల్ల దాన్ని పొందాలనే చూస్తారు. పూర్ణత్వభావన ఏర్పడితేనే ఈ కామం పోతుంది. ఇది శాశ్వతమైన పరిష్కారం.

**దమము – శమము – వివేకము – తాత్కాలిక పరిష్కారం**
**ఆత్మజ్ఞానం – శాశ్వత పరిష్కారం.**

కామాన్ని తొలగిస్తే, క్రోధం తానంతట అదే తప్పుకుంటుంది.

**ఓం తత్సదితి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే**
**శ్రీకృష్ణార్జునసంవాదే కర్మయోగో నామ తృతీయోఽధ్యాయః**

హరి ఓం తత్సత్

ఇది శ్రీమద్భగవద్గీతయందు, ఉపనిషత్తులయందు, బ్రహ్మవిద్యయందు, యోగశాస్త్రమునందు, శ్రీకృష్ణార్జున సంవాదమునందు కర్మయోగము అనే మూడవ అధ్యాయము.

# అధ్యాయము 3 - కర్మయోగము సారాంశము

ఈ అధ్యాయం పేరు కర్మయోగం. పేరుకు తగ్గట్టుగానే ఈ అధ్యాయం కర్మయోగాన్ని కీర్తిస్తుంది. దీనికి ఆధారం అర్జునుడు వేసిన ప్రశ్న. అర్జునుని ప్రశ్నకు ఆధారం రెండవ అధ్యాయంలో కృష్ణపరమాత్మ చేసిన బోధ.

రెండవ అధ్యాయంలో కృష్ణపరమాత్మ జ్ఞానయోగం, కర్మయోగం - రెండింటి గురించీ చెప్పినా, జ్ఞానయోగం గురించి ఎక్కువ చెప్పాడు. నిజానికి కృష్ణపరమాత్మ బోధ మొదలవటమే జ్ఞానయోగంతో మొదలవుతుంది.

**అశోచ్యానన్వశోచస్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే ।**
**గతాసూనగతాసూంశ్చ నానుశోచంతి పండితాః ॥** - 2.11

జ్ఞానులు ఎలా ప్రవర్తిస్తారో చెప్పాడు.

**ఏషా బ్రాహ్మీ స్థితిః పార్థ నైనాం ప్రాప్య విముహ్యతి ।**
**స్థిత్వాస్యామంతకాలేఽపి బ్రహ్మనిర్వాణమృచ్ఛతి ॥** - 2.72

స్థితప్రజ్ఞుడు బ్రహ్మీస్థితిలో ఉంటాడు అని మళ్ళీ జ్ఞానయోగంతో ముగించాడు. ఆ విధంగా కృష్ణపరమాత్మ జ్ఞానయోగంతో మొదలుపెట్టి, జ్ఞానయోగంతో ముగించి, మధ్యలో కర్మయోగం గురించి చెప్పి, అర్జునా యుద్ధం చెయ్యి అన్నాడు.

**యోగస్థః కురు కర్మాణి సంగం త్యక్త్వా ధనంజయ ।**
**సిద్ధ్యసిద్ధ్యోః సమో భూత్వా సమత్వం యోగ ఉచ్యతే ॥** - 2.48

అర్జునా, కర్మ చేయి. కృష్ణపరమాత్మ స్పష్టంగానే చెప్పినా, అర్జునుడు సరిగ్గా వినకపోవటంవల్ల అతనికి సందేహం కలుగుతుంది. ఏమిటా సందేహం?

జ్ఞానయోగం గొప్పదయితే, జ్ఞానయోగంవల్లనే మోక్షం కలిగేటట్లయితే, తనను కర్మ చేయమని ఎందుకు అడుగుతున్నాడు? జ్ఞానయోగాన్ని మెచ్చుకుంటే జ్ఞానం పొందమని చెప్పాలి; కర్మయోగాన్ని మెచ్చుకుంటే కర్మ చేయమని చెప్పాలి. కాని జ్ఞానయోగాన్ని మెచ్చుకుని కర్మ చేయమని ఎందుకు చెప్పడం? ఒక వస్తువును బాగా మెచ్చుకుని, అందువల్ల ఇంకో వస్తువు కొనండి అన్నట్టు ఉంది. అందువల్ల ఈ అధ్యాయం అర్జునుని సందేహంతో మొదలయింది.

మూడవ అధ్యాయాన్ని ప్రధానంగా ఐదు భాగాలుగా విభజించవచ్చు. అవి -

| | |
|---|---|
| **1. ఉపోద్ఘాతం** | **శ్లోకాలు 1-7** |
| **2. కర్మయోగం** | **శ్లోకాలు 8-20 (మొదటి పాదం)** |
| **3. జ్ఞాని విధులు** | **శ్లోకాలు 20 (రెండవ పాదం) - 29** |

**4. కర్మ యోగప్రాముఖ్యత** **శ్లోకాలు 30–35**
**5. కామక్రోధ లక్షణాలు, నివారణ** **శ్లోకాలు 36–43**

**1. ఉపోద్ఘాతం శ్లోకాలు 1–7**

అర్జునుడు జ్ఞానయోగం గొప్పదా; కర్మయోగం గొప్పదా; జ్ఞానయోగం గొప్పదైతే నన్ను యుద్ధం చేయమని ఎందుకంటున్నావు అని అడిగాడు.

ఈ ఉపోద్ఘాత శ్లోకాల్లో, కృష్ణపరమాత్మ కొన్ని ప్రాథమిక అంశాలను విశదీకరించాడు. అవి రెండు సాధనలు, రెండు జీవనవిధానాలు.

**సాధనలు – అందరూ కర్మయోగం, జ్ఞానయోగం రెండూ పాటించి తీరాలి** – జ్ఞానయోగం కావాలా; కర్మయోగం కావాలా అనే అంశంలో మనకు ఎన్నుకునే అవకాశం లేదు. ఎందుకు? మోక్షం పొందటానికి కర్మయోగం ఒక మార్గం, జ్ఞానయోగం ఒక మార్గం అయితే ఈ రెండింటిలో ఏది బాగుంది అని అడగవచ్చేమో కాని శాస్త్రం ఆ అవకాశం ఇవ్వలేదు. **జ్ఞానయోగంవల్లనే మోక్షం లభిస్తుంది** అని నొక్కి వక్కాణిస్తుంది శాస్త్రం. రెండు ప్యాంట్లు ఉంటే ఏది వేసుకోను అనుకోవచ్చు, అలాగే రెండు షర్టులలో ఏది వేసుకోను అనుకోవచ్చు కాని షర్టు వేసుకోనా, ప్యాంటు వేసుకోనా అనుకోలేరు కదా! ఇదీ అంతే!

మీకు మోక్షం కావాలా వద్దా అనే అంశంలో మీకు ఎన్నుకునే అవకాశం ఉంది. మోక్షం కావాలనుకుంటే మాత్రం జ్ఞానయోగం ఒక్కటే మార్గం. జ్ఞానయోగానికి రావాలంటే దానికి అర్హత ఉండాలి. ఆ అర్హత సాధన చతుష్టయ సంపత్తి. అంటే చిత్తశుద్ధి పొందాలి. సాధన చతుష్టయ సంపత్తిని కర్మయోగం ద్వారానే పొందగలము. అందువల్ల కర్మయోగం కూడా పాటించాలి.

మన శాస్త్రం బోధించిన చక్కని రాజమార్గము – కర్మయోగం పాటించి, చిత్తశుద్ధిని పొంది, జ్ఞానయోగానికి వచ్చి, మోక్షం పొందాలి. దీనిలో అయోమయానికి ఆస్కారం లేదు.

ఇంక వేరే ఏ యోగం గురించి మాట్లాడినా కూడా, అది కర్మయోగంలోకే వస్తుంది – అష్టాంగయోగం, జపయోగం, ధ్యానం ఏదైనా సరే.

**జీవనవిధానాలు – ఆశ్రమ ధర్మాన్ని ఎన్నుకునే అవకాశం ఉంది.** గృహస్థాశ్రమాన్ని ప్రవృత్తి మార్గమనీ, సన్న్యాసాశ్రమాన్ని నివృత్తి మార్గమనీ అంటారు. ఇక్కడ కృష్ణపరమాత్మ **నిష్ఠ** అనే పదాన్ని వాడాడు. నిష్ఠ అంటే ఇక్కడ అర్థం ఆశ్రమం లేదా జీవనవిధానం. ఈ రెండు ఆశ్రమధర్మాల్లో ఏదైనా పాటించి చిత్తశుద్ధి పొందవచ్చు.

ఈ రెండు ఆశ్రమాల్లో ఏది మెరుగైనది అంటే కృష్ణపరమాత్మ గృహస్థాశ్రమమే మెరుగైనది అన్నాడు. ఎందుకంటే పరిణతి చెందని సన్న్యాసికన్నా గృహస్థే ఉత్తమం. ఇందులో ముఖ్యమైన మంత్రం.

**లోకేఽస్మిన్ ద్వివిధా నిష్ఠా పురా ప్రోక్తా మయానఘ ।**
**జ్ఞానయోగేన సాంఖ్యానాం కర్మయోగేన యోగినామ్ ॥** – 3.3

రెండు ఆశ్రమధర్మాలు ఉన్నాయి. ఏదైనా పాటించు కాని సాధనలు మాత్రం రెండూ చేయి. కర్మయోగం పాటించి, చిత్తశుద్ధిని పొంది, జ్ఞానయోగానికి వచ్చి, మోక్షం పొందాలి.

**2. కర్మయోగం శ్లోకాలు 8-20 (మొదటి పాదం)**

కర్మయోగం అంటే ఏమిటి? ఇందులో రెండు పదాలు ఉన్నాయి – కర్మ+యోగం. కర్మ అంటే సరియైన పని చేయటం; యోగం అంటే సరియైన దృక్పథం ఉండటం. అందువల్ల కర్మ యోగమంటే

**సరియైన కర్మ + సరియైన దృక్పథం.**

**కర్మ** – కర్మలను మూడు రకాలుగా విభజించింది శాస్త్రం.

1) **సాత్త్విక కర్మ** – దీనివల్ల ఎక్కువమంది లాభం పొందుతారు, నేను కూడా లాభం పొందవచ్చు. ఇది ఉత్తమకర్మ.

2) **రాజస కర్మ** – దీనివల్ల నేను లాభం పొందుతాను, మహా అయితే నా కుటుంబసభ్యులు లాభం పొందుతారు. ఇది మధ్యమ కర్మ.

3) **తామస కర్మ** – నేను లాభం పొందటానికి, ఎదుటివారిని బాధ పెట్టటానికి కూడా వెనుకాడను. ఇది అధమ కర్మ.

కర్మయోగి సాత్త్విక కర్మలను ఎక్కువ చేస్తూ, రాజస కర్మను తగ్గించుకుంటూ, తామసిక కర్మలను పూర్తిగా మానాలి. సాత్త్విక కర్మలను శాస్త్రమే నిర్దేశించింది. వాటిని పంచమహా యజ్ఞాలుగా పేర్కొంది. అవి వరుసగా– దేవయజ్ఞం, పితృయజ్ఞం, ఋషియజ్ఞం, మనుష్యయజ్ఞం, భూతయజ్ఞం. అవి కూడా నిష్కామంగా చేయాలి.

**కర్మ అంటే పంచమహాయజ్ఞాలు, సాత్త్విక కర్మ, నిష్కామ కర్మ**

**యోగం** – యోగం అంటే సరియైన దృక్పథం. దీన్ని సమత్వం అంటారు. దీనికి రెండు పద్ధతులు సూచిస్తున్నాడు కృష్ణపరమాత్మ.

1) **ఈశ్వరార్పణ బుద్ధి** – ఏం చేసినా, దేవుడికి అంకితం ఇస్తున్నట్టుగా చేయాలి. అప్పుడు ఏ పని చేసినా, మనస్ఫూర్తిగా చేస్తాము.

2) **ఈశ్వరప్రసాద బుద్ధి** – మనం ఏ పని చేసినా దానికి ఏదో ఒక ఫలం వస్తుంది. అది మనకు నచ్చవచ్చు, నచ్చకపోవచ్చు. దాన్ని ఈశ్వరప్రసాదబుద్ధితో స్వీకరిస్తే బాధపడము. నేనింత మంచివాడినైనా కూడా నాకే ఎందుకు ఇన్ని కష్టాలు వచ్చాయి అనుకుంటాము. ఈ కష్టాలు ఇప్పటి పని ఫలితమే కాదు. పూర్వజన్మఫలితం కూడా అవవచ్చు అని మర్చిపోతాము. ధర్మరాజు, నలుడు ఇలా మహామహులే ఎన్నో అవస్థలు పడ్డారు.

**ఇలా కర్తగా ఈశ్వరార్పణబుద్ధితో చేయటం, భోక్తగా ఈశ్వరప్రసాదబుద్ధితో స్వీకరించటాన్ని సమత్వం అంటారు.**

అందరూ కర్మయోగాన్ని పాటించి తీరాలని చెబుతూ, కృష్ణపరమాత్మ నాలుగు భిన్నకోణాల్లోంచి కర్మయోగాన్ని అద్భుతంగా వర్ణిస్తాడు.

1. **కర్మయోగాన్ని ఈశ్వర ఆజ్ఞగా పాటించాలి** – ఈ పంచమహాయజ్ఞాలను ఈశ్వర విహితకర్మలుగా చేయాలి. ప్రభుత్వం, చట్టం మన మంచికోసమే ఉన్నా, ప్రభుత్వంకోసం కొన్ని చట్టాలను పాటిస్తాము. పోలీసు చుట్టుపక్కల లేకపోతే సిగ్నలును పాటించని వారెందరో! పరిపక్వత లేనివ్యక్తి తనంతట తాను చేయడు కాబట్టి శాస్త్రం ఈ పంచమహాయజ్ఞాలను చేసి తీరాలని చెబుతోంది. పైగా ఇవి చేయకపోతే ప్రత్యవాయపాపం వస్తుందని బెదిరిస్తుంది కూడా.

2. **కర్మయోగాన్ని ఈశ్వరయజ్ఞంలా చేయాలి** – మనం పరిపక్వత చెందిన వారమైతే, కర్మలను భయంతో చేయనవసరం లేదు, ఈశ్వరునికి కృతజ్ఞత చూపేలా చేయవచ్చు. స్వామీ చిన్మయానంద అద్భుతంగా చెబుతారు– దేవుడు నీకీ జీవితాన్ని కానుకగా ఇచ్చాడు. ఈ జీవితాన్ని నువ్వెలా జీవిస్తావన్నది నువ్వు దేవునికి తిరిగి ఇచ్చే కానుక. నువ్వు ఏం చేసినా, ఏం సాధించినా, అది భగవంతునికి నువ్వు చూపే కృతజ్ఞత. అందువల్ల కర్మయోగాన్ని యజ్ఞంలా మలుచుకోవాలి.

3. **కర్మయోగాన్ని చిత్తశోధకంగా మలచుకోవాలి** – కర్మయోగాన్ని ఆజ్ఞగా పాటించినా పాటించకపోయినా, యజ్ఞంలా చేసినా చేయకపోయినా, చిత్తశుద్ధి పొందటానికి కర్మయోగం అద్భుతమైన మార్గం. కర్మయోగం మనస్సునుంచి రాగద్వేషాలు, కామక్రోధాలు, లోభమోహాలు, మదమాత్సర్యాలనే మలినాలను పోగొట్టుతుంది. అందువల్ల కర్మయోగాన్ని చిత్తశోధకంగా మలచుకోవాలి.

4. **కర్మయోగాన్ని ధర్మాచరణగా చెయ్యాలి** – ప్రకృతిలో సమతుల్యత నిలపటంకోసమైనా కర్మయోగాన్ని పాటించాలి. సృష్టి అంతా లయబద్ధంగా ఉందని ఒప్పుకుని తీరాలి. పదిమంది కలిసి గీతాధ్యయనం చేస్తుంటే అందరూ కలిసి ముక్తకంఠంతో చదవాలి. ఒక్కళ్ళు తప్పుగా చదివినా, అపశ్రుతి దొర్లుతుంది. కర్మయోగి ప్రకృతిలో సమతుల్యతను చూస్తాడు.

ఈ నాలుగు కోణాల్లో ఎలా పాటించినా, కర్మయోగాన్ని పాటించాలి.

### 3. జ్ఞాని విధులు శ్లోకాలు 20 (రెండవ పాదం) – 29

జ్ఞాని విధులు చెప్పటం ద్వారా కృష్ణపరమాత్మ ఒక ఉపసిద్ధాంతాన్ని కూడా చెబుతున్నాడు. జ్ఞాని నిజానికి ఏమీ సాధన చేయనవసరం లేదు. ఎందుకంటే అతను సాధ్యాన్ని (లక్ష్యాన్ని) పొందేశాడు. అతనికి విధినిషేధాలు లేవు. కాని అతనికి ఏమీ విధినిషేధాలు లేకపోయినా, ప్రపంచంలో ఉన్న అజ్ఞానులకు కావాలి కాబట్టి, జ్ఞాని వారికి మార్గదర్శిగా నిలుస్తాడు కాబట్టి, వారికోసమైనా అతను కర్మ చేయాలి. ప్రపంచానికి ఆదర్శపురుషుడు కావాలి.

**యద్యదాచరతి శ్రేష్ఠః తత్తదేవేతరో జనః ।**

**స యత్ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే ॥** – 3.21

పిల్లలు ఎవరినో ఒకరిని అనుకరిస్తారు. సినిమా నటులు, క్రీడాకారుల ఫోటోలు గోడలకు తగిలించుకుని, వారి వేషభాషల దగ్గరనుంచి అన్నీ అనుకరిస్తారు. అందువల్ల జ్ఞానికి ఆదర్శంగా ప్రవర్తించాల్సిన బాధ్యత ఉంది. ఇది ప్రాథమిక బోధ.

దీనివల్ల చెప్పిన ఉపసిద్ధాంతం ఏమిటి? పిల్లలను ప్రభావితం చేసే వారందరినీ కూడా హెచ్చరిస్తున్నాడు కృష్ణపరమాత్మ. పిల్లలమీద నలుగురి ప్రభావం ఉంటుంది – తల్లి, తండ్రి, గురువు, రాజు. ఇక్కడ రాజు అంటే నాయకుడు అనుకోవచ్చు. పిల్లలకు ఈ నలుగురూ చెప్పే మంచిమాటకన్నా, వారి జీవితం ఆదర్శప్రాయంగా ఉండాలి. ఎందుకంటే పిల్లలు వారికి తెలియకుండానే పెద్దవారిని అనుకరిస్తారు. గంటల కొద్దీ చెప్పే ఉపన్యాసాల కన్నా, ఒక నిముషం సేపు పాటించే ఆచరణ ప్రభావం ఎక్కువ.

**4. కర్మ యోగప్రాముఖ్యత శ్లోకాలు 30-35**

30వ శ్లోకం ఈ అధ్యాయం మొత్తానికే ఆయువు పట్టు.

**మయి సర్వాణి కర్మాణి సన్న్యస్యాధ్యాత్మచేతసా ।**

**నిరాశీర్నిర్మమో భూత్వా యుధ్యస్వ విగతజ్వరః ॥** – 3.30

కర్మయోగిగా మారటానికి 5 సూత్రాల కార్యక్రమాన్ని ఇచ్చాడు కృష్ణపరమాత్మ.

1. **వివేక బుద్ధి – అధ్యాత్మ చేతసా–** మోక్షం ముఖ్యసాధనగా ఉండాలి. ధర్మార్థ కామాలను వద్దనటం లేదు కాని అవే అంతిమలక్ష్యాలు కాదు. అవి అంతిమలక్ష్యమైన మోక్షం పొందటానికి మార్గాలు అని అర్థం చేసుకోవాలి.

2. **ఈశ్వరార్పణబుద్ధి – మయి సర్వాణి కర్మాణి సన్న్యస్య –** చేసే కర్మలనన్నిటినీ ఈశ్వరార్పణబుద్ధితో చేయాలి. చేసే ప్రతి పనిని ఆరాధనగా చేయాలి. ఇది మంచిపని, ఇది చెడ్డపని అనుకోకూడదు.

3. **ప్రసాద బుద్ధి – నిరాశీః** – ఎటువంటి కర్మఫలం వచ్చినా దానికి సంసిద్ధంగా ఉండాలి. ఎందుకంటే భవిష్యత్తు మీ చేతిలో లేదు. అంతా నేనే నిర్ణయిస్తాను అనుకుంటే అది గర్వం అవుతుంది; నా చేతిలో ఏమీ లేదు, అంతా భగవంతుడే నిర్ణయిస్తాడు అనుకుంటే అది విధిని నమ్మినట్టవుతుంది. మీ భవిష్యత్తును కొంతమేరకు మీరు నిర్ణయిస్తారు కాని మీరు కాకుండా మీ భవిష్యతును నిర్ణయించటంలో అనేక అంశాలు తోడవుతాయి. అందువల్ల ఏదొచ్చినా స్వీకరించగలగాలి. దీన్ని **ఈశ్వరప్రసాదబుద్ధి** అంటారు. ఓ దేవా, ఏది రావాలని రాసిపెట్టి ఉంటే అది రానీ. కాకపోతే అది నాకు అనుకూలంగా లేకపోతే, దాన్ని చిరునవ్వుతో స్వీకరించే బుద్ధిని నాకు ఇవ్వు అని అనుకోగలగాలి. అలా సంసిద్ధత ఉంటే, ఏమీ ఆందోళన ఉండదు. ప్రణాళిక వేరు, బెంగ వేరు.

4. **అమానిత్వం – నిర్మమః** – ఏదైనా విజయం సాధించగానే, అంతా నావల్లే జరిగిందని పొంగిపోకూడదు. మీరు కాకుండా మీ విజయానికి అనేక అంశాలు తోడ్పడతాయి. అన్నింటినీ కలిపి దైవం అనండి; ఏదో శక్తి అనండి; ఏదైనా అనండి. అందువల్ల విజయం పొందితే అణకువ చూపండి. దీన్ని **నిర్మమః** అంటారు. నేనేమీ చేయలేదు, అననవసరం లేదు, కాని అంతా నేనే చేశాను అని గర్వపడకూడదు. దీన్ని **అమానిత్వం** అంటారు. ఓటమిని చిరునవ్వుతో స్వీకరించటం; విజయంలో వినయం చూపటం కర్మయోగి లక్షణాలు.

5.సమత్వం – **విగతజ్వరః** – దీన్నే **సమత్వం** అని కూడా అంటారు. మొదటి నాలుగూ పాటిస్తే, ఐదవది దానంతట అదే అలవడుతుంది. ఏదొచ్చినా సమత్వం పాటించండి. కష్టం వస్తే కృంగిపోకండి; సుఖం వస్తే పొంగిపోకండి.

ఈ ఐదు సూత్రాలు టూకీగా – వివేకబుద్ధి, ఈశ్వరార్పణబుద్ధి, ప్రసాదబుద్ధి, అమానిత్వం, సమత్వం. ఎవరైతే ఈ ఐదు సూత్రాల కర్మయోగాన్ని పాటిస్తారో వారు ఆధ్యాత్మిక విజయం పొందుతారు.

**యే మే మతమిదం నిత్యమనుతిష్ఠంతి మానవాః ।**
**శ్రద్ధావంతోఽనసూయంతో ముచ్యంతే తేఽపి కర్మభిః ॥** – 3.31

**యే త్వేతదభ్యసూయంతో నానుతిష్ఠంతి మే మతమ్ ।**
**సర్వజ్ఞానవిమూఢాంస్తాన్ విద్ధి నష్టానచేతసః ॥** – 3.32

### 5. కామక్రోధ లక్షణాలు, నివారణ శ్లోకాలు 36–43

అర్జునుడు అడిగిన ఇంకో ప్రశ్నకు కృష్ణపరమాత్మ జవాబు చెప్తున్నాడు. అర్జునుని ప్రశ్న ఇది – కర్మయోగం ఇంత గొప్పదని తెలిసినా కూడా ఏ శక్తి బలవంతం చేసినట్టుగా మనుష్యులు పాపాలు చేస్తున్నారు?

ఆ శక్తిని కామక్రోధాలుగా అభివర్ణిస్తున్నాడు కృష్ణపరమాత్మ. వీటినే రాగద్వేషాలు అని కూడా అనవచ్చు. మనం ఆత్మ–అనాత్మల కలయికలం. అందువల్ల అర్థకామాలూ అవసరమే; ధర్మమోక్షాలూ అవసరమే. రెండింటినీ సమతుల్యం చేసుకోవాలి. కాని మనం ఎంతసేపూ వ్యావహారిక సుఖాలైన అర్థకామాల వెంటే పరుగులు తీస్తాము. ఎందుకు? మన రాగద్వేషాలు మనను ప్రేరేపిస్తాయి. అర్థకామాలు ఎంత ప్రాముఖ్యత వహిస్తాయంటే, ఆధ్యాత్మిక చింతన చేసేందుకు తీరిక లేదు మనకు.

**బాలస్తావత్క్రీడాసక్తః తరుణస్తావత్తరుణీసక్తః ।**
**వృద్ధస్తావచ్చిన్తాసక్తః పరమే బ్రహ్మణి కోఽపి న సక్తః ॥** – భజగోవిందమ్

అందువల్ల మనకు ఆటంకాలు మనలో కలిగే కామక్రోధాలు. కాని కృష్ణపరమాత్మ క్రోధాన్ని విడిగా వివరించడు. కామం తీరకపోతే క్రోధం కలుగుతుంది కాబట్టి, కామాన్ని అరికడితే చాలు. ఐదువందల కోట్ల డాలర్లు ఉన్నా తృప్తి ఉండదు మనుష్యులకు. కోరికలు పుడుతూనే ఉంటాయి. తంబూరశ్రుతి లాగా నాకు కావాలి, నాకు కావాలి అనే కోరిక ఉంటూనే ఉంటుంది.

**కామాన్ని అరికట్టే మార్గాలు** – కామాన్ని రెండు దశల్లో అరికట్టాలి. మొదటిది తాత్కాలిక పరిష్కారం. రెండవది శాశ్వత పరిష్కారం.

1. **తాత్కాలిక పరిష్కారం** – దీన్ని ఫస్ట్ ఎయిడ్ ట్రీట్‌మెంట్ అనవచ్చు. అది మూడు అంశాలను నియంత్రించటం ద్వారా జరుగుతుంది.

ఎ) **దమము** – దమము అంటే ఇంద్రియనిగ్రహం. చూచిన ప్రతిదాన్నీ మనస్సులోకి చొరపడనివ్వకూడదు. కళ్ళముందు బోర్డు పెట్టుకోవాలి – **అనుమతి లేనిదే ప్రవేశం లేదు.**

బి) **శమము** – శమము అంటే మనోనిగ్రహం.

**ధ్యాయతో విషయాన్ పుంసః సంగస్తేషూపజాయతే ।** – 2.62

మనస్సు నిముషంలో సంగత్వం పెంచేసుకుంటుంది. ఒక వస్తువును, ఒక వ్యక్తిని మొదట ఇష్టపడితే ఇంక వాటికి జిగురువేసి అంటించినట్టుగా అతుక్కుపోతారు. ఆ వస్తువు లేదా ఆ వ్యక్తి లేకపోతే నేను జీవించలేను అనే పరిస్థితి వస్తుంది. అందువల్ల అలా అతుక్కుపోవాలని ఉంటే ఉన్నతమైన దానికి అంటే **గీతాబోధకు** అతుక్కుపోండి.

సి) **వివేకము** – వివేకము అంటే ఆలోచించటం. బాహ్యంగా ఉన్న వస్తువు అశాశ్వతమనీ, అశాశ్వతమైన వస్తువు శాశ్వతమైన శాంతిభద్రతలను ఇవ్వలేవనీ తెలుసుకోవాలి.
ఎందుకంటే అశాశ్వతం + అశాశ్వతం = అశాశ్వతం.

**తప్పుగా అర్థం చేసుకున్న ప్రపంచం దుఃఖహేతువు**
**సరిగ్గా అర్థం చేసుకున్న నేను సుఖస్వరూపుడను**

దయానందస్వామీజీ అద్భుతంగా చెబుతారు **'సమస్య నువ్వు, పరిష్కారం నువ్వే!'** వివేకం అంటే నిత్యానిత్య వస్తువివేకం చేయటం. అలా దమము, శమము, వివేకము పాటించటం ద్వారా కామాన్ని తాత్కాలికంగా ఉపశమనం చేయవచ్చు.

2. **శాశ్వత పరిష్కారం** – శాశ్వత పరిష్కారం **ఆత్మజ్ఞానం మాత్రమే**. ఏదైనా కోరిక ఎందుకు కలుగుతున్నది? అపూర్ణత్వంవల్ల.
**ఆత్మన్యేవ ఆత్మనః తుష్టః**

ఆనందం నాలోనే ఉంది అని అర్థం చేసుకుంటే నన్ను ప్రేమిస్తున్నావా, నన్ను ప్రేమిస్తున్నావా అని ఎవరినీ ప్రేమకోసం అర్థించము. ఇతరులు నన్ను ప్రేమించినా, ప్రేమించకపోయినా నేను ఆనందస్వరూపుడను; నేను ఇతరులకు ప్రేమను పంచిపెడతాను అని తెలుసుకోగలుగుతాము.

**ఏవం బుద్ధేః పరం బుద్ధ్వా సంస్తభ్యాత్మానమాత్మనా ।**
**జహి శత్రుం మహాబాహో కామరూపం దురాసదమ్ ॥** – 3.43

నేను పూర్ణుడను అని అర్థం చేసుకుంటే, కోరికలకు చోటేది? కామాన్ని అరికడితే, క్రోధం దానంతట అదే మాయమవుతుంది.

ఈ విధంగా కర్మయోగం గురించి కృష్ణపరమాత్మ బోధించటంవల్ల ఈ మూడవ అధ్యాయాన్ని కర్మయోగం అంటారు.